శ్రీ

గాయత్రీ మంత్ర విశేషములు

(గాయత్రి పేరులేని ఈ మంత్రము గాయత్రికి
ఏవిధముగ అన్వయించునది తెలుపు గ్రంథము)

తిరుమల తిరుపతి దేవస్థానము వారి Roc . No. Endt 5/155/2002
Dt. 2.2.2003 ద్వారా ఆర్థికసహాయముతోముద్రితము



గ్రంథకర్త

డా. స్వర్ణ వాచస్పతి

అధ్యక్షులు: రుద్రకవి సాహిత్యపీఠము

ప్రచురణ : డా. స్వర్ణ వాచస్పతి

రిటైర్డు వెటరినరీ అసిస్టెంటు సర్జన్, నారాయణపురం,

దాచేపల్లి. గుంటూరుజిల్లా - 522414

ప్రచురణ : అగస్టు 2003

ప్రతులు : 1000

షోడశకుసుమం

వెల : రూ. 80-00

ప్రతులకు :

1. డా॥ స్వర్ణవాచస్పతి ఫోన్. 08649-257902

రిటైర్డు వెటరినరీ అసిస్టెంటు సర్జన్ నారాయణపురం,
దాచేపల్లి. గుంటూరుజిల్లా - 522414

2. ఇడమంటి జనార్ధనాచార్యులు ఫోన్. 08644-239108

పధానోపాధ్యాయులు : బ్రహ్మర్షి యలవర్తి ఆంజనేయశాస్త్రి గారి
వేద సంస్కృత పాఠశాల
గాంధీనగర్, తెనాలి - 522 201

3. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్


4-1-435, విజ్ఞాన్ భవన్,
బ్యాంక్ స్ట్రీట్,
హైదరాబాదు - 500 001

విశాలాంధ్ర బుక్ హౌస్

విజయవాడ, హైదరాబాద్, అనంతపురము,గుంటూరు,
విశాఖపట్టణం, హన్మకొండ, కాకినాడ, తిరుపతి.

ముద్రణ :

విజయలక్ష్మి ఆర్ట్ ప్రింటర్స్,
బోస్‌రోడ్, తెనాలి.
ఫోన్. 08644-235157



This Book is published with the financial Assistance of Tirumala Tirupathi Devasthanams under their Scheme "Aid to Authors to publish Religious Books."

అంకితం



గాయత్రీ మాతకు



గ్రంథకర్త :

డా॥ స్వర్ణవాచస్పతి ధర్మపత్ని లక్ష్మీనరసమ్మ

అధ్యక్షులు : రుద్రకవి సాహిత్య పీఠము

బ్రహ్మర్షి యలవర్తి ఆంజనేయ శాస్త్రి గారి వేద సంస్కృత పాఠశాల

గాంధీనగర్, తెనాలి - 522 201

అడ్రస్ :

రిటైర్డు వెటరినరీ అసిస్టెంటు సర్జన్, నారాయణపురం,

దాచేపల్లి - 522 414 గుంటూరు జిల్లా

☎ 08649 - 257902



గ్రంథకర్త వివరములు

జననము	:	11-9-1933
తండ్రి	:	విమర్శకాచార్య, శిల్పకళాకోవిద, స్వర్ణ సుబ్రహ్మణ్యకవిగారు.
తల్లి	:	రాజ్యలక్ష్మి
జన్మస్థలం	:	పెదపాలెం, పొన్నూరు మండలం, గుంటూరు జిల్లా
విద్యాభ్యాసము	:	ప్రాథమిక విద్య - ఎలిమెంటరి స్కూల్, పెదపాలెం. యస్.యస్.యల్.సి. వరకు - ఎడ్వర్డు బోర్డు హైస్కూల్, నిడుబ్రోలు ఇంటర్మీడియట్ : హిందూ కాలేజి, గుంటూరు బి.వి.యస్.సి. కాలేజి ఆఫ వెటరినరి సైన్సు, తిరుపతి.
ఉద్యోగ విరమణ	:	30-9-1992
భార్య	:	లక్ష్మీ నరసమ్మ
కుమార్తెలు	:	రాజ్యలక్ష్మి శివకుమారి, పద్మసుహాసిని, శ్యామలా జయశ్రీ
కుమారులు	:	వెంకటేశ్వరరావు బి.ఇ. (కంప్యూటర్) మేనేజర్ Escoft-Faridabad షణ్ముఖ మహేశ్వరరావు యం.యస్.సి. (ఎలక్ట్రానిక్స్)
అధ్యక్షులు	:	రుద్రకవి సాహిత్యపీఠము - వ్యవస్థాపకులు యలవర్తి ఆంజనేయశాస్త్రిగారి వేద సంస్కృత పాఠశాల గాంధీనగర్, తెనాలి.
రచనలు	:	1. వాల్మీకి రామాయణ సౌరభాలు 2. మహాభారత స్వస్వరూపము 3. రావణబ్రహ్మ చరిత్రము 4. అథర్వణాచార్యుడు 5. కందుకూరి రుద్రకవి చరిత్రము 6. శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వాముల వారి జీవిత చరిత్రము 7. అఖిల దేవతా స్తోత్రమంజరి 8. వాల్మీకి రామాయణ స్వస్వరూపము 9. గాయత్రీ మంత్ర విశేషములు 10. బ్రహ్మవంశ చరిత్ర
ప్రస్తుత నివాసము	:	నారాయణపురం, దాచేపల్లి - 522 414 గుంటూరుజిల్లా, ఫోన్ : 08649 - 257902

అవతారిక

ఒకరోజున నాలో అప్రయత్నముగ గాయత్రి మంత్రములో గాయత్రి పేరు లేకుండుట స్ఫురణకు వచ్చినది. ఆ విషయమును విద్యావిశారద, సాహిత్య సరస్వతి డా॥ కన్నెగంటి రాజమల్లాచారి M.A. Ph.D., గారికి ఫోను చేయగ, వారు ' బ్రాహ్మణులు మా గాయత్రి అంటారు గదా!' అని అన్నారు. నేను ' బ్రాహ్మణుల గాయత్రి, విశ్వబ్రాహ్మణుల గాయత్రి అని ఇందరు లేరు, ఉన్నది ఒక్కరే గాయత్రి ' అని వచించినాను. తరువాత 'గాయత్రిమంత్రము' ను గురించి ఒక వ్యాసము వ్రాసినాను. రుద్రకవి సాహిత్య పీఠ వార్షికోత్సవమునకు తెనాలి విచ్చేసిన బహుగ్రంథకర్త రాచగుండ్ల చెంచలరావు గారు ఆ వ్యాసమును చూచి 'గాయత్రిమంత్రము' నకు ఇంతటి విస్తృతార్థము ఉన్నదా! అని ఆశ్చర్యమును వెలిబుచ్చినారు. అనంతరము గాయత్రిమంత్రమును గురించి గ్రంథమును రచించి ఆగ్రంథమును సాహిత్య బ్రహ్మ డా॥ వి.వి.ఎల్. నరసింహారావు M.A. Ph.D., గారు చూస్తే బాగుంటుందను అభిప్రాయముతో వారికి పంపించినాను. ఆగ్రంథమును సమగ్రము పరిశీలించిన డా॥ వి.వి.ఎల్. నరసింహారావు M.A. Ph.D., గారు వారి అభిప్రాయమును వ్రాయుటయే గాక ఆగ్రంథము లోకమునకు అవసరమని సూచించినారు. బ్రహ్మశ్రీ ' సాహతీ సుత్రామ' రాపాక ఏకాంబరాచార్యులు M.A. రిటైర్డ్ డైరెక్టర్ గారు, రిటైర్డ్ లెక్చరర్ బ్రహ్మశ్రీ కపిలవాయి లింగమూర్తిగారు మున్నగు మహాకవులనేకులు ఈ గ్రంథమును ప్రశంసించినారు. మహాకవుల ఆశీర్వాదమును పొందిన నేను ఆగ్రంథమునకు ఆర్థిక సహాయము కోరుచు తిరుమల తిరుపతి దేవస్థానము కార్యనిర్వాహణాధికారి గారికి సమర్పించినాను. వారు Roc . No. Endt 5/155/2002 Dt. 2.2.2003 ద్వారా ఈ గ్రంథమునకు ఆర్థిక సహాయమును మంజూరు చేసినారు. తెనాలి విజయలక్ష్మి ఆర్టు ప్రింటర్సు వారు వారి కంప్యూటరులో మరల మరల కాపీలు తీసి తప్పులు సవరించుటకు నాకు అందించినారు.

ఈ గ్రంథరచనకు సహకరించిన గ్రంథకర్తలకు ఈగ్రంథరచనకు నన్ను ప్రోత్సహించిన డా॥ కన్నెగంటి రాజమల్లాచారి ప్రభృతులకు, ఈగ్రంథమును ఆమూలాగ్రముగ పరిశీలించిన సాహిత్య బ్రహ్మ డా॥ వానిలి వేంకట లక్ష్మీనరసింహారావు M.A. Ph.D., గారికి, ఈగ్రంథమునకు ఆర్థిక సహాయము నందించిన తిరుమల తిరుపతి దేవస్థానము కార్యనిర్వాహణాధికారి గారికి ఈగ్రంథమును సర్వాంగ సుందరముగ ముద్రించుటకు యత్నించిన తెనాలి విజయలక్ష్మి ఆర్టు ప్రింటర్సు అధినేతలు శ్రీ కె. మహేష్, శ్రీ వి. ప్రసాద్ గార్లకు నా హృదయపూర్వక కృతజ్ఞతాభివందములు తెలియజేయుచు వారిని గాయత్రిదేవి, తిరుమల వేంకటేశ్వరస్వామి సదా ఆశీర్వదించురని కోరుచున్నాను.

ఇట్లు
బుధజన విధేయుడు
స్వర్ణ వాచస్పతి

ఫలించిన మహోకృషి

' సాహిత్య బ్రహ్మ ' డా॥ **వి.వి.యల్. నరసింహారావు** M.A. Ph.D.,
రాష్ట్ర కేంద్ర ప్రభుత్వ విద్యాశాఖ- పురాసంచాలకుడు

డాక్టర్ స్వర్ణవాచస్పతి గారిన గురించి ఇప్పుడు పాఠకలోకమునకు ప్రత్యేకముగా పరిచయము చేయవలసిన పనిలేదు. బహుగ్రంథకర్తగా, విమర్శవీరుడుగా, వైద్యుడుగా ఈయన ప్రసిద్ధుడు. విమర్శకాచార్యుడును, శిల్పకళాకోవిదుడును. శ్రీ భారతీయ మహాశిల్ప బృహద్గ్రంథకర్తయు అయిన శ్రీ స్వర్ణసుబ్రహ్మణ్య కవి గారికి తగిన పుత్రరత్నముగా వాచస్పతిగారు విశిష్టత గడించినారు. ఇందుకు నిదర్శనముగా వాచస్పతి గారి 'వాల్మీకి రామాయణ సౌరభాలు ', ' మహాభారత స్వస్వరూపము', 'రావణబ్రహ్మచరిత్రము', 'అధర్వణాచార్యుడు' మొదలైన గ్రంథములున్నవి. రామాయణ భారతేతిహాసములపై వీరు చేసిన ప్రామాణిక విమర్శలు వీరిని విమర్శకవీరుడుగా నిలబెట్టుచున్నవి.

ఇంతటి విశిష్ట చరిత్ర గల వాచస్పతిగారి దృష్టి ఇప్పుడు గాయత్రీమంత్రము పై ప్రసరించినది. ఇప్పుడు ప్రసరించుట కాదు. ఉపనయన సంస్కారము జరిగిన నాటినుండి ఆ మంత్రమును యధావిధిగా పఠించుచు తత్ఫలమును అనుభవపూర్వకముగా ఆస్వాదించుచున్న విజ్ఞుడు వాచస్పతి. తన తండ్రి గారైన సుబ్రహ్మణ్యకవి దూరదృష్టితో పెట్టిన 'వాచస్పతి' యను నామమును సార్ధకము చేసికొనుచున్నాడనుటకు ప్రకృత గ్రంథమైన 'గాయత్రీ మంత్ర విశేషముల' రచనయే ప్రమాణము.

'వాచస్పతిం విశ్వకర్మాణ మూతయే ' అనెడి ఋగ్యజుర్వాక్యములను బట్టి వాచస్పతియనగా విశ్వకర్మయే. విశ్వకర్మాంశభవుడు గనుకనే ఈయనకు విశ్వప్రకృతి స్వరూపిణియైన గాయత్రీ తత్త్వము నన్వేషించు నాసక్తి ఉత్కటముగా గలిగినది. 24 ప్రకరణములు కలిగిన మహాగ్రంథముగా వాచస్పతి గారు దీనిని రచించిరి. ప్రకరణములు 24 సంఖ్యతో నిబద్ధమై యుండుటలో కూడ గాయత్రీ మంత్రాక్షర సంఖ్యను సూచించుట కలదనిపించును. అవును ; విశ్వామిత్ర మహర్షి దర్శించిన ఈ మహామంత్రమునకు అవయవములు 24 అక్షరములే కదా! గాయత్రీ ఛందస్సునకు గల మూడు పాదాలు ఒక్కొక్కటి 8 అక్షరములు గలవే కదా !

'ఛందస్సు' అనగా పాదనియమము గల పద్యలక్షణ శాస్త్రము. 26 విధములైన ఉక్త అత్యుక్త ప్రతిష్ఠ సుప్రతిష్ఠ గాయత్రాది ఛందస్సులలో 'గాయత్రి' ఒకటి. ఇది మంత్ర

విశేషముగా ప్రసిద్ధి నందినది. మంత్రమనగా 'ప్రసవోపాయమ' నియు , రహస్యమనియు అర్థాంతములు గలవు. ప్రసవోపాయార్థమును బట్టియే 'మంత్రసాని' శబ్దము లోకమున ప్రసిద్ధమైనది. రహస్యార్థములో మంత్రాలోచనము, మంత్రి మొదలైన అర్థములును రూఢమైనవి. ఇంతకును గాయత్రి మంత్రములో విశ్వప్రకృతి రహస్యమలు నిబద్ధమైయున్నవనుట గ్రహింపదగిన విశేషము.

ఈ మంత్రమును 'భూః, భువః , సువః ' అనెడు మూడు వ్యాహృతులున్నవి. 'వ్యాహృతులు వ్యాహరణములు ' అనగా తమలో సమస్త తత్త్వములను ఇముడ్చుకొన్న వాక్కులు. ఈ మూడు వ్యాహృతులు పరతత్త్వ నిరూపకమైన ప్రణవము యొక్క విస్తృత రూపములే. ప్రణవము ' ప్ర + నవము ' నిత్య నూతనమైనది ; శాశ్వతమైన తత్త్వము. గాయత్రీ మంత్ర విస్తృతరూపమే వేదత్రయమనియు, ఆకారణము చేతనే ఆమె వేదమాతయనియు ప్రసిద్ధి యేర్పడినది.

గాయత్రి పంచశీర్ష . ప్రాక్పశ్చిమ దక్షిణోత్తరోర్ధ్వ దిక్కులకు తిరిగియున్న పంచశీర్షములవి. వేదాంగములైన శిక్షా వ్యాకరణ చ్ఛందో నిరుక్త జ్యోతిష కల్పము లాటింటిలో కేవలచ్ఛందస్వరూపిణియైన గాయత్రికి శిక్షాదులైన తక్కిన అయిదును పంచశీర్షములు. పంచశీర్ష అయిన గాయత్రి పంచశీర్షుడైన విశ్వకర్మకు ప్రతిరూపమే.

'త ఆయజన్త ద్రవిణగ్ం సమస్మా ఋషయః పూర్వే జరితా రో న భూనా' అనెడి మంత్రమునకు సాయణులు భాష్యము వ్రాయుచు " తే పూర్వ ఋషయో ద్రష్టారో రశ్మయో అస్మా ఆదిత్యాత్మకాయ విశ్వకర్మణే ద్రవిణం తేజ ఆయజన్త" అని చెప్పుట గుర్తుంచుకోవలసిన ముఖ్యాంశము, కనుక గాయత్రీ మంత్రమందలి సవితృశబ్దము విశ్వాత్మకుడైన విశ్వకర్మను పేర్కొనునదే యని గ్రహింపవలసియున్నది.

ఈ సందర్భమున పంచసంకృతులను కూడ సంభావింపవలసియున్నది. ' సంకృతి' అనగా సమ్యక్కర్మ. ఇట్టి సంకృతి కలవానిని కూడ సంకృతి యందురు. అట్టి సంకృతి యెవరో కాదు విశ్వ సృష్టికి హేతువగు విశ్వకర్మయే. ఆ సృష్టి శిల్పము నుద్దేశించియే యజుర్బ్రాహ్మణ ప్రథమాష్టకము స్పష్టముగా ' స ప్రథమ స్సంకృతి ర్విశ్వకర్మా' అని ఉద్ఘాటించినది. ఈ విశేషములు ఈ గ్రంథములోని 13 వ ప్రకరణములో విపులీకరింపబడినవి.

మొత్తము మీద గ్రంథప్రణాళిక పరిశీలింపగా గాయత్రీ మంత్రముతో ప్రథమ ప్రకరణ మారంభించి, సవితృదేవుడు, గాయత్రీ మంత్రార్థము, వ్యాహృతులు, త్వష్ట, రుద్రుడు, విష్ణువు, విశ్వకర్మ, ఇంద్రుడు, పంచబ్రహ్మలు, జ్యేష్టబ్రహ్మ, ఋగ్వేదాంతర్గత ప్రముఖ దేవతలు, విశ్వకర్మసూక్తము, పురుషసూక్తము, ప్రజాపతి, మొదలైన అనేక విశేషములను డా॥ వాచస్పతిగారు వేదో పనిష దారణ్యక బ్రాహ్మణాది వైదిక వాఙ్మయము నా పోశనము పట్టి వివరించుట జరిగినది. ఈ పనియంతము ఒక వారము పదిరోజులలో జరుగునది కాదు. ఒక సుదీర్ఘతపస్సుగా చిరకాలమధ్యయనము చేసి, గ్రహింపవలసిన విషయము, గ్రహించిన విషయమును సుగమ సుందరముగా పఠితృలోకమునకందించుటయు ఒకమహాశిల్పము. దానిని కైవసము చేసికొన్న ప్రజ్ఞ, నవనవోన్మేషశాలినియై ఈ గ్రంథమున సాక్షాత్కరించుచున్నది.

లోగడ 'గాయత్రీ విశ్వకర్మలు' అను గ్రంథమొక దానిని 'దర్శనాచార్య' 'కళాప్రపూర్ణ' డా॥ కొండూరు వీరరాఘవాచార్యులవారు రచించియున్నారు. అందలి విషయములకంటె ప్రస్తుత గ్రంథమున డా॥ వాచస్పతిగారు అధికముగ వివరించియున్నారు.

ముఖ్యముగా 'విశ్వకర్మ గాయత్రి' అను ప్రకరణములలో ప్రకృతి రూపిణియైన గాయత్రి పంచభూతాత్మకుడై పంచశీర్షుడైన విశ్వకర్మకు ఎట్లు ప్రతిరూపమో ప్రత్యేకముగా వివరించుట జరిగినది. పృథివికి త్వష్ట (బ్రహ్మ), జలమునకు మయుడు (విష్ణువు), అగ్నికి మనువు (రుద్రుడు), వాయువునకు దైవజ్ఞుడు (శిల్పి – ఇంద్రుడు), ఆకాశమునకు విశ్వజ్ఞుడు (సూర్యుడు) అధిదైవతలై ఒప్పుట గాయత్రీ విశ్వకర్మల ఐక్యతత్త్వమును అవశ్యము ప్రమాణీకరించుచున్నది. ఇది విశ్వకర్మ పంచవృత్తులకును నిరూపకము.

గాయత్రీమంత్రము తన్ను గానము చేయువారిని రక్షించును. " గాయంతం త్రాయత ఇతి గాయత్రీ" అని కదా ఛాందోగ్యవివరణ!

ఇంతటి మహత్తరశక్తి గల ఈ మంత్రమును ప్రసాదించిన పుణ్యుడు విశ్వామిత్రుడు – విశ్వామిత్రుడే. విశ్వమును ఆత్మభూతము కావించుకొన్న భారతము సర్వజనులను రక్షింపగలదు. ఋగ్వేద మామాటనే స్పష్టీకరించినది.

" విశ్వామిత్రస్య రక్షతి బ్రహ్మే భారతం జనమ్" (ఋ 3.53.12)

డా॥ వాచస్పతిగారు ఈ గ్రంథమున ఉపసంహారవాక్యములు పలుకుచు

ఈ బుక్కునే పేర్కొనుట గ్రంథ పరమార్థము స్పష్టము చేయుటయే.

గాయత్రీ మంత్ర విశేషార్థ నిరూపకమైన ఈ మహాగ్రంథము రచయిత కృషిని నూటికి నూరు పాళ్ళు సఫలము చేసినది.

ఒక పరిశోధక రచయిత కింతకంటే కృతార్థత ఏముండును ?

వాసిలి వేంకట లక్ష్మీనరసింహారావు
24-11-1001
' సువర్ణ గండపెండేర విభూషిత' -
' సారస్వత విశిష్ట '

గాయత్రీ దర్శనం

' విద్యావిశారద' " సాహిత్య సరస్వతి "
డా॥ **కన్నెకంటి రాజమల్లాచారి.** పిహెచ్‌డి.
ప్రిన్సిపాల్
S.V.K.Pకళాశాల, మార్కాపురం.

మనదేశంలో గాయత్రీ పీఠాలు, మందిరాలు అనేక ప్రదేశాల్లో ఉన్నాయి. వాటిలో కొన్ని సప్తార్షేయ బ్రాహ్మణులు స్థాపించినవి, కొన్ని పంచార్షేయ బ్రాహ్మణులు స్థాపించినవి. పంచార్షేయ మందిరాలకు వెళ్లి గాయత్రి భర్త ఎవరు అని అడిగితే విశ్వకర్మ అన్నారు. సప్తార్షేయ మందిరాలకు వెళ్లి అడిగితే గాయత్రికి భర్త లేడు, జగన్మాత అన్నారు ? గాయత్రి విషయమై నాకు సందేహాలు కలిగాయి. గాయత్రి ఒక్కతేనా ఇద్దరా అని. ఈ విషయమై మహాపండితుడు డా॥ వాచస్పతి గారితో చర్చించాను. గాయత్రిని గురించి పరిశోధనాత్మకమైన గ్రంథాన్ని రచించమని వాచస్పతి గారిని కోరాను. తద్ఫలితమే ప్రకృత 'గాయత్రీ మంత్ర విశేషములు ' అను బృహత్ గ్రంథం.

గ్రంథకర్త :- గాయత్రీమంత్ర విశేషముల గ్రంథకర్త డా॥ స్వర్ణవాచస్పతి గారు వృత్తి చేత వైద్యులైనా ప్రవృత్తి చేత సాహితీ వైద్యులు. బహుగ్రంథకర్తలు. ఇతఃపూర్వం, వాల్మీకి రామాయణ సౌరభాలు, మహాభారత స్వస్వరూపం, రావణబ్రహ్మ, అథర్వణాచార్యుడు, రుద్రకవి మొదలైన వివిధ గ్రంథాలను రచించారు. విశ్వవిద్యాలయాల సాహితీ వేత్తలతో ప్రశంసింప బడ్డారు. గొప్ప పరిశోధకుడుగా గుర్తింపు పొందారు. వాచస్పతి గారు ఏఅంశాన్ని

గ్రహించి పరిశోధించినా సోపపత్తికంగా చర్చించి నిగ్గు తేల్చి సత్యాలను వెలికి తీసి నిష్పాక్షికంగా చెప్పగల వైదుష్యం గలవారు. ప్రస్తుత గ్రంథాన్ని వాచస్పతిగారు సర్వసమగ్రంగా రచించారు.

గ్రంథసారసంగ్రహం :– గాయత్రీ మంత్రంలో 'భర్గ' శబ్దానికి అన్నమని 'ధీ' శబ్దానికి కర్మమని ఆధిభౌతికార్థాన్ని, సవితృ శబ్దానికి కనిపించే సూర్యుడని ఆధిదైవి కార్థాన్నీ గాయత్రీ మంత్రాధి దేవత సాక్షాత పరమేశ్వరుడే యని ఆధ్యాత్మికార్థాన్నీ చెప్పారు.

పంచభూతాలు కలిపినప్పుడు రూపాలు ఏర్పడుతున్నాయి. సవితృ దేవుడు సృష్టికర్త. సర్వానికీ మూలం ప్రణవం. గాయత్రి ప్రణవ స్వరూపిణి, అందుకే గాయత్రీ మంత్రానికి ముందు ఓం, భూః, భువః. స్వః, లు చేర్చబడ్డాయి.

సవితయే బ్రహ్మ :– త్వష్ట, బ్రహ్మ, హిరణ్య గర్భుడు ఒక్కరే. అతడు సృష్టికర్త. విశ్వకర్మ కుమారుడు.

సవిత – విష్ణువు – విశ్వకర్మ :– సవితృదేవుడు విష్ణుదేవుడు విశ్వకర్మ వీరికి అభేదం నిరూపించబడింది. ఈ అంశం ఋగ్వేద మంత్రంలో సమర్థించబడింది.

అథర్వవేదాన్ని అనుసరించి విశ్వకర్మ జలమగ్నమైన భూమిని ఉద్ధరించాడని ఉంది. వరాహావతార వృత్తాంతం వేద విరుద్ధం

సవితయే రుద్రుడు విశ్వకర్మ :–ఋగ్వేదమంత్రం ఆధారంగా సవితయే రుద్రుడు, విశ్వకర్మ అని నిరూపించబడింది. కాని సృష్టికర్తయైన రుద్రుడు పురాణాల్లో భిన్నంగా కనిపిస్తాడు.

సవితయే ఇంద్రుడు – విశ్వకర్మ :– ఋగ్వేదాన్ని అనుసరించి సవితయే ఇంద్రుడుగా నిరూపించబడ్డాడు. సవితకు ఇంద్రునకు అభేదం చెప్పబడింది. ఇంద్రునకు విశ్వకర్మకు అభేదం చెప్పబడింది. ఇంద్రుడు మహాశిల్పి. అహల్య అంటే నాగళ్లు తగలని భూమి. విశ్వకర్మయైన ఇంద్రుడు అటువంటి నేలను సాగు చేశాడు. అహల్యాజారుండనటం వేద విరుద్ధం.

సవితమే సూర్యుడు విశ్వకర్మ :– విశ్వకర్మ నుండి సూర్యుడు ఉద్భవించాడు. బ్రహ్మ విష్ణు రుద్ర ఇంద్ర సూర్యులు విశ్వకర్మ సుతులు.

విశ్వకర్మ :– విశ్వకర్మ సూక్తం ఆధారంగా విశ్వకర్మ తత్వం విశ్లేషించబడింది. సూర్యుడు విశ్వకర్మ స్వరూపుడని సాయణ భాష్యం చెబుతున్నది.

గాయత్రి :- గాయత్రీ సావిత్రీ సరస్వతులు విశ్వకర్మ తత్త్వంలో అంతర్భూతమైనవారు. చరాజరాత్మకమైన జగమంతా గాయత్రియే. గాయత్రి మంత్ర వైశిష్ట్యాన్ని శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి కాలజ్ఞానంలో" న గాయత్ర్యా పరం మంత్రం నమాతుః పరదేవతా' అని ప్రస్తావించారు.

ఉపసంహారం :- గాయత్రీ మంత్రాధిదేవుడు సవితృడు. జగత్పిత విశ్వకర్మ. గాయత్రీ మంత్రం మోక్షహేతువు. ఈ మంత్రాన్ని విశ్వామిత్రుడు ప్రసాదించాడు. వేదోక్తంగా బ్రాహ్మణాదులతో పఠించబడే ఈమంత్రం క్షత్రియుడైన విశ్వామిత్రునితో ప్రసాదించబడి బ్రహ్మజ్ఞానం కలవాడే బ్రాహ్మణుడు అనే అంశాన్ని సూచిస్తున్నది. ఈ మంత్రానికి వేద మంత్రాల్లో మహోన్నత స్థానం ఉంది. ఇదీ క్లుప్తంగా గ్రంథసారాంశం.

గ్రంథకర్త వాచస్పతి గారు పై అంశాలను, వేదాలు, ఉపనిషత్తులు, భాష్యాలు, మున్నగు గ్రంథాల్లోని అంశాలను ఉపపత్తులుగా ఉదాహరిస్తూ నిరూపించారు.

గాయత్రీ మంత్రం ఒక్కటే. కానీ దర్శనాలు చాలా వున్నాయి. ఈ మంత్రానికి ఎందరో పండితులు వ్యాఖ్యానాలు రచించారు. ముఖ్యంగా పంచార్షేయ సప్తార్షేయ బ్రాహ్మణులు రచించారు. అదే మంత్రం అవే వేదాలు ఉపనిషత్తులు శ్లోకాలు. పంచార్షేముల గ్రంథాల్లో విశ్వకర్మ సూక్తం, విశ్వకర్మ తత్త్వం ప్రధానంగా వివరించబడుతుంది. సప్తార్షేముల గ్రంథాల్లో విశ్వకర్మ ప్రస్తావనే వుండదు. పాండిత్య ప్రకర్షతో వాళ్లు పరిహరిస్తారు. అదే ప్రకర్షతో వీళ్లు ఆవిష్కరిస్తారు.

కాని వాచస్పతిగారుఎటువంటి పాక్షికత లేకుండా సమదృష్టితో సత్యాన్వేషణతో ఈ గ్రంథం రచించారని చెప్పవచ్చు.

ఎవరెన్ని భాష్యాలు చెప్పినా మంత్రార్థం మాత్రం ఒక్కటే.

మంత్రార్థం :- ఏ సవితృదేవుడు మనయొక్క బుద్ధులను ప్రేరేపించుచున్నాడో ఆ సవితృదేవుని యొక్క భజింపదగిన భర్గమనే తేజాన్ని ధ్యానిస్తున్నాము. ఈ మంత్రాన్ని సాధారణ వ్యక్తులు, మహాపండితులు తాత్పర్యంతో సహా పఠిస్తారు. కానీ మామూలు మనుషులు చిలకల లాగా పలుకుతారు. పండితులు మాత్రం ఎవరి యిష్టం వచ్చినట్లు వారు వ్యాఖ్యానాలు చేస్తారు.

మంత్రం పేరు :- దీన్ని గాయత్రీ మంత్రం అంటారు. కానీ మంత్రంతో గాయత్రిపేరు అసలు కనిపించదు.

ఛందస్సు :- గాయత్రీ అనేది ఛందస్సు. ఐదుశిరస్సులు, ఐదుకిరీటాలు ఆయుధాలు అనేవి పండితుల ఊహలకు చిత్రకారుల సృష్టి.

ఈ మంత్రంలో స్తుతించబడిన దేవత సవిత అంటే సూర్యుడు. గాయంతం త్రాయతే యస్మాత్ గాయత్రీ తేన కథ్యతే. తనను గానం చేసే వారిని రక్షిస్తుంది.

నాకర్థమైన గాయత్రి :- వాచస్పతుల వారి గ్రంథం చదువగా నాకు బోధపడిన విషయమేమిటంటే

సమస్త విశ్వాన్ని సృష్టించిన దేవుడున్నాడు. కనిపించేవాడు కాదు. ఆయనే స్వయంభూ విశ్వకర్మ – ఈ దేవుడు ఒక్కొక్కరితో ఒక్కొక్కవిధంగా ఒక్కొక్క మతంలో ఒక్కొక్క రకంగా, ఒక్కొక్క భాషలో ఒక్కొక్క విధంగా, పిలువ బడతాడు. ప్రపంచానికంతా ఆయనే. ఎవరైతేనేం సవితను సృజించింది ఆయనే. సృజించిన వాడు మనకు కనిపించక పోయినా సృజించబడిన సూర్యుడు అందరికీ కనిపిస్తాడు. కనిపించి మానవాళికి పనికి వచ్చేదేవుడు సూర్యుడు.

సమస్తం ఆయనే :- సూర్యుడే విశ్వకర్మ, సూర్యనారాయణ, సత్యనారాయణ, గణపతి, శివుడు బ్రహ్మ, రాముడు, కృష్ణుడు అంతా ఆయనే అందరి పక్కా. గాయత్రి ఛాయాదేవిగా లక్ష్మిగా, సరస్వతిగా, పార్వతిగా, రమాదేవిగా, సీతగా, రుక్మిణిగా ఉంటుంది. అంటే అంతా సవితృ స్వరూపమే. కనిపించేది శాశ్వతమైంది, తేజో మయమైంది, మానవులకు కాంతిని శక్తినిచ్చేది, సస్యాలను పండించేది, ఫలితాన్నిచ్చేది సవితృమండలమే. మంత్రంలో లేని శబ్దానికి ఛందస్సుకు సంబంధించిన దానిని అధారంగా పండితులు, వందల కొలది పుటలతో భాష్యాలు రచించారు. గాయత్రి ఛందస్సు మాత్రమే. దేవుడు సవితృడొకడే.

మతాతీతమైన మంత్రం :- సూర్యుడు సర్వమతాలూ అంగీకరించే శక్తి. సంస్కృత భాషలో వుంది గనుక ఇది ఒక మతం వారిది అనుకోవడం పొరపాటు. ఏమతం వారైనా ఈ మంత్రార్థాన్ని మననం చేయవచ్చు. మననం చేస్తే ఫలితం ఉంటుంది. పెదవులాడించిన మాత్రాన ఫలితం ఉండదు. మతాతీతంగా కులాతీతంగా, సర్వులూ పఠించదగిన పవిత్ర మంత్రం గాయత్రి.

డా॥ వాచస్పతిగారు ఇంతవరకు అన్నీ ఇటువంటి గ్రంథాలే రచించారు. వేదాలను ఉపనిషత్తులను పురాణాలను నిశితంగా ప్రశ్నించే వాచస్పతిగారు హేతువాదులు. కాని నాస్తికులు కాదు. ఆయన రచించే గ్రంథాలు కాలక్షేపానికి కాదు. ఆలోచింపచేసేవి. పాఠకులకు సత్యాన్ని చూపించేవి. డా॥ స్వర్ణ వాచస్పతి గారు ఇంకా ఇలాంటివే అమూల్య గ్రంథాలు రచించి జిజ్ఞాసులైన ఆంధ్రసాహితీ ప్రియులకు సత్యాన్వేషకులకు ఆనందాన్ని ఆలోచనను, అందిస్తున్నందుకు అభినందిస్తున్నాను.

ఇట్లు

కన్నెకంటి రాజమల్లాచారి

మా ప్రచురణలు

"విమర్శకాచార్య శిల్పకళాకోవిద" స్వర్ణ సుబ్రహ్మణ్యకవిగారు రచించిన గ్రంథములు

1. భారతీయ మహా శిల్పము.... 1.2.3. భాగములు (ప్రతులు లేవు)

ఇందు 1వ భాగమున కాశ్యపశిల్పము 3,4,5,6 పటలములు, మానసారము 13,14 అధ్యాయములు, శిల్పరత్నము పూర్వభాగము 9,10,16,17,18,19 అధ్యాయములు, సమరాంగణ సూత్రధార 1,61 అధ్యాయములు, అపరాజిత 173 సూత్రములు సేకరింపబడి వాస్తుహోమము, ఉపపీఠభేదములు అధిష్ఠాన భేదములు మున్నగు 104 విషయములు కూర్పబడినవి.

2వ భాగమున కాశ్యపశిల్పము 7 నుండి 25 పటలముల వరకు, మానసారము 11, 15, 16, 18 అధ్యాయములు, శిల్పరత్నము పూర్వభాగము 20, 21, 23, 30, 32, 34, 35, 36 అధ్యాయములు, సమరాంగణ సూత్రధార 55వ అధ్యాయము, అపరాజిత 150 సూత్రము సేకరింపబడి నాలప్రతిష్ఠ, స్తంభ-వేదికా- జాలక-తోరణ-కుంభ-లతాది లక్షణభేదములు మున్నగు 41 విషయములు తెలుపబడినవి.

3వ భాగమున కాశ్యపశిల్పము 26, 32 పటలములు, మానసారము 12, 19, 20, 21, 22, 23 అధ్యాయములు, శిల్పరత్నము 1, 25, 26 అధ్యాయములు సమరాంగణ సూత్రధార 62 అధ్యాయము, అపరాజిత 106 సూత్రము కూర్పబడి గర్భన్యాసము ఒక్క అంతస్తు మొదలు 5 అంతస్తుల వరకు గల దేవాలయభేదములు మున్నగు 122 విషయములు వ్రాయబడినవి.

2. భారతీయ శిల్పము... 4,5,6 భాగములు. వెల రు. 140-00

(ఆంధ్రప్రదేశ్ పౌరగ్రంధాలయశాఖ, హైదరాబాదు. ఆర్.సి.నం. 39 ఇ 1-99 తే. 22-11-99 సైటేషను నంబరు. 761/సా.తె/700/3)

ఇందు 4వ భాగమున కాశ్యపశిల్పము 33 నుండి 41పటలము వరకు, మానసారము 24 నుండి 30 అధ్యాయముల వరకు, సమరాంగణ సూత్రధార 49, 56, 62 అధ్యాయములు, అపరాజిత 81, 104,105,106,155,157,158,159,168 సూత్రములు గ్రహింపబడి ఆరంతస్తులు మొదలు 16 అంతస్తులవరకు గల దేవాలయభేదములు, పై రాజ్య ప్రాసాదభేదములు, అందుత్ర్యంగ, పంచాంగ, సప్తాంగ, నవాంగాది భేదములు, రుచకము మొదలగు 64 భేదములు తెలుపబడినవి.

5వ భాగమున విశ్వకర్మ ప్రకాశ 6 అధ్యాయము సమరాంగణ సూత్రధార 55,56,57,63 అధ్యాయములు, అపరాజిత 106, 116, 155, 159, 162, 163, 167, 168, 170 సూత్రములు కూర్పబడి సాంధార భేదములు, నాగరోద్భవ విమాన ప్రాసాదభేదములు, శ్రీధరాదిశుద్ధ చందభేదములు మేరుజాతి భేదములు మున్నగు 160 విషయములు తెలుపబడినవి.

6వ భాగమున సమరాంగణ సూత్రధార 49, 55, 56, 57, 62, 63, 65 అధ్యాయములు, అపరాజిత 106, 155, 159, 116, 162, 163, 167, 168, 170 సూత్రములు గ్రహింపబడి మేరుభేదములు, కైలాసభేదములు, పుష్పక- మణిక- త్రివిష్టప భేదములు, భూమిజ ప్రాసాదభేదములు, ఉదయకలాస్కంధిరేఖా భేదములు, ద్రావిడ ప్రాసాద భేదములు, వరాట ప్రాసాదభేదములు మున్నగు 134 విషయములు చెప్పబడినవి.

3. భారతీయ మహాశిల్పము... 7,8,9 భాగములు. వెల రూ. **165-00**

(ఆంధ్రప్రదేశ్ పౌర గ్రంధాలయశాఖ సంచాలకులు, హైదరాబాదు. వారి ఆర్.సి.నం.35 ఇ1/99. తేది. 22-11-99 సైటేషను నంబరు. 387/ని.తె./700/2)

ఇందు 7వ భాగమున కాశ్యపశిల్పము 43 పటలము, సమరాంగణ సూత్రధార 59, 60, 61, 64 అధ్యాయములు, శిల్పరత్నము పూర్వభాగము 40 అధ్యాయము, అపరాజిత 133, 134, 164, 165, 166, 169, 172, 176, 177, 179 సూత్రములు గ్రహింపబడి వరాట-విమాన-నాగర-సాంధార-రుచకజాతిసాంధార-లతినజాతి-మిశ్రజాతి-స్త్రీసంజ్ఞిక వలభి- సంహావలోకన ప్రాసాదభేదములు, నాగరజాతి బ్రహ్మ విష్ణ్వాది ప్రాసాదములు, ద్వారదేవతలు, ప్రాకార విధానము మున్నగు 178 విషయములు తెలుపబడినవి.

8వ భాగమున కాశ్యపశిల్పము 44, 45, 46 పటలములు, శిల్పరత్నము పూర్వభాగము 39, 40, 41, 42 అధ్యాయములు, మానసారము 31, 32, 33, 34 అధ్యాయములు, విశ్వకర్మ ప్రకాశ 6వ అధ్యాయము, సమరాంగణ సూత్రధార 66, 67 అధ్యాయములు, అపరాజిత 186, 187, 188, 189 సూత్రములు గ్రహింపబడి, ప్రాకార విధానము, పరివార దేవతలు, గోపురభేదములు, మండపభేదములు మున్నగు 34 విషయములు చెప్పబడినవి.

9వ భాగమున కాశ్యపశిల్పము 46 నుండి 78 పటలములు, మానసారము 51, 52, 53, 62 అధ్యాయములు, శిల్పరత్నము ఉత్తరభాగము 1, 3, 14, 21, 22

అధ్యాయములు, సమరాంగణ సూత్రధార 70, 77 అధ్యాయములు, అపరాజిత 198, 199, 200, 202, 204 నుండి 214 సూత్రములు గ్రహింపబడి శిలా లక్షణములు, రత్న లక్షణములు, స్వయంభు లింగభేదములు, శివరూపభేదములు, గణపతిభేదములు, సూర్యలక్షణము, గ్రహలక్షణములు మున్నగు 124 విషయములు తెలుపబడినవి.

4. భారతీయ మహాశిల్పము... 10వ భాగము వెల రు. 125-00

ఇందు కాశ్యపశిల్పము 46, 48 పటలములు. మానసారము 48, 54, 55, 57-62 అధ్యాయములు, శిల్పరత్నము ఉత్తరభాగము 23, 24, 25 అధ్యాయములు, సమరాంగణ సూత్రధార 77 అధ్యాయము, అపరాజిత 217, 219, 220 ఇ· 223 సూత్రములు గ్రహింపబడి విష్ణు రూప భేదములు దేవీ రూపభేదములు, దిక్పాలక లక్షణములు, నానావిధ దేవతా లక్షణములు, ఋషి లక్షణభేదములు, యక్ష-రాక్షస-గంధర్వ- అప్సర-కిన్నరాది రూపభేదములు జైన-బౌద్ధాది లక్షణములు మున్నగు 144 విషయములు చెప్పబడినవి.

5. భారతీయ మహాశిల్పము... 11వ భాగము. వెల రు. 125-00

ఇందు కాశ్యపశిల్పము 50-57 పటలములు, మానసారము 49, 64, 65, 66 అధ్యాయములు, శిల్పరత్నము ఉత్తరభాగము 16, 21 అధ్యాయములు, పూర్వభాగము 44, 46, అధ్యాయములు, మయవాస్తు 3 అధ్యాయము, సమరాంగణ సూత్రధార 76, 78, అధ్యాయములు, వాస్తు శిరోమణి 3,4 అధ్యాయములు మయమతము 4,5 అధ్యాయములు, అపరాజిత 210, 225, 234, 236 సూత్రములు, ఆత్రేయశిల్పము గ్రహింపబడి ప్రతిమావిధనము, ఉత్తమ-మధ్యమ-కనిష్ట-దశతాల భేదములు, నవతాల-అష్టతాల-సప్తతాల-షట్తాల-పంచతాల-చతుస్తాల-త్రితాల భేదములు, ఏకతాల లక్షణము మున్నగు 33 విషయములుక్తములు.

6. భారతీయ మహాశిల్పము... 12వ భాగము. (అచ్చులో ఉన్నది)

ఇందు కాశ్యపశిల్పము 79-86 పటలములు, మానసారము 43, 67 అధ్యాయములు, సమరాంగణ సూత్రధార 71-83 అధ్యాయములు, శిల్పసంహిత 11 అధ్యాయము, మయమతము 66 అధ్యాయము, అపరాజిత 214, 215, 236 సూత్రములు సేకరింపబడి దేవదానవాది ప్రతిమామాన భేదములు, ముఖ భేదములు, పంచపురుష భేదములు, ఋజ్వాగతాది స్థానభేదములు, పతాకాది చతుః షష్టిహస్త భేదములు, రసదృష్టి భేదములు, ఆయుధ భేదములు, చిత్రలేఖనము మున్నగు 167 విషయములు చెప్పబడినవి.

7. భారతీయ మహాశిల్పము... 13వ భాగము (అచ్చులో నున్నది)

ఇందు విశ్వకర్మ ప్రకాశ 1,2,5,7 అధ్యాయములు, శిల్పరత్నము పూర్వభాగము 3 అధ్యాయము, మానసారము 5-9 అధ్యాయములు, సమరాంగణ సూత్రధార 8,14,20ఇ 24 అధ్యాయములు, అపరాజిత 55,56,68, 91-98. 134 సూత్రములు, కాశ్యపశిల్పము 2 పటలము గ్రహింపబడి- భూమి లక్షణములు, గ్రామ లక్షణములు, ఏకశాల-ద్విశాల-త్రిశాల-చతుశ్శాల భేదములు మున్నగు 300 విషయములు తెలుప బడినవి.

8. భారతీయ మహాశిల్పము... 14వ భాగము వెల రు. **125-00**

(ముద్రితము. 2001-2002 సం) (సప్రయోగ సర్వదేవతా ప్రతిష్ఠాగమము)

ఇందు మానసారము, కాశ్యపశిల్పము, సమరాంగణ సూత్రధార, అపరాజిత పృచ్ఛ, శిల్పరత్నము, నారదీయ శిల్పము, గార్గేయాగమము, పరశివ విశ్వకర్మాగమము లందలి ప్రతిష్ఠా భాగములు గ్రహింపబడి-శైవ-వైష్ణవ-శాక్తేయములకుపయోగించు జీర్ణోద్ధారాదులు మున్నగు విషయములు చెప్పబడినవి.

9. విశ్వబ్రాహ్మణ విజ్ఞానము... వెల రు. **35-00**

(భారతీయ మహాశిల్పము 14వ భాగములో ద్వితీయ భాగము)

(ఆంధ్రప్రదేశ్ పౌరగ్రంధాలయశాఖ సంచాలకులు. హైదరాబాదు. వారి ఆర్.సి.నెం. 35/ఇ1/99 తేది 22-11-99, సైటేషను నంబరు 326/సా.తె. 700/2)

ఇందు శిల్పబ్రాహ్మణులకు అన్యబ్రాహ్మణులతో జరిగిన వాదోపవాదములు, న్యాయస్థానములందు జరిగిన తీర్పులు, శిల్పబ్రాహ్మణులను గురించి ప్రసిద్ధ చరిత్రకారుల రచనలు వ్రాయబడినవి.

10. భారతీయ మహాశిల్పము... 5వ భాగము (అచ్చులో నున్నది)

ఇందు సమరాంగణ సూత్రధార 31 అధ్యాయము వివిధ యంత్రరహస్యములు, చిత్రశిల్పము, వేదకాలము నుండి నేటివరకు గల శిల్పచరిత్రము లందలి మహత్తర చమత్కారములు మున్నగు 200 విషయములు లిఖింపబడినవి.

11. భారతీయ మహాశిల్పము... 6వ భాగము (అచ్చులోనున్నది)

(శిల్పవాస్తు పరిభాషాది విజ్ఞాన సర్వస్వము)

సమస్త శిల్పగ్రంధముల నుండి గ్రహింపబడిన పదివేల శబ్దములు గల నిఘంటువు.

డా॥ స్వర్ణ వాచస్పతి రచించిన గ్రంథములు

1. వాల్మీకి రామాయణ సౌరభాలు వెల రు. 60-00

(ఆంధ్రప్రదేశ్ పౌరగ్రంధాలయశాఖ సంచాలకులు, హైదరాబాదు వారి ఆర్.సి.నెం.35/ఇ1/99 తేది 22-11-99, సైటేషను నంబరు 379/సా.తె. 200/151)

జ్ఞానపీఠ పురస్కార గ్రహీత, పద్మభూషణ్, డా॥ సి. నారాయణరెడ్డిగారు, మార్కాపురం యస్.వి.కె.పి. కళాశాల ఆంధ్రోపన్యాసకులు సాహిత్య సరస్వతి, విద్యావిశారద, డా॥ కన్నెగంటి రాజమల్లాచారి యం.ఎ., పి.హెచ్.డి.గారు, నాగార్జున విశ్వవిద్యాలయం తెలుగు శాఖాధిపతి, ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారిగారు మున్నగు ప్రముఖులచే ప్రశంసించబడిన గ్రంధము.

రాముడు పితృవాక్య పరిపాలనకై వనములకేగలేదు. అవతార పురుషుడుకాదు. పాయస మహిమచే జన్మించలేదు. ఏకపత్నీవ్రతుడు కాదు. న్యాయశీలుడు కాదు. రాముని వనవాసమునకు కైకేయి, మంధరలు కారణము కాదు. దశరథుడు చేసిన వాగ్దానము ప్రకారము తన కుమారునకు రాజ్యమిమ్మని అడిగిన కైక నిందించబడినది. రాజ్యమునకై తండ్రిని వధించుమని రాముని ప్రోత్సహించిన కైకేయి ప్రశంసించబడినది. ఇది న్యాయమా? తన వంశము యొక్క వివరములు తెలిపి, తన వివాహము చేసికొనుమని కోరిన శూర్పణఖను విరూపిని గావించినవాడు రాముడు. తత్ప్రతీకారముగ సీతను లంకాపురికి తీసికొని వెళ్ళియు సీతతో పిరికిదానా! భయపడకుము. నీ అంగీకారము లేనంతవఱకు నిన్ను తాకను అని ధైర్యము చెప్పినవాడు రావణుడు? వీరిలో ఉత్తములు ఎవరు? ఉత్తమ ధర్మమేది? క్షాత్ర ధర్మమా? రాక్షస ధర్మమా?

రామరావణ యుద్ధమునకు మూలకారణము సీతాపహరణము కాదు. రావణుని లంక కిష్కింధ ప్రక్కనేయున్న ద్వీపకల్పము. రావణుడు హనుమంత- సుగ్రీవాదులందఱకు తెలిసినవాడే. మారీచుడు లేడి రూపము ధరించలేదు. హనుమంతుడు సీతాన్వేషణకై లంకకు వెళ్ళలేదు, లంకను దహించలేదు. సముద్రమును లంఘించలేదు. సంజీవి పర్వతమును తీసికొని రాలేదు. రాముడు పరాక్రమవంతుడు కాదు. ధైర్యవంతుడు కాదు. విజ్ఞానవంతుడు కాదు. రాముడు భార్యయగు సీతను నీచాతి నీచంగా చూచాడు. భార్యయగు సీతను లక్ష్మణుని యందుగాని, భరతునియందుగాని వానరరాజగు సుగ్రీవునియందుగాని, రాక్షసరాజగు విభీషణుని యందుగాని మనసుంచి, వారి చెంతకేగుమని వచించిన రామునిలో ఉత్తమలక్షణములున్నవా? గుహుడు, భరద్వాజుడు

మున్నగువారితో తానడవులో కందమూలములు తిని గడపెదనినిన రాముడు వనముల లేగగనే జంతువులను వేటాడి వీటి మాంసమును దినుట ధర్మమా? సీతకు కాల్చిన మాంసపు ముక్కను రుచిచూపుచూ భరతుడు వచ్చుట తెలిసి పర్ణశాలలోనికేగి ఋషివలె కూర్చుండుట రాముని నటనకాదా? రామరాజ్యం కరువుకాటకాలతో దుర్భరంగా వుంది. రామరాజ్యములో శూద్రులు, పేదలు దుర్భరంగా గడిపారు. బిచ్చగాండ్రకు బిచ్చము కూడ లభించేదిగాదు. బ్రాహ్మణుల మాటవిని అడవిలో తపస్సు చేసికొను శంబుకుని అకారణముగా చంపిన రామునిలో ధర్మమున్నదా? సోదరుని రాజ్యమునకై తహతహలాడిన వాడు రాముడు. రాజ్యమునకై సోదరుని, రామునిచే చంపించినవాడు సుగ్రీవుడు. రాజ్యమునకై సోదరులను బంధువులను, స్వజాతినే నాశనము చేయించినవాడు విభీషణుడు. ఇట్టి విషయములనేకము వాల్మీకి రామాయణము నందలి శ్లోకములతో సోదాహరణముగా వివరింపబడినవి.

2. మహాభారత స్వస్వరూపము (ప్రతులు లేవు) వెల రు. **95-00**

(ఆంధ్రప్రదేశ్ పౌరగ్రంధాలయశాఖ సంచాలకులు, హైదరాబాదు వారి ఆర్.సి. నెంబరు 35 తె. 1/2000 తేదీ-11-2000 సైటేషను నంబరు. 1902/సా.తె. 200/320)

ఈనాడు 24-9-2000 దినపత్రికలోని కొన్ని విషయాలు "భారతకథ భాగవతంలో కూడ ఉంది. రెంటికీ రచయిత వ్యాసుడే అయినా కధనంలో వచ్చిన మార్పులను రచయిత పట్టికాబద్ధం చేసి స్పష్టీకరించారు. వాల్మీకి రామాయణానికీ, వ్యాసభారతానికీ కథా సంవిధానంలో కనిపించే భేదాలను పోలికలను మరోపట్టికలో వివరించారు. వ్యాసుడు 'జయ', భారతంగా, మహాభారతంగా ఎలా విస్తరించిదో వివరించారు. బ్రాహ్మణాధిక్యాన్ని చాటటానికి ఎన్నోచేర్పులు, మార్పులు తరువాతి కాలంలో వచ్చాయని, వ్యాసుడూ ఆయన శిష్యులూ చాలక నన్నయభట్టు మొదలైన వాళ్ళు కూడ వక్రీకరించి కౌరవులకు అన్యాయం చేశారని వాదించారు...

బూదరాజు రాధాకృష్ణ.

"ఈ గ్రంథం మీ నిశిత దృష్టికి, రచనాశక్తికి నిదర్శనంగా ఉంది".

డా॥ యన్.గోపి, యం.ఎ.,పి.హెచ్.డి. వైస్ ఛాన్సలర్,
పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాదు.

మహాభారతయుద్ధం ఎలా జరిగిందో భారతం మీద వాచస్పతిగారి విమర్శనా యుద్ధము అలాగే జరిగింది. కథ, విమర్శ రెండూ కలసి కదనుతొక్కాయి.

-**డా॥ కన్నెగంటి రాజమల్లయాచారి** యం.ఎ.,పి.హెచ్.డి.
ప్రిన్సిపాల్ **S.K.V.P.** కళాశాల, మార్కాపురం.

ఈ గ్రంథం ప్రథమభాగం 19 ప్రకరణలలో మహాభారత విమర్శ, ద్వితీయభాగం 81 ప్రకరణలలో మహాభారత కథ వ్రాయబడినది. మహాభారతము ధర్మాధర్మముల పోరాటమా? కుమారులను, బంధుమిత్రులను సర్వమును పోగొట్టుకుని రణమున విజయము పొందిన ధర్మరాజునకు లభించినదేమి. శ్మశాన సదృశరాజ్యము ధర్మ విజయమా? పాండవులు అరణ్య అజ్ఞాతవాసములు నియమప్రకారము గడిపినారా? జూదము రాజసూయ యజ్ఞములోని భాగమా? రాజసూయ యజ్ఞఫలము ద్రౌపది పరాభవము రాజ్యభ్రష్టత వనవాసములా? గురువులను, వృద్ధులను పోషించిన సుయోధను డుత్తముడా? వారి నధర్మముగ వధించిన ధర్మరాజుత్తముడా? కన్యగా నున్నపుడే బిడ్డలను కనిన సత్యవతి-కుంతి చరిత్రలు, భర్త మరణించ వ్యాసుని వలన బిడ్డలను కనిన అంబికా-అంబాలికలు, తండ్రి కుమారుల (సూర్యుడు, యముడు)కు సంతానము పొందిన కుంతి చరిత్ర, పంచభర్తృకయయ్యునూ ఆఱవ భర్తకై ఎదురుచూచిన ద్రౌపది-వీరి చరిత్ర నుండి గ్రహించవలసినదేది? రాజ్యకాంక్షతో వంశమును, దేశమును నాశన మొనరించిన భారతకథ నుండి నేర్చుకొనవలసిన నీతియేమి?

కృష్ణుని విశ్వరూపము, ద్రౌపది వస్త్రాపహరణము, ఉత్తర గోగ్రహణము, మున్నగున వెన్నియో కల్పితములు. కృష్ణ-ధర్మరాజ, ధృతరాష్ట్ర, కర్ణ, భీష్మ, ద్రోణాదుల స్వభావములు విపులముగా చిత్రీకరించబడినవి. ఇట్టి విషయములెన్నియో సోదాహరణమగ వివరింపబడినవి.

3. రావణబ్రహ్మ చరిత్రము (ప్రతులు లేవు) వెల రు. 35-00

(ఆంధ్రప్రదేశ్. పౌరగ్రంథాలయశాఖ సంచాలకులు, హైదరాబాదు వారి ఆర్.సి.నెం. 35/21/2 ఒ. తేది-11-2000 సైటేషను నంబరు 1887/సా.తె. 200/305)

అనేక గ్రంథములు పురాణములు మున్నగు 49 గ్రంథముల నుండి విషయములు పరిశీలించి వ్రాయబడినవి. రావణబ్రహ్మ శివుని మెప్పించిన గొప్ప శివభక్తుడు. సదాచార సంపన్నుడు ఉత్తర హిందూ దేశము నందంతయు దండయాత్రలు చేసి దిగ్విజయము పొందిన ఇక్ష్వాకుల రాజగు మాంధాతను నర్మదానదిని దాటి దక్షిణదేశమునకు రానీయుండ నిలువరించిన మహాపరాక్రమవంతుడు ఇంద్ర, యమ, కుబేర, వరుణాదులను జయించిన మహావీరుడు. చెల్లలగు శూర్పణఖను రాముడు పరాభవించ, అతని భార్యయగు సీతను తీసికొని వెళ్ళియు దిక్కులేని ఆమెనోరడించి ధైర్యముచెప్పి రాజస్త్రీగా సకల మర్యాదలతో గౌరవించిన సార్వభౌముడు అతి వృద్ధుడయ్యును యువకుడగు రామునితో ఏడహో రాత్రములు పోరాడి తన తమ్ముడగు విభీషణుని కుతంత్రమునకు బలిఅయిన మహాబల వంతుడు మహాకవి బ్రహ్మవంశీయుడు.

4. ఆధర్వణాచార్యుడు వెల రు. **20-00**

(ఆంధ్రప్రదేశ్ పౌర గ్రంధాలయశాఖ సంచాలకులు హైదరాబాదు వారి ఆర్.సి.నెం. 35.ఇ1/2000 తేది 16-3-2002 సైటేషను నంబరు. సా.తె. 800/ 1173/894. 827108)

నన్నయకు పూర్వమే సంస్కృత మహాభారతమును సంపూర్ణముగా ఆంధ్రీకరించిన మహాకవి. ఇతని మహాభారత పద్యములు ఇతర గ్రంధములు, చరిత్ర వ్రాయబడినది.

5. కందుకూరి రుద్రకవి చరిత్రము వెల రు. **15-00**

(ఆంధ్రప్రదేశ్. పౌరగ్రంధాలయశాఖ సంచాలకులు, హైదరాబాదు వారి ఆర్.సి.నెం. 35 ఇ1/2000 తేది 16-3-2002/సా.తె. 900/296)

శ్రీ కృష్ణదేవరాయల ఆస్థానకవి. నిరంకుశోపాఖ్యానము మున్నగు మహా కావ్యములు రచించి కృష్ణదేవరాయలచే ప్రశంసించబడిన మహాకవి.

6. అఖిల దేవతాస్తోత్రమంజరి వెల రు. **10-00**

ఇందు 34 దేవతలను గురించి స్తోత్రములు కలవు.

7. శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి జీవిత చరిత్రము వెల రు. **35-00**

క్రీ॥శ॥ 1600 ప్రాంతమున జన్మించి ఆంధ్రరాష్ట్రమంతయు పర్యటించి మరణించిన వారిని బ్రతికించియు, పోలేరమ్మతో నిప్పు తెప్పించియు, శరీరములోనున్న దేవతలను చూపించియు, పశువు గర్భములోని దూడను బయటకు చూపించి మరల ఆ

గర్భములోనికి ప్రవేశపెట్టియు ఇట్టి అనేక మహిమలు చూపించియు, భారతదేశమును పరదేశవాశీయులు పాలింతురనియు, ఉత్తరదేశమున వైశ్య కులమున గాంధీ పుట్టుననియు, ఏకు పట్టెదువాడు వచ్చి మేకై నిలచి జనుల మేలించుననియు, మాలమాదిగులు భూపాలిదు రగుదురనియు, బ్రాహ్మణులు నీచుల నాశ్రయింతురనియు, అనేక ప్రళయములు సంభవించు ననియు, జనులు డిల్లీ నుండి దక్షిణమునకు తరలివత్తురనియు, ఉత్తర దేశమున ప్రజలు కత్తులతో వేటలాడుదురనియు, శివవైష్ణవ దేవాలయములలో రక్తము కారుననియు ఇట్టి అనేక మహిమలు జరుగునని తెలిపి క్రీ॥శ॥ 1693వ సంవత్సరము వైశాఖ శుద్ధ దశమి యందు జీవ సమాధిని చేరెను. వీరబ్రహ్మేంద్రస్వాములవారు విశ్వబ్రాహ్మణుడు, మహాపండితుడు, గొప్ప జ్యోతిషశాస్త్రవేత్త, మహాశిల్పి హిందూ మహమ్మదీయ సమైక్యతావాది, హరిజనోద్ధారకుడు, గొప్ప సంఘసంస్కర్త.

ఈ గ్రంథమును గురించి పండితుల అభిప్రాయములు

"ప్రస్తుత గ్రంథము డా॥ స్వర్ణ వాచస్పతిగారు రచించినది. నిండ నూరు పుటలులేవు. అయినను రచయిత పండిత పరిశోధకుడగుటచేతను, అల్పాక్షరములతో అనల్పార్థమును చెప్పగల సమర్థుడగుట చేతను బ్రహ్మేంద్రుని జీవిత సర్వస్వమును 42 శీర్షికల క్రింద విభజించుకొని పరిత్రలోకమునకు పరమోపకారము కావించెను,...... గ్రంథము సంక్షిప్తమైనదే అయినను బ్రహ్మేంద్రుని కాలజ్ఞానాది రచనలు సారభూతముగ చెప్పబడినవి. అంతేకాదు. పుష్పగిరి అగ్రహారీకులకును సిద్దయ్య గారికిని జరిగిన సంభాషణములో విశ్వకర్మ తత్త్వము విశ్వకర్మీయ విశేషములు, బ్రహ్మజ్ఞాన లక్షణములు సిద్దయ్య గారిచే వివరింపబడినరీతి అపూర్వము...

వాసిలి వేంకటలక్ష్మీ నరసింహారావు
యం.ఏ.,పి.హెచ్.డి. సాహిత్యబ్రహ్మ
రిటైర్డ్ విద్యాశాఖ డైరెక్టరు, హైదరాబాదు.

"వాచస్పతిగారి కలం పరిశోధనకు అలవాటుపడింది. ఏవిషయం తీసుకున్నా దాన్ని పరిశోధించి సత్యాన్ని వెలికితీయటం, అసత్యాన్ని ఖండించడం వారికి అలవాటు. ప్రస్తుత కృతి పరిశోధన పద్ధతిలో నడిచిన చరిత్ర.... రచన మహోత్తరంగా సాగింది. 'మహమ్మదీయుల దేవుడువేరు హిందువుల దేవుడు వేరనుట అజ్ఞానమే కాని వేరుకాదు. దేవుడొక్కడే, అతనికి నామరూపములు లేదు.' అని బ్రహ్మంగారి అద్వైతబోధను రచించి

వాచస్పతిగారు నిజాన్ని చాటారు... శ్రీవారు సజీవంగా సమాధిలోనికి ప్రవేశించారు... ప్రపంచ చరిత్రలో ఈ విధమైన జీవసమాధి అపూర్వం...."

డా॥ కన్నెగంటి రాజమల్లాచారి
సాహిత్య సరస్వతి. విద్యావిశారద
రిటైర్డ్ ప్రిన్సిపాల్, యస్.వి.కె.పి. కళాశాల
మార్కాపురము.

8. వాల్మీకి రామాయణ స్వస్వరూపము వెల రూ. **25-00**


నేను రచించిన వాల్మీకి రామాయణ సౌరభాల ననుసరించి వాల్మీకి రామాయణములోని కథ వ్రాయబడినది.

9. బ్రహ్మవంశచరిత్ర వెల రూ. **80-00**

బ్రహ్మవంశము యొక్క పుట్టు పూర్వోత్తరములు, వేదకాలమునకు పూర్వము నుండియు వారు ప్రజలకై చేసిన కృషి, వారు చరిత్రను., నాగరికతను తీర్చిదిద్దిన వివరములు, వేదములలో బ్రహ్మవంశీయులస్థానము, వారి విశిష్టత, బ్రహ్మవంశీయులగు మనువు, మయుడు, త్వష్ట, ఇంద్రుడు, సూర్యుడు, యముడు, విశ్వరూపుడు, వృత్రుడు, భౌవన విశ్వకర్మ, కశ్యపుడు, నారదుడు, శౌనకుడు, శుక్రాచార్యుడు, వామదేవుడు, భృగువు, గౌతముడు, బృహస్పతి, సంవర్తుడు, అత్రి, అగస్త్యుడు, అధర్వుడు, దధ్యంచుడు, వసిష్ఠుడు, భరద్వాజుడు, అంగీరసుడు, గర్గుడు, పరాశరుడు, శంకరాచార్యుడు మున్నగు మహర్షుల చరిత్రలు వ్రాయబడినవి.

10. గాయత్రీ మంత్ర విశేషములు (అచ్చులో నున్నది)

గాయత్రి పేరు లేనిదియు, సవితృదేవుని స్తుతించునదియును ఋగ్వేదమంత్రము ఏ విధముగ గాయత్రి మంత్రముగ ప్రసిద్ధి చెందినది ఈ మంత్రము బ్రహ్మ, విష్ణువు, శివుడు, ఇంద్రుడు, సూర్యుడు, సవితృడు, విశ్వకర్మ, సావిత్రి, సరస్వతి, గాయత్రి దేవతలకు ఏ విధముగ అన్వయించుచున్నది. వేదోపనిషత్తుల ఉదాహరణముతో విపులముగ వ్రాయబడినది.



విషయసూచిక

ఓం

శ్రీ శారదాయై నమః

గాయత్రీ మంత్ర విశేషములు

ఇష్ట దేవతా ప్రార్థనము

ఓంకార రూప వాగ్దేవీం, హ్రీంకారీం రుద్ర రూపిణీం
శ్రీంకారిణీం వైష్ణవీం, దేవీం ఆదిశక్తిం నమో నమః॥
వాణీం కోమల వాగ్దేవీం, వీణా శ్యామల ధారిణీం
సరస్వతీం సర్వవ్యాపీం సిద్ధ రూపాక్షి మా తృ కా మ్॥
వాగ్దేవీం భువనేశ్వరీం భగవతీం చిద్రూపిణీం సేవాభ్యంతర
సంస్తుత్యాం పరశివాం సదాభక్తి యుక్తే న భావయామ్యహమ్॥
వాగీశాద్యాః సుమనసః సర్వార్థానా ముపక్రమే
యం సత్వాకృత కృత్యాః, స్స్యస్తం నమామి గణాధిపమ్॥

1. గాయత్రీ మంత్రము

ఋగ్వేదము : " తత్సవితుర్వరేణ్యం
భర్గోదేవస్యధీమహి।
ధియో యోనః ప్రచోదయాత్ ॥" 3-62-10

పదవిభాగము : **తత్-సవితుః- వరేణ్యం-భర్గః-దేవస్య - ధీమహి - ధియః-యః -నః ప్రచోదయాత్.**

యః సవితాదేవః= ఏ సవితృ దేవుడు, నః= మనయొక్క, ధియః= బుద్ధులను = ప్రచోదయాత్ = ప్రేరేపించుచున్నాడో, తత్ = ఆ సవితృ దేవుని యొక్క, వరేణ్యం = భజింపదగిన, భర్గః= భర్గమను తేజమును (అవిద్యను నాశనము చేయు స్వయంజ్యోతిని), ధీమహి = ధ్యానించుచున్నాము.

ఈ మంత్రము గాయత్రీ మంత్రముగా ప్రసిద్ధికెక్కినది. కాని ఈ మంత్రములో గాయత్రి నామమెచటను కన్పించదు. గాయత్రిని సావిత్రీ - సరస్వతీ నామములతో ధ్యానించుచుందుము. ఈ మంత్రమున వారి నామధేయములును లేవు. ఈ మంత్రమున స్తుతించబడుదేవుడు సవిత. సవితృ దేవుని స్తుతించు ఈమంత్రము గాయత్రీ మంత్రముగ

ఎట్లు ప్రసిద్ధికెక్కినది? గాయత్రీ దేవికి సవితృ దేవునికిగల సంబంధమేమి? సవితృ దేవుని స్తుతించు ఈ మంత్రము గాయత్రీ దేవికి ఏ విధముగా అన్వయించును? సవితృ దేవుడు ఎవరు?



౨. సవితృ దేవుడు

'సవితృ' శబ్దము 'షూప్రేరణే' అను ధాతువు నుండి పుట్టినది. 'సువతి-సుప్తం ప్రేరయ తీతి సవితా' అనగా నిద్రించువానిని మేల్కొలుపు దేవుడని సవితృ పదమునకు వ్యుత్పత్త్యర్థము. అనగా ప్రాణులను నిద్రనుండి మేల్కొలుపు సూర్యుడని లౌకికార్థము. అజ్ఞానమను నిద్రనుండి మేల్కొలుపు పరమాత్ముడని అంతరర్థము.

'షు' అను సంస్కృత ధాతువునకు 'షు ప్రస వైశ్వర్యయోః' అనియు అర్థము కలదు. ప్రసవించుట అనగా కనుట. దీనిని బట్టి 'సవిత' అనగా జగములను కనిన జగత్పిత అని అర్థము. అనగా అండ పిండ బ్రహ్మాండములను కనిన తండ్రి అని వ్యక్తమగుచున్నది. అనగా జనకుడు, ఉత్పాదకుడు, పుట్టించినవాడు అని అర్థములు సిద్ధించుచున్నవి. ఈ అర్థమును యాస్కుని నిరుక్తవాక్యములు కూడ బలపఱుచుచున్నవి.

'సవీమని' పదమునకు అర్థము తెలుపుచు, 'సవితృ' శబ్దమును గురించి యాస్కాచార్య నిరుక్తము ఈక్రింది విధముగ వచించినది.

1. "సవీమని ప్రసవే" దేవస్య వయం సవితుః సవీమని ఇత్యపి నిగమో భవతి"

నిరుక్తం 6వ అధ్యాయము.

"**వ్యాఖ్య :** సవీమని అనవగతమేతత్, ప్రసవే ఇత్యవగమః, "దేవస్య వయం సవితుః" సవీమని ఇత్యపి నిగమః సర్వార్థ ప్రసవితుః దేవస్య సవీమని = ప్రసవే – సర్వార్థా భ్యను జ్ఞానే, వయం సదా స్యామేతి యోజన."

అనగా 'మనము సర్వమునకును ఉత్పాదకుడగు (జనకుడగు) దేవుని యొక్క ఆజ్ఞలోనుందుముగాక' అని అర్థము. దీనిని బట్టి 'సవిత' అనగా పుట్టించినవాడు. తండ్రి, అని స్పష్టమగుచున్నది.

2. "హోతృ జప స్త్వగ్నిర్వైశ్వానరీయో భవతి. దేవ-సవిత రేతం త్వా వృణతే Z గ్నిం హోత్రాయ సహ పిత్రా వైశ్వానరేణ" ఇతి. ఇమ మే వాగ్నిం సవితా రమాహా, సర్వస్య ప్రసవితారమ్..." **నిరుక్తం. 7వ అధ్యాయం.**

వ్యాఖ్య : సవితః దేవ=హే సకల జగదుత్పాదక దేవ।

దీనిని బట్టియు సవిత అనగా జగత్తులను కన్న తండ్రియని వ్యక్తమగుచున్నది. వేదమంత్రార్థ నిర్ణయములో అతి పూర్వుడగు యాస్కుని మఱియొక ప్రబలతర ప్రమాణము

"దేవ స్త్వష్టా సవితా విశ్వరూపః పు పోష ప్రజాః పురుధా జజాన।
ఇమా చ విశ్వా భువనా న్యస్య మహద్దేవానా మసురత్వ మేకమ్॥"ఋ3.55.16

వ్యాఖ్య : సవితా = సర్వేషా ముత్పాదయితా – నిరుక్తం 10వ అధ్యాయము

సవితృ దేవుడు ఋగ్వేదములో పదకొండు పూర్తి సూక్తములలోను, మరికొన్ని మంత్రములలోను స్తుతించబడినాడు. సవిత శబ్దమునకు తఱచు 'దేవ' శబ్దము కూడియున్నది.

ఋగ్వేదము : **"తత్సవితుర్వృణీ మహే, వయం దేవస్య భోజనం,**
శ్రేష్ఠం సర్వధాతమం, తురం భగస్య ధీమహి." **5.82.1**

ద్యోతన (జ్యోతి) స్వరూపుడును, భజింప తగినవాడును అగు సవితృదేవుని యొక్క శ్రేష్ఠమైనదియు, సమస్త భోగములనిచ్చునదియు, అంతశ్శత్రువుల నణచివేయు సామర్థ్యము కలదియునగు అనుభవింపదగిన ఆ ధనమును (పరమాత్మ స్వరూపమును) భజింతుము (పొందుదుము) గాక।

"అస్య హి స్వ యశస్తరం సవితుః కచ్చ న ప్రియమ్। నమినన్తి స్వరాజ్యమ్॥" **5.82.2.**

సవిత యొక్క అసాధారణ కీర్తిరూప ప్రేమానందమయ స్వరాజ్యమును ఏ శక్తులు హరింపజాలవు, దానితో పోలజాలవు. అనగా ఆ సవితృ దేవుని పరంజ్యోతి స్వరూపమును చూచి పొందు పరమానందానుభూతితో ఏవియు సాటిరావని భావము.

"య ఇమే ఉభే అహనీ పుర ఏత్య ప్రయుచ్ఛన్। స్వాధీ ర్దేవః సవితా॥" **5.82.8**

ఇందలి 'స్వాధీః' అనుమాటకు సాయణులు 'సుకర్మా' అని భాష్యము వ్రాసినారు. సుకర్మలు గల ఏ సవిత, రేలు-పవళ్ళకు ముందు ఏ ప్రమాదము లేకుండ ప్రయాణించు

చున్నాడో అట్టి సవితను అర్చింతుము గాక। (ఇచట రేలు పవళ్ళకు ముందు అనగా కాలమేర్పడుటకు ముందు నుండియే అని భావము)

"య ఇమా విశ్వా జాతా న్యాశ్రావయతి శ్లోకేన। ప్ర చ సువాతి సవితా." **5.82.9.**

ఏ సవిత లోకమున జన్మించిన ప్రాణులకు వేదస్వరూప ధర్మములను వినిపించు చున్నాడో, అట్టి సర్వప్రాణి పితయు, ప్రేరకుడు అగు దేవుని వరింతుము గాక।

"విశ్వాని దేవ సవిత ర్దురితాని పరాసువ! యద్భద్రం తన్న ఆసువ." **5.82.5.**

ఓ సవితృ దేవా! మా యొక్క దురితము లన్నియు పోగొట్టుము. మాకు భద్రములు ("ప్రజావై భద్రం, పశవో భద్రం, గృహం భద్రం" అనగా సంతతి,పశు, గృహము) ఏవి కలవో, వానిని సమకూర్చుము.

"దివోధర్తా, భువనస్య ప్రజాపతిః పిశం గం ద్రాపిం ప్రతిముంచతే కవిః,
విచక్షణః ప్రథయ న్నాపృణన్ను ర్వజీ జన త్సవితా సుమ్న ముక్థ్యం॥" **4.53.2.**

ద్యులోకమును ధరించువాడును, భువనమునకు ప్రజాపతియు, కవియు (క్రాంత దర్శియు, (కవిశబ్దము పరమాత్మకు వాడబడినది. "కవిర్మనీషా పరి భూః స్వయం భూః " అని ఈ శోపనిషత్తు) అగు సవిత ప్రతి ఉదయమును బంగారు కవచమును ధరించును. సర్వద్రష్ట అయిన ఆ పరమాత్మ తన జ్ఞాన తేజముతో ఉపాసక లోక హృదయములను నింపుచు ఆనందమును కలిగించుచున్నాడు.

శతపథ బ్రాహ్మణము (12.3.5.1) 'సవితా ప్రజాపతీ ఒక్కరే' అని తెలిపినది.

"విశ్వారూపాణి ప్రతిముంచతే కవిః ప్రాసావీ ద్భద్రం ద్విపదే చతుష్పదే,
వి నాక మఖ్య త్సవితా వరేణ్యో Zను ప్రయాణ ముషసో విరాజతి." **5.81.2.**

సర్వజ్ఞుడైన సవిత సమస్త రూపములను తనలో లీనమొనర్చుకొనుచున్నాడు. (ఈ సందర్భమున తన నుండి రూపములను (జగములను) సృష్టించుచున్నాడనుటకు "సర్వాణి రూపాణి విచిత్య ధీరః" అను పురుష సూక్త వాక్యము, జగములను తనలో లీనమొనర్చుకొను చున్నాడనుటకు "య ఇమా విశ్వాభువనాని జుహ్వ దృషి ర్హోతా నిషసాద పితానః" అను విశ్వకర్మ సూక్త వాక్యము గమనించదగినవి). అట్టి సర్వక్రియా నాథుడు కనుకనే ద్విపాద జీవులకు చతుష్పాత్తులకు శుభముల నొసగుచున్నాడు. సర్వులకు వరణీయుడైన సవిత ఉషస్సు వఅకు వచ్చిన వారిని, దుఃఖరహితమైన నాకమున చేర్చుకొని ప్రకాశింపజేయు చున్నాడు.

"ఉత యాసి సవిత స్త్రీణి రోచనోత సూర్యశ్మ రశ్మిభిః సముచ్యసి।
ఉత రాత్రీ ముభయతః పరీయస ఉత మిత్రో భవసి దేవధర్మభిః॥" **5.81.4.**

ఓ సవితృ దేవా! నీవు అంతరిక్షమునగల మూడులోకముల యందును తిరుగు చున్నావు. సూర్యకిరణములతో కూడుకొనుచున్నావు. రాత్రి యొక్క రెండు పార్శ్వము లందును (ఉదయాస్త మయములందు) ఉన్నావు. జగత్తును ధరించెడి ధర్మ (కర్మ)ముల చేత ప్రాణులకు మిత్రుడవగుచున్నావు.

అంతరిక్షమునగల లోకములనగా వాయు, విద్యు, ద్వరుణలోకములని బాహ్యార్థము కాగా, అనాహత-విశుద్ధ-ఆజ్ఞా చక్రములని అంతరర్థము.

"ఉతే శిషే ప్రసవస్య త్వ మేక ఉదుత పూషా భవసి దేవ యామభిః
ఉతేదం విశ్వం భువనం విరాజసి శ్యావాశ్వస్తే సవితః స్తోమ మానశే." **5.81.5.**

ఓ సవితా! నీవొక్కడవే సమస్త కర్మలను అనుగ్రహించుటకు ప్రభుడవు అగుచున్నావు. నీవొక్కడవే గమనములచేత పోషకుడవగు చున్నావు. నీవొక్కడవే ఈ సమస్త భూతజాతమును ధరింప సమర్థుడవగు చున్నావు. ఇట్టి నీకు నేను స్తోత్రము నర్పించుచున్నాను.

ఇచట కర్మలనగా లౌకిక-వైదిక-పారమార్థిక-యోగసాధనాది కర్మలనియు భావము. దీనిని బట్టి ఈ మంత్రము సవితయే పరమాత్ముడని స్పష్టము చేయుచున్నది.

"భగం ధియం వాజయంతః పురంధిం నరాశంసో గ్నాస్పతి ర్నో అవ్యాః।
ఆ యే వామస్య సంగధే రయీణాం ప్రియా దేవస్య సవితుః స్యామ." **2.38.10.**

భజింపదగినవాడును, ధ్యానింపదగినవాడును, (ఆధారాది) పురములను ధరించువాడును, వేద జనకుడును అగు సవిత మనకు బలము నిచ్చుచు రక్షించునుగాక। మనకు ధన పశ్వాది సంపత్తుల నొసగు ఆ సవితకు మనము ఇష్టులము అగుదుముగాక।

" అస్మభ్యం తద్దివో అద్భ్యః పృథి వ్యా స్త్వయా దత్త కామ్యం రాధ ఆగాత్।
శం యః స్తోతృభ్య ఆపయే భవా త్యు రుశం సాయ సవిత ర్జరిత్రే॥" **2.38.11**

ఓ సవితా। మా కొఱకు నీచే నొసంగబడిన ఆ ప్రసిద్ధమైన కోరదగిన ధనము స్వర్గము నుండియు, అంతరిక్షము నుండియు, భూమి నుండియు లభించునుగాక! ఇంకను స్తుతించువారి బంధువుకు ఏది సుఖమును కలుగచేయునో, దానిని అధిక స్తోత్రములచే స్తుతించునట్టి నాకు సమకూర్చవలసినది.

ఇచట కోరదగిన ధనమనగా యోగఫలమనియు (అనగా సహస్రారముననున్న పరమాత్మ దర్శనము), స్వర్గము–అంతరిక్షము–భూమి అనగా సహస్రారము, ఆజ్ఞాచక్రము, ఆధారము అనియు అంతరర్థము.

"ఆ కృష్ణేన రజసా వర్తమానో నివేశయ న్నమృతం మర్త్యంచ।
హిరణ్య యేన సవితా రథేనా దేవోయాతి భువనాని పశ్యన్॥" **1.35.2.**

సవితృ దేవుడు నల్లని ఆకాశమార్గమున వర్తించుచు దేవతలను, మానవులను తమ తమ కార్యములయందు నియోగించుచు, బంగారు రథము నెక్కి లోకములను చూచుచు విచ్చేయుచున్నాడు.

ఆధ్యాత్మికమైన అర్థము : నల్లనిదైన అజ్ఞానముచే (మాయచే) ఆవరింపబడిన పరమాత్మ మాయా విద్యోపాధులచేత ఈశ్వరుడును జీవుడును అయి, దేవశబ్దముచే చెప్పదగిన ప్రాణాదీంద్రియములను, మరణ ధర్మము గల శరీరమును పనులయందు ప్రవేశపెట్టుచు జాగ్రజ్జగమునకు విచ్చేయుచున్నాడు.

కఠోపనిషత్తు : "ఆత్మానం రథినం విద్ధి, శరీరం రథమేవచ" అని వచించినది. దీనిని బట్టి బంగారు రథమును శరీరమనియు, సవితృని జీవాత్మ అనియు భావించ వచ్చును. భువనములను చూచుట బాహ్యాంతరర్థముల రెంటను సమానమే.

" సవితా యంత్రైః పృథివీ మరమ్ణా దస్కంభనే సవితా ద్యా మదృంహత్।
అశ్వమివ దుక్షద్ధుని మంతరిక్షమ తూర్తే బద్ధం సవితా సముద్రమ్॥" **10.149.1.**

సవిత యంత్రములచేత భూమిని నిలిపినాడు. ద్యులోకమును ఆకాశమున నిలిపినాడు. అంతరిక్షమున మేఘమును బంధించి వర్షదానము చేయుచున్నాడు.

ఆధ్యాత్మికార్థము : సవితృ పరమాత్మ యొక్క శక్తి వలననే ద్యులోకమని చెప్పదగిన సహస్రారము, అంతరిక్షమని చెప్పదగిన ఆజ్ఞాచక్రము, భూమి అని చెప్పదగిన ఆధారము తమ తమ ధర్మములను నిర్వర్తించుచున్నవి.

ఇచట యంత్రములనగా యమ–నియమ–ప్రాణాయామ–ప్రత్యాహార–ధ్యాన–ధారణ–మనన–సమాధి–యను యోగాంగములనియు, ఈ అష్టాంగముల ద్వారా సహస్రారస్థిత పరమాత్మను సాధింపవచ్చుననియు వ్యక్తమగుచున్నది.

'సవిత' అనగా లోకములను ప్రసవించునట్టి కన్న తండ్రి అనుభావమును సాయణులు ఈక్రింది మంత్రభాష్యమున స్పష్టము చేసినారు.

"తద్రాధో అద్య సవితుర్వరేణ్యం వయందేవస్య ప్రసవే మనామహే।
అస్మభ్యం ద్యావా పృథివీ సుచేతునా రయిం ధత్తం వసుమన్తం శతగ్వినమ్॥"

1.159.5.

భాష్యము : వయం-యజమానాః, సవితుః-సర్వస్య ప్రసవితుః, దేవస్య-ఆదిత్య స్యాంతర్యామి రూపిణః, ప్రసవే=అనుజ్ఞాయాం సత్యాం, తత్తాదృశం, వరేణ్యం-వరణీయమ్.

రాధ ః- పురుషార్థ సాధ్య సమర్థం ధనం గవాదిరూపం, మనామహే -యాచా మహే"

ఈ భాష్యమున 'సవితుః- సర్వస్య ప్రసవితుః' అనుటచే సమస్త జగమును కన్నతండ్రి యైన పరమాత్మ అని వ్రాయబడినది.

"దేవేభ్యో హి ప్రథమం యజ్ఞియేభ్యోZ మృతత్వం సువసి భాగ ముత్తమం।
ఆది ద్దామానం సవిత ర్వ్యూర్ణుషే Z నూచీనా జీవితా మానుషేభ్యః॥" **4.54.2**

ఓ సవితృ దేవా! నీవు ముందుగా దేవతలకు అమృతత్వము యొక్క పూర్ణ భాగమును ఇచ్చుచున్నావు. పిమ్మట మానవులకు వారి క్రమ జీవితమును అందించు చున్నావు. రహస్యార్థము : ఓ సవితృ దేవా! నీవు ముందుగా యోగసిద్ధిని పొంది దేవతలుగా లెక్కింపదగిన వారికి సహస్రారమునందుగల అమృతత్వమును కూర్చెడి సంసిద్ధి యనెడి పూర్ణమయిన భాగము నొసగుచున్నావు. పిమ్మట సాధన చేయువారికి, వారి కుండలిని మేల్కొలిపి స్వాధిష్ఠానాది క్రమమున వారికి క్రమజీవితమును అందించు చున్నావు.

"యుంజతే మన ఉత యుంజతే ధియో విప్రా విప్రస్య బృహతో విపశ్చితః।
విహోత్రా దధే వయునా విదేక ఇన్మహీ దేవస్య సవితుః పరిష్టుతిః."

ఋ 5.81.1యజు 11.4. శ్వేతా 2.4.

విప్రులు (మేధావులు) స్వాధీనమైన తమ మనస్సును మహామేధావి అయిన పరమాత్మ యొక్క అనుగ్రహము కొఱకు సర్వకార్యములయందు నియోగించుచున్నారు. అట్లే కర్మలను గూడ లెస్సగా అనుష్ఠించుచున్నారు. సమస్తమును ధరించు ఆ సవితృ దేవుని యొక్క స్తోత్రము ఎంతయో గొప్పది.

రహస్యార్థము : యోగాభ్యాస పరులగు మేధావులు స్వాధీనమైన తమ మనస్సును, పరమ మేధావి- జ్ఞానస్వరూపుడు అయిన సహస్రారస్థిత పరమాత్మ యొక్క దర్శనము కొఱకు సాధనలయందు నియోగించుచున్నారు. ఆధారాదుల ప్రజ్ఞల నెఱిగిన ఆ సవితృ దేవుని స్తోత్రము ఎంతయో గొప్పది. ఈ మంత్రమున యోగసాధకులను "విప్రాః" అను మాటచేతను, పరమాత్మను 'విప్రస్య' అను విశేషణము చేతను పేర్కొనుట గమనించదగినది.

"హ్వాయా మ్యగ్నిం ప్రథమం స్వస్తయే హ్వాయామి మిత్రావరుణా విహావసే,
హ్వాయామి రాత్రీం జగతో నివేశనీం హ్వాయామి దేవం సవితార మూతయే॥"

1.35.1

మా క్షేమము కొరకు మొదటగా అగ్నిని ఆహ్వానించుచున్నాము. అట్లే మా రక్షణ కొఱకు మిత్రావరుణుల నాహ్వానించుచున్నాము. పగలంతయు శ్రమించిన ప్రాణులకు సుఖనివాసము (నిద్ర)ను గూర్చెడి రాత్రి దేవత నాహ్వానించుచున్నాము. అట్లే మా రక్షణ కొఱకు సవితను ఆహ్వానించుచున్నాము.

ప్రతి ప్రాణికి దేహమున ఉష్ణశక్తి అవసరము. అది లేనినాడు ప్రాణము లుండవు. కనుక మొదట అగ్ని నాహ్వానించుట జరిగినది. పిమ్మట పగటికి అధిదేవతయైన మిత్రుని, రాత్రికి అధిదేవతయైన వరుణుని ఆహ్వానించుట జరిగినది. తదనంతరము జీవులకు విశ్రాంతి ప్రదమైన రాత్రిని, సహస్రార స్థితుడై సర్వులకు అధిష్ఠానమైన సవితను ఆహ్వానించుట జరిగినది.

సవితృ దేవుని గురించిన మఱికొన్ని ఋగ్వేద వచనములు

సవితృ దేవుడు బంగారుకన్నులు (హిరణ్యాక్షః సవితా దేవః 1.35.8), బంగారు చేతులు (హిరణ్యపాణిః/ హిరణ్యహస్తః 1.35.9,10) బంగారు నాలుక (హిరణ్య జిహ్వః 6.71.3) కలవాడు. ఈ విశేషణములు సవితృ దేవునికే ప్రత్యేకముగ వాడబడినవి. సవితృదేవుడు పెద్దచేతులు (పృథుపాణిః, 2-38.2), మంచిచేతులు (సుపాణిః, 3-33-6) సంతోషమును కలిగించు నాలుక (మంద్ర జిహ్వః 6.71.4), మంచి నాలుక (సుజిహ్వః 3.54.11), పసుపు పచ్చని జుట్టు (హరికేశః, 10-139-1) కలవాడు.

సవితృ దేవుడు స్వర్ణ మయమైన దీప్తి (హిరణ్యయీ మమతిం, 3.38.8, 7.38.1) కలవాడు. ఆ దీప్తిని ఆయన సర్వత్రా వ్యాపింప చేయుచున్నాడు. ఆయన అంతరిక్షమును, భూమిని, స్వర్గమును, ప్రపంచమును, భూమిలోని భాగములను ప్రకాశింప చేయు చున్నాడు. (1.35.8, 4.14.2, 4.53.4).

సవితృ దేవుడు స్వర్ణ మయమైన దీప్తి కలవాడనుటచే – పరంజ్యోతి స్వరూపుడని వ్యక్తమగుచున్నది. ఆ దీప్తిని ఆయన సర్వత్ర వ్యాపింపచేయు చున్నాడనుటచే జ్యోతి స్వరూపుడగు సవిత పిండాండ బ్రహ్మాండముల యందు ప్రవేశించి వాటిని సర్వత్ర వ్యాపింప చేయుచున్నాడనియు, బాహ్యమున భూమి, అంతరిక్షము, స్వర్గలోకములందును, ప్రాణుల శరీరమున దశవాయువుల ద్వారా వ్యాపించి ఆధారము నుండి సహస్రారము వఱకు సర్వత్ర ప్రకాశించుచున్నాడనియు తెలియుచున్నది.

ఆయన అంతరిక్షమును, మూడు స్వర్గములను, మూడు భువనమలను మూడుసార్లు చుట్టి వ్యాపించియుండును (4.53.5) అనుటచే అంతరిక్షమనగా సహస్రార మనియు, మూడు స్వర్గములు అనాహత–విశుద్ధ–ఆగ్నేయ చక్రములనియు, మూడు భూములు ఆధార–స్వాధిస్థాన–మణిపూరక చక్రములనియు అంతరర్థము. మరియు 'మూడుసార్లు చుట్టి వ్యాపించియుండును' అనుటచే పూరక–కుంభక–రేచక వాయువులచే ఆక్రమించి యుండుననియు స్పష్టమగుచున్నది.

ఆయన ఎత్తిన పెద్ద బంగారుచేతులు ఆకాశము చివరల వఱకు వ్యాపించును (7.45.2). వాటితో ఆయన అందరినిలేపి అనుగ్రహించును (2.38.2, 4.53.3 మొ). అనుటవలన ఆయన యొక్క జ్యోతి స్వరూపము సహస్రారము వఱకు వ్యాపించియుండు ననియు, ఆ జ్యోతి దర్శనముచే ఆయన అందఱకు ముక్తిని ప్రసాదించుననియు విదితమగుచున్నది. సవిత తన బంగారు రథములో భువనములు చూచుచు అధోమార్గములోను, ఊర్ధ్వ మార్గములోను ప్రయాణించును (1.35.2,3), అనుటచే ఆయన ప్రాణుల శరీరములో జీవరూపమున నుండి బాహ్యమున ఊర్ధ్వలోకములను అధోలోకములను చూచుచుండు ననియు, శరీరములో జ్యోతి స్స్వరూపమున నుండి ఊర్ధ్వ లోకములను సూచించు అనాహత–విశుద్ధ–ఆగ్నేయ చక్రములందును, అధోలోకము లను సూచించు ఆధార స్వాధిష్ఠాన–మణిపూరక చక్రములందును సంచరించు చుండునని తెలియుచున్నది. సవిత చరాచరమైన వాటన్నిటికి ప్రభువు (4.53.6) అని వచించుటచే ఆయన పరమాత్మ అని తెలియుచున్నది. తైత్తిరీయ బ్రాహ్మణము (1.64.1) 'ప్రజాపతి అయిన సవిత జీవులను సృష్టించెను' అని తెలుపుచున్నది.

సవిత కోరదగిన వస్తువులన్నిటికి ఈశ్వరుడు ('ఈశానాం వార్యాణాం' 1.24.3) అనుటచే సమస్తమును ఆయన నుండియే సృజించబడుచున్నది. కనుక బాహ్యమున మనకు కావలసిన వస్తువులకు ఆయనయే ప్రభువు, అంతరమున జ్యోతి స్స్వరూపమున నున్న ఆయనను దర్శించిన సంసార బంధము నుండి విముక్తుడగును. అందువలన బాహ్యాంతరముల యందు మనకు కావలసిన కోరదగిన వస్తువులన్నింటికి ఆయన ఈశ్వరుడు అని విదితమగుచున్నది.

సవిత జీవులను (రాత్రియందు) తమ తమస్థానములలో నుంచి (పగలు) ప్రేరేపించును (4.53.6, 7.45.1), ద్విపాద చతుష్పాద జీవులను విశ్రాంతి తీసికొనునట్లు చేసి లేపును (4.53.3, 6.71.2, 7.45.1), అనుటచే సవిత ప్రాణులనన్నిటిని ప్రళయ కాలమున తన యందాహుతి చేసికొని, పునఃసృష్టి యందు వాటిని ప్రేరేపించునని విదితమగు చున్నది. దేవుడైన సవిత కదలు ప్రతి పదార్థమును ప్రేరేపించును. ("ప్రాసావీద్దేవః సవితా జగత్ పృథక్"–1.57.1) అనుటయు పై విషయమును సమర్థించుచున్నది.

"సూర్యస్యరశ్మిభిః సముచ్యసి" (5.81.4) అనగా సూర్యకిరణములలో కూడుకొనుచున్నాడు" అనుట వలనను, ఆయన ప్రేరణము వలన నదులు పెద్దవిగా ప్రవహించును (3.33.6), అనుట వలనను, సూర్యకిరణముల ద్వారా ఆయన నీటిని గ్రహించి మేఘముల ద్వారా మరల వర్షింప చేయుచున్నాడనియు ఈ విధముగ కదలు ప్రతి పదార్థమును ప్రేరేపించు చున్నాడనియు తెలియుచున్నది. ఆయన శాసనమునకు నీరు, వాయువు లోబడును (2.38.2) అనుటయు పై విషయములను ధ్రువీకరించుచున్నది.

"సవిత అశ్వములను విప్పును, తిరిగి వాటిని ఆపును. ఆయన ఆజ్ఞవలననే రాత్రి వచ్చుచున్నది. సాలీడు గూడు అల్లుచున్నది. పనిచేయువాడు మధ్యలో పనిని ఆపును (2.38.3.4)" అనుటచే సవిత సమస్తమును నియంత్రించుచున్నాడని స్పష్టమగు చున్నది.

సవిత నియమిత ధర్మములను పాటించును (సత్యధర్మా 4.53.4) అనుట వలన ఆయన ప్రాణుల కర్మఫలమును బట్టి వారికి తగు ఫలమును అందజేయును అని తెలియుచున్నది.

సవిత ఋభువులకు అమర్త్యత్వము నిచ్చినాడు (1.110.2) అనుటచే ఆయన శక్తి సామర్థ్యములు, గుణగణములు వెల్లడియగుచున్నవి. మరియు ఆయన అసురుడు (4.53.1) అనియు, పిశాచములను, అపకారము చేయువారిని, రోగములను తొలగించును (1.35.10, 7.38.7) అనియు, మనుష్యులను పాపరహితులుగ చేయుననియు (4.54.3). వారి చెడ్డ కలలను పోగొట్టు ననియు (5.82.4) తెలుపబడినది.

సవితృ దేవుని వసువులు, అదితి, వరుణుడు, మిత్రుడు, అర్యముడు స్తుతించుదురు (7.38.3, 4) అనుటచే సవితృని యొక్క ఔన్నత్యము తెలియుచున్నది.

ఈ విషయములన్నియు సవితృ దేవుడు సృష్టికర్త అనియు, జగత్పిత అనియు, పరంజ్యోతి స్వరూపుడగు పరమాత్మ అనియు, సర్వశక్తి మంతుడనియు, సర్వద్రష్ట అనియు, పరమజ్ఞాని యనియు తెలుపుచున్నవి. సమస్త దేవతలలో సవితృనకు గల మహోన్నత స్థానమును ఈక్రింది మంత్రమెట్లు తెలుపుచున్నదో చూడుడు.

" న యస్యేంద్రో వరుణో న మిత్రో వ్రత మర్యమా న మినంతి రుద్రః
నారాత యస్త మిదం స్వస్తి హువే దేవం సవితారం నమోభిః॥" **ఋ. 2.38.9.**

ఏ సవిత యొక్క వ్రతమును (కర్మను-చేయుపనిని) ఇంద్రుడుగాని, వరుణుడు గాని, మిత్రుడుగాని, అర్యముడుగాని, రుద్రుడుగాని, మరి ఎవ్వరుగాని ధిక్కరించ లేరో అట్టి సర్వశ్రేష్ఠుడైన సవితృ దేవుని నాక్షేమము కొఱకు నమస్కరించుచున్నాను.

శ్వేతాశ్వత రోపనిషత్తు :

" యుం జానః ప్రథమం మన స్తత్త్వాయ సవితా ధియః
అగ్నేర్ జ్యోతిర్ నిచాయ్య పృథివ్యా అధ్యా భరత్." (౨ ౧) మరియు యజు11-1)

సవితా = సవితృ దేవుడు (సృష్టికర్తయగు పరమాత్మ), ప్రథమం = సర్గారంభమున, మనః = మనస్సును, యుం జానః = ప్రాణి దేహముతో జోడింపనెంచుచు, అగ్నేఃజ్యోతిః = అగ్ని యొక్క జ్యోతిని, నిచాయ్య = నిశ్చయించి, పృథివ్యాఃఅధి = పార్థివ శరీరమునందు, తత్త్వాయ = తత్త్వ బోధ కొఱకు, ధియః = బుద్ధులను, ఆభరత్ = ఉంచెను, ఉంచును.

యోగ విషయముగః జీవుడు ధ్యానాదుల నభ్యసింప నారంభించినపుడు మనస్సు నేకాగ్రము చేయదలచుచు శరీరము నందు వ్యాపించియున్న బుద్ధికి కారణమైన అగ్ని యొక్క ప్రకాశమును నిశ్చయించి తత్త్వజ్ఞానము కొఱకు పార్థివ శరీరమున బుద్ధులను స్వాధీనము చేసికొనును.

"యుక్తేన మనసా వయం దేవస్య సవితుః సవే సువర్గే యాయ శక్త్యా" (౨.౨)

(యజు౧౧.౨) వయం= మనుష్యులమగు మనము, యుక్తే న మనసా= సమాహితము ఏకాగ్రము చేయబడిన మనస్సుతో, సవితుః దేవస్య=జగదుత్పాదకుడగు పరమేశ్వరుని, సవే= జగద్రూప యజ్ఞము నందు, సువర్గే యాయ= విశిష్ట సుఖప్రాప్తి కొఱకు, శక్త్యా=యథాశక్తి యత్నింపవలయును.

యోగవిషయముగః మనుజుల దుష్కర్మలలో చిత్తమును జొప్పింపక స్థిరబుద్ధి కలవారై శుభకర్మల యందు మనస్సు లగ్నము చేయుటకు శక్తి కొలది యత్నింప వలయును.

" యుక్త్వాయ సవితా దేవాన్ స్వర్‌యతో ధియా దివమ్
బృహజ్జ్యోతిః కరిష్యతః సవితా ప్రసువాతి తాన్ .॥" (౨.3) (యజు ౧౧.3).

సవితా= ప్రాణుల నుత్పన్న మొనర్చుదేవుడు, స్వః=సుఖవిశేషము, యతః= దేనినుండి ప్రాప్తించునో, ధియా= సూక్ష్మ బుద్ధి మూలమున, దివం = ద్యోతన స్వభావముగల, బృహత్=గొప్పదియైన, జ్యోతిః= ప్రకాశమును, కరిష్యతః= ఆవిష్కరింప జేయు, దేవాన్=చక్షురాదీంద్రియములను - మనోవృత్తి విశేషములను, యుక్త్వాయ= విషయముల నుండి నివర్తింపజేసి-మరలించి. ఆసవితృ దేవుడు, తాన్=అవృత్తులను, ప్రసువాతి=శుభమార్గము ననుసరింప ప్రేరేపించునుగాక।

యోగ విషయముగ : సవితృ దేవుడు విషయముల నుండి మరల్పబడిన మనోవృత్తుల మూలమున సూక్ష్మ బుద్ధి నేర్పరచి, బృహజ్జ్యోతి నుదయింపజేసి జ్ఞానోదయము కలిగించి తత్త్వ సాక్షాత్కారము కొఱకు తోడ్పడుగాక। సవితృ దేవుడింతటి మహోన్నతుడగుట వలననే గాయత్రీ మంత్రాధి దేవతగ స్తుతించబడినాడు.



3. గాయత్రీ మంత్రార్థము

ఈ మంత్రము గాయత్రీ ఛందస్సులో నున్నది. ఇందు పరమాత్మ తత్త్వము సవితృ నామముతో ప్రస్తుతించబడినది.

"సువతి-సుప్తమ్ ప్రేరయతీతి సవితా". సవిత అనగా నిద్రించువానిని మేల్కొలుపు వాడు. అనగా ప్రాణులను నిద్రనుండి మేల్కొలుపు సూర్యుడని లౌకికార్థము. ప్రాణులను అజ్ఞానము అను నిద్ర నుండి మేల్కొలుపు పరమాత్మ అని అంతరార్థము.

"షు ప్రసవైశ్వర్యయోః" అనగా ప్రసవించుట అను అర్థముచే సవిత అనగా జగములను కనిన 'జగత్పిత' అనియు అర్థము సిద్ధించుచున్నది.

వేదమంత్రములకు ఆధిభౌతిక, ఆధిదైవిక, ఆధ్యాత్మికములైన మూడు అర్థము లుండును. ఆ మంత్రములందలి బాహ్యార్థము (లౌకికార్థము) నేగాక అంతరర్థము (పరమార్థము)ను, గ్రహించిననే గాని తత్వార్థ సిద్ధి లభించదు.

గాయత్రీ మంత్రము :

"తత్సవితు ర్వరేణ్యం
భర్గో దేవస్య ధీమహి
ధియో యోనః ప్రచోదయాత్" **ఋ 3.62.10.**

పదవి భాగము :

తత్-సవితుః-వరేణ్యం-భర్గః-దేవస్య-ధీమహి-ధియః-యః-నః- ప్రచోదయాత్.

యః సవితాదేవః= ఏ సవితృ దేవుడు, నః=మన యొక్క, ధియః= బుద్ధులను (కర్మలను), ప్రచోదయాత్=ప్రేరేపించుచున్నాడో, తత్=ఆ సవితృ దేవుని యొక్క

వరేణ్యం=భజింపదగిన, భర్గః=భర్గమను తేజమును (అవిద్యను నాశనము చేయు పరంజ్యోతి స్వరూపమును), ధీమహి=ధ్యానించుచున్నాము.

సాయణుని భాష్యము : తస్య సవితుః– షుఞ్ ప్రేరణే–సర్వప్రాణినాం హృదయే స్థిత్వా తత్కర్మ పరిపాకాను సారేణ భోగార్థం తత్సాధన కర్మార్థం చ ప్రేరకస్య। పరమేశ్వరస్య తస్య సర్వప్రేరకత్వం బ్రహ్మణ 'ఏష హ్యేవైనం సాధుకర్మ కారయతీతి' "ఏషత ఆత్మా Z న్తర్యామ్య మృత" ఇతి తథా "ఈశ్వర స్సర్వ భూతానాం హృద్దేశే Z ర్జున తిష్ఠతి। భ్రామయన్ సర్వభూతానీ" త్యాది శ్రుతి స్మృతిషు ప్రసిద్ధమ్।

అనగా సర్వప్రాణుల హృదయమందుండి వారి వారి(ఆయా) కర్మల పరిపాకము (ఫలము) ననుసరించి భోగముల కొఱకును, భోగసాధనములయిన కర్మల కొఱకును ప్రేరేపించు ఆ పరమేశ్వరుని యొక్క వరేణ్యం=సర్వైర్వరణీయముపాసనీయం– అందరిచేతను కోరదగినదియు, ఉపాసింప దగినదియునగు, భర్గః=జనన మరణాది లక్షణస్య సంసారస్య తదుపాదన భూతస్యా జ్ఞానస్య భర్జకం పారమేశ్వరం తేజః అగ్న్యాది తేజోవత్ ప్రకాశకత్వాత్। ప్రజ్ఞాన ఘనం సత్యజ్ఞానాది లక్షణం బ్రహ్మస్వరూపం తేజో భర్గశబ్దేనోచ్యతే–జనన మరణాది లక్షణములుగల సంసారమును, ఆ సంసారమునకు ఉపాదాన కారణమైన అజ్ఞానమును నశింపజేయునట్టి పరమేశ్వర సంబంధమైన తేజస్సును (పరబ్రహ్మ స్వరూపమును), ధీమహి = ధ్యాయేమహి భావనయా సాక్షాత్కరవామేత్యర్థః– ధ్యానము చేయుచున్నాము, భావనచేసి సాక్షాత్కరించు కొనుచున్నాము.

యః = పైన చెప్పబడిన ప్రేరకుడైన ఏ పరమేశ్వరుడు –"యః సవితోక్తరూపః పరమేశ్వరోనో Zస్మాకం"

ధియో=బుద్ధీః స్వరూపావగతి సాధనాధ్యయ నానుష్ఠాది సత్కర్మ సుప్రేరయతి తద్ధీమహీతి సమన్వయః। తస్య ప్రేరకత్వ ముక్త మధ్యాత్మ పక్ష ఏవమ్.

ప్రచోదయాత్=స్వరూప జ్ఞానమునకు సాధనములైన అధ్యయనము, అనుష్ఠానము మొదలగు సత్కర్మలయందు ప్రేరేపణ చేయునో అటువంటి తేజస్సును ధ్యానింతుము అని సమన్వయము. ఇది అధ్యాత్మ పక్షము.

ఈ మంత్రమున బుద్ధులను సత్కర్మలయందు ప్రేరేపించు సర్వప్రాణుల హృదయమున నున్న పరమేశ్వరుని యొక్క "అజ్ఞానమును నశింపజేయు తేజస్సును" ధ్యానించుచున్నాము అని చెప్పుట జరిగినది. అజ్ఞానమును నశింపజేయుట అనగా అజ్ఞానమను నిద్ర నుండి మేల్కొల్పుటయే. బుద్ధులను ప్రేరేపించు దేవుడు, అజ్ఞానమను నిద్ర నుండి మేల్కొలుపు దేవుడు సర్వప్రాణుల హృదయమున నున్న పరమేశ్వరుడే అని వచించుట జరిగినది. భగవద్గీత "ఈశ్వర స్సర్వ భూతనాం హృద్దేశే Zర్జున తిష్ఠతి" అనగా

ఈశ్వరుడు సర్వప్రాణుల హృదయములలో నున్నాడని అర్థము. దీనినే "ఏషదేవో విశ్వకర్మా॥ సదా జనానాం హృదయే సన్నివిష్టః" అని శ్వేతాశ్వతరోపనిషత్తు వచించుచుండగా, **ఋగ్వేదము** (10.81.1). "స ఆశిషా ద్రవిణ మిచ్ఛమానః పరమచ్ఛ దోవర ఆవివేశ" అని వచించినది. అనగా 'విశ్వకర్మ తిరిగి సృష్టింపవలయునను సంకల్పముచేత ధనమని చెప్ప తగిన జగత్తుల యొక్క భోగమును కోరినవాడై స్వకీయమైన పారమార్థిక రూపమును ఆవరించినవాడై తనచే సృజింపబడిన ప్రాణుల హృదయ ప్రదేశములందు ప్రవేశించెను' అనిభావము. సవితృ దేవుడు 'షు ప్ర సవైశ్వర్యయో' అను వ్యుత్పత్త్యర్థముచే జగములను ప్రసవించిన జగత్పిత అని తెలియుచుండగా, విశ్వకర్మ సూక్తము నందలి "యోనః పితాజనితా' 'చక్షుఃపితా' మున్నగు వాక్యములు విశ్వకర్మను జగత్పితగా తెలుపుచున్నవి. కనుక సవిత అనినను, విశ్వకర్మ అనినను ఒక్కరే అని తెలియుచున్నది. మరియు సవితకు సూర్యుడు అని అర్థము కలదు. "త ఆయజన్త ద్రవిణం సమస్మా ఋషయః పూర్వే జరితారో నభూనా" అను మంత్రమునకు భాష్యము "తే పూర్వ ఋషయో = ద్రష్టారో, రశ్మయో, అస్మా= ఆదిత్యాత్మకాయ విశ్వకర్మణే, ద్రవిణం = తేజ ఆయజన్త" అని వ్రాసినారు. అనగా విశ్వకర్మ ఆదిత్య స్వరూపుడే అని భావము.

సవితను జగములను కనిన తండ్రియనియు, ఆదిత్య స్యాంతర్యామి రూపుడనియు, సాయణులు ఈక్రింది మంత్రమునను స్పష్టము చేసినారు.

"తద్రాధో అద్య సవితు ర్వరేణ్యం వయం దేవస్య ప్రసవే మనామహే." ఋ.1.160.5

భాష్యము : వయం-యజమానాః, సవితుః-సర్వస్య ప్రసవితుః, దేవస్య-ఆదిత్య స్యాంతర్యామి రూపిణః, ప్రసవే-అనుజ్ఞా యాం సత్యాం, తత్తాదృశం వరేణ్యం వరణీయం, **రాధ ః-** పురుషార్థ సాధ్య సమర్థం ధనం గవాదిరూపం, మనామహే - యాచామహే.

కనుక గాయత్రీ మంత్రమున 'సవిత' అను పేరుతో ప్రస్తుతించబడిన సర్వాంతర్యామి అయిన పరమాత్మ విశ్వకర్మయే అనుట స్పష్టము. గాయత్రీ మంత్రోపాస్యుడు సర్వకర్మలకు ప్రభుడును, సమస్త ప్రాణుల హృదయములలో నున్నవాడును, బుద్ధులను ప్రేరేపించువాడును అగు సవితృ రూప విశ్వకర్మ పరమాత్మయే. గాయత్రిని దేవాసుర సంగ్రామమున దేవతలు "విశ్వకర్మ" అని సంబోధించుట, ఈ మంత్రమున విశ్వకర్మ 'సవిత' రూపముతో స్తుతించబడుట గాయత్రీ సవితల ఏకత్వమును సూచించుచున్నవి. మరియు గాయత్రి స్త్రీలింగ పదమైనను గాయత్రీ మంత్రార్థము పుంలింగములో నుండుట గాయత్రీ సవితల అద్వైత స్వరూపమును తెలుపుచున్నది. గాయత్రీ విశ్వకర్మలకు లింగభేదము తక్క అన్య భేదము లేదని 'గాయత్రీ-విశ్వకర్మ' అంశమున విపులముగా తెలుపబడినది.

గాయత్రీ విశ్వకర్మలు జగత్కారణ కర్తలగుట వలననే సృష్టికి మూలమగు -పంచమహా భూతములు, అవ్యక్త మహదహంకారములు, ఏకాదశేంద్రి యములు, శబ్ద-స్పర్శ - రూప-రస-గంధములు అను చతుర్వింశతి తత్త్వములకు సంకేతములుగ గాయత్రీ మంత్రమున 24 అక్షరములున్నవి.

ఇంత వఱకు గాయత్రీ మంత్రమును అధ్యాత్మ పక్షముగ వివరించుట జరిగినది. ఇక అధిదైవతపక్షము.

యః=ఏ సూర్యుడు, నః= మన యొక్క ధియః=బుద్ధులను, ప్రచోదయాత్= అందఱూ తమ తమ పనులు చేయుట యందు ప్రేరేపించుచున్నాడో, తత్ సవితుః దేవస్య=తానుదయించుటచే సర్వప్రాణులను గమనాది వ్యాపారముల యందు ప్రేరేపించు నట్టి సూర్యభగవానుని యొక్క, వరేణ్యం= ప్రకాశమును కోరువారందరి చేతను కోరదగిన, భర్గః= చీకటిని పోగొట్టు కిరణ సమూహమును, ధీమహి= ధ్యానించుచున్నాము.

అనగా ఏ సూర్య (సవితృ) భగవానుడు తానుదయించుటచే సమస్త ప్రాణులను నిద్రనుండి మేల్కొలుపుచు వారిని (వారి బుద్ధులను) తమ తమ కర్మలు చేయుటయందు ప్రేరేపించుచున్నాడో ఆ సూర్య (సవితృ) భగవానుని శ్రేష్ఠమగు తేజమును (చీకటిని పోగొట్టు కిరణ సమూహమును) ధ్యానించుచున్నాము అని భావము.

భర్గశబ్దమునకు అన్నమనియు, ధీశబ్దమునకు కర్మమనియు అథర్వవేద బ్రాహ్మణమైన, 'గోపథము' వచించుచున్నది చూడుడు.

"వేదాం శ్ఛందాసి సవితుర్వరేణ్యం భర్గో దేవస్య కవయో ऽన్న మాహుః,
కర్మాణి ధియస్తదు తే ప్రబ్రవీమి ప్రచోదయం త్సవితా యాభిరేతి."

- గోపథ బ్రాహ్మణము 1.32.

'భ్రస్జపాకే'-వండ బడునది గనుక 'భర్గ' శబ్దమునకు అన్నము అను అర్థము సరిపడు చున్నది. భర్గశబ్దమునకు అన్నమనియు, ధీశబ్దమునకు కర్మమనియు భావించిన గాయత్రీ మంత్రార్థము-ఏ సూర్యభగవానుడు మనయొక్క కర్మలను ప్రేరేపించుచున్నాడో, ఆ సూర్యదేవుని వలన వర్షాదుల ద్వారా లభించెడి శ్రేష్ఠమైన అన్నాది రూప ఫలమును ధ్యానించుచున్నాము.

మఱియొక అర్థము : సూర్య సంబంధముగ.

యః= ఏ సవితృ దేవుడు (సూర్యభగవానుడు), నః= మన యొక్క ధియః =కర్మలను ప్రచోదయాత్=ప్రేరేపించుచున్నాడో; తత్ సవితుః దేవస్య=ఆ సవితృ దేవుని యొక్క (సవితృ శబ్దమునకు సకలజన నిర్వృతి హేతువగు వృష్టిని కలిగించువాడు అనియు

అర్థము. ఇందులకు ప్రమాణము "యాభిరాదిత్య స్తపతి రశ్మిభిస్తాభిః పర్జన్యోవర్షతి–అనగా ఆదిత్యుడు తపింపజేయు కిరణములతోడనే పర్జన్యుడు వర్షించుచున్నాడు' అను శ్రుతియే ప్రమాణము.

మరియు ధ్యానించువారలకు సకల శ్రేయముల నొసగువాడు కావున 'సవిత' అనబడుచున్నాడు. ఇందులకు ప్రమాణము. "ఉద్యం తమస్తం యంత మాదిత్య మభిధ్యాయన్ కుర్వన్ బ్రాహ్మణో విద్వాన్ సకలం భద్రమశ్నుతే– ఉదయించు నట్టియు, అస్తమించునట్టియు ఆదిత్యుని ధ్యానించు విద్వాంసుడు సకల భద్రములనందు చున్నాడు) అను శ్రుతియే ప్రమాణము

వరేణ్యమ్ = పురుషార్థ కాములకు వరింపదగినదియగు (శ్రేష్ఠమగు)

భర్గః=తేజమును, చీకటులను భర్జించునది అనగా పోగొట్టునది కావున 'భర్గ'మన బడుచున్నది.

'మహాన్మే Z వోచో భర్గో మే Z వోచః' అనెడు సూత్రమునందు 'భర్గ' శబ్దము పుంలింగముగను, అకారాంతముగను ఉన్నది.

ధీమహి – ధ్యానించుచున్నాము.

గాయత్రీ మంత్రమున భర్గ శబ్దమునకు అన్నమనియు, ధీశబ్దమునకు కర్మ మనియు అర్థములు చెప్పి కొనుటచే "ఆధిభౌతికార్థము", సవితృ శబ్దమునకు కన్పించెడి సూర్యుడని అర్థము చెప్పికొనుటచే "ఆధిదైవికార్థము", గాయత్రీ మంత్రాధిదేవత సాక్షాత్పరమేశ్వరుడే–పరమాత్మయే అని భావించుటచే "ఆధ్యాత్మికార్థము" సిద్ధించుచున్నది.



4. వ్యాహృతులు

వ్యాహరణ మన కథనము. ఒక్కొక్కటి అనేకార్థములను తెలుపును గనుక వ్యాహృతులని చెప్పబడుచున్నవి. వైదిక సాహిత్యములో వ్యాహృతులు 'భూః, భువః, స్వః, మహః, జనః, తపః, సత్యమ్' అని ఏడుగా చెప్పబడుచున్నవి. కాని 'భూఃభువః, స్వః' అను మూడు వ్యాహృతులు ప్రధానముగా వైదిక మంత్రముల యందు ఉచ్చరింపబడు చున్నవి. గాయత్రీ మంత్రమునకు ముందుగా 'ఓం భూర్భువ స్సువః' అని ఉచ్చరించుటయే ఇందుకు నిదర్శనము. "స్వః" అను అక్షరము ఇందు 'సువః' అని ఉచ్చరింపబడుచున్నది.

తైత్తిరీయోపనిషత్తు 'భూః, భువః, సువః(స్వః) మహః' అన వ్యాహృతులకు ఈ క్రింది అర్థములను తెలుపుచున్నది.

1. భూః=	పృథివి	అగ్ని	ఋక్కు	ప్రాణము
2. భువః=	అంతరిక్షము	వాయువు	సామము	అపానము
3. సువః-స్వః	ద్యులోకము	ఆదిత్యుడు	యజుస్సు	వ్యానము
4. మహః=	ఆదిత్యుడు	చంద్రుడు	బ్రహ్మ	అన్నము

ఉపాసన చేయు విధము : హృదయమునగల ఆకాశమున మనస్సుతో కూడిన జీవుడు కలడు. అతడు జ్యోతి స్వరూపుడు, నాశము లేనివాడు. నోటియందుగల కొండ నాలుక మార్గముతో సుషుమ్న అను నాడి శిరః కపాలమునగల వెంద్రుక మూలము వఱకు విస్తరించి యుండును. ఆనాడియే జీవన్ముక్తుడైన జీవునకు మార్గము. అనగా ముక్తులు ఆ మార్గమున శరీరము విడిచిపోదురు. అట్లు ముక్తుడైన జీవుడు భూఃపద వాచ్యమగు అగ్నియందు కాని, భువః పద వాచ్యమగు వాయువు నందు కాని, స్వః పదవాచ్యమగు సూర్యలోకము నందుగాని, మహః పదవాచ్యమగు బ్రహ్మము నందు గాని ఉండును. అతడు ఆయా లోకములందు విహరించుచు పరమాత్మతో కూడి ఆనందమునను భవించును.

ఈ వ్యాహృతులను ప్రణవవేదము ప్రతిపాదించినందున 'ఓం' అను ప్రణ వాక్షరము ముందుగా ఉచ్చరింపబడుచున్నది.

ఓం ఇతి బ్రహ్మ = ఓం బ్రహ్మము. ఓం ఇతి ఇదం సర్వం = ఓం అని చెప్పబడు బ్రహ్మము చేత ఈ ప్రపంచమంతయు వ్యాపింపబడియున్నది.

ఓం ఇతి ఏతత్ అనుకృతి=ఓమ్ అను నియ్యది బ్రహ్మమున కనుకరణము.

గోపథబ్రాహ్మణము : ఓంకారములో రెండు వర్ణములు, నాలుగు మాత్రలు ఉన్నవి. ఇది సర్వవ్యాప్తి, మార్పులేనిది, బ్రాహ్మీమయం. దీని నుండియే కోరిన వస్తువులు, సమస్త లోకములు, దేవతలు, యజ్ఞములు, శబ్దములు, స్థావర జంగమాత్మకమైన భూతములు పుట్టినవి.

'ఓం' కారము యొక్క మొదటి అక్షరము నుండి స్వర్గము, రెండవ అక్షరము నుండి తేజస్సు, వెలుగు పుట్టినవి.

'ఓం' కారములోని మొదటి స్వరమాత్ర నుండి భూమి, అగ్ని, ఓషధులు, వృక్షములు, 'భూః' అనువ్యాహృతి, గాయత్రి ఛందస్సు, మూడు విధములైన స్తోమములు, తూర్పుదిక్కు, వసంతఋతువు, వాక్కు, నాలుక సృష్టింపబడినవి.

'ఓం'కారములోని ద్వితీయ స్వరమాత్ర నుండి అంతరిక్షము, వాయువు, యజుర్వేదము, 'భువః' అనువ్యాహృతి, త్రిష్టుప్ ఛందస్సు, పదిహేను విధములైన స్తోమములు, పశ్చిమదిక్కు, గ్రీష్మఋతువు, ఉచ్ఛ్వాస నిశ్వాసములకుపయోగపడు అవయవములు నిర్మించబడినవి.

'ఓం' కారము యొక్క 'ఊ' కార మాత్రనుండి నీరు, చంద్రుడు, అథర్వవేదము, నక్షత్రములు, అంగీరసులు, అనుష్టుప్ఛందస్సు, దక్షిణదిక్కు, శరదృతువు, మనస్సు మొదలగునవి పుట్టినవి.

'ఓం'కారము యొక్క 'మ' కార మాత్రనుండి ఇతిహాసపురాణములు, వాక్కు ఛందోయుక్తమైన భాష, ఉపనిషత్తులు, 'పృథక్, కరత్, గుహన్, మహత్, తత్, శం, ఓం, నృత్యం, గానం, చైత్రరథదేవతలు, తేజస్సు, వెలుతురు, ఊర్ధ్వదిక్కు, అధోదిక్కు, హేమన్త శిశిర ఋతువులు సృష్టించబడినవి.

'ఓం' కారము సహాయముతోనే దేవతలు అసురులను జయించినారు. 'ఓం' కారమే అన్ని వేదములకు మూలమై, ప్రపంచమున కంతటికిని ఆధారము దిక్కులు, ఛందస్సు, పంచభూతములు, వేదములు, సూర్యచంద్రులు మొదలగునవన్నియు పుట్టినవి.

ఋగ్వేదము నుండి 'భూః' అను వ్యాహృతి, యజుర్వేదము నుండి 'భువః' అను వ్యాహృతి, సామవేదము నుండి 'స్వః' అను వ్యాహృతి పుట్టినవి.

ఛాందోగ్యోపనిషత్తు : ఓం=రక్షకుడు, అవ=రక్షణే అను ధాతువునకు (అవతేష్టిలోపశ్చ- ౧- ౧౪౧) ఉణాది సూత్రముతో 'మన్' ప్రత్యయము చేర్చిన 'ఓమ్' పదమేర్పడును.

అప్ధాతువు వలనను 'ఓమ్' శబ్దమేర్పడును. వ్యాప్తి దానికి అర్థము. "అ+ఉ+మ్" అను మూడక్షరములతోను 'ఓమ్' సిద్ధించును. ఇట్లీ పదము బ్రహ్మమునకు ముఖ్య నామమైన రక్షకత్వ, వ్యాపకత్వాది బ్రహ్మగుణములను తెలుపును

పంచభూతములు కలిసినపుడు రూపములు ఏర్పడుచున్నవి. సృష్టి రూపము కన్పించుచున్నది. సవితృ దేవుడు సర్వజగత్తును సృష్టించువాడు. గాయత్రి జగన్మాత. సృష్టిని ఆకర్షించునవి వ్యాహృతులు. సర్వమునకు మూలము ప్రణవ స్వరూపిణి అయిన గాయత్రి. అందువలన గాయత్రీ మంత్రమునకు మొదట ఓం, భూః భువః స్వః (సువః)= ఓం భూర్భువస్సువః చేర్చుట జరిగినది.


ప్రణవము, మహావ్యాహృతులతో గూడిన గాయత్రీ మంత్రము.

ఓం భూర్భువ స్సువః

తత్సవితుర్వరేణ్యం

భర్గో దేవస్య ధీమహి

ధియో యోనః ప్రచోదయాత్.



5. సవిత - త్వష్ట (బ్రహ్మ)

'త్వష్టృ' శబ్దమునకు 'త్విషదీప్తౌ' అనుధాత్వర్థముచే "ప్రకాశించువాడు" అని అర్థము. 'త్వక్ణోతి తనుకరోతీతి త్వష్టా' అనువ్యుత్పత్త్యర్థముచే 'త్వష్ట అనగా లోకసృష్టిని చేయువాడు.

త్వష్టపేరు ఋగ్వేదములో 65 సార్లు వచ్చినది. ఋగ్వేదములో త్వష్టను స్తుతించు ప్రత్యేక సూక్తమేమియు లేదు. కాని త్వష్టను స్తుతించు మంత్రములు ప్రతి మండలము లోను ఉన్నవి.

ఋగ్వేదము :

"దేవ స్త్వష్టా సవితా విశ్వరూపః పుపోష ప్రజాః పురుధా జజాన,
ఇమా చ విశ్వా భువనా న్యస్య మహా ద్దేవానా మసురత్వ మేకమ్." **3.55.19.**

సవితయు, విశ్వరూపుడును, దేవుడును అగు త్వష్ట ప్రాణులను నానావిధ రూపములుగా పుట్టించి పోషించుచున్నాడు. ఈ సమస్త లోకములు అతని మహద్దైశ్వర్యమే.

"గర్భేను నౌ జనితా దంపతీక ర్దేవ స్త్వష్టా సవితా విశ్వరూపః." **10.10.5.**

సవితయు, విశ్వరూపుడు, దేవుడు అగు త్వష్ట గర్భము నందుండగనే దంపతులను చేసినాడు.

పై రెండు మంత్రములలోను సవిత, త్వష్ట అనుపదములు పర్యాయపదములుగ వాడబడి వారి అభేదమును తెలుపుచున్నవి.

"త్వష్టా వై పశూనామ్, మిథునానామ్ రూపకృత్" అను యజుర్వేద మంత్రము కూడ త్వష్ట ప్రాణులను వధూవరులను సృష్టించుచున్నాడని తెలుపుచున్నది.

"పిశంగ రూపః సుభరో వయోధాః, శ్రుష్టీ వీరో జాయతే దేవకామః
ప్రజాం త్వష్టా విష్యతు నాభిమస్మే, అథా దేవానా మప్యేతు పాథః." **2.3.9.**

ఏ దేవుడు వంశమునునిల్పు సంతానము నిచ్చుచున్నాడో, అట్టి త్వష్టృ దేవుని అనుగ్రహము చేత బంగారు కాంతి గలవాడును, యజ్ఞములు (మంచికర్మలు) చేయగల వాడును, అన్నదాతయు, గుణవంతుడును, దేవతలు మెచ్చువాడును అగు పుత్రుడు జన్మించు గాక।

ఈ మంత్రమును బట్టి సంతానము నిచ్చునది త్వష్టృ దేవుడని తెలియుచున్నది. తైత్తిరీయ బ్రాహ్మణము (1.6.4.1) "ప్రజాపతి అయిన సవిత జీవులను సృష్టించినాడు." అని తెలుపుచున్నది.

"యఇమే ద్యావా పృథివీ జనిత్రీ రూపై రపింశ ద్భువనాని విశ్వా'
త మద్య రిషితో యజీయాన్ దేవం త్వష్టార మిహ యక్షి విద్వాన్." **10.110.9.**

'ఏ త్వష్ట్ర దేవుడు ఈ ద్యావా పృథువులను సృజించి సమస్త భువనములను నానా రూపములు కలవానినిగ చేసినాడో' అని ఈ మంత్రము తెలుపుచుండగా, సవిత ద్యావా పృథువులను నిలిపినాడని ఈ క్రింది మంత్రభాగము తెలుపుచున్నది.

"సవితా యంత్రైః పృథివీ మరమ్ణా దస్కంభనే సవితా ద్యామ దృంహత్." **10.149.1.**

మఱియు సవిత భువనమును ధరించుచున్నాడు (4.54.4) అనియు, స్వర్గ లోకమును ధరించుచున్నాడు ('దివోధర్తా', 4.53.2) అనియు తెలుపబడినది.

" త్వష్టా ర మగ్రజాం గోపాం పురో యావాన మాహువే,
ఇందు రింద్రో వృషాహరిః పవమానః ప్రజాపతిః."
9.5.9.

అందఱి కంటె ముందు ఉన్నవాడును, జగత్పాలకుడును, దేవతలకు ముందు నడచు మార్గదర్శియు అగుత్వష్ట్ర దేవుని యజ్ఞమునకు పిలుచుచున్నాము. ఆత్వష్ట్ర సోముడును, హరియు, ఇంద్రుడును, ప్రజాపతియు, పవమానుడును, కోరికలు తీర్చువాడును, అయియున్నాడు. ఇట్లనుటచే అతని సర్వదేవాత్మకత్వము వెల్లడియగుచున్నది.

ఈ మంత్రమున త్వష్టను 'ప్రజాపతి' అనుట జరిగినది. సవితను "భువనస్య ప్రజాపతిః" (ఋ 4.53.2) అని ఋగ్వేదము, ప్రజాపతి అయిన సవిత జీవులను సృష్టించినాడని తైత్తిరీయ బ్రాహ్మణము (1.6.4.1) వచించినది.

ఋగ్వేదము 'సుపాణిః' అను పదము త్వష్టకు (6.49.9), సవితకు (3.33.6) వాడినది. ఋగ్వేదములో త్వష్ట మొదటివాడు (అగ్రియ. 1.13.10) అనియు, మొదట పుట్టినవాడు (అగ్రజా) అనియు తెలుపబడినది. శుక్ల యజుర్వేద, యజురారణ్యకము లందలి పురుష సూక్త మంత్రము.

" అద్భ్య స్సంభూత పృథివ్యై రసాచ్చ విశ్వకర్మణ స్సమ వర్తతాధి
తస్య త్వష్టా విదధ ద్రూపమేతి తత్పురుషస్య విశ్వమాజాన మగ్రే."

విశ్వకర్మ నిమిత్త కారణముగా పృథివి యొక్క సారము వలనను, నీటివలనను ఈ జగము ఏర్పడినది. ఆ విశ్వకర్మ యొక్క ప్రతి రూపముగానే త్వష్ట (బ్రహ్మ) అనుదేవుడు రూపొందినాడు. సృష్టికి ముందు ఆ పరమపురుషుని (విశ్వకర్మ) యొక్క ఆ జగత్తు జ్ఞానరూపములో నున్నది.

ఈ మంత్రమున విశ్వకర్మ నుండి త్వష్ట జన్మించినాడని తెలుపబడినది.

"తవ వాయ వృతస్పతే, త్వష్టు ర్జామాత రద్భుత।అవాం,స్యా వృణీ మహే".

ఋ. 8.27.21.

సాయణుల భాష్యము : "హే ఋతస్పతే = ఋతపతే, త్వష్టు ర్జామాతః= బ్రహ్మణో జామాతః, ఏషా కథా ఇతిహాసాదిభి రవగంతవ్యా....

"త్వష్టు ర్జామాతరం వయ,
మీశానం రాయమీమహే, సుధావంతం
వాయుం ద్యుమ్నా జనాసః." **ఋ. 8.27.2.**

సాయణుల భాష్యము : "త్వష్టు ర్బ్రహ్మణో జామాతార మీశానం సర్వస్యేశ్వరం, ఏతాదృశం వాయుం" అని. త్వష్టుః=బ్రహ్మణః= బ్రహ్మకు, అని గమనించవలయును.

పై రెండు మంత్రములలోను త్వష్ట అనగా బ్రహ్మ అని సాయణుని భాష్యము .

"సుకృత్సుపాణిః, స్వవాం ఋతా వా దేవ స్త్వష్టా Z వసే తాని నో ధాత్."

ఋ 3.54.12.

భాష్యమ్. సుకృత్=సుష్ఠు జగతః కర్తా; సుపాణిః=కల్యాణపాణిః; స్వవాన్= ధనవాన్. ఋతావా=సత్య సంకల్ప స్త్వష్టాదేవ, స్తానియా న్యస్మాక మపేక్షి తాని, అవసే=రక్షణాయ, నః= అస్మభ్యం; ధాత్=దదాతు. అనగా జగములను లెస్సగా సృష్టించిన వాడును. మంగళకర హస్తములు కలవాడును, జ్ఞానమనెడి ధనము కలవాడును, సత్య సంకల్పుడును అగు త్వష్ట మన కోరికలను తీర్చి రక్షించుగాక।

"త్వష్టా రూపాణి హి ప్రభుః." **ఋ. 1.188.9**

సాయణుల భాష్యము : త్వష్టా రూపాణి=యోనౌ సృష్టాని రేతాంసి రూపాణి కర్తుం ప్రభుర్హి" అనగా త్వష్ట గర్భము నందుంచబడిన రేతస్సులకు రూపనిర్మాణము చేయుచున్నాడని భావము.

"త్వష్టా రూపాణి పింశతు." **ఋ. 10.184.1.**

పిశ=అవయవే. 'పింశతి' అనగా అవయవములతో గూడిన రూపములను సృజించు చున్నాడని భావము.

"త్వష్టా రూపాణా మధిపతిః." **యజుః కాం. 3.4.5.1.**

త్వష్ట రూపములకు నాయకుడు.

"యావ చ్ఛో వై రేతస స్సిక్తస్య త్వష్టా రూపాణి వికరోతి." **తై.సం. 1.5.9.1**

అనగా త్వష్ట రేతస్సునకు రూపకల్పన చేయు దేవుడని యర్థము.

"ఉత మాతా బృహద్దివా శృణోతు న స్త్వష్టా దేవే భిర్జనిభిః పితావచః।
ఋభుక్షా వాజో రథస్పతి ర్భగో రణ్వః శం నః శశమానస్య పాతు నః॥"

ఋ.10.64.10.

దేవమాత (బృహద్దివా) యు, జగత్పితయైన త్వష్టయు, దేవతలతోను దేవపత్నుల తోను మామాటను విందురుగాక! అట్లే ఇంద్రుడు, అతనికి సహచరుడును రథస్పతియు (రథనిర్మాత) ఋభువులలో కనిష్ఠుడును అగువాజుడును, భగుడును, మరుద్గణమును స్తోత్రము చేయు మమ్ము రక్షించుగాక। ఈ మంత్రమున త్వష్ట 'జగత్పిత'యని వచించుట గమనింపదగినది.

"త్వష్టా వీరం దేవకామం జజాన। త్వష్టు రర్వాజాయత ఆశురశ్వః।
త్వష్టేదం విశ్వం భువనం జజాన బహోః కర్తార మిహ యక్షిహోతః॥"

యజు. కాం. 5.1.11.3.

తా॥ త్వష్ట్ర దేవుడు దేవతలు గోరువాడును కర్మశూరుడు నగు పుత్రుని జనింప జేసెను. ఆ పుత్రుడు త్వష్ట నుండి గమనమున నేర్పరియగునదియు, శీఘ్రముగ బోవునదియు నగు అశ్వమును బుట్టించెను. ఓహోతా। విశాలమగు జగమును సృజించు త్వష్ట్ర బ్రహ్మను నీ యజ్ఞమున పూజింపుము. ఈ మంత్రము వలన పుత్రకల్పన త్వష్టచే జరుగుచున్నదని తెలియుచున్నది.

తైత్తిరీయ విశ్వకర్మ సూక్తమంత్రము :

"విశ్వకర్మా హ్యా జనిష్ఠ దేవ ఆది
ద్గంధర్వో అభవ ద్వితీయః
తృతీయః పితా జనితౌష ధీ నామ్"

సాయణుని భాష్యము : "విశ్వకర్మా దేవతిర్యగాది విశ్వ భేదస్యకర్తా, సత్యలోకనివాసీ చతుర్ముఖో దేవో Z జనిష్ఠ ఉత్పన్నః. ఆదిత్-అనంతరమేవ తదపేక్షయా ద్వితీయో గంధర్వో Z భవత్-ఉత్పన్నః. తత ఊర్థ్వమోషధీనాం పితాపాలకః, పితా చోత్పాదకః సోమఃపూర్వోక్త ద్వితీయాపేక్షయా తృతీయో Z భవత్."

అనగా బ్రహ్మాండమున దేవతిర్యగాది జీవభేదములకు కర్త అయిన విశ్వకర్మ సత్యలోక నివాసి అయిన చతుర్ముఖుడు (బ్రహ్మ) అయినాడు. అనంతరము రెండవవాడుగా గంధర్వుడయినాడు. మూడవ వాడుగా ఓషధీపాలకుడు-పిత అయిన సోముడైనాడు.

ఈ మంత్రమునకు పూర్వ మంత్రము

"తమిద్గర్భం ప్రథమం దధ్ర ఆపో యత్రదేవా స్సమ గచ్ఛన్త విశ్వే,
అజస్య నాభా వధ్యేక మర్పితం యస్మిన్నిదం విశ్వం భువన మధిశ్రితమ్."

అనగా ఈ విశ్వము నంతయు గర్భమునందుంచు కొనిన ఏ విశ్వకర్మయందు దేవత లందఱు కూడియున్నారో ఆ గర్భమునే ఉదకములు మొదటగా ధరించినవి. జన్మము లేని విశ్వకర్మ యొక్క నాభిస్థానమున ఒకానొక బీజముంచబడినది. ఏ బీజమున ఈ సమస్త భువనములు ఆశ్రయింపబడియున్నవో - అట్టి బీజము.

ఈ మంత్రమున "అజస్య, నాభౌ" అను రెండు పదములు కలవు. ఆ రెంటిని కలిపిన 'అజనాభము' అగును. మన దేశమునకు మొదట అజనాభమను పేరు గలదు. ఈ విషయమును భాగవతము "ము న్నజనాభంబను పేరంబరగు దేశంబు భరతుండు పాలించు కతన భారతంబు నాబరగె' అని వచించినది. దీనిని బట్టి 'అజునికి- సృష్టికర్త అయిన విశ్వకర్మకు నాభివంటిదైన దేశము అని భావము. ఈ 'అజనాభ' పదమును ఆధారముగా చేసికొని, విష్ణుమూర్తి నాభికమలము నుండి బ్రహ్మపుట్టి, సృష్టి చేసినాడని పురాణములలో వ్రాయబడినది.

శ్వేతాశ్వతరోపనిషత్తు :

"యో బ్రహ్మాణం విదధాతి పూర్వం
యోవై వేదాంశ్చ ప్రహిణోతి తస్మై,
తం హదేవ మాత్మ బుద్ధి ప్రకాశం
ముముక్షు ర్వై శరణ మహం ప్రపద్యే."

ఏ దేవుడు సృష్ట్యాదియందు బ్రహ్మదేవుని సృజించెనో, ఎవడు వేదములను ఆ బ్రహ్మ కొఱకు ఒసంగినాడో, ఆత్మబుద్ధిని ప్రకాశింపచేయువాడగు ఆ దేవుని-సంసార బంధము నుండి ముక్తి పొందదలచిన వాడనైన నేను శరణుపొందుచున్నాను.

ఈ మంత్ర మీ విధముగ బ్రహ్మకు పూర్వమున్న-బ్రహ్మను సృజించిన దేవుని స్తుతించుచున్నది. అథర్వవేదము దశమ కాండము నాల్గవ అనువాకమున గల రెండు సూక్తములలో స్కంభుడను దేవుడు జ్యేష్ఠ బ్రహ్మగా స్తుతింపబడినాడు. జ్యేష్ఠ బ్రహ్మ అనగా

బ్రహ్మకు పూర్వుడేగదా! "విశ్వకర్మా హ్య జనిష్ఠ ఆది" అనగా విశ్వకర్మ మొదటగా బ్రహ్మ అయినాడు అని చెప్పుటచే, ఈ జ్యేష్ఠ బ్రహ్మ 'విశ్వకర్మ' అని స్పష్టమగుచున్నది. మఱియు విశ్వకర్మ నుండి త్వష్ట జన్మించినాడనియు, త్వష్ట అనగా బ్రహ్మయే అను పైనుదాహరించిన మంత్ర భాష్యముల వలనను త్వష్ట అనగా బ్రహ్మయే అని స్పష్టమగుచున్నది.

అమరకోశములో 'బ్రహ్మ'కు పర్యాయ పదములుగా ప్రజాపతి, పరమేష్ఠి, హిరణ్య గర్భ పదములు వాడబడినవి.

ప్రజాపతి, విశ్వకర్మ, పరమేష్ఠి అనువారు ఒకే ఒక దేవుని యొక్క వివిధ మూర్తులని సాయణులీ క్రింది విధముగ వ్రాసినారు.

"స పరమేష్ఠీతి - ప్రజాపతి ర్విశ్వకర్మా పరమేష్ఠీ
త్యేతే త్రయో ష్యేక స్యైవ మూర్తిభేదాః."

"హిరణ్య గర్భః సమవర్త తాగ్రే భూత స్యజాతః పతిరేక ఆసీత్,
సదాధార పృథివీం ద్యాముతే మాం కస్మైదేవాయ హవిషా విధేమ."

ఋ.1.12.1.

సృష్టికి పూర్వము హిరణ్య గర్భుడను దేవుడొక్కడే ఉండెను. ఆయన భూ దివములను సృజించి ధరించెను. అట్టి అనిర్వచనీయ దేవుని అర్చింతుము గాక। హవిస్సులతో ఆయనను పూజింతుముగాక।

ఈ మంత్రమున హిరణ్యగర్భుడు భూదివములను సృష్టించి ధరించినట్లు తెలుపబడినది. ఋగ్వేదము (10.110.9)లో "య ఇమే ద్యావా పృథివీ జనిత్రీ' అని త్వష్టృ దేవుడు ద్యావా పృథువులను సృష్టించినట్లు తెలుపబడినది. మఱియు సృష్టికి పూర్వము హిరణ్య గర్భుడను దేవుడొక్కడే యుండెననుట "విశ్వకర్మా హ్య జనిష్ఠ దేవ ఆది" అనుటనుబట్టి హిరణ్యగర్భుడే 'బ్రహ్మ' అనియు, 'త్వష్ట' అనియు తెలియుచున్నది. సవిత ద్యావా పృథువులను నిలిపినాడనియు "దివోధర్తా, భువనస్య ప్రజాపతిః" (10-149-1) దివమును ధరించినాడు, భువనమునకు ప్రజాపతి అనుటచే హిరణ్యగర్భుడు-త్వష్ట-సవితల అభేదము తెలియుచున్నది.

త్వష్టకు కౌశిక సూత్రములో సవిత తోను, ప్రజాపతితోను, మార్కండేయ పురాణములో విశ్వకర్మ తోను, ప్రజాపతితోను, అభిన్నత్వము చెప్పబడినది.

"య ఆత్మదా బలదా యస్య విశ్వం ఉపాసతే ప్రశిషం యస్య దేవాః
యస్య ఛాయామృతం యస్య మృత్యుః కస్మైదేవాయ హవిషా విధేమ॥." 2

ఏ హిరణ్య గర్భుని నుండి సృష్టిలో అనేకములగు జీవాత్మ లేర్పడుచున్నవో, ఎవడు శక్తి ప్రదాతయో, ఎవని శాసనమును సమస్త ప్రాణులును దేవతలును అనుసరించు చున్నారో, అమృతత్వ-మృత్యుత్వములు ఎవనికి ఛాయలైయున్నవో అట్టి పరమాత్ముని సేవింతుముగాక।

"యః ప్రాణతో నిమిషతో మహి త్త్వైక ఇద్రజా జగతో బభూవ।
య ఈశే అస్య ద్విపద శ్చతుష్పదః ॥కస్మై॥." **3.**

ఎవడు నిశ్వసించుచున్న, నిమేషించుచున్న జగత్తునకు (ప్రాణులకు) తన మహిమ చేత ఏకైక ప్రభువై వెలుగుచున్నాడో, ఎవడు కంటికి కన్పించు ద్విపాత్తులకు (దేవ మనుష్యాదులకు), చతుష్పాత్తులకు (పశువులకు) ప్రభువో అట్టి హిరణ్యగర్భుని సేవింతుముగాక।

ద్యావా పృథువులకు సృజించినాడనుటచేత, సృష్టికి పూర్వముగల దేవుడనుట చేత, 'హిరణ్యగర్భుడు త్వష్టకు, విశ్వకర్మకు ప్రతిరూపమే' అని విదితమగుచున్నది.

"యస్యేమే హిమవన్తో మహిత్వా యస్య సముద్రం రసయా సహాహుః
యస్యేమాః ప్రదిశో యస్య బాహూ కస్మై దేవాయ హవిషా విధేమ."

ఋ. 10.121.4.

హిమవదాది పర్వతములు ఎవని ఐశ్వర్యమో, నదీ నద సముద్రాదులు ఎవని మహాభాగ్యమని తత్త్వవేత్తలు చెప్పుచుందురో, దిక్కులు, విదిక్కులు (మూలలు) ఎవని బాహువులై యున్నవో, అట్టి హిరణ్యగర్భుని సేవింతుముగాక!

ఈ మంత్రములోని 'సముద్రం' అను పదము, కృష్ణ యజుర్వేదము నందలి విశ్వకర్మ సూక్తములోని 'సముద్రాయ వయునాయ' అనుపదము ఒక్కదే అని పండితుల అభిప్రాయము. మఱియు దిక్కులు – "విశ్వకర్మా దిశాంపతిఃసనః పశూన్ పాతు సోZస్మాన్పాతు తస్మై నమః" (యజు. కాం.5. ప్ర.5.అ.5) అను మంత్రమునకు సంబంధించినవే.

"యేన ద్యౌ రుగ్రా పృథివీ చ ధృఢా యేన స్వః స్తభితం యేన నాకః
యో అంతరిక్షే రజసో విమానః॥ కస్మై.....॥" **5.**

ఎవని చేత అంతరిక్షము అంతుపట్టనంత గహనముగా ఉన్నదో, భూమి స్థిరమై వెలుగుచున్నదో, స్వర్గము పడకుండ ఉన్నదో, సూర్యాదులు పడకుండ ఆకాశమున

తిరుగాడుచున్నారో (ఇచట సూర్యుని చెప్పుటచేత 'తక్కిన గ్రహ నక్షత్రాదులు కూడ' అని భావించవలయును). ఎవడు అంతరిక్షమున కూడ ఉదకములను నిర్మించుచున్నాడో అట్టి ప్రజాపతిని సేవింతుముగాక!

"మా నో హింసీ జ్జనితా యః పృథివ్యా యో వా దివం సత్యధర్మా జజాన।
య శ్చాప శ్చంద్రా బృహతీ ర్జజాన ॥ కస్మై॥ " 9.

ఎవడు భూమిని సృష్టించెనో, ఏ సత్యధర్ముడు స్వర్గాది లోకములను సృజించెనో, ఎవడు అహ్లాదమును కలిగించునట్టి అధిక జలములను నిర్మించెనో, అట్టి ప్రజాపతిని సేవింతుముగాక!

ఋగ్వేదము దశమ మండలము 121వ సూక్తములోని మొదటి తొమ్మిది మంత్రములలోనూ చివరి పాదము "కస్మై దేవాయ హవిషా విధేమ" అనగా 'ఏ దేవునికి హవిస్సు నిచ్చి పూజించుదము' అనియుండగా, ఈ సూక్తము మొదటి మంత్రములో ఆ దేవుడు 'హిరణ్య గర్భుడు' అనియు, పదవ మంత్రములో "ప్రజాపతే సత్వదేతా న్యన్యో విశ్వా జాతాని పరిత బభూవ' అనగా 'ప్రజాపతీ। నీకంటెను ఇతరుడెవరు ఈ అన్ని పదార్ధములలోను వ్యాపించిలేదు' అని చెప్పబడినది. ఈ 121వ సూక్తములో చెప్పబడిన కొన్ని విషయములు ఈ దిగువ వ్రాయబడినవి.

అన్ని ప్రాణులను పుట్టించినవాడు, అంతటికి ఒకేపతి (భూతస్య జాతః పతిరేక ఆసీత్. 1). ఈ జగత్తుకంతటికి అతడొక్కడే రాజు (ఏక ఇద్రాజా జగతో బభూవ-2) ఆయన ఆజ్ఞను దేవతలతో పాటు అందరూ పాటింతురు. (యస్య విశ్వ ఉపాసతే ప్రశిషం యస్య దేవాః2) ఈ దిక్కులన్నియు ఆయన బాహువులు (యస్యేమా: ప్రదిశో యస్య బాహూ. 4). దేవతలలో ఒకే దేవుడు (యో దేవే ష్వధి దేవ ఏక ఆసీత్. 8)

అశ్వలాయన గృహ్య సూత్రములో ప్రజాపతికి-బ్రహ్మకు ఏకత్వము చెప్ప బడినది (3.4మొ). తైత్తిరీయ సంహితలో 'ప్రజాపతి-హిరణ్యగర్భుడు' అని చెప్పబడినది (5.5.1.2). ఋగ్వేదములో ప్రజాపతి శబ్దము సవితకు విశేషణముగ వాడబడినది (భువన స్య ప్రజాపతిః 4.53.2). బ్రాహ్మణాలలో (శత పథ బ్రాహ్మణము 8.2.1.10, 8.2.3.13; ఐతరేయ బ్రాహ్మణము 4.22.) విశ్వకర్మకు ప్రజాపతికి ఏకత్వము స్పష్టముగ చెప్పబడినది.

"ప్రజాపతి ర్విశ్వకర్మా మనో గంధర్వః" అను యజుర్వాక్యమునకు శతపథ బ్రాహ్మణము నందలి నిర్వచనము "ప్రజాపతి ర్విశ్వకర్మేతి, ప్రజాపతిర్వై విశ్వకర్మా, సహీదగ్ం, సర్వమకరోత్". ప్రజాపతి అనగా విశ్వకర్మ, అతడీ సర్వమును సృష్టించినవాడు.

పై విషయముల వలన త్వష్ట–బ్రహ్మ–హిరణ్యగర్భుడు ఒక్కరే అనియు, అతడు జగత్సృష్టి కర్త అనియు, విశ్వకర్మ కుమారుడనియు, తెలియుచున్నది.

విశ్వకర్మ సూక్తమంత్రము "ద్యావాపృథివీ జనయన్దేవ ఏకః" విశ్వకర్మ ఒక్కడే ద్యావా పృథువులను సృష్టించినాడని తెల్పుచుండగా, ఋగ్వేద మంత్రము (10.110.9) త్వష్ట–ద్యావా పృథువులను సృష్టించినాడని తెలిపినది. పురుషసూక్తమంత్రము "విశ్వకర్మణ స్సమవర్తతాధి తస్యత్వష్టా విదధ ద్రూపమేతి' అనగా 'విశ్వకర్మ యొక్క ప్రతిరూపము త్వష్ట' అని వచించినది. విశ్వకర్మ నిర్గుణుడు కాగా బ్రహ్మ రజోగుణ ప్రధానుడు.

శ్రీ కాళహస్తి ముని ప్రణీత విశ్వకర్మ పురాణము

కోడిగ్రుడ్ల వంటి ఆకారములు గల వేలకొలది బ్రహ్మాండములు ఎవని గర్భము నుండి కలుగుచున్నవో అతడే 'త్వష్ట' యను నామముగల బ్రహ్మ. బ్రహ్మాండముల నడుమ నుండెడి యిట్టి బ్రహ్మ, విష్ణు గర్భము నుండి పుట్టినవాడే. అట్టి వేలకొలది బ్రహ్మాండములను మయ స్వరూపుడగు విష్ణువు భరించుచున్నాడు. అట్టి మహాండముల నడుమనున్న విష్ణువు శివుని గర్భము నుండి ఉదయించినవాడే. ఆ మహాండముల వేల సంఖ్యలను మనురూపుడైన శివుడు భరించుచున్నాడు. పరాండముల నడుమనున్న శివుడు పరశివుని యందుండెడి వాడే. 'విశ్వకర్మ' యని పిలువబడెడి పరశివుడు ఆ పరాండములను భరించుచున్నాడు. పరబ్రహ్మాండముల మధ్యమునగల పరశివుడు పరబ్రహ్మాండ సహస్రములను తన సహస్ర శీర్షాకారము చేత అనగా విరాట్పురుష దేహము చేత భరించుచున్నాడు.

పరబ్రహ్మాండమనునది పండిన మఱ్ఱి పండును బోలియుండును. పరాండము మేడిపండును బోలి యుండును. మహాండము పావురపు గ్రుడ్డు వలె వెలయుచుండును. బ్రహ్మాండము కోడిగ్రుడ్డును పోలినదై యుండును.

శ్లో॥ విశ్వం గర్భేణ సంధృత్వా, విశ్వకర్మా జగత్పతిః
వటపత్ర పుటేశేతే, యద్దశాంగుళ మాత్రకః. 4.30.

Kaegi : త్వష్ట అతి ప్రాచీనకాలములో దేవతగా ఉండి, తరువాతి కాలములో విస్మరింప బడినవారిలో ఒకడు.

Ludwing : త్వష్ట సంవత్సరమున కధి దేవత.

Kuhn : త్వష్టకు సవితకు అభిన్నత్వము చెప్పబడుటచే త్వష్ట-సూర్యుడయి ఉండవచ్చును.

Hardy : త్వష్ట సూర్యునికి సంబంధించిన దేవత.

జగత్తులకు ప్రభుడైన ఆ విశ్వకర్మ విశ్వము నెల్ల తన గర్భమునందుంచుకొని, దశాంగుళ పరిమాణములవాడై మఱ్ఱియాకు మీద శయనించి యుండును.

శ్లో॥ బాలార్కకోటి లావణ్యో, బాలరూపీ దిగంబరః
యోగ మాయా యుతో దేవో, విశ్వకర్మా చ పత్రకే. **4.31.**

ఆ విశ్వకర్మ కోటి బాలసూర్యుల తేజముగలవాడై, బాలరూపమున దిగంబరుడై, యోగమాయతో గూడి ఆ మఱ్ఱియాకు మీద శయనించి యుండును.


శ్లో॥ ఆ నాభి కమలం బ్రహ్మా ఆ కంఠం వైష్ణవీ తనుః,
ఆ శీర్ష మీశ్వరో జ్ఞేయో, విశ్వకర్మత్రయీ తనౌ. **4.32.**

ఆ విశ్వకర్మ యొక్క వేదరూప శరీరము పాదముల నుండి బొడ్డు వఱకు బ్రహ్మ స్వరూపముగను, బొడ్డు నుండి కంఠము వరకు విష్ణు స్వరూపముగను, నాభి నుండి శిరః పర్యంతము ఈశ్వర రూపముగను భావింపవలయును.

శ్లో॥ కరాభ్యాం స పదాంగుష్ఠం, వక్త్రే నిక్షిప్య చుంబయన్
యోగనిద్రా సమాయుక్తో, శ్వేతే న్యగ్రోధ పత్రకే **4.33.**

ఆ విశ్వకర్మ భగవానుడు తన చేతులతో కాలిబొటనవ్రేలిని నోటిలో వైచికొని ముద్దిడుకొనుచు (చీకుచు) యోగ నిద్రాయుక్తుడై మఱ్ఱియాకు మీద పవళించి యుండును.

ఈ స్వరూపమే విష్ణువునకును అన్వయించుచు పురాణములందు కన్పించును.



6. సవిత - విష్ణువు - విశ్వకర్మ

'విష్' అను ధాతువు నుండి విష్ణు శబ్దము పుట్టినది. 'విషల్ వ్యాప్తౌ' అనగా వ్యాపించువాడు అని అర్థము. విష్ణువు ఋగ్వేదములో ఐదు సూక్తములలోను, మరియొక సూక్తములో కొన్ని మంత్రములలోను స్తుతించబడినాడు.

ఋగ్వేదము :

"యస్యత్రీ పూర్ణా మధునాపదా న్యక్షీయ మాణాస్వధయా మదంతి,
య ఉత్రిధాతు పృథివీ ముతద్యా మేకో దాధార భువనాని విశ్వా." 1.154.4.

ఏ విష్ణువు యొక్క మధువుతో పూర్ణము లయిన మూడు స్థానములు నాశనము లేనివై హర్షింప జేయుచున్నవో, ఏ విష్ణువు త్రిధాతువులతో కూడిన ద్యావా పృథువులను ఒక్కడే ధరించినాడో, అట్టి విష్ణువు నారాధింతమని తక్కిన మంత్రములతో సమన్వయము.

సవిత ద్యావా పృథువులను నిలబెట్టినాడని (ఋ. 10. 149. 1), స్వర్గమును ధరించుచున్నాడని (ఋ. 4. 53. 2), భువనము నంతటిని ధరించుచున్నాడని (ఋ. 4. 54. 4), చెప్పబడినది. దీనిని బట్టి సవిత, విష్ణువు లిరువురు ఒకే సృష్టి కార్యమును నిర్వర్తించుచున్నట్లు తెలియుచున్నది. **అంతరర్థము :** మూడు స్థానములు అనగా మణిపూర, అనాహత, ఆజ్ఞాచక్రములు. మణిపూరము జఠరాగ్నికి నివాసము. అనాహతము ప్రాణవాయువునకు నివాస స్థానము. ఆజ్ఞాచక్రము జీవునికి, అతని ఉపాధి అయిన కారణ దేహమునకు నిలయము. ద్యావా పృథువులనగా ఆధారము నుండి సహస్రారము వఱకుగల చక్రములు.

ఏ విష్ణు రూప పరమాత్మ యొక్క దివ్యమైన అమృత రసముతో పూర్ణము లయిన నాశనము లేని మూడు స్థానములు యోగరూపాహారముచేత యోగులను హర్షింప జేయుచున్నవో, ఏ పరమాత్మ ఆధారాది సప్త కమలములతో కూడిన శరీరముతో త్రిధాతువులతో కూడిన సమస్త ప్రాణులను ఒక్కడే ధరించినాడో, అట్టి విష్ణువు నారాధింతము.

"విష్ణోర్నుకం వీర్యాణి ప్రవోచమ్ యః పార్థివాని విమమే రజాంసి,
యో అస్కభాయ దుత్తరమ్ సదస్థమ్ విచక్రమాణ స్త్రేధో రుగాయః" 1.54.1.

ఏ విష్ణువు (పరబ్రహ్మము) పృథివీ సంబంధమైన (పృథివి మొదలు ఆకాశము వఱకుగల) లోకములను (పిండాండ పక్షమున ఆధారాదులనెడి చక్రములను) నిర్మించినాడో, ఏ విష్ణువు మూడు స్థానముల యందు మూడు రీతులుగ (మణిపూరమున జఠరాగ్నిగను, అనాహతమున ప్రాణవాయు రూపముగను, ఆజ్ఞాచక్రమున మాయోపాధి-అవిద్యోపాధి

రూపముగను) సంచరించువాడై, తత్త్వజ్ఞులచేత లెస్సగా గానము చేయబడుచు, అన్నిటికిని ఉత్తరమున (పైన) ఉన్న సహస్రార స్థానమును సృష్టించినాడో, అట్టి విష్ణువు యొక్క ప్రభావమును లెస్సగా పలుకుచున్నాను.

"ప్రత ద్విష్ణుః స్తవతే వీర్యేణ మృగో నభీమః కుచరో గిరిష్ఠాః
యస్యోరుషు త్రిషు విక్రమణే ష్వధి క్షియంతి భువనా ని విశ్వా." 1.154.2

ఏ విష్ణువు యొక్క గొప్పవి అయిన మూడు విక్రమములందు సమస్త భూత సమూహములు నివసించుచున్నవో, ఆ విష్ణువు (సహస్రార పరబ్రహ్మ) తన శక్తి చేత కొండపై నున్న భయంకర సింహమువలె ఎల్లరిచేత స్తుతింపబడుచున్నాడు.

త్రివిక్రముడనగా కారణ-సూక్ష్మ-స్థూల దేహములందు ప్రవేశించిన జీవుడనియు, ఉరుక్రముడు అనగా సప్తముధాతువులతో కూడిన స్థూలదేహమున జీవభావమున మెలగు వాడనియు, అంతరార్థము. 'కుచరః'. కు అనగా భూమి ఆధారము. పృథివీ భూతమునకు నెలవైనది. అనగా ఆధారమున కుండలినీ రూపమునున్న వ్యాపకుడైన విష్ణువనియు, గిరిష్ఠాః, 'గీ' అనగా వాక్కు గిరి=వాక్కు నందు పరావాగ్రూపముగా ప్రకాశించు వాడు. అనగా ప్రణవమునందు లీనమైయున్న వాడనియు ఆధ్యాత్మ పరముగా భావించ వలయును.

"ప్రవిష్ణవే శ్రూషమేతు మన్మ గిరిక్షిత ఉరుగాయాయ వృష్ణే,
య ఇదం దీర్ఘం ప్రయతం సదస్థ మేకో విమమే త్రిభిరి త్ప దేభిః." 1.154.3.

ఏ విష్ణువు ప్రసిద్ధము-విస్తృతము-నియతము అయిన త్రిలోకముల ఏకీభావమును తానొక్కడే అద్వితీయుడై మూడు స్థానములచేత లెస్సగా నిర్మించెనో- వ్యాపించెనో, అట్టి సహస్రారమందున్న వాడును (గిరిక్షితే), లెస్సగా కీర్తింపబడువాడును, కోరికలను వర్షించువాడును అగు విష్ణువు కొఱకు మన యోగ్యమైన స్తోత్రము.

"తదస్య ప్రియ మభిపాథో అశ్యాం నరోయత్ర దేవయవో మదంతి,
ఉరుక్రమస్య స హి బంధురిత్థా విష్ణోః పదే పరమే మధ్వ ఉత్సః." 1.154.5.

యత్ర = ఎక్కడ (ఏ సహస్రారమున), దేవయవః= దేవాదులను నిర్మించిన పరబ్రహ్మము యొక్క సాధర్మ్యము పొందదలచిన, నరః= సాధకులయిన యోగులు, మదంతి=ఆనందము పొందుదురో, అస్య=అట్టి విష్ణువు యొక్క , ప్రియం=ప్రియమైన, తత్=ఆ వచింప వీలుకాని, పాథః= సహస్రార లోకమును, అభి అస్యాం=వ్యాపింతునుగాక! విష్ణోః= విష్ణువు యొక్క, పరమపదే=పరమపదము (సహస్రారము) నందు, మధ్వః=

అమృతము యొక్క , ఉత్సః= నిష్యందము (స్రవించుట), ఇత్థా=చెప్పబడిన రీతిగా, సః = సహస్రారమున కేగి ఆనందించు ఆ యోగసిద్ధుడు, త్రివిక్రమస్య= అనాహత-అజ్ఞాసహస్రారములలో మెలగెడి బ్రహ్మమునకు లేదా మూడు దేహములందు (కారణ-సూక్ష్మ-స్థూలములందు) ఉన్న జీవునకు, బంధుః= చుట్టమగుచున్నాడు.

ఈ మంత్రమునగల "విష్ణోఃపదే పరమే మధ్వ ఉత్సః" అను వాక్యమును వ్యాఖ్యానించుచు సాయణులు-వ్యాపనశీలుడైన విష్ణువు యొక్క పరమానందాత్మక స్థానమున మధుర నిష్యందము కలదనియు, క్షుత్తృష్ణా జరామరణ పునరావృత్త్యాది భయములు లేవనియు, సంకల్ప మాత్రము చేతనే అమృతతుల్యాది భోగములు ప్రాప్తించుననియు వ్రాసినారు.

త్రివిక్రముడనగా ముల్లోకములందు వ్యాపించినవాడనియు, ఉరుక్రముడనగా గొప్ప వ్యాప్తి కలవాడనియు భావము. మరియు 'త్రివిక్రమ' శబ్దము చేత మాయా శబలిత బ్రహ్మము, 'ఉరుక్రమ' శబ్దము చేత సర్వవ్యాపక పరిపూర్ణ నిర్గుణబ్రహ్మము సూచింపబడినారు.

"చతుర్భిఃసాకం నవతిం చనామభి శ్చక్రం నవృత్తం వ్యతీ రవీవిపత్,
బృహచ్ఛరీరో మిమిమాన ఋక్వభి ర్యువా కుమారఃప్రత్యే త్యా హవమ్." **1.54.6.**

ఆదిత్య రూపుడైన విష్ణువు, చతుర్భిస్సాకం=94 సంఖ్యగల కాలము యొక్క అవయవములను, సంవత్సరము=1, ఆయనములు=2, ఋతువులు=5, (తైత్తిరీయ సంహితలో హేమంత శిశిరఋతువులను కలిపి 'హేమన్త శిశిరఋతువు' అని ఒకే ఋతువుగా వచించుట జరిగినది. ఋగ్వేదము (1.164.15)న సంవత్సరమున రెండేసి నెలలకొక ఋతువు చొప్పున ఆఱు ఋతువులనియు, అవి సూర్యునిచే నేర్పడుచున్నందున దేవజాతములనియు, అధికమాసము ఏడవ ఋతువనియు, అది దేవజముకాక మలమాసముగా చెప్పబడుచున్నదనియు తెలుపబడినది), నెలలు=12, పక్షములు=24, అహోరాత్రములు=30, జాములు=8, మేషాది లగ్నములు=12, మొత్తము=94.

నామభిః= పేర్లచే, వృత్తం=జరుగునట్లుగా, వ్యతీం=వివిధ స్వభావములను, చక్రం న=చక్రమువలె, అవీవిపత్=త్రిప్పుచున్నాడు. ఇట్టి కాలాత్మకుడగు విష్ణువు, బృహచ్ఛరీర =విరాట్ అను గొప్ప దేహము కలవాడై, మిమిమానః= దేవ మానవ తిర్యగాది రూపములను సృష్టించుచు, అవియే తన స్వరూపముగ కలవాడై అనియును లేక , ఋక్వభిః=స్తోత్రములచేత, మిమిమానఃస్తుతింపబడుచున్నవాడై, అకుమారః= అల్పుడుగాక, యువ=యువకుడైన విష్ణువు, ఆ హవమ్= మా ఆహ్వానమును విని, ప్రత్యేతి= విచ్చేయు చున్నాడు.

"అతో దేవా అవన్తునః యతో విష్ణుర్విచక్రమే పృథివ్యాస్సప్తధామభిః" **1.22.6.**

'పృథివ్యాస్సప్త ధామభిః అనగా పృథి వ్యాది స్సప్తలోకములని బాహ్యార్థము, పృథివీ శబ్దముచే నెఱుగ దగిన ఆధారాది సప్తచక్రములని అంతరర్థము. విష్ణువు పృథివి నుండి సప్త ప్రదేశములకు పయనించుట అనగా ఆధారమునందలి కుండలినీశక్తి యోగాది సాధనములచే మేల్కొని స్వాధిష్ఠానాది చక్రములను భేదించుకొనుచు సత్య లోకమగు సహస్రారమును చేరుట. సప్తధామములనగా శరీరము నందుగల 1. చర్మ, 2. రక్త, 3.మాంస, 4. మేదస్, 5. అస్థి, 6. మజ్జా, 7.శుక్రములనెడి సప్తధాతువులనియు భావము. స్థూలశరీరము ఈ సప్తధాతు సమ్మేళనమే. ఆ స్థూల దేహము నాశ్రయించియే జీవుడు కర్మలనొనర్చుచు సుఖ దుఃఖాదుల ననుభవించుచున్నాడు. ఆ విష్ణువే శరీరమును సృష్టించి, అందు వ్యక్తమై జీవనామమును తాల్చి, మందప్రకాశుడై దేహమునందును వెలుపలి పదార్థములయందును అహంకారమును మమకారమును కలిగి బంధింప బడినవాని వలె సంచరించుచున్నాడు.

సవిత జీవులను సృజించినాడని తైత్తిరీయము (1. 6. 4. 1), సవిత చరాచరము లన్నిటికి ప్రభువని ఋగ్వేదము (4. 53. 6, 10. 121. 6), వచించుచున్నందున సవితకు విష్ణువునకు అభేదము.

"స ఆశిషా ద్రవిణ మిచ్ఛమానః ప్రథమ చ్ఛదోవర ఆవివేశ" అను విశ్వకర్మ సూక్త మంత్రముచే విశ్వకర్మ ప్రాణుల హృదయమున జీవరూపమున ప్రవేశించినాడని తెలుపబడుటచే విష్ణు-విశ్వకర్మల అభేదము స్పష్టమగుచున్నది. సవితృదేవుని "విశ్వారూపాణి ప్రతిముంచతే కవిః" అని ఋగ్వేదము (5. 81. 2) వచించగా, విష్ణువును "మావర్పో అస్మ దప గూహ ఏతద్య దస్య రూపః సమిదే బభూథ" (ఋ. 7. 100. 6) అనగా 'ఈ రూపమును మా నుండి దాచకు ఏలయన నీవు యుద్ధములో అన్యరూపు డవయ్యేదవు' అని అర్థము. ఈ విధముగ ఋగ్వేదము సవితృని విశ్వరూపుడనియు, విష్ణువును అన్యరూపుడనియు వచించి వారి అభేదమును తెలిపినది.

ఋగ్వేదము సవితను గురించి "యః పార్థివాని విమమే" (5. 81. 3) అనియు, విష్ణువును గురించి "య పార్థివాని విమమే రజాంసి" (1. 154. 1, 6. 49. 13) అనియు తెలిపినది.

విష్ణువు తన మూడు అడుగులు భూమిమీద, అంతరిక్షములో, స్వర్గములో వేయును. అని శతపథ బ్రాహ్మణము (1. 9. 3. 9), తైత్తిరీయ బ్రాహ్మణము (3. 1. 2. 7) తెల్పుచుండగా, విష్ణువు మూడు లోకముల నాక్రమించినాడని తైత్తిరీయ సంహిత (2. 1. 3. 1) తెలిపినది. దీనినే ఋగ్వేదము (1. 22. 17), విష్ణువు మూడులోకములను మూడడుగులచే ఆక్రమించినాడని తెలిపినది.

మూడు లోకములనగా భూమి, అంతరిక్షము, స్వర్గము అని బాహ్యార్థము కాగా, అనాహత-ఆజ్ఞా-సహస్రారములు అని గాని లేదా మణిపూర-అనాహత, ఆజ్ఞాచక్రములు అనిగాని అంతరర్థము.

సవిత అంతరిక్షమును, మూడు స్వర్గములను, మూడు భూములను మూడు సార్లు చుట్టి వ్యాపించియుండును అని ఋగ్వేదము (4.53.5) తెలిపినది. దీని అంతరర్థము అంతరిక్షము, మూడు స్వర్గములు, మూడు భూములు అనగా సహస్రారముతో కలుపుకొని సప్తచక్రములనియు, మూడుసార్లు చుట్టియుండును అనగా ఇడా, పింగళ- సుషుమ్న నాడులనియు భావించవచ్చును. ఈ విధముగా విష్ణువునకు సవితకు సమన్వయము కుదురుచున్నది. విష్ణువు కూడ "పృథివ్యా స్సప్తధామభిః" (ఋ. 1.22.16), అనగా బాహ్యముగా పృథివ్యాది సప్తలోకములను, పిండాండ పక్షమున ఆధారము నుండి సహస్రారము వఱకుగల సప్త చక్రములను వ్యాపించినట్లు తెలియుచున్నదిగదా।

పై విషయములచే సవితృ దేవునకు, విష్ణువునకు అభేదము స్పష్టమగుచున్నది.

"విష్ణు ర్యోనిం కల్పయతు, త్వష్టా రూపాణి పింశతు
ఆ సిం చతు ప్రజాపతి, ర్ధాతా గర్భం దధాతు తే." **10.185.1.**

భాష్యం : విష్ణు ర్వ్యాపకోదేవో యోనిం-గర్భాదాన స్థానం, కల్పయతు-కరోతు. త్వష్టా-తను కర్తా. ఏత త్సంజ్ఞకో దేవశ్చ రూపాణి-నిరూపకాణి స్త్రీత్వ పుంస్త్వాభి వ్యంజకాని చిహ్నాని, పింశతు-అవయవీ కరోతు..."

ఈ మంత్రమును గర్భాదాన సంస్కారమున చదువుదురు-"విష్ణువు నీ మర్మావయవమును (యోనిని) వీర్యధారణకు యోగ్యముగా చేయుగాక! త్వష్టృ దేవుడు మీ దంపతుల కర్మ ననుసరించి ఆ వీర్యమునకు స్త్రీ పురుషాది రూపము లను సృజించుగాక! ప్రజాపతి రేతస్సును అండమునందు చేరునట్లు చేయునుగాక. ధాత ఆ రేతస్సును పిండ రూపముగా పరిణమింప చేయుగాక।" అని మంత్ర భావము.

"ఆయో వివాయ స చ ధాయ దైవ్య ఇంద్రాయ విష్ణుః సుకృతే సుకృత్తరః
వేధా అజిన్వ త్రిషధస్థ ఆర్య మృతస్య భాగే యజమాన మా భజత్." **1.156.5.**

సుకృత్ = సృష్ట్యాదులైన మంచికర్మల నొనర్చువాడు.

అట్టివారిలో సుకృత్తరుడనగా గొప్ప సృష్టికర్త అని భావము.

విశ్వకర్మ సూక్తములో విశ్వకర్మకు 'సాధుకర్మ' అను పేరు వాడబడినది. 'సాధుకర్మ' అనగా యోగ్యమైన (మంచి) కర్మ ల నొనర్చువాడని భావము. కనుక విశ్వకర్మ పదముతో 'సుకృత్తర' పదము కూడ తుల్యమై, విష్ణు-విశ్వకర్మల అభేదమును తెలుపుచున్నది.

"స ప్రథమ స్సంకృతి ర్విశ్వకర్మా
స ప్రథమో మిత్రో, వరుణో z గ్నిః
స ప్రథమో బృహస్పతి శ్చి కిత్వాన్" (యజుర్బ్రాహ్మణ ప్రథమాష్టక ప్రపాఠకం)

సమీచీనమగు నిర్మాణము (సృష్ట్యాది కర్మము) కలవాడు 'సంకృతి' యనబడును. అనగా శిల్పాచార్యుడని భావము. అట్టి శిల్పాచార్యులలో మొదటివాడు 'విశ్వకర్మ' అనియు, తరువాతి ప్రథమ శిల్పాచార్యులు మిత్రుడు, వరుణుడు, అగ్ని, బృహస్పతి. 'సుకృత్' అను పదము కూడ సృష్ట్యాది మంచికర్మల నొనర్చు 'సృష్టికర్త' అని విశదమగుటచే విష్ణువును కూడ మహాశిల్పియని భావించవచ్చును.

ఈ మంత్రమున విష్ణువుతో కలిపి ఇంద్రునకు కూడ 'సుకృత్' అను పదము వాడబడుటచే ఇంద్ర-విష్ణు-విశ్వకర్మల అభేదము తెలియుచున్నది. ఈ మంత్రమున 'త్రిషధస్థ' అను పదము కూడ విష్ణువు కు వాడబడినది. "త్రిషధస్థ" కు త్రిసంఖ్యోపేత సహస్థానవాన్' అని సాయణుల భాష్యము. ఈ త్రిసంఖ్యను శ్వేతాశ్వతరోపనిషత్తు ఈక్రింది విధముగా వచించినది.

" స విశ్వరూప స్త్రి గుణ స్త్రి వర్త్మా ప్రాణాధిపః సంచరతి స్వకర్మ భిః" **5.7.**

భగవంతుడు విశ్వరూపుడును, మూడు గుణములు కలవాడును, మూడు మార్గములలో గొప్పవాడును, ప్రాణాది ఇంద్రియములకు అధిపతియు అయి, తన సృష్ట్యాది కర్మలచే ప్రకాశించుచున్నాడు.

'త్రిషధస్థ' అను పదమునందలి త్రిస్థానములు, బాహ్యముగ భూమి, అంతరిక్షము, స్వర్గముకాగా, అధ్యాత్మకముగ స్థూల – సూక్ష్మ కారణ దేహములనియు, ఆ దేహముల

సంస్కృత సాహిత్య చరిత్ర : పౌరాణిక మతంలో ఉన్నంత ప్రాముఖ్యం ఋగ్వేదములో విష్ణువుకు లేదు. వైదిక యుగం తర్వాత విష్ణువుకు ప్రాధాన్యం హెచ్చింది. వేదాలలో అనేక దేవతలు చేసే కార్యాలు వారి శక్తులు విష్ణువులో ఉన్నట్లుగా రూపకల్పన చేయబడింది. అనేక దేవతలు విష్ణువు యొక్క రూపాంతరాలుగా, అవతరాలుగా చేయబడినారు. సూర్యుడు విష్ణువు యొక్క రూపాంతరంగా ఆరాధింపబడినాడు. సూర్యనారాయణ దేవత ఈ రూపాంతర కల్పన యొక్క ఫలితంగా పుట్టిన దేవతయే. 'మిత్ర' శబ్దానికి సూర్యుడు అనే అర్థం ఉన్నది. మిత్రావరుణుల జంటయే పౌరాణికయుగంలో నర-నారాయణులుగా రూపొంది ఉంటారు. ఈ జంటయే సూర్యానారాయణునిగా అవతరించియుంటుంది. వరుణుడు సత్య-ఋతాలను కాపాడే దేవత. ఈ అభిప్రాయం నుంచే సత్యనారాయణుని రూపం వికసించింది. వరుణుడు ఊర్ధ్వలోకంలో సువర్ణ సౌధంలో కూర్చుంటాడని ఋగ్వేదంలో ఉన్నది. అదే వైకుంఠలోక కల్పనకు దారితీసింది. వరుణుడు సముద్ర మధ్యంలో పడవమీద అధిష్ఠించినట్లుగా వసిష్ఠునికి గోచరించాడు. అదే తర్వాత విష్ణువు సముద్రంలో పవ్వళిస్తూ సముద్రరాజు కూతురుని వివాహమాడిన విష్ణువు అయినాడు. వరుణుడు దయాళువు, పాపులను, వ్రతభంగం చేసినవారిని శిక్షించేవాడు. పశ్చాత్తాప తప్తులైనవారిని కరుణించేవాడు. ఈ లక్షణములన్నియు విష్ణువును ఆపాదింపబడినవి.

నధిష్ఠించిన జీవుడు విష్ణువనియు భావము. ఈ త్రిస్థాన స్థితుడగు విష్ణువు "త్రీణి పదావి చక్రమే" అన్నట్లు త్రిస్థాన వ్యాపి. విశ్వకర్మకు కూడ పరమ, మధ్యమావమ ధావములు మూడు కలవని' యాతే ధామాని పరమాణి' అను మంత్రము తెలియజేయు చున్నది కదా!

"ఇదం విష్ణు ర్వి చక్రమే
త్రేధా నిదధే పదమ్
సమూఢ మస్య పాంసురే." **ఋ. 1.22.17.**

విష్ణువు మూడు లోకములను మూడడుగులచే ఆక్రమించినాడని బాహ్యార్థము కాగా, నతడు జీవాత్మయై స్థూల-సూక్ష్మ- కారణ దేహముల నాక్రమించినాడని అంతరర్థము. కారణ దేహము అవిద్యా శరీరము. సూక్ష్మము సత్వ రజోగుణములతో నేర్పడిన జ్ఞాన కర్మేంద్రియ పంచప్రాణ స్వరూపమైనది. స్థూలము జగము నందే తిరుగుచు సుఖదుఃఖాది ద్వంద్వముల ననుభవించుచు కర్మలను చేయుచున్నది. కనుక దీనిని భోగముల కేర్పడిన శరీరమనియు, స్థూల జగమును భోగ్యమనియు అందురు. ఈ మంత్రము కూడ 'సమూఢ మస్య పాంసురే' అనగా పృథ్వీ మయ దేహమునందే భోగానుభవము అని తెలిపినది. కనుక ఈ స్థూలాది శరీరత్రయము నధిష్ఠించినవాడు భగవంతుడే కాని అన్యము కాదు. కనుక ఈ దేవుడు శరీరమున ప్రవేశించి జీవుడైనాడని భావము. ఈ విధముగా విష్ణువు త్రిశరీరముల నధిష్ఠించినాడని "త్రేధా నిదధే పదమ్" అను వాక్యము తెలుపుచుండగా, విశ్వకర్మ సూక్తము "స ఆశిషా ద్రవిణ మిచ్ఛమానః ప్రథమ చ్ఛదవరా ఆ వివేశ" అనగా విశ్వకర్మ-శరీరమున జీవుడై ప్రవేశించినాడని తెలిపినది. మరియు విశ్వకర్మ సూక్తము ఈ త్రిశరీరములను 'యాతే ధామాని పరమాణి, యావమా, యామధ్యమా విశ్వకర్మ న్నుతేమా' అని తెలిపినది. ఇచట పరమధామమనగా కారణదేహమనియు, మధ్యమ మనగా సూక్ష్మదేహమనియు, అవమ మనగా స్థూలదేహ మనియు భావించవలసి యున్నది.

పురాణములు :గంగా-సరస్వతీ, యమునలు విష్ణువు భార్యలని బ్రహ్మవైవర్త పురాణము, బ్రహ్మాండపురాణము తెలుపుచున్నవి.

సరస్వతి-బ్రహ్మమానస పుత్రిక, ముఖవాసిని. శివలింగము యొక్క ఆది అంత్యములు చూచుటకేగి, కార్యవిముఖులై తిరిగివచ్చిన విష్ణు-బ్రహ్మలలో, బ్రహ్మ శివలింగాంతము చూచివచ్చినానని అబద్ధమాడగా శివుడు బ్రహ్మముఖవాసిని అయిన సరస్వతిని 'నదిరూపుదాల్చుమ'ని శపించినట్లు బ్రహ్మాండపురాణము చెప్పుచున్నది.

సరస్వతి బ్రహ్మ పుత్రిక అనియు, బ్రహ్మకే భార్య అనియు అనేక పురాణములు తెలుపుచున్నవి. బ్రహ్మ పుత్రిక అయిన సరస్వతి - మహావిష్ణువుకు భార్య అని బ్రహ్మవైవర్త పురాణము తెలుపుచున్నది. బ్రహ్మ తన కమండలములోని ఉదకముతో విష్ణువు పాదమును కడుగగా, ఆపాదప్రక్షాళనముతో జారిన బ్రహ్మ కమండలములోని నీరు గంగగా విష్ణు పురాణములో అభివర్ణింపబడినది.

యమున (యమి) సూర్యా సంజ్ఞల పుత్రిక అని పురాణములలోనేగాక వేదములలోనూ వచింపబడినది. అయితే వేదవిజ్ఞాన అంతర్యాలను దృష్టిలో పెట్టుకొనిన, 'యమ' పరమైన మహాశక్తికి

ఈ విధముగా ఋగ్వేదము నందలి 1.22-16,17 మంత్రములు విష్ణువు త్రిలోకములనే కాక సప్తలోకములను కూడ మెట్టి (వ్యాపించి)నట్లు తెలుపుచున్నవి. ఇది ఆయన బ్రహ్మాండరూపము. ఇట్టి విష్ణువు ఆధారచక్రమున కుండలినీ రూప శేష సర్పముపై పవ్వళించి ఆ కుండలిని ద్వారా సహస్రారము వఱకు గల సప్త చక్రములను వ్యాపించుచున్నాడు. అనగా యోగసాధకులు కుండలిని మేల్కొలిపి స్వాధిష్ఠానాదుల భేదించుకొని సహస్రారమునకేగి అందు పరమాత్మతో ఐక్యమగుచున్నారు. కనుక విష్ణువు బ్రహ్మాండముననేగాక పిండాండమున జీవస్వరూపుడై తన సర్వాంతరత్వమును, సర్వాంతర్యామిత్వమును, సర్వవ్యాపకత్వమును తెలియజేయుచున్నాడు. పిండాండమున కుండలియే ఆదిశేష స్వరూప సర్పము. ఈ భావమే పురాణములలో విష్ణువు శేషశయనుడై పాల సముద్రమున పవ్వళించి యుండునని వర్ణితమైనది. ఇక్కడ పిండమే (శరీరమే) పాలసముద్రము.

"త్రీణి పదా విచక్రమే విష్ణుర్గోపా, అదాభ్యః అతో ధర్మాణి ధారయన్" **18.**

భూమి, అంతరిక్షము, ద్యులోకము అనెడి స్థావరములందు ధర్మ ధారణము కొఱకై మూడు పాదముల నుంచెను.

'యమున' కూడా బ్రహ్మ మానస పుత్రికగా భావించవచ్చునని పండితుల రచనలు తెలుపుచున్నవి. శుక్లయజుర్వేదము బ్రహ్మకూ యమునకూ పితృపుత్రికా స్థానపరమైన అవినాభావ సంబంధమున్నట్లు అనేక చోటుల వర్ణించినది. కనుక గంగ యమున సరస్వతులు ముప్వురు త్రివేణులై విష్ణువు భార్యలుగ మనకు పురాణములలో కన్పించుచున్నారు.

విష్ణు పాదోద్భవి అయిన గంగను మహేశ్వరుని భార్యగా పురాణములు వర్ణించుచున్నవి. పురాణము లందుగల ఇట్టి వేదవిరుద్ధ విషయములను పురాణములయందేగల అన్యోన్య వ్యతిరేక విషయములను పురాణ గ్రంధకర్తలెట్లు సమర్ధించగలరో?

వేదములలో జగత్సృష్టికర్తగా పేర్కొన బడిన విష్ణువు పురాణములలో భార్యాలంపటుడుగనే కాక అనసూయాది మహా పతివ్రతల చెంత వివిధ వేషములు ధరించిన విష్ణువు, జలంధరుని భార్యయగు బృందను, శంఖచుడుని భార్యయగు తులసీదేవిని చెరచిన విష్ణువు, నానాయుద్ధములందు విజేతయు, పరాజితుడునగు విష్ణువు ఒక్కరే అనుట ఏ విధముగ పొసగును?

ఇంద్రునికి వృత్రాసురునితో జరిగిన యుద్ధములో విష్ణువునకు ఇంద్రుని తోడ్పడినట్లు ఋగ్వేదమున (6.20.2) గలదు. అదే ఋగ్వేదమున వృత్రవధను ఇంద్రుని తల్లియైన అదితి, మహావిష్ణువు ఆక్షేపించగా, శుక్రాచార్యులు విష్ణువుతో, 'ఒకవేళ నీవు వృత్రహంతకుడైన ఇంద్రుని సంహరించిన నీవు కూడ చంపబడుదువు.' అని బెదిరించినట్లు ఋగ్వేదము (4.18.11)తో చెప్పబడి యున్నదని డా॥వడ్లమూడి గోపాలకృష్ణయ్యగారు ఋగ్వేద సంహిత తృతీయ సంపుటము పీఠికలో వ్రాసినారు. దీనిని బట్టి విష్ణువులు 'ఇరువురు' అని వ్యక్తమగుచున్నది.

"ఉతా మాతా మహిష మన్వ వేన దమీత్వా జహతి పుత్రదేవాః

అథాబ్రవీద్ వృత్ర మిన్ద్రో హనిష్య న్సఖే విష్ణో వితరం విక్రమ స్వ॥ ఋ. 4.18.11.

"విష్ణోః కర్మాణి పశ్యత యతో వ్రతాని పస్పసే ఇంద్రస్య యుజ్యః సఖా" 1.22.19.

ఎవ్వరికిని అణంప నలవికాని వాడును, సర్వజగత్తులకు రక్షకుడునగు విష్ణువు యొక్క విశ్వసృష్ట్యాది కర్మలను పరికింపుడు. ఇంద్ర సఖుడైన అతని దయవలననే సమస్త కార్యములు నెఱవేరుచున్నవి. 'విష్ణోకర్మాణి పశ్యత' అనుటచే విష్ణువు యొక్క కర్మలు లౌకిక-వైదిక కర్మలనియేగాక సృష్ట్యాది కర్మలనియు భావించవలయును. అట్లు భావించుటచే ఆ కర్మలు చేయు విష్ణువునకును, అవే కర్మలు చేయుచు శరీరమున ప్రవేశించిన (ప్రథమ చ్ఛదవరా ఆవివేశ) విశ్వకర్మకును అభేదము స్పష్టముగా గ్రహించ నగును.

ఈ మంత్రము నందలి : 'ఇంద్రస్య యుజ్యః సఖా' అనెడి వాక్యము ఇంద్ర-విష్ణువుల సఖ్యమును తెలుపుచున్నది. మోక్ష సూక్తము నందలి యొక ఋక్కు వీరిని జీవేశ్వర రూపులుగ నెట్లు వర్ణించుచున్నదో చూడుడు.

"ద్వా సుపర్ణా సయుజా సఖా యా సమానం వృక్షం పరిష స్వజాతే,
తయో రన్యః పిప్పలం స్వాద్వత్తి అనశ్నన్నన్యో అభిచాక శీతి." ఋ.1.164.20.

ఈ మంత్రము సంసార వృక్షముపై నున్న పక్షి ద్వయమునుగా జీవేశ్వరులను వర్ణించుచున్నది. సమాన యోగము, గమనము, మైత్రిగల రెండు పక్షులు ఒక చెట్టుపై నున్నవి. అందొకటి ఆ చెట్టు పండ్లను తినుచున్నది. మరియొకటి ఏమియు తినక సాక్షి మాత్రముగా వెలుగుచున్నది. అందు పండ్లను తిను పక్షియే జీవుడు. అతడు తన కర్మఫలములను అనుభవించుచుండగా, రెండవవాడైన ఈశ్వరుడు ఏమియు తినక సాక్షి మాత్రుడై, తినుచున్న పక్షిని పరికించుచున్నాడు. ఇంద్ర-విష్ణువులు ఈ మంత్రమున వర్ణింపబడిన జీవేశ్వరులకు ప్రతీకలే. "ఇంద్రస్య యుజ్యఃసఖా" అని విష్ణుమంత్రము (ఋ. 1.22.19) న నుండగా, ఈ మంత్రమున" సయుజా సఖాయా" అని యున్నది. 'సయుజా' అనినను, 'యుజ్యః' అనినను ఒకటే అర్థము. సఖా శబ్దము రెండు మంత్రములలోను ఉన్నది.

ఇంద్రుడు భువనాధిపతి అయినట్లు, జీవుడు శరీరేంద్రియ మనః ప్రాణాది యుక్త క్షేత్రమునకు అధిపతి. అట్టి జీవుని ఉద్ధరించువాడు విష్ణుస్వరూప ఈశ్వరుడని సమన్వయము. ఇంద్రునివలెనే జీవుడును భోగప్రియుడు కనుక ఇంద్రునితో జీవుని పోలిక సమంజసము. అలాగే జీవుని దరిచేర్చువాడు సహస్రారవాసియైన పరమేశ్వరుడే. కనుక వారిరువురి మైత్రిని వేదమంత్రములు పై విధముగా తెల్పినవి. "ఉరుక్రమస్య సహి బంధురిత్థా" అను ఋగ్వేద విష్ణుమంత్రము పరమేశ్వరాను గ్రహము పొందిన జీవుడు ఆ పరమేశ్వరునికి బంధువు, పుత్రుడు, సాక్షాత్తు అతడే కాగలడని అద్వైత స్థితిని బోధించినది కదా.

"నతే విష్ణో జాయమానో నజాతో దేవ మహిమ్నః పరమం త మాప
ఉదస్త భ్నానాక మృష్వం బృహన్తం దా ధర్థప్రాచీం కకుభం పృథివ్యాః" 7.99.2.

ఓ విష్ణుదేవా! నీ మహిమ యొక్క పారమును పుట్టినవాడు (భూతకాలము) కాని, పుట్టుచున్నవాడు కాని ఎఱుగడు. (అనగా ఆ మహిమకు అవసానము లేదనియు, అతడు వ్యాపించియున్నందున ఎవరును తెలిసికొనలేరనియు భావము). నీవు సర్వోన్నతమై సుందరమై యున్న నాకమును ధరించియుంటివి. భూమి యందలి పూర్వాది దిక్కులను ధరించియుంటివి.

యజుర్వేదము కాం.5. ప్ర.5 అ.5, "విశ్వకర్మా దిశాంపతి స్సనః" అనగా విశ్వకర్మ దిఙ్మయమగు ప్రపంచమున కధీశ్వరుడు అని తెలుపుచున్నది. కనుక ఇచట విష్ణువునకు విశ్వకర్మకు అభేదము.

"తద్విష్ణోః పరమం పదం సదా పశ్యన్తి సూరయః దివీవ చక్షురాతతమ్"
ఋ. 1.22.20.

విష్ణువు యొక్క ఆపరమ పదమును పండితులు-కన్ను అవరోధము లేని ఆకాశమును చూచినట్లు సర్వదా చూచి ధన్యులగుదురు. ఇచట పండితులనగా జ్ఞానులని భావము. జీవి ఏ పరమకారణము నుండి వచ్చెనో మఱల ఆపరమ కారణమును చేరినపుడు ఆ జీవి ప్రయాణము పూర్తి యగును. అదియే విష్ణుపదము అని వేద వచనము. దీనినే యజురారణ్యకము "తమేవం విద్యా నమృత ఇహ భవతి" అనియు, గీత "తమేవ చాద్యం పురుషం ప్రపద్యే" అనియు వచింపగా, విశ్వకర్మ సూక్తము "తం భువనా యంత్యన్యా" అనగా జీవుడు ఏ అద్య వస్తువు నుండి వచ్చెనో మఱల ఆ అద్యవస్తువులోనే లీనమగుట జీవిత గమ్యము అని వచించినది-అనగా ఆ జగత్కారణము ను భువనములు ప్రవేశించి ధన్యములగుచున్నవి భావము.

విశ్వకర్మ సూక్తము "పరోదివా పర ఏనా పృథివ్యా పరోదేవేభి రసురై ర్గుహాయత్" అని వచించినది. అనగా విశ్వకర్మ యొక్క పరతత్త్వము స్వర్గ-భూలోకముల కంటెను, దేవతల కంటెను, అసురుల కంటెను పరమైనది. అనగా అది గుణములకు పరమైన తత్త్వము. విష్ణువు సత్వ గుణప్రధానుడే గదా! కనుక విష్ణువు యొక్క పరమ పదము అనగా జన్మ హేతువు – విశ్వకర్మ యొక్క పరస్వరూపమని విదితమగుచున్నది.

"నారాయణ" అను పదము ఋగ్వేద మంత్రములలో నెచటను కన్పించదు. పురుష సూక్తమునకు ద్రష్ట 'నారాయణుడు' అను ఋషి. 'నారాయణ' పదము తైత్తిరీయారణ్యకము (10.10.1)లోనున్నది. నారాయణుని గూర్చి డా. సర్వేపల్లి రాధాకృష్ణన్

గారు భారతీయ తత్త్వశాస్త్రము ద్వితీయ భాగము 'పౌరాణిక తత్త్వశాస్త్రము' అను ప్రకరణమున నిట్లు వ్రాసిరి. "క్రమముగా వాసుదేవుడే విష్ణువు, నారాయణుడు అయినాడు. నారాయణ శబ్దము విష్ణు సంబంధముగాకున్నను, మొదటగ శతపథ బ్రాహ్మణమున (1.2.5.5) పేర్కొనబడినది. తైత్తిరీయారణ్యకమున 'నారాయణుడు' శాశ్వత పరమ దైవమై 'హరి' నామమును పొందినది (10.10.1). మహాభారతమున నారాయణుడు ఒక సనాతన మహర్షి."

ఋగ్వేదమున కన్పించని వాసుదేవ, నారాయణులు తైత్తిరీయారణ్యకము నాటికి విష్ణువుతో సమాన స్థితిని పొంది, విష్ణు నామములలో కలిసిపోయిరి. ఇందుకు మంత్రపుష్పములోని "నారాయణాయ విద్మహే, వాసుదేవాయ ధీమహి, తన్నో విష్ణుః ప్రచోదయాత్" అను మంత్రమే నిదర్శనము. ఈ మంత్రములోని 'ప్రచోదయాత్' అను పదము గాయత్రీ మంత్రములోనిదే.

నారాయణుడు : నార+అయన = నారాయణ=జలములు నివాసముగ కలవాడు. యజుర్వేద విశ్వకర్మ సూక్తము ఈక్రింది విధముగా వచించినది.

"సముద్రాయ వయునాయ సింధూనాం పతయే నమః
నదీ నాగ్ం సర్వాసాం పిత్రే జుహుతా విశ్వకర్మణే విశ్వాహా మర్త్యగ్ం హవిః."

సముద్ర స్వరూపుడును-ప్రకాశకుడును-ప్రవహించెడి నదులకు నాయకుడును-సమస్త నదులకు తండ్రియు నగు విశ్వకర్మకు నమస్కారము. ఆ విశ్వకర్మకు అన్ని వేళల యందు ఆజ్యాది హవిస్సులను సమర్పించి పూజింపుడు.

దీనిని బట్టి పరమాత్మ స్వరూపము ఎక్కువగా జలముల నాశ్రయించియే యున్నదని తెలియుచున్నది. యజుర్వేదము కూడ జలములకు-సృష్టికి, విశ్వకర్మకు గల సంబంధమును తెలిపినది. అందువలననే పురాణములు విష్ణువును నారాయణుడు, జలధియే నివాసముగా కలవాడు అని వచించినవి.

వేదముల యందు విశ్వకర్మ నిర్వహించిన కార్యములు పురాణములయందు విష్ణువునకు ఆపాదించబడుచు నెట్లు మార్పు చెందినవో ఈక్రింది విషయముచే గమనించ నగును.

"ఆపో వా ఇద మగ్రే సలీల మాసీ త్తస్మిన్ ప్రజాపతి ర్వాయు ర్భూత్వా చర్తత్స ఇమా మపశ్య, త్తాం వరాహో భూత్వాహర, త్తాం విశ్వకర్మా భూత్వా వ్యమార్ఢ్, సా ప్రథత, సా పృథివ్య భవత్. తత్పృథివ్యై పృథివీత్వం, తస్యాం విశ్రామ్య త్ప్రజాతి స్సదేవా న సృజత - వసూన్, రుద్రా, నాదిత్యాన్." యజు కాం. 7. ప్రప. 1 అనువాకము-5.

అర్థము : కంటికి కన్పించు ఈ జగమంతయు మొదట (సృష్టికి పూర్వము) కేవలము జలరూపముగా నుండెను. అట్టి నీటియందు నివసింప వీలులేనందున, ప్రజాపతి వాయురూపుడై ఆనీటియందు ప్రవేశించి అంతటను తిరుగాడెను. ఆయనకు నీటిలో భూమి కన్పించెను. ప్రజాపతి వరాహరూపమును ధరించి ఆ భూమిని నీటి పైకి తీసికొనివచ్చెను. పిమ్మట ప్రజాపతి ఆవరాహ రూపమును వీడి, విశ్వకర్మ రూపమును తాల్చి భూమిమీద నున్న జలములనెల్ల తుడిచివేసి దానిని విస్తరింప చేసెను. అనగా భూసృష్టి జరిగినది. అపుడు భూమి సర్వ ఓషధులకు, ప్రాణులకు నివాసమైన పృథివిగా విరివి చెందినది. ఇట్లు ప్రథనము (విస్తృతి) చెందినది కనుక దానికి 'పృథివి' అను పేరు కల్గినది. అప్పుడు విశ్వకర్మ ప్రజాపతి ఆ భూమిపై విశ్రమించి వసువులు, రుద్రులు, ఆదిత్యులు అనెడి దేవగణములను సృష్టించెను.


అథర్వవేదము :

"యా మన్వైచ్ఛ ద్ధవిషా విశ్వకర్మా అన్త ర్ణవే రజసి ప్రవిష్టామ్
భుజష్యం పాత్రం నిహితం గుహా యదా విర్భోగే అభవన్మాతృ మద్భ్యః" 12.1.60.

నీటియందు మునిగిపోయిన యే భూమిని విశ్వకర్మ అందు మునిగి, వెదికి, పైకి తీసికొనివచ్చి జీవ భోగ్యముగా చేసెనో, ఆ భూమి మమ్ము రక్షించును గాక! అనగా మాకు భోగ్యమగు గాక అని భావము.

ఈ విధముగా విశ్వకర్మ జలమగ్నమైన భూమిని నీటి నుండి ఉద్ధరించినాడని యజుర్వేదము, అథర్వవేదము తెలుపుచుండగా, మన పురాణములు విష్ణువు వరహావతార మెత్తి నీటి నుండి భూమిని పైకి తీసికొని వచ్చినాడని వ్రాయుట ఎంత వేద విరుద్ధమో గమనింపుడు.

ఇట్టి వేద విరుద్ధ విషయములు పురాణముల యందెన్ని యోగాంచనగును.



7. సవిత - రుద్రుడు - విశ్వకర్మ

తైత్తిరీయ సంహిత (1.51.1): "సో Z రోదీ ద్య దరోతీత్, తద్రుద్రస్య రుద్రత్వం" అనగా 'రోదనము చేసెను కనుక రుద్రునికి రుద్రత్వం'

యాస్కుడు : "రౌతీతి సతః" (రు =అరుచు)
"రోదయ తేర్వా' -ఏడిపించు

సాయణుడు, "రుద్ దుఃఖం ద్రావయతీతి రుద్రః" దుఃఖము అనగా సంసారమను దుఃఖము, భక్తుల దుఃఖము, అవిద్య అను దుఃఖము అని పలువిధములుగా భావించవచ్చును.

శ్వేతాశ్వతరోపనిషత్తు "ద్రావయతి – దృణాతి" –పోగొట్టును.

శతపథ బ్రాహ్మణము : " కతమే రుద్రా ఇతి?దశేమే పురుషే ప్రాణాః, ఆత్మై కా దశ, స్తే యదా స్మాన్మర్త్యా చ్ఛరీరా దుత్క్రా మన్త్య థరోదయన్తి, తద్య ద్రోద యన్తి, తస్మా ద్రుద్రా" ఇతి–అష్టాధ్యాయీ కాండము, షష్ఠాధ్యాయము, తృతీయ బ్రాహ్మణము–6.

జీవులయందలి దశప్రాణములు (దశేంద్రియములు), ఆత్మ కలిసి ఏకాదశ రుద్రులగుచున్నారు. ఈ ప్రాణాత్మలు శరీరము నుండి వెడలిపోయి బంధువుల నేడ్పింతురు కనుక వీరిని రుద్రులని పిలుచుచున్నారు. "రోదయన్తీతి రుద్రాః"

ఋగ్వేదములో రుద్రుడు మూడు సూక్తములలో పూర్తిగను, రెండు సూక్తములలో కొన్ని మంత్రములలోను స్తుతించబడినాడు. తైత్తిరీయ సంహిత (కృష్ణ యజుర్వేదము) చతుర్థ కాండము 5వ ప్రపాఠకమున 11 అను వాకముల లోను, అధర్వవేదము 11వ కాండము నందలి మొదటి అను వాకములోను 'రుద్రస్తుతి' యున్నది.

ఋగ్వేదము సవితృ దేవుని "భువనస్య ప్రజాపతి" (4.53.2) అనియు, రుద్రుని "భువనస్య పితరం" (6.49.10) అనియు వచించినది.

సవితను స్వర్ణమయమైన దీప్తి కలవాడు, (హిరణ్మయీ మమతి" (ఋ 3.38. 8,7.38.1) అనియు, రుద్రుని సూర్యునివలె తేజస్సు గలవాడు, బంగారము వలె ప్రకాశించువాడు. "యః శుక్ర ఇవ సూర్యో హిరణ్య మివరోచతే" (ఋ 1.43.5) అనియు తెలిపినది. మరియు సవిత సూర్యరశ్ములతో కలిసిపోవును (ఋ 5.81.4) అనియు, వాటితో ప్రకాశించును (10.139.1) అనియు తెలిపినది.

సవితను కోరదగిన వస్తువులన్నిటికి ఈశ్వరుడు "ఈశానం వార్యాణాం" (ఋ 1.24.3) అని వచించుచు, రుద్రుని కోరికలు తీర్చువాడు "మీ ఢ్వస్" (ఋ. 1.114.13) అని తెలిపినది. సవితను–విశ్వరూపుడు అనియు, కవి యనియు "విశ్వరూపాణి

ప్రతిముంచతే కవిః" (5.81.2) అని వచించుచు, రుద్రుని పురురూపుడు (బహురూపుడు) (ఋ. 2.33.9), కవి (ఋ. 1.114.4) అని తెలిపినది.

ఈ విధముగ ఋగ్వేదము సవితకు రుద్రునకు అనేక అభేదములు తెలిపినది.

శ్వేతాశ్వతరోపనిషత్తు :

"యదా తమస్తన్న దివా న రాత్రి ర్నసన్న చా సచ్ఛివ ఏవ కేవలః,
తదక్షరం తత్స వితుర్వరేణ్యం ప్రజ్ఞా చ తస్మాత్ ప్రసృతా పురాణీ." 4.18.

రేలు పవళ్ళుకాని, చీకటి వెలుగులుకాని, సదసత్తులుకాని-ఏ ద్వంద్వములు లేనప్పుడు పారమార్థికముగ ఒక్క శివతత్త్వమే వెలుగుచున్నది. అదే అక్షరము (నశింపనిది), సవితృ శబ్దముచే పేర్కొనదగినది. దాని నుండియే ప్రాచీనమైన ప్రజ్ఞ అనగా మాయ ప్రసరించినది.

ఈ ప్రజ్ఞను నాసదీయ సూక్తము 'తమస్సు' అనియు, విశ్వకర్మ సూక్తము 'నీహారము' అనియు వచించినవి. మొదటి జగత్కారణ తత్త్వమును విశ్వకర్మ సూక్తము 'విశ్వకర్మ' పదముచే పేర్కొనగా, శ్వేతాశ్వ తరోపనిషత్తు నందలిపై మంత్రము 'శివ' శబ్దముచే పేర్కొనినది.

ఈ మంత్రమున 'శివ–సవిత' పదములు ప్రయోగించబడుటచే శివ, సవితృల అభేదము స్పష్టమగుచున్నది. గాయత్రి మంత్రములోని 'త త్సవితుర్వ రేణ్యం' ఈ మంత్రమున ప్రయోగించబడుటయు గమనించదగియున్నది.

"నైన మూర్ధ్వం నతిర్యఞ్చం, నమధ్యే పరిచక్రభద్,
న తస్య ప్రతిమా అస్తి, యస్య నామ మహద్యశః." 4.19.

ఈ శివతత్త్వము ఊర్ధ్వముగ గాని, అడ్డముగాగాని, మధ్యనేగాని కలదని భావించ రాదు. అనగా 'అంతర్బహిశ్చ త త్సర్వం" అన్నట్లు లోపల వెలుపల అంతటను వ్యాపించి, అన్నియు అయి యున్నది. దానితో పోల్చదగిన దేదియులేదు. దాని కదియే సాటి.

"న సంధృశే తిష్ఠతి రూపమస్య, న చక్షుషా పశ్యతి కశ్చనైనమ్,
హృదా హృదిస్థం మనసాయ ఏన, మేవం విదుర మృతాస్తే భవన్తి" 4.20.

దాని నామము, యశస్సు మిక్కిలి గొప్పది. దాని రూపము కంటికి కన్పించదు. ఎవరు దానిని కంటితో చూడలేదు. ఏ ఇంద్రియముతోను చూడలేరు. అనగా అది మనో వాగింద్రియముల కందనిదియు, వాటిని సృష్టించి ప్రేరేపించునదియు అని భావము.

"అస్మాన్మాయీ సృజతే విశ్వమేత, మస్మిం శ్చాన్యో మాయయా సన్నిరుద్ధః." 4.9.

సృష్టికర్త 'మాయ' అయి, సృజించగా, అతని ప్రతిబింబము జీవుడై ఆ మాయా మయ జగమున బంధింప బడుచున్నాడు.

**"సూక్ష్మాతి సూక్ష్మం కలిలస్య మధ్యే విశ్వస్య స్రష్టార మనేక రూపం
విశ్వ స్యైకం పరివేష్టి తారం జ్ఞాత్వా శివం శాంతి మత్యం తమేతి"** 4.14.

పరమేశ్వరుడు పరమాణువుల కంటె మిక్కిలి సూక్ష్ముడు. ఈ సమస్త విశ్వమును సృష్టించుచు, ఈ విశ్వమునకు లోపల వెలుపల అంతటను వ్యాపించియుండును. అయినను అతడు నిర్లిప్తుడు. అట్టి పరమేశ్వరుని తెలిసికొనిన వాడే అనంతశాంతిని పొందును.

ఈశ్వేతాశ్వతరోపనిషత్తే "ఏషదేవో విశ్వకర్మా మహాత్మా, సదా జనానాం హృదయే సన్ని విష్టః" (4.17) అనగా విశ్వకర్మ జనుల హృదయములో ప్రవేశించినాడని తెలిపి శివ – విశ్వకర్మల అభేదమును చాటినది. తైత్తిరీయ బ్రాహ్మణము 'ప్రజాపతి అయిన సవిత జీవులను సృష్టించినాడు" (1.6.4.1) అని వచించి శివ–విశ్వకర్మలతో సవితకు అభేదమును తెలిపినది. విశ్వకర్మ సూక్తము కూడ 'స ఆశిషా ద్రవిణ మిచ్ఛమానః పరమచ్ఛదోవర ఆవివేశ' అని వచించినది. అనగా విశ్వకర్మ జగత్తుల భోగమును కోరినవాడై వారి శరీరములలో ప్రవేశించినాడని భావము.

**"యో దేవానాం ప్రభవ శ్చో ద్భవశ్చ విశ్వాధిపో రుద్రో మహర్షిః,
హిరణ్య గర్భం జన యా మాసపూర్వం స నో బుద్ధ్యా శుభయా సంయునక్తు."** 3.4.

సర్వదేవతలకు జనన కారణమైనవాడును, (సవిత జీవులను సృజించినాడని తైత్తిరీయ బ్రాహ్మణము 1.6.4.1), విశ్వమునకు ప్రభువును (సవిత చరాచరములన్నిటికిని ప్రభువు ఋ 4.53.6), మహర్షియునగు రుద్రుడు "(య ఇమా విశ్వా భువనాని జుహ దృషిర్హోతా నిషసాద పితానః" అని విశ్వకర్మ సూక్తము అనగా 'ఏ విశ్వకర్మ ఈ సమస్త భువనములను ప్రళయకాలమున తన యందు ఆహుతి వలెవేసికొని ఋషియు, హోతయు, మనకు జనకుడు అయి యుండెనో అని అర్థము) మొదట హిరణ్య గర్భుని (బ్రహ్మను) సృష్టించెను. ("విశ్వకర్మా హ్యా జనిష్ఠ దేవ ఆది" అని విశ్వకర్మ సూక్తము అనగా విశ్వకర్మ మొదట బ్రహ్మ అయినాడు అని అర్థము) అట్టి రుద్రుడు మాకు మంగళకరమైన బుద్ధిని ఒసంగుగాక। (గాయత్రీ మంత్రమున సవిత 'ధియో యోనఃప్రచోదయాత్' అనగా మన యొక్క బుద్ధులను ప్రేరేపించు దేవుడుగ స్తుతించబడినాడు).

పై విషయములన్నిటి వలన సవిత – రుద్రుడు – విశ్వకర్మ ఒక్కరే అని తెలియు చున్నది.

"ఏకో హి రుద్రో న ద్వితీయా య తస్థు
ర్య ఇమాన్ లోకానీశత ఈశనీ భిః,
ప్రత్యఙ్ జనాం స్తిష్ఠతి సంచు కోపాన్త కాలే
సంసృజ్య విశ్వా భువనాని గోపాః." **3.2.**

ఏ రుద్రుడు ఒక్కడే తన నియామక శక్తి చేత జగత్తులను నియమించుచున్నాడో, అట్టి రుద్రుడు స్వతస్సిద్ధుడై యున్నాడు.

విష్ణువు ఒక్కడే భూమ్యాకాశములను భువనములనన్నిటినీ ధరించినాడని "పృథివీ ముతద్యా మేకో దాధార భువనాని విశ్వా" (ఋ 1.154.4) అను వాక్యము సవిత భువనము నంతటిని ధరించెను. (ఋ4.54.4), స్వర్గమును ధరించెను. (దివోధర్తా, ఋ.4.53.2) అను వాక్యములతోను, విశ్వకర్మ ఒక్కడే ఈద్యావా పృథువులను సృష్టించినాదు (ద్యావా భూమీ జనయన్ దేవ ఏకః – విశ్వకర్మ సూక్తము) అను వాక్యములతోను తుల్యమై రుద్ర–విష్ణు సవిత–విశ్వకర్మల అభేదమును తెలుపుచున్నది.

పై మంత్రమునకు 'పండిత గోపదేవ్' గారి వ్యాఖ్యానము.

"యః=ఎవడు, జనాన్=జనులను, సంసృజ్య=బాగుగ సృష్టించి, ప్రత్యఙ్ తిష్ఠతి =వారి అంతఃకరణమున వ్యాపకుడై యుండునో, విశ్వాభువనములు=సమస్త లోకములు, గోపాః= రక్షించుచున్నాడో, అన్తకాలే=ప్రళయకాలమున, సంచుకోప=కుపితుడై సర్వమును నశింపజేయు చున్నాడో, ఇమాన్ లోకాన్=ఈ లోకముల నన్నింటిని, ఈశనీభిః=శాసించు శక్తులతో, ఈశత=వశమున నుంచుకొనుచున్నాడో, అతడు, ఏకఃహి=ఒక్కడే రుద్రః= రుద్రుడు–ఏడ్పించువాడు, సర్గ స్థితి లయకాలములందతడే ప్రాణులనేడ్పించును. కావున అతడే రుద్రుడనబడును. కావున పూర్వులు, ద్వితీయాయ న తస్థుః=మఱియొకనిని ఉపాసింపరైరి.

పరమేశ్వరుడొక్కడే ఈ బ్రహ్మాండమును సృష్టించి పోషించి, లయము చేయగల శక్తులతు కలిగియున్నాడు. పురాణములందు వర్ణింప బడునట్లు సృష్టి స్థితి లయముల నొనర్చుటకు బ్రహ్మ విష్ణు మహేశ్వరులు. అను దేవతలు భిన్నులుగా నున్నట్లు విశ్వసించుట వేదశాస్త్రము లకు విరుద్ధమగును."

ఈ మంత్రము "య ఇమా విశ్వా భువనాని... ఆ వివేశ" అను విశ్వకర్మ సూక్త మంత్రమును పోలియున్నది.

"మాయాం తుప్రకృతిం విద్యాన్మాయినం తు మహేశ్వరమ్
తస్యావయవ భూతైస్తు వ్యాప్తం సర్వమిదం జగత్." **4.10.**

ప్రకృతిని 'మాయ' అనియు, మహేశ్వరుని 'మాయ'కు అధిపతి అనియు తెలిసికొన వలయును. ఆ మహేశ్వరుని యొక్క ప్రకృతి సంయుక్తములగు అవయవములతో ఈ జగత్తు అంతయు వ్యాపింపబడియున్నది.

"యో యోనిం యోని మధితిష్ఠ త్యేకో యస్మిన్నిదం సంతి విచైతి సర్వం
త. మీశానం వరదం దేవ మీడ్యం నిచా య్యేమాం శాంతి మత్యంత మేతి." **4.11**

ఏ పరమేశ్వరుడు ప్రతి పదార్థమునకు ఉపాదాన కారణమైన ప్రకృతికి ఆధారమై యున్నాడో, ఏ దేవునియందు ఈ ప్రపంచమంతయు లీనమగునో, వివిధ రూపములను ధరించునో, మోక్షము నొసగువాడును, స్తుతి చేయదగినవాడును అగు ఆ ఈశ్వరుని తెలిసికొనిన వాడు శాశ్వత శాంతిని పొందును.

"యో దేవానా మధిపో యస్మిం ల్లోకా అధిశ్రితాః
య ఈశే అస్య ద్విపద శ్చతుష్పదః కస్మై దేవాయ హవిషా విధేమ." **4.13.**

ఏ పరమేశ్వరుడు దేవతలకు అధిపతియో, ఎవనియందు లోకములన్నియు ఆశ్రయించియున్నవో, ఎవడు ద్విపద–చతుష్పద జీవముల కధిపతియో, సుఖస్వరూపుడగు ఆ ఈశ్వరుని స్తుతి ప్రార్థనాది హవ్య సాధనములతో సేవింతును.

"విశ్వతశ్చక్షు రుత విశ్వతో ముఖో విశ్వతో బాహు రుత విశ్వత స్పాత్
సంబాహుభ్యాం ధమతి సంపతత్రైర్ద్యావా పృథివీ జనయన్ దేవఏకః." **3.3.**

అంతటను కన్నులు, ముఖములు, బాహువులు, పాదములు కల ఒకే దేవుడు ద్యావా పృథువుల నుత్పన్నము చేయుచు ధర్మాధర్మములనెడి బాహువులతో ప్రాణులను జోడించును. పంచభూతములతో సమస్త ప్రాణులను జోడించును. అనగా పరమేశ్వరుడు జీవులొనర్చు శుభాశుభకర్మలకు తగినట్లు ప్రాణులను సృష్టించి, పోషించి లయము చేయు చున్నాడని భావము. ఈ మంత్రము విశ్వకర్మ సూక్తము లోనిదే.

"సర్వానన శిరోగ్రీవః సర్వభూత గుహాశయః
సర్వవ్యాపీ స భగవాన్ తస్మాత్ సర్వగతః శివః". **3.11.**

భగవంతుడగు శివుడు సర్వప్రాణుల ముఖములందును, శిరస్సు లందును, కంఠములందును సమస్తమున వ్యాపించియున్నాడు. సర్వప్రాణుల హృదయమునందు

ఉన్నాడు. అందువలన అతడు సర్వవ్యాపి. సర్వగతుడు. ఈ శ్వేతాశ్వతరోపనిషత్తే "ఏష దేవో విశ్వకర్మా మహాత్మా సదా జనానాం హృదయే సన్నివిష్టః" అని వచించి రుద్ర-విశ్వకర్మల అభేదమును తెలిపినది.

"క్షరం ప్రధాన మమృతాక్షరం హరః క్షరాత్మానా వీశతే దేవ ఏకః
తస్యా భి ధ్యానా ద్యోజనా త్తత్వ భావాత్ భూయశ్చాన్తే విశ్వమాయా నివృత్తిః".
1.10.

ప్రధానమైన ప్రకృతి నశించునదే. (అనగా బ్రహ్మమున కలిసిపోవునది). అమృతము అక్షరమైన దొక్క హరతత్వమే. "హరతీతిహరః" హరించువాడు హరుడు. ఈ క్షరాక్షరములను శాసించు నొక దేవుడున్నాడు. అతనిని ధ్యానించుట (మననము చేయుట) వలన, అతనిలో లీనమగుట వలన విశ్వమాయ నివర్తించి అమృతత్వము కలుగును.

ఋగ్వేదములో రుద్రుడు మూడు పూర్తి సూక్తములలోను, రెండు సూక్తభాగముల లోను స్తుతించబడినాడు.

"కద్రుద్రాయ ప్రచేతసే మీఢుష్ట మాయ తవ్యసే వోచేమ శన్తమం హృదే" ఋ1.43.1

ప్రచేతసే=ప్రకృష్టమగు జ్ఞానముతో కూడినవాడును, మీఢుష్ట మాయ=కోరిన కోర్కెలను వర్షించు వాడును, తవ్యసే=ఎక్కువగా వృద్ధినొందినవాడును, హృదే=హృదయములందధి ష్ఠించినవాడును, నగు, రుద్రాయ=రుద్రుడను పేరుగల దేవుని కొఱకు, శన్తమం=ఎక్కువ సుఖకరమగు స్తోత్రమును, కత్ః=కదా - ఎప్పుడు, వోచేమ=పఠింతుము।

"యథా నో అదితిః కరత్ పశ్వే నృభ్యో యథాగవే యథా తోకాయ రుద్రియమ్." 2.

అదితిః=భూమి, నః=మాకు, రుద్రియం= రుద్ర సంబంధమగు భేషజమును, యథా=ఎట్లు సిద్ధించునో అట్లు, కరత్=చేయుగాక। పశ్వే=అశ్వ గో మహిషాదులగు పశువులకు, నృభ్యః=మా మనుష్యులకు, గవే=విశేషించి గోవులకు, తోకాయ= సంతానము నకు, ఎట్లు రుద్ర సంబంధమగు ఔషధము సిద్ధించునో, అట్లు చేయుగాక। (మూల మంత్రములో భేషజ పదము లేకున్ననను తైత్తిరీయ సంహిత లోని మంత్రములను ఆధారము చేసికొని భాష్యకర్త 'భేషజ' పదమును చేర్చినాడు. ఆ మంత్రము "యాతే రుద్ర శివా తనూః శివా విశ్వా హ భేషజీ శివా రుద్రస్య భేషజీ" తై.సం.4.5.10.1)

"యథా నో మిత్రో వరుణో యథా రుద్రశ్చి కే తతి యథా విశ్వే సజోష సః." 3.

మిత్రుడు, వరుణుడు ఎట్లు మమ్ము అనుగ్రహింపదగిన వారని యెంతురో, రుద్రుడెట్లు అనుగ్రాహ్యులని యెంచునో, సమస్త దేవతలు ఎట్లు దయజూడనెంతురో-అట్లు అగుగాక।

"గాథ పతిం మేథపతిం రుద్రం జలాష భేషజం, త చ్ఛంయోః సుమ్న మీమహే." 4.

స్తుతి పాలకుడును, యజ్ఞపాలకుడును, సుఖరూపమగు ఔషధము కలవాడును అగురుద్రుని (నుండి) బృహస్పతి పుత్రుడగు శంయునికి సంబంధించిన అప్రసిద్ధమగు సుఖమును మేము కోరుచున్నాము. ఈమంత్రమున గల 'జలాష భేషజ'మను పదము రుద్రునకు విశేషణము. అందువలననే జనులు రుద్రునకు అభిషేకము చేయుట.

"య శ్శుక్ర ఇవ సూర్యో హిరణ్య మివ రోచతే శ్రేష్ఠో దేవానాం వసుః." 5.

ఏ రుద్రుడు సూర్యునివలె దీప్తిశాలియు, బంగారము వలె సర్వులకు ప్రీతి పాత్రుడును, దేవత లందటిలో శ్రేష్ఠుడును అయి ఇష్టుడగుచున్నాడో, అందఱను నివాస యోగ్యులను చేయు ఆ రుద్రుడు-తరువాతి మంత్రముతో అన్వయము

"శం నః కర త్యర్వతే, సుగం మేషాయ మేష్యే నృభ్యో నారిభ్యో గవే." 6.

మా గుఱ్ఱములకు, మేషీమేషములకు, నారీనరులకు, గోవులకు చక్కగా పొందదగిన సుఖమును కలిగించుచున్నాడు. ఈ మంత్రమున గల "శం నః కరతి" పదమే తరువాతి వాఙ్మయమున 'శంకరుడు'గా అయినది.

"భువనస్య పితరం గీర్భి రా భీ రుద్రం దివా వర్ధయా రుద్ర మక్తౌ,
బృహన్త మృష్వ మజరం సుషుమ్న మృధ గ్ఘువేమ కవినేషి తాసః." 6.49.10

భువన పితయైన రుద్రుని దివారాత్రుల యందు స్తోత్రముల చేత స్తుతించుదము. బృహత్స్వ రూపుడును (మహతో మహీయాన్), కవియు, జరామరణ రహితుడును, దర్శనీయుడును, సుఖ యుక్తుడును అగు రుద్రుని ఎక్కువగా స్తుతింతుముగాక!

ఈవిధముగ రుద్రుని "భువనస్య పితరం" అని వచించిన ఋగ్వేదమే – విశ్వకర్మను "యోనః పితా జనితా యో విధాతా ధామాని వేద భువనాని విశ్వా (10.82.3)" అని వచించి, రుద్ర–విశ్వకర్మల అభేదమును తెలిపినది.

శివుని ముఖములను తైత్తిరీయారణ్యక చతుర్థ ప్రశ్నము ఈక్రింది విధముగ తెలుపుచున్నది.

1. సద్యోజాతం ప్రపద్యామి, సద్యో జాతాయ వై నమః.
భవే భవే నాతి భవే భజస్వ మాం భవోద్భవాయ నమః.

2. వామదేవాయ నమో, జ్యేష్ఠాయ నమో, రుద్రాయ నమః.
కాలాయ నమః కలవికరణాయ నమో, బల వికరణాయ నమో,
బల ప్రమథాయ నమః సర్వభూతదమ నాయనమో, మనోన్మనాయ నమః.

3. అఘోరేభ్యో Z థఘోరే భ్యో ఘోరఘోర తరేభ్యః.
సర్వేభ్య స్సర్వ సర్వేభ్యో నమస్తే Zస్తు రుద్ర రూపేభ్యః.

4. తత్పురుషాయ విద్మహే, మహాదేవాయ ధీమహి, తన్నో రుద్రః ప్రచోదయాత్.

5. ఈశాన స్సర్వ విద్యానా మీశ్వర స్సర్వ భూతానాం,
బ్రహ్మాధిపతి ర్బ్రహ్మణో Z ధిపతిర్ బ్రహ్మ శివోమే అస్తు సదాశివోమ్.

వసిష్ఠ పురాణము విశ్వకర్మ యొక్క పంచముఖములను, ఆముఖ సంభూతుల నిట్లు తెలిపినది.

"సద్యో జాత ముఖే జాత, స్సానగో విశ్వకర్మణః,
వామదేవ ముఖే జాతో, బ్రహ్మర్షి స్తు సనాతనః,
అఘోర ముఖ సంజాతో Z హభూనో విశ్వకర్మణః,
తత్పురుష ముఖే జాతః, ప్రత్నో Z సౌ విశ్వకర్మణః,
తస్యేశాన ముఖే జాత, స్సుపర్ణో విశ్వకర్మణః.

ఈవిధముగ రుద్ర-విశ్వకర్మల ముఖములు సమానములై యుండుట వారి యేకత్వమును స్పష్టీకరించుచున్నవి.

తైత్తిరీయ సంహిత (కృష్ణయజుర్వేదము) చతుర్థ కాండములోని 5వ ప్రపాఠకమును నమకమనియు, శతరుద్రీయ మనియు నందురు. ఇందు ప్రతి నామము చివర 'నమః' అని యుండుటచే నమకమనియు, రుద్రుడు అనేక నామములతో సర్వదేవాత్మకుడుగ, సర్వజ్ఞుడుగ, మహాదేవుడుగ వర్ణింపబడుటచే 'శతరుద్రీయము' అనియు

నందురు. ఇందు 11 అను వాకములలో రుద్రుడు స్తుతించబడినాడు. శతరుద్రీయము నందలి రుద్రుని గురించిన కొన్ని మంత్రములు, పదములు ఈక్రింద వివరింపబడినవి.

"యాతే రుద్ర శివా తనూ, రఘోరా పాపకాశినీ,
తయా న స్తనువా శంతమయా గిరిశం తాభిచాక శీహి." **1.3.**

ఓ రుద్రా! నీ యొక్క ఘోరము కానిదియు పాపములేనిదియు అయిన శివంకర మయిన (శివము=అనుగ్రహించునది) తనువు చేత మమ్ము సుఖింపజేయుము.

అగ్ని స్వరూపుడైన రుద్రునికి ఘోరము, శివము అను రెండు శరీరములు కలవు. ఘోరము హింసించునది. శివము అనుగ్రహించునది.

ఈ మంత్రమున రుద్రుడు 'గిరిశంత' అని సంబోధించబడినాడు. అనగా కైలాసగిరి యందుండి సుఖము నిచ్చువాడని బాహ్యార్థము కాగా, సహస్రార మందుండు పరబ్రహ్మమని అంతరర్థము.

"అసౌ యస్తామ్రో అరుణ, ఉతబభ్రు, స్సుమంగళః,
యే చే మాగ్ం రుద్రా అభితో దిక్షు శ్రితా
స్సహస్రశో హైషాన్ హేడ ఈమహే." **1.7.**

రుద్రుడు సూర్యస్వరూపుడై ఉదయమున తామ్రుడు (ఎర్రనివాడు) గను, పిమ్మట అరుణవర్ణము కలవాడుగను, అనంతరము పింగళ వర్ణము కలవాడుగను, ఆయా వేళల యందు మంగళకరములయిన సప్త వర్ణములు కలవాడుగను అయి లోకములను అను గ్రహించి వాటిచే పనులు చేయించుచున్నాడు. అట్టి సూర్యుని యొక్క రుద్రరూప కిరణములు వేలసంఖ్య గలవై దశ దిక్కులయందు వ్యాపించిన చీకట్లను పారద్రోలుచున్నవి. అట్టి ఆదిత్య, తత్కిరణరూప రుద్రుల క్రోధమును స్తుతించుచున్నాము. ఇచట సూర్యుడు బాహ్యార్థము గను, అంతరర్థము సహస్రారముగను భావించవలయును.

సవిత అనగా సూర్యుడని అర్థము కలదు. సవిత-సూర్యుల అభేదము ఋగ్వేద మున పలుచోటుల వివరింపడినది. విశ్వకర్మయే సూర్యుడని ఈ క్రింది విషయములు తెలుపు చున్నవి.

"విశ్వకర్మా హ్యజనిష్ఠ దేవ ఆది ద్గంధర్వో అభవద్వితీయః" అని తైత్తిరీయ విశ్వకర్మ సూక్తము. అనగా విశ్వకర్మ మొదట బ్రహ్మ అయినాడు. రెండవవాడుగా గంధర్వుడయినాడు అని అర్థము. తైత్తిరీయ సంహిత "సూర్యోగంధర్వ స్తస్య మరీచయో Z ప్సరసః " (3. 4. 71) అనగా "సూర్యుడనగా గంధర్వుడు, అతని కిరణములు అప్సరసలు" అని అర్థము.

"గావోరశ్మయః, తాన్ ధరతీతి గంధర్వః ఆదిత్యః"– "గాం వేద లక్షణం ధారయతీతి గంధర్వః "వేదరూప వాక్కులను ధరించువాడు గంధర్వుడు సూర్యుడే. – సూర్యుడు వేదత్రయ స్వరూపుడను మంత్రములు కూడ ఈ అంశమును సమర్థించుచున్నవి. యాజ్ఞవల్క్యునకు శుక్లయజు ర్వేదమును ప్రవచించినది సూర్యుడే కదా! కనుక సూర్యుడు వేదజనకుడైన విశ్వకర్మ స్వరూపుడే.

పై విషయముల వలన రుద్ర–సవిత–సూర్య–విశ్వకర్మల అభేదము తెలియు చున్నది.

"నమో అస్తు నీలగ్రీవాయ, సహస్రాక్షాయ మీఢుషే
అధో యే అస్య సత్వా నో అహం తేభ్యో Z కరం నమః." **1.9.**

నీలగ్రీవుడును, సహస్రాక్షుడును, మేఘ రూపుడును అయిన రుద్రునకు నమస్కారము. అంతియకాదు. ఆ భగవంతునకు భృత్యులు, సేవకులు, భక్తులు అయినవారికి కూడ నా నమస్కారము.

నీలగ్రీవుడు అను పేరు శివునకు కాలకూట విషమును కంఠము నందు ధరించుటచే కలిగినది. ఈ పదము నుదాహరణముగా ఒక మహాకవి తెలిపిన సందేశమును చూడుడు.

"గుణ దోషా బుధో గృహ్ణ న్నిందు క్ష్వేడా వివేశ్వరః,
శిరసా శ్లాఘతే పూర్వం, పరం కంఠే నియచ్ఛతి."

శివుడు–విషమును ఎవరికి అపకారమొనరింపనీయక కంఠము నందుంచుకొని, అందరికిని కన్పించునట్లు చంద్రుని శిరస్సున ధరించిన విధముగ, బుద్ధిమంతుడు ఇతరుల గుణదోషములను గ్రహించి, దోషమును తనలో నుంచుకొని మంచిని లోకమునకు చాటవలయును.

సహస్రాక్ష శబ్దము ఇంద్రునకును, విశ్వకర్మకును ("విశ్వతశ్చక్షురుత విశ్వతో ముఖో విశ్వతోహస్త ఉత విశ్వత స్పాత్," యజుః4. 6. 2) అన్వయించును.

'మీఢుష్టమ' అను పదమునకు కోరికలను తీర్చువాడనియు అర్థము కలదు.

"అధ్యవోచ దధివక్తా ప్రథమో దైవ్యోభిషక్,
అహీంశ్చ సర్వాన్ జంభయన్, సర్వాశ్చ యాతుధాన్యః". 1.6.

సర్వదైవశక్తులను రక్షించునట్టి ప్రథమ దేవుడును, వేదములను వచించిన వక్తయు, ఆధి వ్యాధులను హరించు వైద్యుడును అగు రుద్రుడు మాకపకారము చేయు సర్వవ్యాఘ్రాది క్రూర జంతువులను, రాక్షసులవలె మాకెగ్గు చేయువారిని నాశనము చేయుచు నన్ను సర్వశ్రేష్ఠునిగా ఒనర్చుగాక!

"ద్రాపే అన్ధ సస్పతే, దరిద్ర న్నీలలోహిత,
ఏషాం పురుషాణా మేషాం పశూనాం,
మాభే ర్మారో మో ఏషాం కించ నామమత్." 10.1

ద్రాపే=పాపులను నరకమునకు పంపువాడా; అంధ సస్పతే=అన్నమునకు అధిపతీ, దరిద్రన్=ఏమియును లేనివాడా (భగవంతుడు తాను తప్ప ఇంకేమియులేని వాడు కనుక దరిద్రుడని భావము. ఏదైన ఉన్నను అది తన కంటెను భిన్నము కాదు కనుక అతడన్నియు ఉన్నను ఏమియులేని వాడనియే భావము; నీలలోహిత=నీలపు కంఠము, లోహిత దేహము కలవాడా! ఏషాం పురుషాణాం=మాకు సంబంధించిన పుత్రపౌత్రాదుల యొక్క పశూనాం=పశువులను మాభేః=భయపెట్టవద్దు; ఏషాం= వీరియొక్క కించన= ఏ వస్తువు; మారో=నష్టపడకుండగాక! మో ఆమమత్=రోగగ్రస్తము కాకుండుగాక!

"యా తేరుద్ర శివాతనూ శ్శివా విశ్వాహ భేషజీ
శివా రుద్రస్య భేషజీ తయా నో మృడ జీవసే." 10.2.

హేరుద్రా! విశ్వ అహ భేషజీ = అన్నిదినముల యందు మారోగ దారి ద్ర్యాదులకు మందు వంటిదైన, శివా=శాంతమైన, యాతే తనూః= ఏ నీశరీరము కలదో, రుద్రస్య భేషజీ=రుద్రుని యొక్క మందు వంటిదైన, తయా=ఆశరీరము చేత; నః= మమ్ములను, జీవసే=హాయిగా జీవించుటకు మృడ=సుఖపెట్టుము.

"మృడా నో రుద్రత నో మయస్కృధి క్షయ ద్వీరాయ నమసా విధేమ తే,
యచ్ఛం చ యోశ్చ మను రాయజే పితా త దశ్యామ తవ రుద్రప్రణీతౌ". 10.4.

హేరుద్రా! నః=మమ్ములను, మృడ=ఈ లోకమున సుఖింపజేయుము, ఉత=ఇంకను పరలోకమున కూడ, నః=మాకు, మయఃకృధి=సుఖములను కల్పించుము,

క్షయద్వీ రాయతే=మా పాపముల నణంచునీకు, నమసా=నమస్కారముచే, విధేమ= పరిచర్యలను చేయుదుము.

పితా మనుః= తండ్రియైన మనుబ్రహ్మ,యత్ శం=ఏ సుఖమును, యోశ్చయత్= దుఃఖ భిన్నమైన దేనిని, ఆయజే=చేకూర్చునో, తత్=దానిని, హేరుద్రా, తవప్రణీతౌ=నీ స్నేహము కలుగుచుండగా, అశ్యామ=పొందుదుముగాక!

ఈ మంత్రమున మనుబ్రహ్మను 'పితా' అని వచించుటచే అతడు 'మానవ పిత' అనియు, 'జగత్పిత' అనియు తెలియజేయుట జరిగినది. ఈ మంత్రమున మను రుద్రులకు అభేదము సిద్ధమగుచున్నది. స్కాంద నాగర ఖండము 'మనువు శివుడు, మయుడు రమాధవుడు' అని వచించినదిగదా।

"శ్రుతం గర్తసదం యువానం మృగం న భీమ ముపహత్ను ముగ్రమ్
మృడా జరిత్రే రుద్ర స్తవానో అన్యం తే అస్మిన్నవ పన్తు సేనాః." **10.8.**

గర్తసదం= గుంట (గుహ) వంటి హృదయమున ఉన్నవాడును, యువానాం= నిత్య తరుణుడును, భీమం మృగం న=భయంకరమైన సింహము వంటివాడును, ఉపహత్నుం ఉగ్రమ్=ప్రళయ వేళ జగత్తులను నాశనము చేయుటకు ఉగ్రుడైన వాడును అగురుద్రుని, శ్రుతం=నా మాట విని, స్తుహి=ప్రార్థింపుడు. "ఏషదేవో విశ్వకర్మా మహాత్మా, సదా జనానాం హృదయే సన్నివిష్టః" అని శ్వేతాశ్వతరోపనిషత్తు వాక్యము. హేరుద్రా! స్తవానః =నాచే స్తుతించబడినవాడవై, జరిత్రే=క్షీణించు స్వభావముగల శరీరమున, మృడ=సుఖమును నింపుము; తే సేనాః=నీ సైన్యములు, అన్యం=నా శత్రువును, అనపన్తు=నశింప జేయునుగాక!

నమకమునగల రుద్రుని సంబోధించు కొన్ని పదములు. పదములకు ముందు అనువాకము సంఖ్య తెలుపబడినది.

1. ప్రథమ దేవుడు

మీఢ్వస్= మీఢుష్టమ : కోరికలు తీర్చువాడు. (ఋ. 1.114.3). ఈపదమునకు తర, తమ ప్రత్యయములు చేర్చిన 'మీఢుష్టర, మీఢుష్టమ పదములు రుద్రునకు వాడబడినవి.

2. హిరణ్య బాహవే=బంగారు నగలు చేతులయందు కలవాడు.

సేనాన్యే=సేనలను నడుపు సేనాపతి.

దిశాంచపతయే=దిక్కులకు అధిపతి. ఈక్రింది యజుర్వేద మంత్రము విశ్వకర్మ రుద్రాదులొకరే అని తెలుపుచున్నది.

"యో దేవానాం నామధా ఏకఏవ" అను మంత్రమునకిది ఉదాహరణము.

యజుర్వేదము :

"విశ్వకర్మా దిశాం పతి స్సనః పశూ న్పాతు
సో Z స్మా న్పాతు తస్మై నమః,
ప్రజాపతీ రుద్రో వరుణో Z గ్ని ర్దిశాం పతి స్సనః
పశూన్పాతు సో Z స్మాన్పాతు తస్మై నమః." (కాం. ౫ ప్ర.౫ అ.౫)

దిఙ్మయమగు ప్రపంచమున కధీశ్వరుడగు విశ్వకర్మ మాగోధనాదులను, మమ్ము రక్షించుగాక! ఆ విశ్వకర్మ కొఱకు నమస్కారము. ప్రజాపతియును, రుద్రుడును, వరుణుడును, అగ్నియు, దిక్కులకధిపతియునగు విశ్వకర్మ మా పశువులను రక్షించుగాక! మమ్ములను కాపాడునుగాక! అట్టి జగత్కర్తయగు పరమేశ్వరునకు నమస్కారము.

పశూనాం పతయే=పశువులనగా జీవులు అని భావము. జీవులకందఱికి ప్రభువు.

సస్పింజరాయ త్విషీమతే = లేతపచ్చిక వంటి కాంతిగలవాడును, కాంతిమంతుడు
(చిత్స్వరూపుడు) ను,

అన్నానాం పతయే = జీవులు తినెడి ఆహారములకు పోషకుడు.

భవస్య = జీవుల సంసారమునకు, హేత్యై = కత్తివంటివాడు.

జగతాం పతయే = జగత్తులకు ప్రభువు.

క్షేత్రాణాం పతయే = శరీరములకు ప్రభువు. అనగా క్షేత్రపాలకుడగు జీవుడు.

స్థపతయే = జగత్తులకు ప్రభువు, లేక, జగత్తులను నిర్మించిన శిల్పాచార్యుడు.

మానసారము :

"స్థపతిః స్థాపనాయార్హో వేద విచ్ఛాస్త్ర కోవిదః,
స్థాపనాధిపతి ర్యస్మాత్త స్మాత్ స్థపతి రుచ్యతే."

దేవ మనుష్యాలయ గ్రామ పట్టణాదులను స్థాపించు (నిర్మించు) అర్హతగల వేదశాస్త్రవేత్తను 'స్థపతి' అందురు. అతడా విధముగ స్థాపించు నర్హత కలవాడు కనుక 'స్థపతి' అని చెప్పబడినాడు.

వృక్షాణాం పతయే = సర్వప్రాణులకు భోజ్య పదార్థముల నందించు
చెట్లకు ప్రభువు.

భువంతయే = లోకములను విస్తరింప జేయువాడు.

కృత్స్నవీతాయ= సైన్యముచే పరివేష్ఠింపబడినవాడు. ప్రాణేంద్రియ సమూహముచే
పరివేష్ఠించబడిన వాడని ఆధ్యాత్మికార్థము.

సత్వానాంపతయే = సత్వగుణము కల ఆశ్రితులను కాపాడువాడు. సత్వము లనగా ప్రాణములనియును అర్థము. కనుక ప్రాణులకు అధిపతి– పశుపతి.

3. సహమానాయ = సర్వమును సహించునట్టివాడు.

నివ్యాధినే = తాపత్రయాది వ్యాధులు లేనివాడు.

ఆ వ్యాధి నీనాం పతీయే = తాపత్రయ వ్యాధిగ్రస్థులైన సంసారులకు పాలకుడు.

5. భవాయ = అతని నుండి భూతములు (ప్రాణులు) పుట్టుచున్నవి కనుక 'భవుడు'అను పేరు కలిగినది. దీనిని బట్టి రుద్రుడు సృష్టికారుడయిన 'బ్రహ్మ' అని విదితమగు చున్నది.

శర్వుడు = పాపమును పోగొట్టువాడు.

పశుపతి = పశుసమానమైన అజ్ఞానులను పాలించి, రక్షించువాడు.

శితికంఠుడు = శితి అనగా నలుపు, తెలుపు అను రెండర్థములు కలవు. ఇచట నల్లని కంఠము కలవాడు అని అర్థము.

శిపివిష్టాయ = "విష్ణుః శిపి విష్టః" అను శ్రుతిని బట్టి విష్ణుస్వరూపములను తాల్చినవాడని భావము.

హ్రస్వుడు = పొట్టివాడు. పరమాత్మ 'అణోరణీయాన్' అనగా అణువు కంటెను పరమాణువు కంటెను సూక్ష్మరూపుడని శ్రుతి. కనుక అతడు హ్రస్వుడే.

బృహత్తు = మహత్స్వరూపుడు. "మహతో మహీయాన్" అని శ్రుతి. మహత్తత్వము ఆకాశము కంటెను గొప్పది. కావున బృహచ్ఛబ్దము సార్థకమే.

వర్షీయసుడు = వృద్ధుడు, ఇచ్చట గుణవృద్ధుడని, ఆద్యుడని భావించనగును.

అగ్రియుడు = అందరికంటెను, అన్నిటి కంటెను ముందున్న వాడు. పరమాత్మ యందు ప్రకృతి (మాయ) తోచక పూర్వమే ఉన్నాడు. కనుక పరాపర ప్రకృతుల కంటెను అగ్రియుడు. దీనినే "ఆత్మా వా ఇదమేక ఏవాగ్ర ఆసీత్, నాన్యత్కించన మిషత్" అనగా కేవల పరమాత్మ తత్త్వ మొక్కటే ఆది యందు కలదు. అట్టి అగ్రము నుండి కలవాడు కనుక 'అగ్రియుడు'. "ప్రథముడు" అనినను ఈ అర్థమే చెల్లును.

ఆశవు : 'అశూ' అను ధాతువునకు 'వ్యాప్తి' అని అర్థము. అనగా బాహ్యాంతర ములయందు వ్యాపించియుండువాడు అని అర్థము.

అజిరుడు= నడక నేర్పు కలవాడు. ఏకాలమున ఎవరికెట్టి కర్మల ఫలము లందవలయునో వారికా ఫలములను ఆలస్యము జరుగకుండ చేకూర్చువాడని భావము.

శీభ్యాయ = శీభ అనగా నీటి ప్రవాహము. కనుక శీభ్యాయ అనగా నీటిధారల యందుండువాడు అని అర్థము "జలధారా ప్రియశ్శివ" అందురు. అందువలననే శివుని నీటితో అభిషేకము చేయుదురు "అపాంగర్భం వ్యద ధా త్పురుత్రా" అని విశ్వకర్మ సూక్త మంత్రము వచించు చున్నది. అనగా విశ్వకర్మ జగదుత్పత్తి బీజమును నీటియందే ఉంచినాడని భావము. కావున విశ్వకర్మయు జలప్రియుడే.

ఊర్మ్యుడు = ఊర్మి అనగా జలతరంగము. కనుక ఊర్మ్యుడనగా తరంగము యందుండు వాడు అని అర్థము.

సముద్రము పరమేశ్వర స్వరూపమని యజుర్వేద విశ్వకర్మ సూక్తము నందలి 'సముద్రాయ వయునాయ......" అను మంత్రము తెలుపుచున్నది. అందలి తరంగములే జీవులు సర్వజీవులలోను పరమాత్మ అంతర్యామి రూపముగా నున్నందున భగవంతుడు ఊర్మ్యుడు.

అవస్వనన్యుడు = నిలుకడనీటిలో నుండువాడు.

స్రోతస్యుడు = ప్రవాహము నందుండువాడు. ప్రవాహము అనగా చరములైన ప్రాణులనియు, నిలుకడగల నీరము లనగా అచరములయిన ప్రాణులనియు, రుద్రుడు చరాచరముల యందుండు వాడనియు తాత్వికార్థము.

ద్వీప్యుడు = ద్వీపమున నుండువాడు. అనగా పరమేశ్వరుడు నీరు లేనిచోటను ఉండువాడని అర్థము.

6. జ్యేష్ఠుడు = మొదట పుట్టినవాడు. పూర్వజుడు. సృష్టికర్త.

కనిష్ఠుడు = చివర పుట్టినవాడు. అపరజుడు, లయకారుడు.

మధ్యముడు = మధ్య కాలమున నుండువాడు.

సోభ్యుడు = పుణ్య పాపరూప కర్మల నాచరించువాడు. అనగా జీవరూపుడు.

యామ్యుడు = యమలోకమున పాపులను శిక్షించువాడు.

క్షేమ్యుడు = మోక్షార్థి, వేదవేత్త.

శ్లోక్యుడు = శ్లోకాది రూపమంత్రముల నెఱిగినవాడు.

అవసాన్యుడు = వేదముల యవసానము ఉపనిషత్తులు. వాటి కర్తృడైన జ్ఞాని. అనగా వేదాంతి

అవభిందుడు = శత్రువులను భేదించువాడు. ఆధ్మాత్మిక దృష్టితో చూచిన అంతశ్శత్రువులను గెలుచువాడు.

శ్రుతుడు = వేద విద్య కలవాడు.

7. వాస్తోష్పతి = వాస్తువు అనగా నివాసయోగ్యమైన భూమి, గృహము మొదలగునవి. వానిని రక్షించువాడు వాస్తుపుడు అనగా వాస్తోష్పతి.

8. సోముడు = ఉమాదేవితో కూడినవాడు గనుక సోముడు. మాయా శక్తి సహితుడని తాత్వికార్థము. అనగా ప్రకృతి పురుష స్వరూపుడని భావము. దీనినే శంకరాచార్యుల వారిట్లు వచించిరి.

"శివ శ్శక్త్యా యుక్తో యది భవతి శక్తః ప్రభవితుం,
న చే దేవం దేవో న ఖలు కుశలః స్పందితు మపి."

శివుడు (పురుషుడు) శక్తి (ప్రకృతి) తో గూడిననే గాని సృష్టి జరుగదు. (ప్రకృతి) లేనిచో సృష్ట్యాదులు జరుగవు. నిర్వికార నిర్గుణ శివస్వరూపము కదల లేదు. జగత్క్రీడను నడపలేదు.

శంగాయ='శం' అనగా సుఖము. దానిని భక్తుల కందించువాడు శంగుడు.

ఉగ్రుడు = శత్రువుల వినాశనమునకు క్రోధము తాల్చువాడు. శత్రువులనగా అంతశ్శత్రువులని ఆధ్యాత్మికము.

దూరేవధుడు = దూరమున నున్న శత్రువులను చంపువాడు

అగ్రేవధుడు = ఎదుట నున్న శత్రువులను చంపువాడు.

హనీయసుడు = ప్రళయకాలమున సర్వమును నశింపచేసి తనలో లీనమొనర్చుకొను వాడు.

తారుడు = ఓంకారముచే ప్రతిపాదింపబడెడి అర్థ స్వరూపుడు.

శంభుడు = సుఖమును కలిగించువాడు;

మయోభవుడు = మయ స్కరుడు=సుఖమును గూర్చువాడు.

శివుడు = కల్యాణ స్వరూపుడు.

ఇచట ప్రయోగింపబడిన 'నమశ్శివాయ' పదమే. ఉపాసకులను 'పంచాక్షరి' యైనది.

పార్యుడు = సంసార సముద్రమున కావలి యొడ్డున మోక్షార్థులచే ధ్యానించ బడువాడు.

అవార్యుడు = ఏ ప్రాకృత శక్తులచేతను అడ్డగింప నలవి కానివాడు.

ప్రతరణుడు = సంసారమును తరింపచేయువాడు.

ఉత్తరణుడు = తత్త్వ జ్ఞానము కలిగినవారిని భవసాగరమును తరింప జేయువాడు.

ఆతార్యుడు = కామ్యకర్మ లంపటులను తత్త్వ జ్ఞానమునకు దూరమందుంచి సంసార సుఖముల నొసగువాడు.

అలాదుడు = సంపూర్ణముగా కర్మఫలములను గోరు జీవుడు.

ఆలాద్యుడు = అతనిని కర్మానుగుణముగా ప్రేరేపించువాడు.

సికతుడు = ఇసుక యందు ఆసన ప్రాణాయామాదు లొనర్చువాడు.

10. భగవంతుడు = "ఐశ్వర్యస్య సమగ్రస్య, ధర్మస్య యశసః శ్రియః

జ్ఞాన వైరాగ్యయో శ్చైవ షణ్ణాం భగ ఇతీరితః."

"సంపూర్ణమైన ఐశ్వర్యము, ధర్మము, యశస్సు, సంపత్తి, జ్ఞానము, వైరాగ్యము అను ఆటింటికి భగమని పేరు. అవి కలవాడు భగవంతుడు. భగవంతుడన షడ్గుణైశ్వర్య సంపన్నుడు.

విష్ణు పురాణము :

"ఉత్పత్తిం చ వినాశం చ భూతానా మాగతిం, గతిం,

వేత్తి విద్యా మవిద్యాం చ సవాచ్యో భగవా నితి".

సృష్టి ప్రళయములు, భూతముల రాకపోకలు, విద్యావిద్యలు ఎవడెఱుగునో అతడు భగవంతుడు. ఉపనిషత్తు. "భవం నిహత్య యోగం దదాతీతి భగవాన్" భవ శబ్దములోని మొదటి అక్షరమును, యోగ శబ్దములోని చివరి అక్షరమును కలుపగా 'భగ'మగును. అది కలవాడు భగవంతుడు. సంసారమును హరించి బ్రహ్మయోగము నొసగువాడు భగవంతుడు.

ఋగ్వేదము (5-82-1, 3, 7.38.1.6)లో సవితకు భగునికి "సవితా భగః', భగః సవితా" అని అభేదము చెప్పబడినది.

అథర్వవేదము 11వ కాండము నందలి మొదటి అను వాకమునగల 5వ సూక్తము, 6వ సూక్తము లందలి మంత్రములు రుద్రుని స్తుతించునవియే. ఈ మంత్రములు యజుర్వేదీయ రుద్రాధ్యాయ మంత్రములను పోలియున్నవి. అచట రుద్రుని కన్వయించిన పదములే యిచటను రుద్రునికి ప్రయోగింపబడినవి.

ఈ విధముగ వేదోపనిషత్తులలో జగత్సృష్టి కర్తగ, మహోన్నతుడుగ వర్ణింపబడిన రుద్రుడు పురాణములలో ఆది దేవుడుగ వర్ణింపబడుచు, భార్యాలంపటుడుగ

వర్ణింపబడినాడు. మరియు అనేక యుద్ధములు చేసినట్లును వర్ణింపబడినాడు. ఋగ్వేదములో ఉగ్రుడుగ వర్ణింపబడినను అతడొనరించిన యుద్ధమేదియు కన్పించదు. ఋగ్వేదములో ఆయన బంగారు ఆభరణాలతో ప్రకాశించును (2.33.9), చాల రూపాలు గల హారము ధరించును (2.33.10), రథము మీద కూర్చుండును (2.33.11), అని వర్ణింపబడగా, పురాణములలో వీటికి భిన్నముగా పాములను ఆభరణములుగా ధరించు వాడుగను, వృషభ వాహనుడు గను వర్ణింపబడినాడు. మరుత్తులు, రుద్రుని కొడుకులు అని ఋగ్వేదములో వచింపబడినది.

వేదముల తరువాతి సాహిత్యములో 'అంబిక' అను పేరు వాజస నేయ సంహిత లో ఉన్నది. కాని అచట ఆమె రుద్రునికి సోదరి అని చెప్పబడినది. శివుని భార్య పేర్లైన 'ఉమా, పార్వతీ' పదాలు తైత్తిరీయ ఆరణ్యకము లోనూ, కేనోపనిషత్తులోను ఉన్నవి. శాంఖాయన శ్రౌత సూత్రములో (4.20.1) భవుడు, శర్వుడు రుద్రుని కొడుకులని చెప్పబడినది.

ఋగ్వేదములో బృహస్పతి -గణపతిగా ఆరాధింపబడినట్లు తెలియుచున్నది. కాని పురాణములలో గణపతి పార్వతీ కుమారుడుగ చెప్పబడుటయేగాక, గజాసురుని తల ధరించుట మున్నగు వైపరీత్యము లెన్నియో కన్పించుచున్నవి.

ఈ విధముగ జగత్సృష్టికర్తయగు రుద్రుడు పురాణములలో భిన్నుడుగ వ్యవహరింపబడుట గమనించిన, పురాణములెన్ని పోకడలు పోయినవో కన్పించుచున్నది.

త్రిమూర్తులు

బ్రహ్మ, విష్ణు, శివ, ఇంద్ర, సూర్యులను పంచమూర్తులలో, బ్రహ్మ, విష్ణు, శివుడు అను త్రిమూర్తులే పురాణ వాఙ్మయమున సృష్టి-స్థితి-లయకారులుగ, సృష్టి కర్తలుగ ప్రఖ్యాతి వహించిరి. వీరిని గురించి వేదోపనిషత్తులయందు లేని విషయము లెన్నియో పురాణవాఙ్మయమున వ్రాయబడినవి. వేదోపనిషత్తుల యందు సృష్టికర్తలుగ వివరింపబడిన వీరు పురాణ వాఙ్మయమున మనకు సంసారలంపటులుగ గన్పింతురు. వీరిని గురించి వేదోపనిషత్తుల యందుగల అనేక విషయము లింతకు పూర్వమే వ్రాయబడినవి. ఋగ్వేదమున మృత్యుంజయ మంత్రముగ ప్రసిద్ధికెక్కిన ఈ దిగువ మంత్రమును చూడుడు.

"త్ర్యంబకం యజామహే, సుగంధిం పుష్టివర్ధనం
ఉర్వారుక మివ బంధనా న్మృత్యోః ర్ముక్షీయ మా Z మృతాత్." ఋ. 7.59.12.

సాయణుల భాష్యము : "త్రయాణాం=బ్రహ్మ విష్ణు రుద్రాణాం, అంబకం= పితరం, యజామహ ఇతి శిష్య సమాహితో వసిష్ఠో బ్రవీతి."

దీనిని బట్టి ఈ మంత్రమున స్తుతింపబడిన త్ర్యంబకుడు బ్రహ్మ, విష్ణు, రుద్రులనెడి త్రిమూర్తులకు తండ్రియని ఈ మంత్రమునకు ద్రష్టలు అయిన వసిష్ఠుని యభిప్రాయము. త్ర్యంబకం – "త్రీణి అంబకాని యస్య సః త్ర్యంబకః" అని విగ్రహము.

అంబకమనగా కన్ను, బాణము అని అర్థములు కలవు.

త్ర్యంబకుడనగా మూడు కన్నులు కలవాడు–'ముక్కంటి' అని యర్థము.

మనకు మంత్ర తంత్ర పురాణాది వాఙ్మయమున విశ్వకర్మ, శివుడు, గాయత్రి, శక్తి, శ్రీదేవి మున్నగువారు మూడు కన్నులు కలవారుగ కన్పింతురు. పురుషులలో మనకు శివుడు, విశ్వకర్మ మాత్రమే కన్పింతురు. శివుడు త్రిమూర్తులలోని వాడే కనుక, ఇకను మిగిలిన విశ్వకర్మ–త్రిమూర్తులకు తండ్రియని తేట తెల్లమగుచున్నవి. ఇంతకు పూర్వము బ్రహ్మ–విష్ణు–రుద్రులను గురించి వివరింపబడిన అనేక విషయములలో విశ్వకర్మ బ్రహ్మ–విష్ణు–రుద్రాదులకు తండ్రియని వివరించుట జరిగినది. రాబోవు పంచమూర్తుల వివరములందును ఈ విషయము లింకను వివరింపబడగలవు.

పై మంత్ర భావము : త్రిమూర్తులకు తండ్రియు, కీర్తివలె అంతటను వ్యాపించు వాడును, సమస్త పుష్టులను సమకూర్చువాడును అగు త్ర్యంబకుని ఆరాధింతము. అయనను ఆరాధించినచో తొడిమ నుండి దోసకాయ ఊడిపడునట్లు మృత్యువు నుండి కాని, సంసారము నుండి కాని విడివడవచ్చును. అంతియేకాని అమృతము నుండి మాత్రము విడివడము.



8. సవిత - ఇంద్రుడు - విశ్వకర్మ

ఇంద్రుడు ఋగ్వేదములో దాదాపు 200 సూక్తములలో ప్రత్యేకముగను, ఏబది సూక్తములలో ఇతర దేవతలతో కలిసియు స్తుతించబడినాడు.

ఋగ్వేదము (2.30.1) లో ఇంద్రునకు 'సవిత' అను విశేషణము వాడబడినది. ఇంద్రుడు బంగారు రంగుకలవాడు ("హిరణ్మయః. ఋగ్వేదము 1.7.2, 8.55.3). సవిత సువర్ణ మయమైన దీప్తి ("హిరణ్మయీా మమతిం ఋ. 3.38.8, 7.38.1) కలవాడు. ఇంద్రుడు బంగారుచేతులు (హిరణ్య బాహుః. ఋ 7.34.4), పెద్ద చేతులు (పృథూ), విశాలమైన (బహూలా) చేతులు కలవాడు (ఋ.6.193, 8.32.10, 8.70.1), సవిత పెద్ద చేతులు కలవాడు (పృథుపాణి ఋ. 2.38.2)

ఇంద్రుడు తన మాయతో బహురూపములు ధరించును "ఇంద్రో మాయాభిః పురు రూప ఈయతే" (ఋ. 6.47.18, 3.48.4, 3.53.8)

సవిత విశ్వరూపుడు. (విశ్వరూపాణి ప్రతిముంచతే కవిః" ఋ. 5.81.02)

ఇంద్రుడు ఒక్కడే ప్రపంచమున కంతటికి నిరాజు ('ఏకో విశ్వస్య భువనస్య రాజా' ఋ. 3.46.2).

సవిత "భువనస్య ప్రజాపతిః (ఋ. 4.53.2).

ఇంద్రుడు చలించువాటికి, ఊపిరి పీల్చువాటికి అన్నిటికి ప్రభువు (ఋ. 1.101.5), సవిత చరాచరములన్నిటికీ ప్రభువు (ఋ. 4.53.6).

ఇంద్రుడు భూమిని ధరించినాడు, ఆకాశమును తన మాయచే నిలబెట్టినాడు. 'ఆధార యత్పృథివీం అస్త భ్నా న్మాయ యా ద్యావస్రసః" (ఋ. 2.17.5 మొ). ఆకాశమును భూమిని నిలిపినాడు. భూమిని విశాలము చేసినాడు (ఋ. 2.15.2).

సవిత భూమ్యాకాశములను నిలిపినాడు (సవితా యంత్రైః పృథివీ మరమ్ణా దస్కంభనే సవితా ద్యామ దృంహత్" ఋ. 10.149.1), ఆకాశమును (ఋ.4.53.2, 10.149.4) భువనమును (ఋ.4.54.4) ధరించును.

ఇంద్రుడు స్వర్గానికి భూమికి ఉత్పాదకుడు (జనితా దివా జనితా పృథివ్యాః ఋ. 8.36.4, 6.47.4).

పై విషయములన్నియు సవిత-ఇంద్రుడు ఒక్కరే అని తెల్పుచున్నవి.

"సురూప కృత్ను మూతయే సుదుఘా మివ గోదుహే
జుహూ మసి ద్యవి ద్యవి" **(ఋ. 1.4.1).**

పాలు కావలసినవాడు మంచి పాలనిచ్చు గోవును వలె చక్కని శిల్ప రూపములను సృష్టించు ఇంద్రుని మా రక్షణ కొఱకు ప్రతి దినమును పిలుచు చున్నాము.

ఈ మంత్రమున ఇంద్రునికి 'సురూపకృత్ను' పదము వాడబడినది. అనగా మంచి రూపములను సృష్టించువాడు అని అర్థము. దీనికి సాయణులిట్లు వ్రాసినారు. "సురూపకృత్నుం=శోభన రూపోపేతస్య కర్మణః కర్తార మింద్ర మూతస్మద్రక్షార్థం యేZ" అనగా అందమైన స్వరూపము గల కర్మలను చేయుకర్త అని భావము. అనగా అందమైన స్వరూపము గల కర్మలను చేయుకర్త అని భావము. అనగా రమ్యరూప నిర్మాత అయిన శిల్పి అని భావము.

"పురాం భిన్దుర్యువా కవిరమితౌజా అజాయత,
ఇంద్రో విశ్వస్య కర్మణో ధర్తా వజ్రీ పురుష్టుతః" **ఋ. 1.11.4.**

ఇంద్రః=ఇంద్రుడు, పురాంభిందుః=శత్రుపురములను భేదించువాడును (మోక్షసాధకులయిన జీవుల యొక్క స్థూల-సూక్ష్మ-కారణ దేహములను భేదించువాడని అంతరర్థము), యువా=యువకుడును (బాల్యాది దశలు లేని నిర్వికారుడని భావము), అమితౌజాః= గొప్ప సామర్థ్యము కలవాడు (షడ్గుణైశ్వర్య సంపన్నుడైన భగవంతుడు) ను, విశ్వస్య కర్మణః=సమస్త కర్మలను అనగా సృష్టి, స్థితి, లయ, తిరోధాన, అనుగ్రహాదులయిన జగత్కర్మలను, ధర్తా=ధరించువాడును, వజ్రీ=వజ్రము కలవాడు (ప్రకృతిచే అభేద్యుడని భావము)ను, పురుస్తుతః= బాగుగా స్తుతించబడినవాడును, అజాయత=అయెను.

"త మీశానం జగత స్తస్థుష స్పతిం, ధియం జిన్వ మవసే హూమహే వయమ్." **1.89.5.**

జగతః= తిరుగుచున్న ప్రాణులకు, తస్థుషః=స్థావరములకు, పతిం=ప్రభువును, ధియం జన్వమ్=సత్కర్మలచే సంతోషపెట్టదగిన, ఈశానం=జగత్తులనెడి ఐశ్వర్యము కల ఇంద్రుని, అవసే= మా రక్షణ కొఱకు, వయం=మేము, హూమహే=పిలుచుచున్నాము.

ఈ మంత్రమున ఇంద్రుడు పరమేశ్వరుడుగా స్తుతించబడినాడు. ఇట్టివే మరికొన్ని మంత్రములు

"త్వం భువః ప్రతిమానం పృథివ్యా ఋష్వ వీరస్య బృహతః పతిర్భూః,
విశ్వ మాప్రా అంతరిక్షం మహిత్వా సత్యమద్ధానకి రన్య స్త్వావాన్" **1.52.13.**

ఓ ఇంద్రా! నీవు పృథివికి ప్రతినిధి వగుచున్నావు. స్వర్గలోకమునకు కూడ నీవే పతివి. నీ మహిమచే అంతరిక్షము నందును వ్యాపించి యున్నావు. ఇందు అసత్యము లేదు. నీవు సర్వ వ్యాపకుడవు, సర్వ రక్షకుడవు అనుట సత్యము. ఈ విషయమే విశ్వకర్మ సూక్తమున "పరోదివా పరఏనా పృథివ్యా దేవేభి రసురైర్య దస్తి" అని వచింపబడినది. కనుక ఇంద్రునకు విశ్వకర్మకు అభేదము.

"న యస్య ద్యావా పృథివీ అను వ్యచో న సింధవో రజసో అంత మా నశుః
నో తస్య వృష్టిం మదే అస్య యుధ్యత ఏకో అన్య చ్చ కృషే విశ్వమానుషక్." 1.52.14.

ఏ ఇంద్రుని యొక్క విశ్వవ్యాపక స్వభావశక్తిని ద్యావా పృథువులు పొందజాలవో, అంతరిక్షమున ప్రవించు స్వభావముగల జలములు సయితము ఏ ఇంద్రుని శక్తిని పొందలేవో, ఏ ఇంద్రుని వృష్టి శక్తిని అడ్డగించుటకు యత్నించి అతనిని గెలువలేరో, అట్టి సర్వశక్తి సంపన్నుడవైన ఇంద్రా! నీవొక్కడవే సమస్త విశ్వమును (భూత సమూహమును) స్వాధీన మొనర్చుకొని ఎదురు లేక ప్రకాశించుచున్నావు.

"త్వ మస్య పారే రజసో వ్యోమనః స్వభూత్యోజా అవసే ధృష న్మనః,
చ కృషే భూమిం ప్రతిమాన మోజసో అపః స్వః పరిభూ రేష్యా దివమ్"
15.52.12.

సర్వశ్రేష్ఠమైన మనస్సుగల ఓ ఇంద్రా! నీవు మమ్ములను ఉద్ధరింపదలచిన వాడవై మాకు కన్పించు అంతరిక్షలోకమునకు ప్రతినిధిగా భూమిని (భూలోకమును) సృజించి నావు. అంతే కాదు బలవంతులలో మహాబలశాలివైనావు. అంతరిక్ష ద్యులోకములను వ్యాపించినవాడవై వాటి రక్షణ కొఱకు ప్రవర్తించుచున్నావు.

సవిత-విష్ణువులు కూడ ఈ లోకములను సృజించి వ్యాపించినట్లు ఇంతకు పూర్వమే తెలుపబడినది. విశ్వకర్మ ద్యావా పృథువులను సృష్టించినట్లు "ద్యావా భూమీ జనయన్ దేవ ఏకః" అను విశ్వకర్మ సూక్తవాక్యము తెలుపుచున్నది కదా! దీనిని బట్టి ఇంద్ర విశ్వకర్మల అభేదము తెలియుచున్నది.

"రూపం రూపం మఘవా బోభవీతి మాయాః కృణ్వానః తన్వం పరిస్వాం,
త్రిర్యద్దివః పరి ముహూర్త మాగాత్ స్వైర్మంత్రై రనృతుపా ఋతావా." 3.53.8.

ధనవంతుడగు ఇంద్రుడు మాయలను చేయగలిగి తన శరీరమును అనేక రూపములుగా చేయజాలును. (ఇందుకు "ఇంద్రో మాయాభిః పురురూప ఈయతే" (ఋ. 6.47.18) అనగా ఇంద్రుడు తన మాయాశక్తిచేత నానారూపములను పొందగలడు.

అనుటయు నిదర్శనము). సత్యవంతుడైన ఇంద్రుడు యజ్ఞకర్తల స్తుతుల నాలించి ఒకేసారి ఎన్ని యజ్ఞముల కైనను వచ్చుచుండును.

"రూపం రూపం ప్రతిరూపో బభూవ త దస్య రూపం ప్రతి చక్షణాయ,
ఇంద్రో మాయభిః పురురూప ఈయతే యుక్తా హ్యస్య హరయః శతాదశ."
ఋ. 6.47.18.

ఇంద్ర= ఆకాశము వలె సర్వగతుడును, సదానంద రూపుడును అగు పరమాత్మ, రూపం రూపం=ప్రతి శరీరమునందును, ప్రతిరూపః=ప్రతి బింబరూపుడై, బభూవ= ఉండెను. (అనగా చిన్మాత్రుడైన తాను అంతఃకరణో పాధులయందు జీవరూపుడై ప్రకాశించెనని భావము). అస్య=ఈ ఇంద్రుని యొక్క, తత్‌రూపమ్= ఆ ప్రతి బింబ రూపము, ప్రతిచక్షణాయ=నియతమైన ఆకార దర్శనార్థమై ఉపయోగించుచున్నది. ఇంకను ఆ యింద్రుడు, మాయాభిః= మాయా శక్తుల చేత, పురురూప=అనేక రూపములు కలవాడుగ, ఈయతే=ఒప్పుచున్నాడు. అస్య=ఇతనికి, దశశతాహరయః= గుఱ్ఱముల వంటివని చెప్పదగిన వేలకొలది ఇంద్రియ మనోవృత్తులు, యుక్తాః=విషయములను గ్రహించుటకు ఉపయోగించు నవియై యున్నవి. అనగా జీవులకు కలిగెడి ఆయా మానసాదులైన ఇంద్రియ వృత్తులు అంతర్ముఖము లయినచో ఆ పరమాత్మ దర్శనమునకే తోడ్పడు చున్నవనుట పరమార్థము. ఈ మంత్రమున 'రూప' శబ్దముచేత తమోగుణ సృష్టియైన స్థూల శరీర బ్రహ్మాండములును, 'హరి' శబ్దము చేత సూక్ష్మ కారణ దేహములును చెప్పబడి, సమస్త సృష్టియు సంగ్రహింపబడుట ఎఱుంగదగినది.

"యుజానో హరితా రథే భూరి త్వష్టే హ రాజతి,
కో విశ్వాహో ద్విషతః పక్ష ఆసత ఉతాసీనేషు సూరిషు." **ఋ. 6.47.19.**

హరితాః=గుఱ్ఱములను (సత్యసంకల్పములను), రథేయుజానః= (శరీర) రథమునకు పూన్చుచు, త్వష్టా=లెస్సగా ప్రకాశించు ఇంద్రుడు, భూరి ఇహ రాజతి=లెస్సగా ఈ శరీరమున వెలుగుచున్నాడు. అనగా సత్సంకల్పముల నిచ్చుచున్నాడని భావము. అనగా అంతశ్శత్రువు లయిన కామక్రోదాధులను జయించువాడు ఆ యింద్రుడేనని అంతరర్థము. ఈ మంత్రమున ఇంద్రునికి 'త్వష్ట' శబ్దము వాడబడుటచే అతని జగత్కర్తృత్వము విశదమగుచున్నది.

"త్వమింద్రా భి భూరసి, త్వం సూర్య మరోచయః విశ్వకర్మా విశ్వదేవో మహానసి."
ఋ. 8.98.2.

ఓ ఇంద్రుడా! నీవు శత్రువులను జయించినావు. నీవు సూర్యుని వెలుగులచే దీప్తి కలవానిని చేసినావు. నీవు విశ్వకర్మవు. అనగా సృష్ట్యాది కర్మలు కలవాడవు. అంతియే కాదు నీవు విశ్వదేవుడవు, సర్వదేవతాత్మకుడవును అయినావు.

"ఇంద్రాయ హృదా మనసా మనీషా ప్రత్నాయ పత్యేధియో మర్జయన్త." ఋ 1.61.2.

స్వామియు (ప్రత్నే), ప్రత్నరూపుడును అగు ఇంద్రునికై హృదయము చేతను, మనస్సు చేతను, బుద్ధివలన కలిగిన జ్ఞానము చేతను స్తుతులను లేక కర్మలను చేయుడు లేక సమర్పింపుడు. ఇచట 'ప్రత్న' శబ్దము పురాతనుడు అను అర్థమును, పంచ ఋషులలోని 'ప్రత్నసఋషి' అను అర్థమును సూచించుచున్నది.

"ఇంద్రో దీర్ఘాయ చక్షసే ఆ సూర్యం రోహ యద్దివి వి గోభిరద్రి మైరయత్"

ఋ. 1.7.3.

ఇంద్రుడు ఎల్లప్పుడు లోకములకు వెలుగులనిచ్చుటకు, సూర్యుని దివియందు స్థాపించినాడు. అంతియేకాదు. జలములను నింపి మేఘమును వర్షించునట్లు ప్రేరేపించెను.

"బ్రహ్మా న్వీరబ్రహ్మకృతిం జుషాణో Z ర్వాచీనో హరి భిర్యాహి తూయమ్."

ఋ 7-29.2

వీరబ్రహ్మవు అగు**F.N.**ఇంద్రుడా! స్తోత్రములను సేవించుచు అశ్వయానము పై శీఘ్రముగ రమ్ము.

ఇట్టి కార్యములు ఇంద్రుని సృష్టి కర్తృత్వమును, సురూప కృత్ను ధర్మమునే చాటుచున్నవి.

F.N. ఈ మంత్రమునందలి 'వీరబ్రహ్మ' అను పదమునకు తిరుపతి దేవస్థానము వారు ప్రచురించిన ఋగ్వేద మంత్రముల వ్యాఖ్యానములో 'బ్రాహ్మణవీరుడవగు' అని అర్థమీయ బడినది.

బనగానపల్లె వద్ద నున్న కొండగుహలో కాలజ్ఞానమును రచించి కందిమల్లయ్య పల్లెలో జీవసమాధిని చేరిన శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాములవారు రచించిన తాళపత్ర గ్రంథమున గల కాలజ్ఞానములో "శ్రీ మహావిష్ణువు, శ్రీ వీరబ్రహ్మయోగీంద్రుడు, వీర వీరత్వముచేతను, బ్రహ్మ బ్రహ్మత్వముచేతను దశావతారములు ఎత్తి ఆనందాశ్రమము లకు శిష్యుడై అంతర్భవిష్యమంతా, సాంద్రసింధువేదము చదివి, బనగానపల్లె చేరి......." అనియున్నది.

శబ్దరత్నాకరములో 'బ్రహ్మ' అను పదమునకు విష్ణువు అనియు అర్థము చెప్పబడినది. దీనినిబట్టి శ్రీ మహావిష్ణువు, శ్రీమద్విరాట్ పోతులూరి 'వీరబ్రహ్మం'గా అవతరించెనని కొందరు పండితులు రచించుచున్నారు. ఈ విషయమునింకను పండితులు పరిశీలింతురు గాక!

"త్వం త్వా వాజేషు వాజినం వాజయామః శ్శతక్రతో, ధనానా మింద్రసాతయే." 1.4.9.

సాయణుల భాష్యం : హేశతక్రతో। బహుకర్మయుక్త, యద్వా, బహు ప్రజ్ఞాన యుక్త ఇంద్ర।....." పెక్కుకర్మలతోగాని, పెక్కు విజ్ఞానములతోగాని కూడిన వాడింద్రుడు.

"ఇది, పరమైశ్వర్యే" అను ధాతువు నుండి ఇంద్ర శబ్ద మేర్పడుచున్నది. ఇంద్రుని యొక్క పరమైశ్వర్యము (ఈశ్వరభావము) అతడు సూర్యాగ్ని వాయ్వాది రూపుడై యుండుటయే అని ఈ దిగువ మంత్రము తెలుపుచున్నది.

"యుం జన్తిబ్రధ్నమరుషం చరన్తం పరి తస్థుషః రోచన్తే రోచనా దివి." 1.6.1

ఒక్కడే అయిన ఇంద్రుని–దివము నందున్న సూర్యునిగను, హింసారహిత మయిన అగ్ని రూపముగనున్న వానినిగను, వాయురూపముగ అంతటి సంచరించుచున్న వానిని గను, అంతటను తిరుగుచున్న ప్రాణులు భావించి ఆరాధించు చున్నారు. ఆకాశమున నున్న నక్షత్రములు కూడ ఇంద్ర స్వరూపములే కాని భిన్నములు కావు.

ఇంద్రుడు–తానే మనువు, సూర్యుడు అయినట్లు "అహం మనురభవం సూర్య శ్చాహం" (ఋ. 4.26.1) అని వచించినాడు. ఇంద్రుడు సూర్యుడని సంబోధించబడినాడు (ఋ. 10.89.2). ఇంద్రుడు–సూర్యుడు ఒకడే అయినట్లు ఆహ్వానించబడినాడు (ఋ. 8.92.19) ఇంద్రుడనగా సూర్యుడని శతపథ బ్రాహ్మణము (1.6.4.18) తెలిపినది. ఇంద్రుడే సూర్యుని పుట్టించినాడని (జనితా సూర్యస్య ఋ. 3.49.4) అనియున్నది.

ఋగ్వేదము ఇంద్రుని గురించి ఈ క్రింది విధముగా వచించినది.

దేవుడు కాని, మనుష్యుడు కాని ఆయన కంటెను ఎక్కువవాడు, సమానుడు లేడు (6.30.4). దేవతలలో ఆయన వంటివాడులేడు. ఇంతకు ముందు పుట్టినవారును, ఇప్పుడు పుట్టిన వారును, ఆయనకు సాటిరారు (1.165.9). దేవతల కంటె గొప్పవాడు (3.46.3). పుట్టినవారిలోను, పుట్టబోయేవారిలోను ఆయనకు సాటి ఎవ్వరు లేరు (4.18.4). శక్తిలోను, బలములోను దేవతలందఱు ఆయన కంటె తక్కువవారే (8.5.17). ఆయనకున్న శక్తి ముందు వారికి, తరవాత వారికి, ఇప్పటి వారికి లేదు (5.42.6). ఆయనకున్న శక్తి దేవతలకు, మనుష్యులకు నీటికి లేదు (1.100.5), ఇప్పటి వారెవరు ఆయనకు సాటిరారు (1.165.9), అతడు స్వరాట్ (3.46.1) ఆయన తన శక్తితో ఏకైకుడుగా పాలించు పూర్వజుడైన ఋషి (ఋషిర్హి పూర్వజా అస్యేక ఈశాన ఓ జసా - 8.6.41).

ఆయన ఆజ్ఞను వరుణుడు, సూర్యుడు పాటింతురు. ("యస్య వ్రతే వరుణో యస్య సూర్య" 1.101.3, 2.38.9), 'శచీవత్' (శక్తిగలవాడు) అను పదము ఋగ్వేదములో ఇంద్రునకు 15 చోట్ల, ఇతర దేవతలకు రెండు చోట్ల వాడబడినది. శచీపతి(=శక్తికి పతి)

అను పదము ఋగ్వేదములో 10 చోట్ల ఇంద్రునకు, ఒక చోట (7.67.5) అశ్వినులకు వాడబడినది. ("తానః శక్తం శచీపతి శచీభిః"= ఆ శచీపతులు మాకు శక్తులు ఈయవలయును.) ఒకచోట ఇంద్రుడు "శచీపతే శచీనాం" (శక్తులకుపతి అయిన శచీపతి) అని పునరుక్తితో సంబోధించబడినాడు. (10.24.2).

ఇంద్రుడు 'విశ్వకర్మా (8.98.2)' అనగా సృష్ట్యాది కర్మలు గల మహాశిల్పి అని స్తుతించబడినాడు. అందువలననే పురాణ వాఙ్మయమున-కర్మశక్తి (శచి) భార్యగా వర్ణింపబడినది. ప్రతివారు కర్మ యోగులుగా జీవించుటయే వేదహృదయము. అసలు కర్మచేతనే జీవత్వము ఏర్పడుచున్నది. అనాది కర్మ ప్రవాహమున బడి ఈదులాడుటయే జీవుని స్వభావము. కర్మయే లేనిచో జీవుడే ఉండడు. అందువలననే జీవునికి కర్మతో విడదీయరాని బంధము కలదు. అందుకే కర్మ బంధమన్నారు. ఆ బంధమును వదిలించుకొనుటకు కర్మయే కావలసియున్నది.

"శచ్యా కర్త పితరా యువానా శచ్యాకర్త చమసం దేవపానం
శచ్యా హరీ ధనుతరావ తష్టేంద్ర వాహా వృభవో వాజరత్నాః." **4.35.5.**

శచి అనగా శిల్పకర్మ కౌశలము, ప్రజ్ఞ, జ్ఞానమని భావము. ఋభువులు అట్టి కర్మకౌశలము చేతనే తమ తల్లిదండ్రులను యౌవన వంతుల నొనర్చినారు, దేవతలు అమృత పానము చేయు సాధనమైన చమస (పాత్ర) మును నిర్మించినారు, ఇంద్రుని గుఱ్ఱములను వేగము కలవాని నొనర్చినారు (ఇచట ఇంద్రాశ్వములు యంత్రమయములని గ్రహించవలయును).

పై మంత్రమున శచీ పదమును శిల్పకర్మను చెప్పుటకు వాడుట గమనించ దగినది. శచీ శబ్దమునకు ప్రజ్ఞ అనియు అర్థము ఋక్కుల యందు కన్పించుచున్నది. "శచీన ఇంద్ర పురుకుద్యు మత్తమ" (1.53.3), శచీన=ప్రజ్ఞానామ, శచీవః=ప్రజ్ఞావన్ అని భాష్యము. ప్రజ్ఞా ప్రతిభాదులు చతురబుద్ధి లక్షణములు.

ఇంద్రునకు ఋగ్వేదములో దాదాపు 60సార్లు 'శతక్రతు' అను పదము వాడబడినది. సాయణులు "శతక్రతో" (సంబోధన) అను శబ్దమునకు బహుకర్మన్ (చాలపనులు కలవాడా). బహుప్రజ్ఞ (చాల ప్రజ్ఞలు కలవాడు) అను అర్థములను వ్రాసినాడు (ఋ.1.10.1 భాష్యం). కొండూరు వీరరాఘవాచార్యులవారును 'క్రతు' శబ్దమునకు మొదట కర్మమనియే అర్థముండెడిదనియు, అట్టిది క్రమముగా యజ్ఞమునకు రూఢిచేసినారనియు, శతక్రతువనగా బహువిధ శిల్పకర్మలను చేయువాడు, పాలించువాడు, ప్రోత్సహించువాడు అనియే తాత్పర్యము' అని 'ఋగ్వేద రహస్యాలు' అను గ్రంథమున వ్రాసినారు.

ఋగ్వేదము ఇంద్రుని యొక్క బృహత్ శరీరమును గురించి "అపారమైన భూమ్యాకాశములను పట్టుకొని నప్పుడు అవి ఆయన పిడికిటిలో ఇమిడి, పోయినవి (3.30.5), భూమ్యాకాశములు ఆయనలో సగము (6.30.1, 10.119.7), భూమ్యా

కాశములు ఆయన మొలత్రాడునకు చాలవు. (అరం రోదసీ కక్ష్యే నాస్మై' 1.173.6)" అని తెలిపినది. "మహతో మహీయాన్' అని శ్రుతి. మహత్తత్వము ఆకాశము కంటెను గొప్పది. కనుక ఇంద్రునకును విశ్వకర్మకును అభేదమే. మత్స్య పురాణము 250 అధ్యాయమున శిల్పశాస్త్రోపదేశికులలో శుక్ర-బృహస్పతి-విశ్వకర్మ- భృగువు మున్నగువారితో బాటు పురందరుని కూడ పేర్కొనినది. పురందరుడు అనగా ఇంద్రుడేగదా! కనుక ఇంద్రుడు మహాశిల్పి యనుట నిక్కము.

"సువీరస్తే జనితా మన్యత ద్యౌ రింద్రస్య కర్తా స్వప స్తమో Z భూత్,
య ఈం జజాన స్వర్యం సువజ్ర మన పచ్యుతం, సదసోన భూమ."　　4.17.4.

ఇంద్రా! ఏ ప్రజాపతి – స్తోత్రార్హుడవును, స్వర్గపాలకుడవును, మంచి వజ్రము కలవాడవును అగు నిన్ను కనెనో, ఆ ప్రజాపతి సుసంతానము కలవాడును, మంచిపని చేసినవాడును అయి సంతసించుచున్నాడు. ఇచట ప్రజాపతి అనగా "ప్రజాపతి ర్విశ్వకర్మా' అను శ్రుతి ప్రకారము విశ్వకర్మయే అని భావము.

"త్వ మథ ప్రథమం జాయ మానో Z మే విశ్వా అధిథా ఇంద్ర కృష్టీః"　　4.17.4.

ఓ ఇంద్రా! నీవు భగవంతునికి మొదట పుట్టినవాడవై జగమున గల సమస్త జనులకు అధిపతివై వారిని రక్షించినావు.

బ్రహ్మ-విష్ణు-శివ-ఇంద్ర-సూర్యులు విశ్వకర్మ భగవంతునికి మొట్ట మొదటగ జన్మించి జగత్సృష్టి కర్తలైనారని స్కాంద పురాణాదులును వర్ణించుచున్నవి గదా!

యజుర్వేద పురుషసూక్తము పురుషుని (విశ్వకర్మ) నుండి ఇంద్రుడు, అగ్ని పుట్టినారు (ముఖాదింద్రశ్చాగ్నిశ్చ) అని వచించినది.

యజుర్వేద పురుషసూక్తము పురుషుని (విశ్వకర్మ) నుండి ఇంద్రుడు. అగ్ని పుట్టునారని (ముఖాదింద్రశ్చాగ్నిశ్చ) అని వచించినది.

ఋగ్వేదము (8.98.2) న ఇంద్రుడు 'విశ్వకర్మన్' అని చెప్పబడినాడు.

"ఇంద్రం మిత్రం వరుణ మగ్నిమాహు రథో దివ్యస్స సుపర్ణో గరుత్మాన్,
ఏకం సద్విప్రా బహుధా వద న్త్యగ్నిం యమం మాతరిశ్వాన మాహుః."

ఋ. 1.164.46.

జగత్కారణ మయిన ఏకైక సత్పదార్థమును మేధావులగు వారు (విప్రులు) తత్వ పరిశీలనము చేసి ఇంద్రుడనియు, మిత్రుడనియు, వరుణుడనియు, అగ్ని అనియు ఆకాశ సంచారము చేయు మంచి ఱెక్కలుగల గరుత్మంతుడనియు, యముడనియు, మాతరిశ్వ డనియు చెప్పుచున్నారు.

ఒకే ఒక జగత్కారణ సద్రూప పరమాత్మ, తన యందు తోచిన భిన్నభిన్న కార్యములను బట్టి భిన్న భిన్న నామరూపములతో వ్యవహరించబడుచున్న దనుట ఈ మంత్రము నందలి పరమార్థము.

వేదముల యందింతటి మహోత్కృష్టుడుగ వచింపబడిన ఇంద్రుడు పురాణ వాఙ్మయమున అహల్య జారుడుగ వర్ణింపబడుట వేద విరుద్ధము గదా! హలము అనగా నాగలి. హల్య అనగా నాగళ్ళ సమూహము. అహల్య అనగా నాగళ్ళు తగలని నేల. ఇంద్రుడు మహాశిల్పి, విశ్వకర్మ గనుక అట్టి భూమిని సాగుచేయుట అను క్రియ అహల్యతో సంభోగముగ వక్రీకరింపబడి యుండునని తోచెడిని. లేదా అహల్యాజారుడగు ఇంద్రుడు సృష్టికర్తయగు ఇంద్రుడు ఒక్కడేకాక పోవచ్చును. F.N.2



వేదములలో ఇంద్రుడు, మహేంద్రుడు, వాసవుడు, వైకుంఠేంద్రుడు, ముష్కరేంద్రుడు, త్రైలోక్యాత్మేంద్రుడు, విశ్వకర్మేంద్రుడు అనునామములు కన్పించుచున్నవి.

ఋగ్వేదము దశమ మండలము (47,18,49,50 సూక్తములలో వైకుంఠేంద్రుడు' దేవతగా స్తుతించబడినాడు. శుక్లయజుర్వేదము 8వ అధ్యాయము 46వ మంత్రమునకు దేవత-విశ్వకర్మేంద్రుడు . సామవేద కౌథుమ జైమిని-రాణాయనీయశాఖల గానభాగములలో పేర్కొనబడిన 641-650 ఋక్కులకు 'దేవతా ఇంద్ర స్త్రైలోక్యాత్మా' అని పేర్కొనుట జరిగినది. ఋగ్వేదము దశమ మండలము 38వ సూక్తమునగల 5 ఋక్కులకు ఋషి 'ఇన్ద్రోముష్కవాన్' అని యున్నది. ఈ ఇంద్రులందఱు ఒక్కరేకాదు. అనేకులు అని పండితుల అభిప్రాయము. పురాణములలో ఒక్కొక్క మన్వంతరములో ఒక్కొక్కరు ఇంద్రపదవి నధిష్ఠించి నట్లు తెలియుచున్నది. ఇంద్రుడనగా నూఱుక్రతువులు చేసినవాడని పురాణ వాఙ్మయము పేర్కొనుచున్నది. పురాణములలోని పైరెండు విషయములు నూఱు క్రతువులు చేసినవారు ఒక్కొక్క మన్వంతరములో ఒక్కొకరు ఇంద్రుడైనాడని చెప్పుకొనినను, బలి, ప్రహ్లాదుడు మొదలగువారు ఇంద్రపదవి నధిష్ఠించినటుల పురాణములయందే వ్రాయబడుట పురాణములలోని భిన్నత్వమును తెలియజేయుచున్నది. మరియు పురాణములలో ఇంద్రుడు స్వార్థపరుడుగా, అసూయాపరుడుగా, జారుడుగా, పిరికివాడుగా పేర్కొనుట జరిగినది. ఈ గ్రంథములో వచింపబడిన సృష్టికర్తయగు ఇంద్రునికి, పురాణములలో వర్ణింపబడిన ఇంద్రునికి ఎంతయో వ్యత్యాసమున్నది. మరియు నీ గ్రంథమున వచింపబడిన ఇంద్రుడు విశ్వకర్మ తనయుడుగా పేర్కొనబడుటచే వేదములయందు 'విశ్వకర్మేంద్రుడు'గా పేర్కొనబడిన ఇంద్రుడే అని స్పష్టమగుచున్నది.

ఋగ్వేదమునను ఇంద్రుని వీరోచిత కార్యములనేకము స్తుతించబడినవి. ఋగ్వేదములో వృత్ర వధచేసిన ఇంద్రుడు 104 సూక్తములలో అభివర్ణించబడినాడు. మరియు నతడు అనేక రాక్షసులను చంపినట్లు ఋగ్వేదమే తెలుపుచున్నది. సహజముగ యుద్ధములు చేయువారు రాజులే కనుక ఆ ఇంద్రునిగ లేక మహేంద్రునిగ భావించవచ్చును. అట్లే అహల్యాజారుడగు ఇంద్రుడు 'ముష్కరేంద్రుడు" కావచ్చును. ఈ విషయములనింకను పండితులు పరిశోధింతురుగాక!

ఋగ్వేదము (1.86-11,12)లో ఇంద్రుని భార్య 'ఇంద్రాణి' అని చెప్పబడినది. శతపథ బ్రాహ్మణము (14.2.1.8) ఇంద్రాణి ఇంద్రుని భార్య అనిచెప్పినది. ఐతరేయ బ్రాహ్మణము (3.22.7) ప్రాసహా, సేనా' అనువారు ఇంద్రుని భార్యలు అని తెలిపినది. తైత్తిరీయ బ్రాహ్మణము (2.4.2.7,8) మైత్రాయణీ సంహిత (3.8.4, 4.12.1) ప్రాసహా సేనా అనువారు ఇంద్రాణి ఒక్కరే అని తెలిపినది.

ఈపై నుదాహరించిన గ్రంథము (గాయత్రీ మంత్రవిశేషములు) లోని ఇంద్రుడు త్రైలోక్యాత్మేంద్రుడుకాని విశ్వకర్మేంద్రుడు కాని కావచ్చును. ఈ విషయమునింకను పండితులు పరిశోధింతురు గాక!

9. సవిత-సూర్యుడు-విశ్వకర్మ

'సవితృ' శబ్దము 'షూ ప్రేరణే' అను ధాతువు నుండి పుట్టినది. 'సువతి-సుప్తం ప్రేరయతీతి సవితా' అనగా నిద్రించువానిని మేల్కొలుపువాడు అని వ్యుత్పత్త్యర్థము. ఋగ్వేదము లోని మూడవ మండలము 62వ సూక్తము నందలి దశమ మంత్రమునకు భాష్యము వ్రాయుచు సాయణులు 'సవితృ' పదమునకు ప్రాణులను నిద్ర నుండి మేల్కొలిపెడి సూర్యుడనియు అర్థము చెప్పినారు. ఋగ్వేదములో సూర్యుడు 10 సూక్తములలో స్తుతించబడినాడు.

అమరకోశము సూర్యుడు-సవిత-వివస్వతుడు-పూషుడు-తరణి-మిత్రుడు. అను పదములను పర్యాయ పదములుగ తెలిపినది. ఋగ్వేదము సూర్యుని చేత ప్రేరేపించబడిన జనులు వారి వారి పనులను నిర్వహింతురు (7.63.4) అనియు, సూర్యుడు అందరికిని సమానుడై అందరిని ప్రేరేపించువాడుగ ఉదయించును (7.63.2.3), అనియు వచించుచు, సవిత ప్రేరణ వలన నదులు ప్రవహించును (3.33.6)అనియు, సవిత అవిద్యను నాశనము చేయుటకు బుద్ధులను ప్రేరేపించును (3.62.10) అనియు తెలిపినది. దీనిని బట్టి సూర్యుడు సవిత-ఇరువురు ప్రేరణకర్తలని స్పష్టమగుచున్నది.

"తరణి ర్విశ్వ దర్శతో జ్యోతిష్కృదసి సూర్య విశ్వమాభాసి రోచనమ్." ఋ. 1.50.4.

ఓ సూర్యుడా! నీవు జీవులను తరింపచేయునట్టివాడవు. అందువలననే నీకు 'తరణి' అను పేరు కలిగినది. అటులనే నీవు సర్వప్రాణులకు దర్శనీయుడవు.

"ఉద్వయం తమస స్పరి జ్యోతి ష్పశ్యంత ఉత్తరం
దేవం దేవత్రా సూర్య మగన్మ జ్యోతి రుత్తమమ్." ఋ. 1.50.10.

చీకటి (రాత్రి)కి పిమ్మట ఉదయించువాడును, దేవతలలో శ్రేష్ఠుడును, జ్యోతి స్వరూపుడును అగు సూర్యుని దర్శించి, ఆ ఉత్తమ జ్యోతిని పొందుదుముగాక!

మరియు "సూర్య ఆత్మా జగతస్త స్థుషశ్చ" (ఋ. 1.115.1, 7.60.2) అనగా సూర్యుడు చరాచరములకు ఆత్మ-అని తెలుపబడినది.

ఋగ్వేదము సవితృ దేవుడు చరాచరములన్నిటికి ప్రభువు (4.53.6) అనియు, తైత్తిరీయ బ్రాహ్మణము "ప్రజాపతి అయిన సవిత జీవులను సృజించినాడ"నియు (1.6.4.1) తెలిపినది.

శ్వేతాశ్వతరోపనిషత్తు "ఏషదేవో విశ్వకర్మా మహాత్మా సదాజనానాం హృదయే సన్నివిష్టః" అనగా ఎల్లప్పుడును జనుల హృదయమున నుండువాడు మహాత్ముడగు

విశ్వకర్మ-అనియు, ఋగ్వేద యజుర్వేదములందలి విశ్వకర్మ సూక్తమంత్రము "స ఆశిషా ద్రవిణ మిచ్ఛమానః పరమ చ్ఛదో వర ఆవివేశ" అనగా విశ్వకర్మ మఱల సృష్టింప వలయునను సంకల్పముతో ప్రాణుల హృదయమునందు ప్రవేశించి నాడు-అనియు తెలిపినది.

బుద్ధియే బ్రహ్మము యొక్క ఆనంద స్వరూపము నెఱుగగలదని-తైత్తిరీయోపనిషత్తు వచించుట వలన, ఆ బుద్ధులను ప్రేరేపించువాడు ప్రాణులలో జీవుని రూపమున నున్న విశ్వకర్మ పరమాత్మయే అగును. సవితృ దేవుడు బుద్ధులను ప్రేరేపించు చున్నాడని ఋగ్వేద మంత్రము (3.62.10) తెలుపుచున్నది.

పై విషయముల వలన సవిత-సూర్యుడు-విశ్వకర్మ-ఒక్కరే అని తెలియుచున్నది.

"అయం దేవానా మపసా మపస్తమో యోజజాన రోదసీ విశ్వశంభువా,
వియో మమే రజసీ సుక్రతూ యయా Z జరేభిః స్కంభనేభిః సమానృచే."
ఋ. 1.160.4.

విశ్వములకు సుఖ దాయకములయిన ద్యావా పృథువుల నెవడు సృష్టించెనో, దేవతలలో శ్రేష్ఠుడును కర్మవంతులలో శ్రేష్ఠకర్మ కలవాడును అగు సూర్యుడు, రంజింప జేయు ద్యావా పృథువులను, ప్రాణులకు సుఖమును కలుగజేయు కర్మచేత విశేషము కలవానిని చేసెను. జీర్ణములు కాని గట్టినైన శంకువులచేత స్థాపించెను.

"సవితా యంత్రైః పృథివీ మరమ్ణా దస్కంభనే సవితా ద్యామ దృంహత్." 10.149.1.

సవిత యంత్రముల చేత భూమిని నిలిపెను. జీర్ణములు కాని గట్టివైన శంకువుల చేత ద్యులోకమును నిలిపెను.

విశ్వకర్మ ఒక్కడే ఈ ద్యావా పృథువులను సృష్టించినాడని "ద్యావా భూమీ జనయన్ ఏకదేవః" (ఋ. 10.81.3) అను విశ్వకర్మ సూక్త మంత్రము తెలుపుచున్నది.

పై విషయములు సవితృ-సూర్య-విశ్వకర్మల అభేదమును తెలుపుచున్నవి.

"తే హి ద్యావా పృథివీ విశ్వశంభువ ఋతావరీ రజసో ధార యత్కవీ,
సుజన్మనీ ధిషణే అంతరీయతే దేవీదేవో ధర్మణా సూర్యః శుచిః" 1.60.1.

ఇందు విశ్వక్షేమంకరములైన ద్యావా పృథువులను దేవునిగను, దేవతగను పేర్కొని వాటిలో ద్యులోకమున నుండువాడు పరమాత్మ స్వరూప సూర్యుడే అని చెప్పబడినది.

ఆ సూర్యునే ద్యావా పృథువులకు పుత్రునిగను, వాటికి సృష్టికర్తగను, ఈ సూక్తము నందలి తరువాతి మంత్రములు "సవహ్నిః పుత్రః పిత్రో పవిత్ర వా న్పునాతి ధీరో భువనాని మాయయా" (3) "పితా మాతాచ భువనాని రక్షితః" (2) తెలుపుచున్నవి. 4వ మంత్రము "అయందేవానా మపసా మపస్తమో, యో జజాన రోదసీ విశ్వశంభువా" అనగా సృష్టికర్తలలో గొప్ప సృష్టికర్త అయిన ఆ సూర్యుడే ద్యావా పృథువులచే రక్షింపదగిన జగములను కల్పించినాడని తెలిపినది కదా!

"మహా నాదిత్యో నమ సోప సద్యో యాత యజ్ఞనో గృణతే నుశేవః,
తస్మా ఏత త్పన్యత మాయ జుష్ట మగ్నౌ మిత్రాయ హవి రాజుహోత."

ఋ. 3.59.4.

ప్రతి ప్రాతఃకాలము నందును జనులను తన ఆరాధన కొఱకు ప్రేరేపించుచున్న (మేల్కొలుపుచున్న) సూర్యుడు మహాత్ముడు. అనగా పరమాత్ముడే. కనుక ఆ పరమాత్మ అందఱి చేతను నమస్కారము (ఆరాధన) లను పొందదగినవాడు, సేవింపదగినవాడు, ఉపాసింపదగిన మిత్రుడు అని చెప్పదగిన ఈ దేవుని గూర్చి నిత్యమును అగ్నియందు ఆహుతులను సమర్పించుచు ప్రార్థింపుడు.

"సప్త త్వా హరితో రథే వహంతి దేవ సూర్య, శోచిష్కేశం విచక్షణ!" ఋ. 1.50.8.

ఓ సూర్యదేవా! నీ రథమును ఏడు గుఱ్ఱములు లాగుచున్నవి. ఇందలి 'సప్త' శబ్దముచే ఆధారాదులును, 'రథ' శబ్దముచే శరీరమును సూచించబడును. సూర్యజ్యోతి – సహస్రారస్థిత పరమాత్మ అని స్పష్టము చేయుచున్నది.

"ఇమం రథ మధియే సప్త తస్థుః, సప్త చక్రం సప్తవహన్త్య శ్వాః" (ఋ. 1.164.3.) అను మంత్రమును, 'సప్త యుంజంతి రథమేక చక్ర మేకో అశ్వో వహతి సప్తనామా (1.164.2.) అను మంత్రమును, ఏక చక్రము గల శరీరమనెడి రథమున ఆధారాది సప్త కమలములున్న వనియు, సప్త కమలములతో కూడిన ఈ శరీరమును ప్రాణవాయువనెడి గుఱ్ఱములాగు చున్నదనియు తెలుపుచున్నదికదా!.

"పాకః పృచ్ఛామి మనసా విజానన్ దేవానా మేనా నిహితా పదాని,
వత్సే బష్కయే Z ధి సప్త తంతూ న్వితత్ని రే కవయ ఓతవా ఉ." ఋ. 1.164.5.

దేవానాం = దేవతల యొక్క (ఆధారాది దివ్యశక్తుల యొక్క), ఏనాపదాని=ఈ తత్త్వములు, నిహితాః= అతి రహస్యములుగా ఉంచబడినవి, వత్సే=సర్వమునకు ఆధార భూతమయిన, బష్కయే=ఆదిత్యుని యందు (బ్రహ్మయందు లేక ఆత్మతత్త్వము నందు)

అధి=అధికముగ, కవయః= క్రాంత దర్శులైన సాధకులు, సప్త తంతూన్=సప్త కిరణములను (సప్తచక్రములను), ఓతవై=సాధనార్థము, వితత్నిరే=వ్యాపింపచేసిరి. ఈ విషయమును, పాకః=అపరిపక్వుడనైననేను, మనసా=మనస్సు చేత, అవిజానన్=తెలియలేక, పృచ్ఛామి=అడుగుచున్నాను.

"సప్త యుంజన్తి రథ మేక చక్రం ఏకో అశ్వో వహతి సప్తనామా,
త్రినాభి చక్రమజర మనర్వం యత్రేమా విశ్వా భువనాని తస్థు." ఋ. 1.164.2.

సూర్యుని రథము ఒక్క చక్రము మాత్రమే కలది. దానిని ఏడు పేర్లుగల ఒకే అశ్వము లాగుచున్నది. అనగా సప్తవిధములుగాగల ఒకే వాయువు లాగుచున్నదని భావము. మరియు ఆధారాది సప్తచక్రముల యందలి చలనమే శరీరమును సజీవమొనర్చి నడుపుచున్నదనియు, ఆ రథము నధిష్ఠించిన పరమాత్మ నాశ్రయించియే సమస్త భువనములు స్థితినందు చున్నవని ఆధ్యాత్మికార్థము. త్రినాభి=మూడు ముఖ్యస్థానములు, (మణిపూరక, అనాహత, ఆజ్ఞలు) కలిగి, చక్రం=తిరుగు స్వభావముగల ఈ శరీరము, అజరం అనర్వం= (ప్రాణము యోగమార్గమున చక్కగా పనిచేసినంత వఱకు) శిథిలము కాదు, జీర్ణింపదు. ఏ శరీరమునందు ఈ సమస్త భువనములు అధివసించి యున్నవో, "యథా బ్రహ్మాండం, తథా పిండాండ మపి" బ్రహ్మాండము వంటిదే పిండాండము. అనగా బ్రహ్మాండమున కలవన్నియు పిండాండమున కలవని భావము.

"ఏక స్సుపర్ణ స్సముద్ర మావివేశ స ఇదం విశ్వం భువనం విచష్టే,
తం పాకేన మనసా పశ్య మంతిత తం మాతా రేఢి స ఉ రేఢి మాతరమ్."
ఋ. 10.114.4.

సుపర్ణః= సంచారక్షముడైన సూర్యుడు, ఏకః=అసహాయుడై, సముద్రమ్= అంతరిక్ష (ఆకాశ)మును, ఆవివేశ=ప్రవేశించెను, సః=అతడు, ఇదం విశ్వం భువనమ్=ఈ సమస్త విశ్వమును, విచష్టే=అనుగ్రహ దృష్టితో చూచుచున్నాడు. తమ్=అట్టి సూర్యుని, పాకేన మనసా=పరిపక్వ చిత్తముతో, అంతితః= దగ్గఱగా, అపశ్యం=చూచితిని, తం=అతనిని, మాతా=ఉదక నిర్మాత్రియైన మధ్యమ వాక్కు, రేఢి=ఆస్వాదించెను, మాతరం=ఆవాక్కును, స ఉ=అతడును, రేఢి=ఆస్వాదించెను. అనగా వాక్కుచేత అతడు, అతని చేతవాక్కు పరస్పరము ఉపజీవింపబడుచున్నవని భావము.

ఇచట 'సుపర్ణ' శబ్దమునకు పరమాత్మ అని అర్థము చెప్పుకొనిన అతడు సముద్రము వంటి జగ(దేహ)మున ప్రవేశించి ఆ విశ్వమును పరిశీలించుచున్నాడనియు, అతనిని పరిపక్వ చిత్తులు పొడగాంతురనియు ఆధ్యాత్మికార్థము బోధపడును.

ఈ మంత్రములందు సూర్యునికి 'సుపర్ణ' శబ్దమును వాడుట సూర్య సుపర్ణులకు గల అభేదమును తెలుపుచున్నది. సుపర్ణుడు సానగాది పంచఋషులలో ఐదవవాడు. స్కాందాది పురాణములలో సూర్యునకు సుపర్ణ ఋషికి అభేదము స్పష్టముగా తెలుపబడినది. "ద్వా సుపర్ణా సయుజా సఖాయౌ" (ఋ. 1.164.20) అను మంత్రములోని మొదటి రెండు పాదములు 'దూరదృష్టిగల మేధావులు సద్వస్తువగు ఒకే సుపర్ణుని తమ వాక్కుల చేత అనేక విధములుగా అనేక నామములతో పలుకుచుందురని తెలుపుచున్నది గదా!

ఇతని సప్తకిరణములను సప్తర్షులుగా భావించి, వాటికి జనకమైన మండలమును (సమష్టి రూపమును) విశ్వకర్మగా భావించి "త ఆ యజన్త ద్రవిణం సమస్మా ఋషయః పూర్వే" అనెడి విశ్వకర్మ సూక్త వాక్య వ్యాఖ్యాన సందర్భమున "తే పూర్వ ఋషయో=ద్రష్టారో రస్మయోZ స్మా-ఆదిత్యా త్మకాయ విశ్వకర్మణే. ద్రవిణం-తేజం-ఆయజన్త" అనగా పూర్వఋషులని చెప్పదగిన ద్రష్టలు (కిరణములు) ఆదిత్యాత్మకుడైన విశ్వకర్మను తేజోరూప పూజాద్రవ్యములతో పూజించిరి" అని సాయణులు వ్రాసినారు.

"దివ్యం సుపర్ణం వాయసం బృహంత మపాం గర్భం దర్శత మోషధీనాం,
అభీపతో వృష్టిభి స్తర్పయంతం సరస్వంత మవసే జోహవీమి" ఋ.1.164.52.

దివ్యం=ఆకాశమున నుండువాడును, సుపర్ణం=మంచి గమనము గలవాడును, వాయసం=చరించువాడును, అపాం=నీళ్ళకు, గర్భం=నివాసమైనవాడును (కిరణముల ద్వారా నీటిని ఆకర్షించి వర్షము నొసంగువాడని అర్థము), ఓషధీనాం=లతావృక్ష సస్యాదుల, గర్భం=నివాసమును, దర్శతం=చూపువాడును, అభీపతః=అనుకూలముగా, వృష్టిభిః= వర్షముల చేత, తర్పదుంతం=లోకములను తృప్తి పఱచువాడును, సరస్వతం=ఉదకములు కలవాడును, అయిన సూర్యుని, అవసే=రక్షించుట కొఱకు, జోహవీమి=మాటి మాటికి పిలుచుచున్నాను.

అధ్యాత్మికార్థము:.....వృష్టిభిః తర్పయంతం=కోరికలను వర్షించి ప్రాణులను తృప్తి పఱచువాడును, సరస్వంతం=ఉదకమునకు సృష్టికర్త అయిన సహస్రారస్థిత పరమాత్మను, అవసే=రక్షణ కొఱకు, జోహవీమి=మాటిమాటికి పిలుచుచున్నాను.

"కిం స్విద్ గర్భం ప్రథమం దధ్ర ఆపో యత్రదేవా ప్రథమం గచ్ఛంత విశ్వే. ఋ. 10.82.5.
"తమిద్గర్భం ప్రథమం దధ్ర ఆపో యత్రదేవా స్సమ గచ్ఛంత విశ్వే." ఋ. 10.82.6.

ఈ రెండు మంత్ర భాగములు విశ్వకర్మ జలములను సృష్టించినాడని, వాటియందు జగద్బీజమును నిక్షేపించినాడని తెలుపుచున్నవి.

పై విషయముల వలన సూర్య–విశ్వకర్మల అభేదము తెలియుచున్నది.

ఋగ్వేదము సూర్యుని గమనమునకు వరుణుడు త్రోవచేసినాడనియు (ఉరుంహిరాజా వరుణశ్చకార సూర్యాయ పంథా మన్వేతవా ఉ, 1.24.8, 7.87.1), ఆదిత్యులైన మిత్రుడును, వరుణుడును, అర్యముడును త్రోవచేసినారనియు (7.60.4), సోముడు సూర్యునిలో కాంతిని స్థాపించినాడనియు (అయం సూర్యే అదధా జ్యోతి రంతః . 6.44.23, 9.97.41), సృష్టికర్త అయిన ధాత సూర్యుని చంద్రుని కల్పించి నాడనియు (సూర్యచంద్ర మసౌధాతా యథా పూర్వమకల్పయత్, 10.190.3.), జీవులందఱు సూర్యునిమీద ఆధారపడినవారే అనియు (1.164.4) తెలిపినది మరియు సూర్యుడు దేవతలకు గొప్ప పురోహితుడు (అసుర్యఃపురోహితః, 8.101.12) అనియు తెలిపినది. సూర్యునకు 'విశ్వకర్మన్' (10.170.4) అను విశేషణము వాడబడినది.

యజుర్వేదమున రుద్రుడు సూర్యుడుగ స్తుతింపబడుట ఈ క్రింది మంత్రమున చూడనగును.

"అసౌ యస్తామ్రో అరుణ, ఉత బభ్రు స్సుమంగళః
యే చేమాగ్ం రుద్రా అభితో దిక్షు శ్రితా
స్సహస్రశో హైషాన్ హేడ ఈ మహే" (కాండం. 4, ప్రపా5, అను1. మంత్రం7)

అథర్వవేదము :

"దివి స్పృష్టో యజత స్సూర్యత్వ గవ యాతా హరసో దైవ్యస్య,
మృడాద్ గంధర్వో భువనస్య య స్పతిరేక ఏవ నమస్యః సుశేవా" 2.1.2.2.

దివిలో నుండువాడును, పూజింపదగినవాడును, సూర్య సమాన తేజుడును, దేవతల కోపమును పోగొట్టువాడును (ఇంద్రియా టోపముల నణచువాడని అంతరర్థము), సుఖప్రదాతయు, భువన పాలకుడును అయిన సూర్యభగవానుడొక్కడే సర్వులకు నమస్కరింపదగినవాడు, సులభముగా సేవింపదగినవాడు.

"కాలో అశ్వో వహతి సప్త రశ్మిః సహస్రాక్షో అజరో భూరి రేతాః
త మారో హన్తి కవయో విపశ్చిత స్తస్య చక్రా భువనాని విశ్వా."
కాం.19, అను6, సూ.7, మం.1.

కాలమను అశ్వము ఏడు పగ్గములు కలదియు, ముసలితనము లేనిదియు, వేయికన్నులు కలదియు, గొప్ప రేతస్సు కలదియునై, తనపై నెక్కిన వారిని గమ్యస్థానమునకు

చేర్చుచున్నది. దాని నెక్కుటకు దిగుటకు నేర్పుగల విద్వాంసులు ఎక్కి ప్రయోజనములను సాధించుకొందురు (అనగా నేర్పుగలవారు సమయమును సద్వినియోగము చేసికొందురని భావము). సమస్త భువనములు ఆ అశ్వమునకు తిరుగ దగిన స్థానములయి ఒప్పుచున్నవి.

సప్తరశ్ములు అనగా ఏడు కిరణములనియు, ఏడు ఋతువులనియు భావించ వచ్చును. ప్రతి రెండు నెలలకొక ఋతువు చొప్పున ఆఱు ఋతువులు దేవజాతములనియు, ఏడవ ఋతువు మలమాసముగా చెప్పబడుచున్నదనియు ఋగ్వేదము (1.164.15) తెలుపుచున్నది. 'భూరిరేతస్సు' అనగా బ్రహ్మాండములను కనజాలు శక్తి కలదని భావము. ఈకాల స్వరూప రథమునకు చక్రములు సమస్త భువనములు.

ఏడు రశ్ములను ఏడుగురు సూర్యులనియు భావించవచ్చును. "దేవా ఆదిత్యా యే సప్త తేభిః సోమాభిరక్షనః" (9.114.3) అని ఋగ్వేదము తెలిపినది గదా! తైత్తిరీయా రణ్యకము ఆ ఏడుగురు సూర్యులపేర్లను 1.అరోగుడు, 2. భ్రాజుడు, 3. పటరుడు, 4. పతంగుడు, 5. స్వర్ణరుడు, 6. జ్యోతిషీమంతుడు, 7.విభాసుడు (1.7.1) అని తెల్పినది. ఆ అరణ్యకమే కశ్యపుని గూడ సూర్యునిగ వచించినది. సూర్యుని సప్త గాయత్ర్యాది ఛందస్సులు కలవాడనియు చెప్పవచ్చును. ఏలయన సూర్యుడు త్రయీ మయుడు గదా!

తైత్తిరీయ బ్రాహ్మణము :

"ఋగ్భిః పూర్వాహ్ణే దివి దేవ ఈయతే, యజుర్వేదే తిష్ఠతి మధ్యే అహ్నః,
సామవేదే నాస్తమయే మహీయతే, వేదైరశూన్యస్త్రిభిరేతి సూర్యః". 3.12.9.1.

సూర్యుడు ఉదయించునపుడు ఋక్స్వరూపుడుగను, మధ్యాహ్నమున యజుస్స్వరూ పుడుగను, అస్తమయవేళ సామస్వరూపుడుగను ఉండును అతడెప్పుడును వేదశూన్యుడై యుండడు.

కాలము సూర్యునివలననే నేర్పడుచున్నది కనుక 'కాలమ'నగా సూర్యుడని అర్థము. 'సహస్రాక్షః' అనగా అక్షులను బోలిన కిరణములుగలవాడు. సూర్యుడు సహస్రకిరణుడు కదా! లేక పరమాత్మ సహస్రాక్షుడు గనుక సూర్యుని పరమాత్మగను ఎంచవచ్చును. 'సూర్య ఆత్మా జగత స్త స్థుషశ్చ" (ఋ. 1.115.1) అనగా సూర్యుడు స్థావర జంగమ ప్రపంచమునకు ఆత్మ. కనుక అతడు పరమాత్మయే. సూర్యుడు తన ఉదయాస్త మయములచేత కాలచక్రమును త్రిప్పుచున్నందున అతడు కాలస్వరూపుడు.


"దివ్యో గన్ధర్వో భువనస్య య స్పతి రేక ఏవ నమస్యో విక్ష్వీడ్యః,
తం త్వా యౌమి బ్రహ్మణా దివ్యం దేవ, నమస్తే అస్తు దివి తే సధస్థమ్." 2.1.21.

భువనముల కధిపతియు, ద్యులోకములోనివాడును అగు గంధర్వుడు (సూర్యుడు) ఒక్కడే లోకమున నమస్కరింపదగినవాడు, స్తుతింప దగినవాడు. దివ్యుడవైన ఓ సూర్యదేవా! నిన్ను జగత్కారణ పరబ్రహ్మముగా నెంచుచున్నాను. లేదా నిన్ను నా స్తోత్ర మంత్రములతో సంయోగ పఱచుచున్నాను. దివము నందుండి ప్రకాశించు నీకు నమస్కారము.

"విశ్వకర్మా హ్యజనిష్ఠ దేవ ఆది,
ర్గంధర్వో అభవద్వితీయః,
తృతీయః పితా జనితౌషధీనాం
మపాం గర్భం వ్యదధా త్పురుత్రా."

అను యజుర్వేదీయ విశ్వకర్మ సూక్త మంత్రమువలన విశ్వకర్మ మొదట బ్రహ్మదేవుడై నాడనియు, పిమ్మట రెండవవాడుగా గంధర్వుడై నాడనియు, అనంతరము మూడవవాడుగా సోముడై నాడనియు తెలియుచున్నది. "గంధర్వ" శబ్దమునకు "సూర్యో గంధర్వః తస్యకిరణా న్యప్సరసః" అని యజుర్వేదము. అనగా గంధర్వుడనగా సూర్యుడనియు, అప్సరసలనగా కిరణములనియు భావము.

దీనిని బట్టి విశ్వకర్మ నుండి సూర్యుడు ఉద్భవించినట్లు స్పష్టమగుచున్నది.



10. పంచ-బ్రహ్మలు-ఋషులు-మూర్తులు

ఋగ్వేదము నందలి నాసయ సూక్త ప్రథమ ద్వితీయ మంత్రములు సృష్టికి పూర్వము అనగా సృష్ట్యాదిమ కాలమున సత్తు అనిగాని, అసత్తు అనిగాని చెప్పదగిన దేదియు లేదనియు (అనగా సదసదతీత తత్త్వమున్నదని గ్రహించవలయును). లోకములు గాని, ఆకాశాదులుగాని, ఆకాశాదుల యందిమిడియున్న స్వర్గాది భువనములుగాని లేవనియు, ఆవరించునది-ఆవరింపబడునది యేదియు లేదనియు తెలిపినది. ఆ సత్తు, అసత్తులులేని సదసదతీత తత్త్వమును, ఋగ్-యజుర్వేదము లందుగల విశ్వకర్మ సూక్తము, సృష్ట్యాది సమస్త కర్మలకు మూలమైన దగుటచే 'విశ్వకర్మ' అని వచించినది. దీనినే మూలస్తంభము ఈక్రింది విధముగ వచించినది.

"న భూమి నజలంచైవ నతేజో న చ వాయవః
న చ బ్రహ్మా న చ విష్ణు న చ రుద్రశ్చ తారకః
సర్వశూన్య నిరాలంబో స్వయంభూ విశ్వకర్మణః"

తా॥ భూమి, జలము, తేజస్సు, వాయువు, బ్రహ్మ, విష్ణు, రుద్రుడు, నక్షత్రములు ఏమియు లేక సర్వశూన్యమైయున్న కాలమున స్వయంభూ విశ్వకర్మ ఒక్కడే ఉండెను.

నాసదీయ సూక్తము నందలి తృతీయ మంత్రము సృష్ట్యాది యందుగల జగత్కారణ తత్త్వము (సదసదతీత తత్త్వము) నుండి 'తమస్సు' అనుమాయ కలిగి, ఆ మాయ జగత్కారణముతో అవిభాగాపన్న మైనదని తెలిపినది. ఈ 'తమస్సు' నే విశ్వకర్మ సూక్త మంత్రము 'నీహారము' అని వచించినది. మరియు కృష్ణ యజుర్వేదీయ చతుర్థకాండ షష్ఠ ప్రపాఠకము ద్వితీయానువాకము నందలి విశ్వకర్మ సూక్తమిట్లు తెలుపుచున్నది.

"యో నః పితా జనితా యోవిధాతా యో న స్సతో అభ్యాస జ్జజాన" 3

యః= ఏ విశ్వకర్మ, నః=మనకు, పితా=పాలకుడును, జనితా=పుట్టించిన వాడును, విధాతా=సమస్త జగత్తులకు ఉత్పాదకుడును, అయియుండెనో, యః=ఏ విశ్వకర్మ, నః =మనకు కావలసిన అనుభవయోగ్య వస్తు సమూహములను,సతః సత్తునుండి, జజాన = కలిగించినాడో.

"విశ్వకర్మా మనసా యద్విహాయా ధాతా విధాతా పరమోతపంద్రుక్ ..." 2

యత్=ఎందువలన, విశ్వకర్మ, మనసా=తన మనస్సంకల్పము చేత, విహాయా= విశేషముగా తాను సృష్టించిన వాటిని సంహరించు వాడును, ధాతా=పుట్టించువాడును, విధాతా=పోషించువాడును, అయినాడో

ఈవిధముగా వచించుటచే విశ్వకర్మ సృష్టికర్తయని స్పష్టమగుచున్నది.

"త ఆ యజన్త ద్రవిణం సమస్మా ఋషయః పూర్వే జరితారో నభూనా
అసూర్తా సూర్తా రజసో విమానే యే భూతాని సమకృణ్వ న్నిమాని." 4

యే=విశ్వకర్మచే సృష్టింపబడిన మొట్టమొదటి ఏ సృష్టికర్తలు, ఇమాని భూతాని=ఈ ప్రాణులను, సమకృణ్వన్=సృజించినారో, తే పూర్వే=ఆ పూర్వులైన సృష్టికర్తలు, అనగా మనుమయాది పంచబ్రహ్మలు లేదా బ్రహ్మ-విష్ణు-రుద్రాది పంచమూర్తులు, లేదా సానగాది పంచఋషులు, అస్మై=తమచే సృజించబడిన ఈ జగత్తు కొఱకు, ద్రవిణం=ధనమని చెప్పదగిన భోగ్యవస్తు సమూహమును, సమాయజంత=సృష్టించిరి. ఋషయః= అతీంద్రియ జ్ఞానముగల (సర్వజ్ఞులైన), తే=ఆ ఋషులు లేక మూర్తులు లేక బ్రహ్మలు, భూనా=తమ మహిమచేత ఎప్పుడును, జరితారః న=జీర్ణులుకారు. (వారు) వారిచే సృజింపబడిన లౌకికజీవులు, అసూర్తా=ప్రాణములు కలిగిన (వారిని సృష్టించిరి) వారై, రజసో విమానే సూర్తా=తాము చేసిన రంజనాత్మక కర్మల (చేత ప్రేరేపింపబడుచు) ను అనుభవింప సంసిద్ధులై యున్నారు.

ఈ మంత్రమున 'పూర్వే ఋషయః' అనుటవలన, ఈ పంచఋషులు ప్రాచీనులు, ప్రథములు అని తెలియుచున్నది. **ఈ పంచఋషులు కృష్ణ యజుర్వేద (తైత్తిరీయ సంహిత) చతుర్థకాండ. తృతీయ ప్రశ్నమున ఈక్రింది విధముగా ప్రస్తావించబడినారు.**

1. ప్రాచీదిశాం, వసన్త ఋతూనా, మగ్నిర్దేవతా, బ్రహద్రవిణం, త్రివృత్‌స్తోమ, స్స ఉ పంచ దశవర్తని, స్త్ర్య విర్వయః, కృతమయానాం, పురోవాతోవాత, స్సానగఋషిః.

2. దక్షిణ దిశాం, గ్రీష్మఋతూనా, మింద్రో దేవతా, క్షత్రం ద్రవిణం, పంచదశ స్తోమ, స్స ఉసప్తదశవర్త నిర్దిత్యవాడ్వయ, స్త్రేతా యానం, దక్షిణ ద్వాతో వాత, స్సనాతనఋషిః.

3. ప్రతిచీదిశాం, వర్షఋతూనాం, విశ్వేదేవాదేవతా, విట్‌ద్రవిణగ్ం, సప్తదశ స్తోమ, స్స ఉ వేకవిగ్ంశవర్తని, స్త్రివత్సోవయో, ద్వాపరో Z యానాం, పశ్చాద్వాతోవాతో, అహభూన ఋషిః.

4. ఉదీచీదిశాగ్ం, శరదృతూనాం, మిత్రావరుణౌ దేవతా, పుష్టం ద్రవిణ, మేకవిగ్ం శ స్తోమ, స్స ఉ త్రిణవ వర్తని, స్తుర్యవాడ్వయ, ఆస్కందో Z యానా ముత్తరా ద్వాతో వాతః, ప్రత్నఋషిః.

5. ఊర్ధ్వాదిశాగ్ం, హేమన్త శిశిరావృతూనాం, బృహస్పతి ర్దేవతా, వర్చో ద్రవిణం, త్రిణవస్తోమ, స్స ఉ త్రయ స్త్రిగ్ంశవర్తని, షష్ఠవాడ్వయో Z భి భూరయానాం, విష్వగ్వాతోహత, స్సుపర్ణ ఋషిః.

ఈ మంత్రములను ఇష్టకోపధాన మంత్రములందురు. యజ్ఞకుండమున ఆయా దిక్కుల యందు బంగారపు ఇటుకలను పేర్చునపుడు ఈ మంత్రములను చదువుదురు. వీనిభావము 1. ఓ ఇటికా! నీవు దిక్కులలో తూర్పువు, ఋతువులలో వసంతమవు. దేవతలలో అగ్నివి. ధనములలో బ్రాహ్మణ ధనమవు. స్తోమములలో త్రివృత్తవు. పంచదశ స్తోమమును ప్రవర్తింప చేయు శక్తివి నీవే. వయస్సులలో అర్ధసంవత్సరమవు. యుగములలో కృతయుగమవు. వాయువులలో తూర్పుగాలివి. ఋషులలో సానగ ఋషివి–ఇట్లనుచు దిక్కునకు పది చొప్పున ఇటుకలను పేర్చెదరు. మిగిలిన దిక్కుల యందును ఇదే క్రమము.

అథర్వ వేదము :

"వాచస్పత ఋతవః పంచ యేనో వైశ్వకర్మణాః,
పరి యే సంబభూవు, ఇహైవ ప్రాణస్సఖ్యేనో అస్తు.
తం త్వా పరమేష్ఠిన్, పరిరోహిత ఆయుషా వర్చసా దధాతు."
కాండం. 13, సూక్తం 1, మంత్రము 18.

ఈ సూక్తమునకు రోహిత సూక్తమని పేరు. దీని వినియోగము చేత రాజునకు రాష్ట్ర భరణ సామర్ధ్యము కలుగగలదు. ఈ మంత్రము వాచస్పతిని సంబోధించి చెప్పబడుచున్నది. "వాచస్పతిం విశ్వకర్మాణ మూతయే" అని విశ్వకర్మ సూక్త మంత్రము తెలుపుచున్నది గదా! అనగా 'వాచస్పతి–వాక్కునకు పతియగు విశ్వకర్మను (ఈ అంశమును 'సరస్వతి' ప్రకరణమున విపులముగ చూడనగును) రక్షణార్థమై పిలుచుచున్నాము' అని భావము.

ఈ అథర్వవేద మంత్రమున "పంచవైశ్వకర్మణులు" (విశ్వకర్మ పుత్రులు) పంచ ఋతువులలో ఆయుస్సును, వర్చస్సును, రాజునకొసగి కాపాడుదురుగాక!" అనుటచే ఆ వైశ్వకర్మణులు రాజునకు అట్టి శక్తి నిత్తురని భావము స్ఫురించుచున్నది. దీనిని బట్టి ఈ పంచ వైశ్వకర్మణులు మన్వాదులుగాని, బ్రహ్మాదులుగాని, సానగాదులుగాని అగుదురు.

"యస్యాం వేదిం పరిగృహ్ణన్తి భూమ్యాం,
యస్యాం యజ్ఞం తన్వతే విశ్వకర్మాణః,
యస్యాం మీయన్తే స్వరవః పృథివ్యాం
ఊర్ధ్వాః శుక్రా ఆహుత్యాః పురస్తాత్
సా నో భూమిర్వర్ధయ ద్వర్ధమానా." **12.1.13.**

ఏ భూమియందు అరుగును నిర్మించి విశ్వకర్మలు (విశ్వకర్మజులైన సానగాదులు వారి సంతానము) యజ్ఞము లొనర్తురో, అట్టి భూమి తాను వృద్ధి పొందుచు, మమ్ము వృద్ధి పొందించుగాక!

ఈ మంత్రమునందలి 'యస్యాం యజ్ఞం తన్వతే విశ్వకర్మాణః' అనెడి వాక్యము ఋగ్యజుస్సులను, విశ్వకర్మజు లయిన సానగాది బ్రహ్మర్షులను వారి సంతానమును పేర్కొని, వారు చేసెడి వైదిక యజ్ఞములను ప్రస్తావించినది. ఈ పంచ ఋషులే పంచ జనులుగను, పంచ వేదములను పంచశిల్పములను అనుష్ఠించువారుగను పేర్కొన బడినారని మన దర్శనములు తెలుపుచున్నవి.

"యస్యాం పూర్వే భూతకృత ఋషయో గా ఉదా నృచుః,
సప్త సత్రేణ వేధసో యజ్ఞేన తపసా సహ." **12.1.39.**

ఏ భూమి యందు పంచ భూత ప్రతినిధులయిన పంచ ఋషులు, గోవులు, సప్తఋషులు ఉన్నారో, ఉండి, వారు తపోయజ్ఞములచేత ప్రవర్తించినారో....

"సానో భూమి రాది శతు యద్ధనం కామయా మహే,
భగో అను ప్రయుక్తా మింద్ర ఏతు పురోగవః." **12.1.40.**

అట్టి భూమి మేము కోరెడి నానారూపమైన ధనమును మాకొసగుగాక! భగుడను దేవుడు దానిననుసరించుగాక! ఇంద్రుడు దద్దానిని పొందుగాక!

పంచభూత ప్రతినిధులు పంచఋషులు అనుటకు శ్రీకాళహస్తి ముని ప్రణీత విశ్వకర్మ పురాణము నందలి ఈ శ్లోకములను చూడుడు.

శ్లో॥ ఆకాశో మనునా జాతః, పవనస్తు మయా దభూత్,
జాతం త్వష్టుశ్చ తత్తేజః, జలం తచ్ఛిల్పి తో Z భవత్.
విశ్వజ్ఞా ద్భూతలం జాతః, పంచ తత్త్వాని శక్తయః,
పంచభి స్తా న్య జాయన్త, జగత్కారణ కైః క్రమాత్.

తా॥ ఆకాశము మనువు నుండియు, వాయువు మయుని వలనను, అగ్ని త్వష్ట నుండియు, జలము శిల్పి నుండియు, భూమి విశ్వజ్ఞుని చేతను కలిగినవి. జగత్కారణ భూతులైన మన్వాదులగు అయిదుగురిచేతను ఈ పంచతత్త్వములును, పంచశక్తులును వరుసగా జన్మించినవి.

ఇచట మన్వాది పంచబ్రహ్మ లనుటచే, సానగాది పంచ ఋషులనియు లేదా బ్రహ్మ విష్ణ్వాది పంచ మూర్తులనియు భావించవచ్చును. ఈ విషయము లిక ముందు విపులముగా తెలుపబడును.

శ్లో॥ పృథ్వీ, జలంచ, తేజస్చ, వాయు, రాకాశమేవచ,
మను రాకాశ తత్త్వస్థో, వాయుతత్త్వస్థితోమయః,
త్వష్టాతు తేజస్తత్త్వస్థ శ్శిల్పీ చ జల తత్త్వగః,
విశ్వజ్ఞో భూమి తత్త్వ స్థః,త క్రమా త్తిష్ఠంతి శక్తి భిః.

తా॥ ఈ పంచ బ్రహ్మలు తమ తమ శక్తులతో గూడినవారై క్రమముగా మనువు ఆకాశ తత్త్వమునను, మయుడు వాయు తత్త్వమునను, త్వష్ట అగ్ని తత్త్వమునను, శిల్పి జల తత్త్వమునను, విశ్వజ్ఞుడు భూతత్త్వమునను నివసింతురు.

ఈ విషయములు గాయత్రీదేవి ముఖములను గురించి వ్రాయునపుడు విపులముగా తెలుపబడును.

"య ఇమా భువనాని జుహ్వ దృషిర్హోతా నిషసాద పితానః" అను ఋగ్వేద యజుర్వేదము లందుగల విశ్వకర్మ సూక్త మంత్రమున విశ్వకర్మను 'ఋషి' అనుట జరిగినది.

"త ఆయజన్త ద్రవిణం సమస్మా ఋషయః పూర్వే జరితారో నభూనా" (ఋ. 10.82.4). అను మంత్రమున విశ్వకర్మచే సృష్టింపబడిన మొట్టమొదటి సృష్టికర్తలను "పూర్వఋషులు" అనుట జరిగినది.

శ్వేతాశ్వతరోపనిషత్తు (3.4) "రుద్రోమహర్షిః" అని వచించగా, తైత్తిరీయ సంహిత నమకములోని మొదటి అనువాకమున రుద్రుడు 'స్థపతి' అని వచించబడినాడు.

'స్థపతి' అనగా ఎవరు? అను విషయమును గురించి ఈక్రింది గ్రంథము లిట్లు వచించుచున్నవి.

బ్రహ్మాండ పురాణము :

శ్లో॥ స్థపతిః స్థాపకశ్చైవ ఆచార్యో విశ్వకర్మణః
ఆచార్యో విశ్వకర్మాచ, ఆది బ్రహ్మ కులోద్భవః.

'స్థపతి' అనగా స్థాపించువాడు, విశ్వకర్మాచార్యుడు. విశ్వకర్మాచార్యుడు ఆదిబ్రహ్మ (విశ్వకర్మ) కులమున నుద్భవించినవాడు.

మానసారం :

"స్థపతిః స్థాపనా యార్హో వేద విచ్ఛాస్త్ర కోవిదః,
స్థాపనా పతి ర్యస్మాత్త స్మాత్ స్థపతి రుచ్యతే."

దేవ మనుష్యాలయ గ్రామ పట్టణాదులను స్థాపించు (నిర్మించు) అర్హతగల వేదశాస్త్ర వేత్తను "స్థపతి" అందురు. అతడట్లు స్థాపించు నర్హత గల వాడగుటచే 'స్థపతి' యని చెప్పబడినాడు.

ఇందు బ్రహ్మాండ భవన స్థాపకుడైన శిల్పాచార్యునిగ 'రుద్రుని' ప్రస్తావించుట జరిగినది. మరియు జగత్కారణకర్తయగు పరమేశ్వరుని 'విశ్వకర్మ' అని స్తుతించుటయు విశ్వశిల్ప కర్మలకు నిదర్శనము. త్వష్టను ఋగ్వేదము (1.188.9) "త్వష్టా రూపాణి హి ప్రభుః" (సాయణుని భాష్యము– త్వష్టారూపాణి యోనౌ సృష్టాని రేతాంసి రూపాణి కర్తుం ప్రభుహి" అనగా త్వష్ట, గర్భము నందుంచబడిన రేతస్సునకు రూప నిర్మాణము చేయుచున్నాడని భావము) అని వచించగా, యజుర్వేదము (3.4.5.1) "త్వష్టా రూపాణా మధిపతిః" అని వచించినది.

ఋగ్వేధము సవితయు విశ్వరూపుడును అగు త్వష్ట్ర దేవుడు గర్భమునందే దంపతులను చేసినాడు. ("గర్భేను నౌ జనితా దంపతీక, ర్దేవ స్త్వష్టా సవితా విశ్వరూపః " (10.10.5) అని తెలుపగా, యజుర్వేదము "త్వష్టా వై పశూనామ్, మిథునానామ్ రూపకృత్" అని వచించినది. అనగా త్వష్ట ప్రాణులను, వధూవరులను సృష్టించినాడు అని భావము.

"విష్ణు ర్యోనిం కల్పయతు, త్వష్టా రూపాణి పింశతు,
ఆసించతు ప్రజాపతి, ర్ధాతా గర్భం దధాతు తే." **ఋ. 10.185.1.**

విష్ణువు మర్మావయవమును (యోనిని) వీర్యధారణకు యోగ్యముగా చేయును. త్వష్ఠ ఆ వీర్యమును స్త్రీ పురుషాది రూపములుగా సృజించును. ప్రజాపతి ఆరేతస్సును అండము నందు చేరునట్లు చేయును. ధాత ఆరేతస్సును పిండరూపముగా పరిణమింప చేయును.

ఈ మంత్రమన 'పింశతు' అను క్రియ వాడబడినది. "పిశి అవయవే" అనగా అవయవ నిర్మాణము చేయుట అని అర్థము.

అథర్వ వేదము :

"త్వష్టా జాయా మజనయత్, త్వష్టా స్యైత్యాం పతిం
త్వష్టా సహస్ర మాయూగ్ం షి దీర్ఘమాయుః కృణోతు వామ్." (6.78.3)

ఈ మంత్రమును పురోహితుడు వివాహకాలమున చదువును. దీని భావము "ఓ వరుడా! తష్టు దేవుడు నీకీ భార్యను సృజించి యిచ్చెను. ఆ త్వష్టయే ఈమెకు నిన్ను పతిగా సృష్టించెను. అట్టి త్వష్ట వధూవరులగు మీ యిర్వురకు దీర్ఘాయువును కలుగ జేయునుగాక!

ఋగ్వేదము :

"య ఇమే ద్యావా పృథివీ జనిత్రీ రూపై రపింశ ద్భువనాని విశ్వా
త మద్య హోత రిషితో యజీయాన్ దేవం త్వష్టార మిహ యక్షి విద్వాన్." 10.110.9.

ఏ త్వష్టు దేవుడు ఈద్యావా పృథువులను సృష్టించినాడో, సమస్త భువనములను రూపము గల వానినిగ చేసినాడో, అట్టి త్వష్టను ఈ యజ్ఞ కార్యమునందు హవిస్సు మొదలగు వానితో యజింపుము.

పై మంత్రములను బట్టి త్వష్ట జగచ్ఛిల్పి యని తెలియుచున్నది. మరియు త్వష్ట ఇంద్రునకు వజ్రాయుధమును తయారు చేసి యిచ్చినట్లు ఋగ్వేదమున గలదు. ఈ విషయములన్నియు త్వష్ట మహాశిల్పియని తెలియజేయుచున్నవి.

త్వష్టయే బ్రహ్మయని ఇంతకు పూర్వమే వ్రాయబడినది.

ఋగ్వేదమున ఇంద్రుడు 'విశ్వకర్మన్' అని స్తుతించ బడినాడు (8.98.2). మరియు ఋగ్వేదము ఇంద్రుని 'సురూప కృత్నువు' అని వచించినది (1.4.1.) అనగా అందమైన స్వరూపముగల కర్మలను చేయువాడు అని అర్థము.

ఈ విషయములు ఇంద్రుని శిల్పకర్తృత్వమును తెలియజేయుచున్నవి.

"ఇంద్రాయ విష్ణః సుకృతే సుకృత్తరః." (ఋ. 1.156.5) అనుటచే, ఇంద్రుడు, విష్ణువు, సుకృత్=సృష్ట్యాదులైన మంచికర్మలు చేయువారిలో, సుకృత్తరః= గొప్ప సృష్టికర్తలు, అని తెలియుచున్నది. దీనినిబట్టి విష్ణువు కూడా మహాశిల్పి యని తెలియుచున్నది.

ఋగ్వేదమున సూర్యుడు 'విశ్వకర్మన్' అని స్తుతించబడినాడు (10.170.4).

పై విషయములను బట్టి బ్రహ్మ-విష్ణు-రుద్ర-ఇంద్ర-సూర్యులు శిల్పులు అని తెలియుచున్నది.

కాళహస్తి మునికృత విశ్వకర్మ పురాణము. 5వ అధ్యాయము.

"భూత్వాథ పురుషాకారో విశ్వకర్మాది పూరుషః
ప్రతీకే ష్వ సృజద్దేవా న్విశ్వోత్పత్తి చికీర్షయా
ముఖే భ్యో బ్రహ్మణ స్తస్య, జాతా మన్వాదయ క్రమాత్
మను,ర్మయ శ్చ, త్వష్టా చ, శిల్పీ, విశ్వజ్ఞ ఏవచ."

ఆదిమ తత్త్వమయిన విశ్వకర్మ పురుష సూక్తమున చెప్పబడిన పురుషాకారము కలవాడై విశ్వమును సృష్టించదలచి తన అంగములయందు దేవతలను సృజించినాడు. ఆయన పంచముఖముల నుండి మనువు, మయుడు, త్వష్ట, శిల్పి, విశ్వజ్ఞుడు అను పంచబ్రహ్మ లుదయించిరి.

వసిష్ఠ పురాణము : కాండము 3, అధ్యాయము 5.

"సుపర్ణ స్సానగ శ్చైవ సనాతన ఇతి స్మృతః,
గురుశ్రేష్ఠో Z హభూనశ్చ ప్రత్నో ధాత్రీ సురక్షకః, (13)

సుపర్ణ, సానగ, సనాతన, అహభూన, ప్రత్నులనెడి అయిదుగురు విశ్వకర్మ ముఖోద్భూతులయిన పంచబ్రహ్మలు.

అనగా వీరు విశ్వకర్మ యొక్క సంకల్ప మాత్రముననే కలిగి ముఖమువలె సృష్టి కార్యమునకు ముఖ్య భూతులయినారని భావించవచ్చును.

విశ్వకర్మ ముఖోద్భూతాః బ్రహ్మణః పంచకీర్తితా."
"సద్యోజాత ముఖే జాత స్సానగో విశ్వకర్మణః, (14)

వామదేవముఖే జాతో బ్రహ్మర్షి స్తు సనాతనః,
అఘోర ముఖ సంజాతో Z హ భూనో విశ్వకర్మణః. (15)

తత్పురుష ముఖే జాతః ప్రత్నో Z సౌ విశ్వకర్మణః,
తస్యే శానముఖే జాత స్సుపర్ణో విశ్వకర్మణః. (16)

విశ్వకర్మయొక్క సద్యోజాత ముఖము నుండి సానగఋషి, వామదేవ ముఖము నుండి సనాతన ఋషి, అఘోర ముఖము నుండి అహభూన ఋషి, తత్పురుష ముఖము నుండి ప్రత్నస ఋషి, ఈశానముఖము నుండి సుపర్ణ ఋషి జన్మించిరి.

బ్రహ్మాండ పురాణము : ద్వితీయ పటలము

"నమో ऽస్తుతే సానగ విశ్వకర్మణే నమోస్తుతే
పూర్వ ముఖోద్భవాయ నమోస్తు షడ్భూత
వినిర్మితాయ (?) నమోస్తు చిద్రూప నమో నమస్తే,
సాధనం నాస్తి సర్వత్ర, లోకానాం సర్వ సాధక,
కరోతి లోహకర్మాణి, లోకాన్ రక్షతి సానగః
దదౌ శస్త్రాణి దేవానాం, దుష్ట నిగ్రహ కారణాత్,
స చ సర్వం జగత్కర్తా, సద్యోజాత ముఖోద్భవః
శూలం దదాది భర్గాయ, చక్రం దత్తం చవిష్ణవే,
పాశస్తు బ్రహ్మణే దత్త, స్త్రిమూర్త్యా త్మక సానగః."

పూర్వముఖమున పుట్టిన చిద్రూపుడవైన ఓ సానగ విశ్వకర్మా! నీకు నమస్కారము. లోకమున ఎక్కడా ఏ ఉపకరణములు లేనపుడు సర్వసాధకుడైన సానగ బ్రహ్మర్షి లోహకర్మలను చేసి లోకములను రక్షించుచున్నాడు. ఇంకను ఆ సానగఋషి దుష్ట నిగ్రహము కొఱకు దేవతలకు శస్త్రాస్త్రముల నొసగెను. సద్యోజాత ముఖమున పుట్టి సర్వ జగత్కర్త అయిన అతడు శివునకు శూలమును, విష్ణువునకు చక్రమును, బ్రహ్మకు పాశమును ఇచ్చెను. అతడు త్రిమూర్తి స్వరూపుడు.

"క్షు తృష్ణాది నివృత్తాత్మా, జాయతే దక్షిణా న్ముఖాత్,
సనాతనో దారుకర్మ కుశలో నిర్మమే పురా
హలాదీనాం తు కర్తవ్యం, మందిరాణాం విశేషతః,
స్యందనా దీని యానాని, వికరోతి సనాతనః."

తా॥ విశ్వకర్మ దక్షిణ ముఖము నుండి పుట్టిన సనాతన ఋషి ఆకలిదప్పులు లేనివాడును, కొయ్యను కనిపెట్టి దారుకర్మను సృష్టించినవాడును అయినాడు. ఆ మహర్షియే పూర్వము నాగలి, బండి, రథము మొదలగు సాధనములను కనిపెట్టి లోకమున దారు శిల్ప ప్రచారము చేసినాడు.

ఈ సానగ సనాతనాది ఋషులు బ్రహ్మవిద్యోప దేశికులలో అగ్రగణ్యులుగ **బృహదారణ్య కోపనిషత్తు** చతుర్థా ధ్యాయాంతమున పేర్కొనబడినారు.

"సంస్తుతో నారదాద్యై, స్త్వహ భూన ఋషి సత్తమః
అశేష మునిభిః పూజ్య, స్త్వ ఘోర వదనోద్భవ
యోగార్హపత్య ధర్మస్య, వినిర్మాతా జగద్విభుః
త్వష్టా స్వర్ణాది భిర్లోహైః పాత్రాణి వికరోతిసః."

తా॥ నారదాదులచే స్తుతింపబడినవాడును. సర్వమునికోటికి పూజనీయుడును అగు అహభూనఋషి, విశ్వకర్మ యొక్క అఘోర ముఖము నుండి జన్మించెను. జగత్ప్రభుడగు ఆ అహభూనఋషియే గృహస్థ ధర్మమును సృష్టించినవాడు. త్వష్టృ స్వరూపుడగు అతడు బంగారము మున్నగు లోహములచే ఇండ్లయందు ఉపయోగింప దగిన పాత్రములు మొదలగు వానిని చేసి లోకోపకారము నొనర్చెను.

ఈ శ్లోకములో త్వష్టయు అహభూన ఋషియు నొక్కరే అయినట్లు వచింప బడినది. "యోగార్హ పత్య ధర్మస్య వినిర్మాతా జగద్విభుః" అనుటచే అనంత మహిమాభి శోభితుడగు త్వష్ట గృహస్త ధర్మమునకు నిర్మాత యని తెలియుచున్నది.

"ప్రత్నో విశ్వస్య కర్తాసౌ, జగద్రక్షా పరాయణః,
బ్రహ్మోద్ముఖా జ్జాతః, ప్రవరః ప్రత్న సంతతేః."

తా॥ విశ్వకర్మయు, జగద్రక్షకుడును అగు ప్రత్న ఋషి, విశ్వకర్మ భగవానుని తత్పురుష మనెడి ఉత్తర ముఖము నుండి కలిగినాడు. ఇతడు ప్రత్నఋషి గోత్రమునకు చెందిన బ్రాహ్మణ్యమునకు మూలపురుషుడు.

ఈ శ్లోకములో ప్రత్న ఋషి కనిపెట్టిన శిల్పమును గురించి వక్కాణించలేదు. అయినను 'శిలా కర్మచ శిల్పినామ్' మొదలగు వచనములచేత శిల్పి బ్రహ్మ అయిన ప్రత్నస ఋషి శిలా శిల్పమునకు ఉపదేశికుడై నానావిధ దేవతామూర్తులను, దేవాలయ-మండప- గోపుర ప్రాకారాదులను నిర్మించుటను కనిపెట్టి లోకమును తరింపచేసెనని తెలియుచున్నది.

"మహోన్నతో మహాత్మావై, పీనవక్షా స్సు సుందరః,
అనాది నిధన స్స్వర్ణ, స్సుపర్ణ స్తస్య నామహి,
స్వర్ణం దదాతి లోకానాం, బ్రహ్మణ్యా ర్ధ్వ ముఖోద్భవః,
కిరీట కుండలాదీనాం, భూషణానాం ప్రయోజకః."

తా॥ మహోన్నతుడును, మహాత్ముడును, అందగాడును, ఆద్యంతములు లేనివాడును అగు సుపర్ణ బ్రహ్మర్షి, 'విశ్వకర్మ భగవానుని'ఊర్ధ్వ ముఖము నుండి పుట్టినాడు. ఈ మహాత్ముడు సువర్ణ శిల్పమునకు సృష్టికర్తయై కిరీట–కుండల–మంగళ సూత్రాది భూషణముల నిర్మాణమును లోకమునకుపదేశించెను.

ఈ పంచఋషులను వసిష్ఠ పురాణము విశ్వకర్మ ముఖోద్భవులని చెప్పగా, బ్రహ్మాండ పురాణము బ్రహ్మముఖోద్భవులని వచించినది. విశ్వకర్మ–పంచముఖ బ్రహ్మగదా!

"త ఆయజన్త....ఋషయః పూర్వే" (ఋ. 10.81.4) అను మంత్రమునకు భాష్యము వ్రాయుచు సాయణులు "తే పూర్వే ఋషయో, అస్మై=విశ్వకర్మణే చరుపురో డాశాది లక్షణం, ధనం, సం=సమ్యక్, ఆయజన్త=సర్వతో యజన్తే.. యే స్థావర జంగమాత్మకే జగతి వర్తమానాన్ ఏతాన్ ప్రాణినః తేజసా సమకృణ్వన్, తే పూర్వఋషయో–ద్రష్టా రో రశ్మయో అస్మా=ఆదిత్యాత్మకాయ విశ్వకర్మణే, ద్రవిణం=తేజఃఆయజన్త"

ఇచట పూర్వఋషులను, ఋషులు గానే భావింపక కిరణములుగా భావించుట విశేషము. అటులనే విశ్వకర్మను ఆదిత్యాత్మకుడు (సూర్యస్వరూపుడు) అనుటయు గమనించ దగినది. సూర్యుడు విశ్వకర్మ నుండి పుట్టినట్లు "విశ్వకర్మా హ్యజనిష్ఠ దేవ ఆది ద్గంధర్వో అభవ ద్వితీయః" అని యజుర్వేదీయ విశ్వకర్మ సూక్త మంత్రము తెల్పినది గదా!

శిల్పోపనిషత్తు : "....యదా తదా భవజ్జగ ద్విజ్ఞాన శూన్యమ్। సోऽకామ యతా త్మానం పంచాస్యం। తదై వా విరాసీ త్ప్రవృత్త్యై తస్యైవ తేజో ऽంశా దభవన్ బ్రహ్మణో మను ర్మయ స్త్వష్టా శిల్పీ విశ్వజ్ఞ ఇతి పంచ। తా నేవం హోవాచ విశ్వకర్మా ప్రవర్తయత లోకం పంచకర్మ భిరితి ప్రవర్తత ఇత్యేతైః పంచభిరితి ప్రపంచో భవతి! యజ్ఞ ఏ వేదం కర్మ, యజ్ఞః కర్మైవ। శ్రుణుత తద్యథా సృష్టి, స్థితి, లయ, తిరో ధానాను గ్రహ రూపాణీతి। ఏతద్భువ త్యేవం విశ్వకర్మణ శ్శిల్పమ్। కుర్యాదేవ మేవచ లోకస్య। దాతారో భవన్తు జ్ఞానస్య, విజ్ఞానస్య చ శిల్పినః"

ఈ జగత్తు విజ్ఞాన శూన్యముగా నున్నప్పుడు విశ్వకర్మ పంచముఖుడయ్యెను. పంచముఖుడైన అతని తేజస్సు నుండి మను–మయ–త్వష్ట–శిల్పి–విశ్వజ్ఞు లనెడి పంచబ్రహ్మలు దయించిరి. జగత్పిత వారితో నిట్లనెను. "మీరు పంచకర్మలచే జగత్తును ప్రవర్తింప జేయుడు. ఈ పంచకర్మలచే ప్రవర్తించుచున్నది కనుకనే ఇది ప్రపంచమగు చున్నది. సృజించుట, పోషించుట, లయింప జేయుట, అంతర్ధానము నొందించుట, పునస్సృష్టికి అనుగ్రహించుట అనెడి పంచకర్మలు నావలననే ప్రవర్తించు చున్నవి. ఇట్లే శిల్పబ్రహ్మలగు మీరును సృజింపుడు. జ్ఞాన విజ్ఞానములకు దాతలు కండు..."

శైవాగమము :

"అథైషాం దేవతాః పంచ విశ్వకర్మ ముఖోద్భవాః,
మను, ర్మయ, స్తథా త్వష్టా, శిల్పి కశ్చై, తథైవచ.
దైవజ్ఞః పంచమః ప్రోక్తా: స్వర్గస్థా యజ్ఞ పోషకాః."

విశ్వకర్మ ముఖోద్భవులైన మను, మయ, త్వష్ట, శిల్పి, దైవజ్ఞు లనెడివారు స్వర్గము నందుండి యజ్ఞపోషకులై ఒప్పుచున్నారు.

నాగర ఖండము :

"మను, ర్మయ, స్తథా త్వష్టా, శిల్పీ, విశ్వజ్ఞ, ఏవ
విశ్వకర్మ సుతా, హ్యేతే పంచసృష్టి ప్రవర్తకాః"

మనువు, మయుడు, త్వష్ట, శిల్పి, విశ్వజ్ఞుడు అనువారు విశ్వకర్మ యొక్క పుత్రులు, వారే సృష్టి ప్రవర్తకులు. అనగా సృష్టి-స్థితి-లయ-తిరోధాన-అనుగ్రహ కార్యములను నిర్వర్తించువారు. అనగా వీరి యొక్క సమిష్టియైన విశ్వకర్మయే అన్నిటిని చేయువాడైనను, వ్యష్టిగా మన్వాదులు ఆయా కార్యములకు కర్తలనియు, వారే సృష్టి ప్రవర్తకులైన ఆదిస్రష్టలనియు "త ఆయజన్త..." అనెడి మంత్రము కూడా ధ్వనింప జేయుచున్నది. దీనినే అధర్వవేదము "వైశ్య కర్మణ' పదముచే స్పష్టము చేసినది. పంచబ్రహ్మోపనిషత్తు : "పంచముఖేభ్యః పంచశీర్ష స్యాస్య మనుః ప్రథమః, మయోద్వితీయః, త్వష్టా తృతీయః, శిల్పీ చతుర్థః, విశ్వజ్ఞః పంచమఇతి, స ఏ వార్కో విధీయతే. సానగ స్సనాతనో Zహ భూనః ప్రత్నస్సుపర్ణ ఇత్యే తే చ సర్వే గోత్ర పురుషాః"

నాగర ఖండము :

"మను స్సానగ గోత్రశ్చ, సనాతన మయః స్మృతః
అహభూనస్తు త్వష్టుః స్యాత్, శిల్పీ ప్రత్నః ప్రకీర్తితః
విశ్వజ్ఞస్తు సుపర్ణ స్స్యా, దేవం గోత్రము దీరితామ్."

మనువు-సానగ గోత్రము, మయుడు-సనాతన గోత్రము, త్వష్ట-అహభూనస గోత్రము, శిల్పి-ప్రత్నస గోత్రము, విశ్వజ్ఞ-సుపర్ణ గోత్రము.

మనువు సానగ గోత్రమనుటచే మను సానగులకు, మయుడు సనాతన గోత్రమనుటచే మయ సనాతనులకు, త్వష్ట అహభూనస గోత్రుడనుటచే అహభూన త్వష్టలకు శిల్పి ప్రత్నస గోత్రమనుటచే శిల్పీ ప్రత్నసులకు, విశ్వజ్ఞ సుపర్ణస గోత్రమనుటచే విశ్వజ్ఞ సుపర్ణస ఋషులకు అభేదము స్పష్టమగుచున్నది.

ఆంధ్రనాగర ఖండము :

"మనువు శివుడును, మయుడు రమాధవుండు.
త్వష్ట పరమేష్ఠి, శిల్పి వృద్ధ శ్రవుండు,
తక్ష భానుండగు, వీరుదైవ గురులు
విశ్వకర్మాగ్ర నందనుల్ వినుత పుణ్య." **3.43.**

యజుర్వేదము : "మనుబ్రహ్మణే ఉమామహేశ్వరాభ్యా న్నమః। మయబ్రహ్మణే లక్ష్మీ నారాయణాభ్యా న్నమః। త్వష్టబ్రహ్మణే–వాణీహిరణ్య గర్భాభ్యా న్నమః। శిల్పి బ్రహ్మణే శచీపురందరాభ్యాం నమః। విశ్వజ్ఞ బ్రహ్మణే–సంజ్ఞా భాస్కరాభ్యా న్నమః। విరాడ్విశ్వకర్మణే నమః। స్వరాడ్విశ్వకర్మణే నమః"

దీనినిబట్టి మనుబ్రహ్మయొక్క సృష్టియే ఉమామహేశ్వరుడైన రుద్రుని కృత్యమనియు, మయబ్రహ్మ యొక్క సృష్టియే లక్ష్మీనారాయణ స్వరూపమయిన విష్ణు కృత్యమనియు, త్వష్ట బ్రహ్మ యొక్క సృష్టియే వాణీ హిరణ్యగర్భుడైన బ్రహ్మ కృత్యమనియు, శిల్పి బ్రహ్మయొక్క సృష్టియే శచీపురందరుడైన దేవేంద్రుని కృత్యమనియు, విశ్వజ్ఞ, బ్రహ్మయొక్క సృష్టియే సంజ్ఞా భాస్కరుడయిన సూర్యుని కృత్యమనియు, విరాడ్బ్రహ్మమే విశ్వబ్రహ్మ స్వరూపమనియు, స్వరాడ్బ్రహ్మమే, విశ్వబ్రహ్మ స్వరూపమనియు విదితమగు చున్నది.

"అయా మనూ ఋగ్జాతం। మయా దారు యజుస్తథా।
తామ్రు త్వష్టా రజా సామం। శిలా శిల్పి అథర్వణః
రౌప్య స్వర్ణార్క ప్రణవం। పంచ బ్రహ్మ విధీయతే".

మనువునకు అయశ్శిల్పము ఋగ్వేద పారాయణము, మయునకు దారుకర్మము యజుర్వేద పారాయణము, త్వష్టకు రాగి–ఇత్తడిపనులు చేయుట సామవేదమును పఠించుట, శిల్పిబ్రహ్మకు శిలాశిల్పము అథర్వవేద పారాయణము, విశ్వజ్ఞ బ్రహ్మకు సువర్ణ శిల్పము చేయుట ప్రణవ వేద పారాయణము కర్తవ్యములు.

నాగర ఖండము :

శ్లో॥ అయస్కృతి ర్మనూనాంచ, మయానాం దారుకర్మచ
త్వష్టృణాం తామ్రకర్మాణి, శిల్పకర్మ చ శిల్పి నాం।
సౌవర్ణం తక్షకానాంచ, పంచకర్మాణి తానివై,
ఏ తే పంచక రూపాశ్చ, యజ్ఞకర్మ పరాః స్మృతాః॥

మను వంశీయులకు అయశ్శిల్పము, మయ వంశీయులకు దారుకర్మ, త్వష్టు వంశము వారికి రాగి-ఇత్తడి శిల్పములు, శిల్పి బ్రహ్మ వంశమువారికి శిలాశిల్పము, విశ్వజ్ఞ వంశము వారికి సువర్ణ శిల్పము కర్తవ్యములు. "ఏతే పంచక రూపాశ్చ" అనుటచే ఈ పంచకర్మలు సృష్టి-స్థితి-లయ-తిరోధాన-అనుగ్రహ కర్మము లంతటి శ్రేష్ఠములనియు, 'యజ్ఞకర్మపరాః స్మృతాః' అనుటచే యజ్ఞకర్మలతో సమానములనియు భావము.

"ఋగ్వేదశ్చ మనూనాంచ, మయానాంచ యజుశ్రుతిః,
త్వష్ట్రాణాం సామవేదశ్చ, శిల్పిజానాం త్వథర్వకః
విశ్వజ్ఞా నాంచ ప్రణవో గాయత్ర్యంచ సమాచరేత్."

తా॥ మనువంశమువారు ఋగ్వేదమును, మయవంశము వారు యజుర్వేదమును, త్వష్టు వంశికులు సామమును, శిల్పివంశికులు అథర్వవేదమును, విశ్వజ్ఞ వంశమువారు ప్రణవ వేదమును చదువవలయును.

శిల్పి స్తంభ మూలశ్లోకము :

"తిథి రూప మనుప్రోక్తం, వారస్య మయ సంభవాః
నక్షత్రం త్వష్ట రూపంచ, శిల్పియోగం తథైవచ,
విశ్వజ్ఞ కరణం చైవ, పంచాంగో అధిదేవతాః".

తా॥ తిథి మనుబ్రహ్మ ఉద్భవము. వారం మయబ్రహ్మ ఉద్భవము. నక్షత్రం త్వష్ట బ్రహ్మ ఉద్భవము. కరణం విశ్వజ్ఞ బ్రహ్మ ఉద్భవము. కనుక వీరే పంచాంగమునకు అధిదేవతలు.

యజురారణ్యక పురుషసూక్తము నందలి చివరి మంత్రము :


"యో దేవేభ్య ఆతపతి, యో దేవానాం పురోహితః,
పూర్వో యో దేవేభ్యో జాతః, నమో రుచాయ బ్రాహ్మయే."

దేవతలను తన అజ్ఞావర్తులను చేసికొని ఆయా పనులు చేయించు వాడును, దేవతలకు కూడ పురోహితుడై వారి మేలుకోరువాడును, అందరికంటెను ముందు స్వయంసిద్ధుడై, యున్నవాడును, జ్ఞాన స్వరూపుడును అగు ఆ విశ్వకర్మకు నమస్కారము. ఇందలి 'దేవేభ్య ఆతపతి' అను వాక్యమునకు వ్యాఖ్యానమే తైత్తిరీయ ఆనందవల్లిలోని ఈ దిగువ మంత్రము

"భీషాస్మా ద్వాతః పవతే, భీషోదేతి సూర్యః,
భీషా స్మాదింద్ర, శ్చాగ్నిశ్చ, మృత్యు ర్ధావతి."

అతనికి వెఱచియే గాలి వీచుచున్నది, సూర్యుడు ప్రకాశించుచున్నాడు, ఇంద్రాగ్నులు తమ తమ పనులు నెరవేర్చుచున్నారు. అనగా శక్తులన్నియు ఆయన వలననే పని చేయుచున్నవి. మృత్యుదేవత కూడ ఆయనకు భయపడియే నియమిత కాలమున ప్రాణులను కబళించు చున్నది.

పై విషయములనుబట్టి బ్రహ్మ-విష్ణు-రుద్ర-ఇంద్ర-సూర్యులు విశ్వకర్మ సుతులనియు, వారే త్వష్టృ-మయ-మను-శిల్పి-విశ్వజ్ఞ, బ్రహ్మలనియు, వారే అహభూన-సనాతన-సానగ-ప్రత్నస-సుపర్ణస ఋషులనియు, సమస్తమునకు విశ్వకర్మ సమిష్టియైన సృష్టికర్తకాగా, ఆయన కుమారులగు బ్రహ్మ-విష్ణు-రుద్రాదిమూర్తులు లేక త్వష్టృ మయాది బ్రహ్మలు లేక అహభూన-సనాతన-సానగాది బ్రహ్మర్షులు వ్యష్టిగా ఆయా కార్యములకు సృష్టికర్తలై "ఆత్మావై పుత్ర నామాసి" అను శ్రుతిని సార్ధకము చేయుచు జగత్సృష్టి కర్తలైరి.



11. జ్యేష్ఠ బ్రహ్మ

అథర్వవేద దశమకాండము చతుర్ధ అనువాకములో రెండు సూక్తములు కలవు. అందు ఒక్కొక్క సూక్తమున 44 మంత్రములు కలవు. ఆ మంత్రములలో స్కంభుడు అను దేవుడు జ్యేష్ఠ బ్రహ్మగా స్తుతించబడినాడు. ఆ అనువాకములకు సాయణుల ఉపోద్ఘాతము: "స్కంభ ఇతి సనాతన తమో దేవో బ్రహ్మణో ప్యాద్య భూతః, అతో జ్యేష్ఠం బ్రహ్మేతి తస్య సంజ్ఞా. తస్మిన్సర్వమే తత్తిష్ఠతి. ఏతత్సర్వం తేనావిష్టమ్. విరాడపి తస్మి న్నేవ సమాహితః . తస్మిన్నేవ దేవాదయః సర్వే సమాహితా ఇత్యాది వర్ణనమ్."

స్కంభుడను దేవుడు సనాతనుడు. అతడు బ్రహ్మకు కూడ మొదటివాడు. కనుక జ్యేష్ఠ బ్రహ్మ అని అతనికి పేరు. ఈ సర్వసృష్టి అతనియందే ఆధారపడియున్నది. సృష్టి నంతటిని ఆశక్తి ఆవేశించియే యున్నది. విరాట్పురుషుడు కూడ అతని యందే యున్నాడు. దేవాదులు కూడ అతనియందే కలరని ఈ మంత్రములు వర్ణించుచున్నవి.

మొదటి సూక్తము నందలి కొన్ని మంత్రములు :

"కస్మిన్నంగే తపో అస్యాధి తిష్ఠతి?
కస్మిన్నంగ ఋత మస్యధ్యా హితం?
క్వవ్రతం క్వ శ్రద్ధాస్య తిష్ఠతి?
కస్మిన్నంగే సత్య మస్య ప్రతిష్ఠతి? (1)

కస్మాదం గా ద్దీప్యతే అగ్ని రస్య?
కస్మాదం గా త్పవతే మాతరిశ్వా?
కస్మా దం గా ద్విమిమీతే Z ధి చంద్రమా?
మహః స్కంభస్య మిమానో అంగమ్. (2)

కస్మి న్నంగే తిష్ఠతి భూమి రస్య?
కస్మి న్నంగే తిష్ఠ త్యన్తరిక్షమ్?
కస్మి న్నంగే తిష్ఠ త్యాహితా ద్యౌః?
కస్మి న్నంగే తిష్ఠ త్యుత్తరం దివః? (3)

క్వ ప్రేప్సన్ దీప్యత ఊర్ధ్వో అగ్నిః?
క్వ ప్రేప్సన్ పవతే మాతరిశ్వా?
యత్ర ప్రేప్సన్తీ రభి యన్త్యా వృతః
స్కంభం తం బ్రూహి కతమః స్వి దేవ సః (4)

క్వార్ధమాసాః క్వయన్తి మాసాః?
సంవత్సరేణ సహ సం విదానాః?
యత్ర యన్త్యృతవో యత్రార్తవాః?
స్కంభం తం బ్రూహి కతమః స్విదేవసః (5)

క్వ ప్రేప్సన్తీ యువతీ విరూపే
అహోరాత్రే ద్రవత స్సంవిదానే?
యత్ర ప్రేప్సన్తీ రభి యన్త్యా పః
స్కంభం తం బ్రూహి కతమః స్విదేవ సః (6)

యస్మిన్ స్తబ్ధ్వా ప్రజాపతి
ర్లోకాన్ సర్వా న ధారయత్
స్కంభం తం బ్రూహి కతమః స్విదేవ సః॥ (7)

యత్ పరమ మవమం, యచ్చ మధ్యమం,
ప్రజాపతిః సస్పృజే విశ్వరూపమ్,
కియతా స్కంభః ప్రవివేశ తత్ర
య న్న ప్రావిశత్ కి య త్తద్బభూవ. (8)

కియతా స్కంభః ప్రవివేశ భూతం,
కియత్ భవిష్య దన్వాశయే Z స్య,
ఏకం యదంగ మకృణో త్సహ స్రధా
కియతా స్కంభః ప్రవివేశ తత్ర. (9)

తా॥ ఏ స్కంభ నామక జగత్కారణ శక్తియొక్క శరీరమున తపస్సు, ఋతము, వ్రతము, శ్రద్ధ, సత్యము ఆధారపడియున్నవో (1). ఏ స్కంభనామక శక్తి శరీరము నుండి అగ్ని వెలుగుచున్నదో, గాలి వీచు చున్నదో, చంద్రుడు ప్రకాశించు చున్నాడో, అట్టి గొప్పదైన స్కంభ శక్తిని ఆరాధించు చున్నాను. (2). ఏ స్కంభ శక్తి యందు భూమి, అంతరిక్షము, దివము, దివము యొక్క ఉత్తర (పై) భాగము ఆధారపడియున్నవో (3). ఎవని యొక్క ప్రేరణచేత అగ్ని పైకెగయుచు మండుచున్నదో, గాలి అడ్డముగా వీచుచున్నదో, నీళ్ళు పల్లమునకు ప్రవహించుచున్నవో, దానినే స్కంభనామక శక్తిగా నెఱుగుము. (4). దేనియందు అర్ధమాసములు (పక్షములు), నెలలు, ఋతువులు, ఋతుధర్మములు నిలిచి తమ తమ ధర్మములను నిర్వర్తించుచున్నవో, దానినే స్కంభనామక శక్తిగా నెఱుగుము. (5). ఎక్కడ విపరీత రూపములుగల దివారాత్రులు (పగలు తెల్లనిది, రాత్రి నల్లనిది కనుక అవి విరూపములు) ప్రవర్తించుచున్నవో, ఎక్కడ జలములు ప్రవహించుచున్నవో (6). దేని శక్తిచే ప్రజాపతి లోకములను సృష్టించి ధరించుచున్నాడో, దానిని జగత్కారణ స్కంభ (పరబ్రహ్మ) శక్తిగా నెఱుంగుము. (7). ప్రజాపతి సృష్టిలో దేనిని పరమముగాను, అవమము (అధమము)గాను, మధ్యమముగాను, నానా రూపములతో సృష్టించినాడో, దేని చేత స్కంభశక్తి వాటియందు ప్రవేశించెనో, ప్రవేశించి తద్రూపము కలదాయెనో (8). అదే విధముగ ఆ శక్తి ఎట్లు భూతభవిత్యులయందలి భూతములలో తానై ప్రవేశించెనో, దానిని జగత్కారణ శక్తిగా నెఱుంగుము. (9).

పై 8,9 మంత్రమల భావమునే ఋగ్వేదము ఈక్రింది విధముగ తెలిపినది.

"యాతే ధామాని పరమాణి యావమా యా మధ్యమా విశ్వకర్మన్నుతేమా."
(10.80.5)

ఓ విశ్వకర్మా! నీకు నివాసములయిన అధమ, మధ్యమ, ఉత్తమ ధామములు ఏవి కలవో

"య ఇమా విశ్వాభువనాని జుహ్వదృషి ర్హోతా నిషసాద పితా నః
స ఆశిషా ద్రవిణ మిచ్ఛమానః ప్రథమ చ్ఛ దవరా ఆవివేశ." 10.80.1.

ఏ విశ్వకర్మ సమస్త భువనములను సృజించి అతీంద్రియ ద్రష్టయై మనకు తండ్రియై యుండెనో అతడే జగద్భోగాపేక్షతో జీవుల హృదయ కమలములందు ప్రవేశించెను.

ఈ విషయములనుబట్టి స్కంభ సూక్తమున వచింపబడిన జ్యేష్ఠ బ్రహ్మ- విశ్వకర్మయే అని విదితమగుచున్నది. స్కంభ సూక్తము నందలి ఈక్రింది మంత్రములు కూడ పై విషయమునే స్పష్టపఱచు చున్నవి.

"యత్ర లోకాంశ్చ, కోశాం శ్చాపో బ్రహ్మా జనా విదుః,
అ సచ్చ యత్ర సచ్చాన్తః స్కంభం తం బ్రూహి. (10)

యత్ర తపః పరాక్రమ్య వ్రతం ధారయ త్యుత్తరం,
ఋతం చ యత్ర శ్రద్ధా చాపో బ్రహ్మా సమాహితాః,
స్కంభం తం బ్రూహి కతమః స్విదేవ సః. (11)

యస్మి న్భూమి రన్తరిక్షం ద్యౌ
ర్యస్మి న్నధ్యా హితా యత్రాగ్ని శ్చంద్రమా
స్సూర్యో, వాత స్తిష్ఠ న్త్యర్పితాః స్కంభం తం- (12)

యస్య త్రయ స్త్రింశ ద్దేవా అంగే సమాశ్రితాః
స్కంభం తం బ్రూహి కతమః స్విదేవ సః. (13)

యత్ర ఋషయః ప్రథమ జా ఋచ స్సామ యజుర్మహీ,
ఏకర్షి ర్యస్మి న్నర్పితః (14)

యత్రా మృత శ్చ మృత్యుశ్చ, పురుషే Z ధి సమాశ్రితే,
సముద్రో యస్య నాడ్యః పురుషే Z ధి సమాశ్రితాః." (15)

తా॥ దేనియందు లోకములు, బ్రహ్మాండములు, వాటికి కారణమైన జలములు, వేదము ఉన్నవని తత్త్వవేత్త లెఱుంగుదురో, సత్తు–అసత్తు–అన్తము దేనియందంత ర్భూతములో ఆస్కంభ నామక పరబ్రహ్మమును గుర్తింపుము (10). దేనియందు తపస్సు, వ్రతము, ఋతము శ్రద్ధ జలము నిలిచియున్నవో, దానిని స్కంభనామక పరమాత్మగా నెఱుగుము(11). భూమి–అంతరిక్షము–దివము–అగ్ని–సూర్యచంద్రులు. వాయువు దేని నాధారము చేసికొని యుండునో దానిని స్కంభ పరమాత్మగా నెఱుగుము (12). ముప్పది ముగ్గురు దేవతలు (అష్ట వశువులు, ఏకాదశ రుద్రులు, ద్వాదశాదిత్యులు, ప్రజాపతి, ఇంద్రుడు) దేని యందాధారపడి యున్నారో (13). దేనియందు మొదటివారైన సానగాది పంచఋషులు, ఋక్సామ యజుస్సులు, భూమి, ఏకర్షియు వెలుగుచున్నారో (14). ఏ పురుషునియందు అమృతము, మృత్యువు, సముద్రము నెలకొనియున్నవో, అట్టి స్కంభ నామక పరబ్రహ్మమును గూర్చి లోకమునకు చాటుము. అమృతము, మృత్యువు పరబ్రహ్మ స్వరూపములే అని భగవద్గీత (అమృతం చైవ మృత్యుశ్చ సద సచ్చా హమర్జున) కూడ వచించినది.

"యత్రా దిత్యాశ్చ, రుద్రాశ్చ, వసవశ్చ, సమాహితాః,
భూతం చ యత్ర భవ్యం చ, సర్వే లోకా: ప్రతిష్ఠితాః" **22.**

తా॥ ఏ స్కంభ నామక శక్తియందు వసురుద్రాదిత్యులు, భూతభవ్యములు, సర్వలోకములు నిలిచియున్నవో, దానినే జ్యేష్ఠ బ్రహ్మమని యెఱుంగుము. ఈ విషయమును కృష్ణయజుర్వేద మంత్రమిట్లు చెప్పుచున్నది.

"ఏనదేవా జ్యోతిషోర్ధ్వా ఉదాయన్, యేనాదిత్యా, యేన, వసవో, యేనరుద్రాః,
యేనాంగిరసో, మహిమాన మాన శుః, తేనైతు యజమానఃస్వస్తి-స్వర్గాయ వా ఏషలోకాయ"
5, 7.5.

తా॥ బ్రహ్మ-విష్ణు-రుద్రాది దేవతలు ఏ అనంతశక్తి చేత తేజోమయులై ఊర్ధ్వలోకమున నున్నారో, ఏశక్తి చేత రుద్రులు, వసువులు, ఆదిత్యులు, ఆంగీరసులు మహిమలు కలవారైనారో, ఆ మహాశక్తి చేత ఈ యజమానుడు శుభములనంది ఉత్తమ లోకములను పొందుగాక!

ఇట్లనుటచే ఆ మహాశక్తి స్కంభనామక శక్తి లేదా విశ్వకర్మ నామకశక్తియని తెలియుచున్నది. విశ్వకర్మ వసువులను, రుద్రులను, ఆదిత్యులను సృష్టించినట్లు యజుర్వేదము నందలి ఈ క్రింది మంత్రము తెల్పుచున్నదిగదా!

"ఆపోవా ఇద మగ్రే సలీల మాసీ త్తస్మిన్ ప్రజాపతి ర్వాయు ర్భూత్వా చర్త త్స ఇమా మపశ్య, త్తాం వరాహో భూత్వాహర, త్తాం విశ్వకర్మా భూత్వా వ్యమార్టీత్, సాప్రథత, సాపృథివ్య భవత్, తత్పృథివ్యై పృథివీత్వం, తస్యాం విశ్రామ్యమ్యత్ప్రజా తి స్స దేవా న సృజత. వసూన్, రుద్రా, నాదిత్యాన్" కాం.7, ప్ర.ప-1, అనువాకము 5.

"యస్య భూమిః ప్రమాన్తరిక్ష ముతోదరమ్
దివం యశ్చక్రేమూర్ధానం, తస్మై జ్యేష్ఠాయ నమః" **(32)**

తా॥ ఎవనికి భూమిపాదములో, అంతరిక్షము ఉదరమో, దివము శిరస్సో, అట్టి జ్యేష్ఠ బ్రహ్మకు నమస్కారము. యజుర్వేదీయ పురుష సూక్తమునగల "నాభ్యా అసీదంతరిక్షం, శీర్ష్ణో ద్యౌ స్సమవర్తత, పద్భ్యాం భూమిర్దిశ శ్రోతాత్.. తథాలోకాగ్ం అకల్పయన్" అను మంత్రమునగల విషయములే ఇందుదాహరింపబడినవి.

"యస్య సూర్య శ్చక్షు శ్చంద్ర మాశ్చ పునర్ణవః,
అగ్నిం యశ్చక్ర ఆస్యం, తస్మై జ్యేష్ఠాయ బ్రహ్మణే నమః." **(33)**

ఎవనికి సూర్యుడు నేత్రమో, చంద్రుడు మనస్సో, అగ్ని ముఖమో, అట్టి జ్యేష్ఠ బ్రహ్మకు నమస్కారము. దీనికి మూలము యజుర్వేదీయ పురుషసూక్తమునగల "చంద్రమా మనసో జాతః, చక్షో సూర్యో అజాయత, ముఖా దింద్రశ్చా గ్నిశ్చ ప్రాణా ద్వాయు రుజాయత" అను మంత్రమే.

రెండవ సూక్తము :

"యో భూతంచ భవ్యంచ, సర్వం యశ్చాధి తిష్ఠతి,
స్వర్యస్యచ కేవలం తస్మై జ్యేష్ఠాయ బ్రహ్మణే నమః (1)

ఎవడు భూత భవిష్యద్వర్తమానములన్నిటిని అధిష్ఠించి యుండునో, స్వర్గమునకు ఎవడు ఆధారుడో, అట్టి జ్యేష్ఠ బ్రహ్మకు నమస్కారము.

ఇందు "పురుష ఏ వేదం సర్వం యద్భూతం, యచ్చభవ్యం" అను పురుష సూక్త వాక్యము అనుగతమైనది.

"ప్రజాపతి శ్చరతి గర్భే అన్త రదృశ్య మానో బహుధా విజాయతే,
అర్ధేన విశ్వం భువనం జజాన యదస్యార్ధం కతమ స్సకేతుః." (13)

ఇదియును పురుషసూక్తము నందలి మంత్రమే. కాని పురుష సూక్తము నందలి 'అజాయ మానః'అను పదము ఇందు 'అదృశ్యమాన' అని మార్చబడినది.

ఈ పద్య భావము : ప్రజాపతి శరీరమధ్యమున చరించుచున్నాడు. అతడు కంటికి కన్పించని వాడై బహువిధములుగా అగుచున్నాడు. అతని సగభాగము చేత ఈ విశ్వము కలిగినది. మిగిలిన భాగమేదికలతో అది కేతువు. జగన్మూలము. ఈ విషయ మునే పురుషసూక్తము "పాదో Z స్య విశ్వభూతాని త్రిపాదస్యామృతందివి" అని వచించినది.

"యత స్సూర్య ఉదే త్యస్తం యత్ర చ గచ్ఛతి,
తదేవ మన్యే Z హం జ్యేష్ఠం, తదు నాత్యేతి కించన." (16)

తా॥ ఏ దివ్యశక్తి ప్రభావమున సూర్యుడు ఉదయాస్తమయములచే కాలమును కల్పించుచున్నాడో, ఆ దివ్యశక్తియే జ్యేష్ఠ బ్రహ్మము. దాని నెవ్వడు అతిక్రమింపలేడు.

"సనాతన మేన మాహు రుతాద్య స్స్యాతు నర్ణవః,
అహోరాత్రే చ జాయేతే, అన్యో అన్యస్య రూపయోః." (23)

దేని నుండి మనో బుద్ధ్యాదులు కలుగుచున్నవో, పరస్పర విరుద్ధములయిన అహోరాత్రులేర్పడు చున్నవో, దానిని సనాతనమైన జ్యేష్ఠ బ్రహ్మ అందురు.

"పూర్ణాత్ పూర్ణముదచతి, పూర్ణం పూర్ణేన సిచ్యతే,
ఉతో తదద్య విద్యామ యతస్తత్పరిషిచ్యతే." **(29)**

ఈ మంత్రము "పూర్ణమదః పూర్ణమిదం, పూర్ణాత్పూర్ణ ముదచ్యతే, పూర్ణస్య పూర్ణ మాదాయ, పూర్ణమే నావ శిష్యతే" అను మంత్రమునకు ప్రతిబింబముగా నున్నది. ఇది జ్యేష్ఠ బ్రహ్మము యొక్క సర్వపరిపూర్ణత్వమును ప్రకాశింపజేయుచున్నది.


"యో విద్యాత్ సూత్రం వితతం, యస్మిన్నోతాః ప్రజా ఇమాః
సూత్రం సూత్రస్య యోవిద్యాత్, స విద్యాత్ బ్రాహ్మణం మహత్." **(37)**

ఏ సూత్రమునందు ఎల్లజీవులు (పూలవలె) గ్రుచ్చబడియున్నారో, ఎల్ల సూత్రములకు ఏది మూలసూత్రమో, దానినెఱిగినవాడు జ్యేష్ఠ బ్రహ్మమును ఎఱిగిన జ్ఞాని.

"పుండరీకం నవద్వారం, త్రిభిర్గుణేభి రావృతం,
తస్మిన్ యద్యక్ష మాత్మన్వత్ తద్వై బ్రహ్మవిదో విదుః." **(43)**

తొమ్మిది ద్వారములుగల శరీరము నందలి అంతఃకరణము తమో రజ స్త్వము లనెడి గుణములకు, వాటి వికారములకు నెలవు. అట్టి అంతఃకరణోపాధి యందు ఏ ఆత్మ ప్రకాశించుచున్నదో, దానిని జ్యేష్ఠ బ్రహ్మ విదులైనవారు తెలిసికొందురు.

ఈ విధముగా అథర్వవేదమునందు వచింపబడిన జ్యేష్ఠ బ్రహ్మ, ఋగ్వేద, యజుర్వేదములందు వచింపబడిన విశ్వకర్మ. పురుషుడు ఒక్కరే అని, ఋగ్వేద-యజుర్వేద-అథర్వవేదములందుగల విశ్వకర్మ, పురుష, స్కంభ సూక్త మంత్రముల పరస్పర సాదృశ్యము స్పష్టీకరించుచున్నది.



12. ఋగ్వేదములోని ప్రముఖ దేవతలు

"ఋచ-స్తుతౌ" ఋచధాతువు నుండి పుట్టిక 'ఋక్' శబ్దము స్తోత్రమను అర్థమును తెలుపును. ఋగ్వేదము అనగా దేవతాదులను స్తోత్రము చేయు గ్రంథము.

1. త్వష్టృ దేవుడు :

"త్విష, దీప్తౌ" అను ధాతువు నుండి త్వష్టృ శబ్దమేర్పడినది. అనగా 'కాంతి, దీప్తి' అని భౌతికార్థములు. దీనిని బట్టి త్వష్ట అనగా దీప్తిమంతుడు అని అర్థము. అనగా తాను ప్రకాశించుచు ప్రకాశింపలేని యితరమును ప్రకాశింపజేయునదని భావము. అనగా చిత్స్వరూపము-పరబ్రహ్మము అని ఆధ్యాత్మిక భావము.

త్వష్ట జగములను నిర్మించినట్లు ఋగ్వేదములోని పెక్కుమంత్రములు తెలియ జేయుచున్నవి. అతనిని గూర్చి ప్రయోగించిన 'సుకృత్, సుపాణిః, అనుపదములు అతని జగత్సృష్టత్వమును తెలుపుచున్నవి. "దేవస్త్వష్టా సవితా' అను మంత్రము త్వష్టృ దేవుని ప్రజాసృష్టితోబాటు 'పుపోష' అను పదముచే అతడు పోషకుడని తెలుపుచున్నది. ఋగ్వేద మంత్రము (10.110.9) త్వష్ట బ్రహ్మాండమున కంతటికిని రూపమిచ్చిన దేవుడని తెలుపుటయే గాక 'దేవం త్వష్టార మిహ యక్షి విద్వాన్' అను వాక్యముచే అతడు సమస్త వాంఛా ఫలముల నొసగి రక్షించుననియు, ఆరాధకులకు మోక్షము నిచ్చుననియు తెలియు చున్నది. 'త్వష్టా రూపాణి హి ప్రభు' అనుటచే త్వష్ట స్థూలబ్రహ్మాండ సృష్టినే గాక గర్భస్థపిండములకు కూడ రూపనిర్మాణము చేయుచున్నాడని తెలియుచున్నది. "ఇహ త్వష్టా సుజనిమా సజోషా దీర్ఘమాయుః కరతి జీవసే వః" (ఋ. 10.18.6) అను ఋగ్వేద మంత్ర భాగము 'సృష్టికర్త అయిన త్వష్ట దీర్ఘాయువు నొసంగు'నని తెలుపుచున్నది.

"శివస్త్వష్ట రిహాగహి, విభుఃపోష ఉతత్మనా, యజ్ఞేయజ్ఞేన ఉదవః" **ఋ. 5.6.9**

తాత్పర్యం :- ఓ త్వష్టృ దేవా! శివుడవును (సుఖకరుడవును) వ్యాపకుడవును, పోషకుడవును అయిన నీవు మా యజ్ఞమునకు దయచేసి అన్ని సమయములందును సన్నిహితుడవై మా ఉపాసన, ఆరాధనా రూప యజ్ఞములను సఫలమొనర్చి మమ్ము కాపాడుదువు గాక! ఈ మంత్రమున త్వష్టకు 'శివ' శబ్దము వాడబడినది.

"యుజానో హరితా రథే, భూరి త్వష్టేన రాజతి
కో విశ్వాహా ద్విషతః పక్ష ఆసత ఉతా సీ నేషు సూరిషు." **ఋ. 6.47.19.**

హరిదశ్వుడగు ఇంద్రుడు అనేక ప్రదేశములందు (త్వష్ట=) ప్రకాశించువాడై యొప్పుచున్నాడు.

ఈ మంత్రమున 'త్వష్ట' శబ్దము ఇంద్రునకు వాడబడినది.

"అత్రాహగో రమన్వంత నామ త్వష్టు రపీచ్యం" **(ఋ.1.84.15).**

దీనికి "త్వష్టు ర్దీప్త స్యాదిత్యస్య" అని భాష్యము. ఇచట 'త్వష్ట' శబ్దము సూర్యునకు పర్యాయముగా వాడబడినది.

"విశ్వకర్మణ స్సమవర్తతాధి తస్య త్వష్టా విదధ ద్రూపమేతి" అను యజు రారణ్యక పురుషసూక్త వాక్యము విశ్వకర్మ నుండి త్వష్ట జన్మించినాడని తెలిపినది. త్వష్టృదేవుడు పురాణ వాఙ్మయమున బ్రహ్మగా రూపొందినాడను విషయములు ఈగ్రంథమున నింతకు పూర్వమే వివరింపబడినవి.

2. హిరణ్యగర్భుడు :

"హిరణ్యగర్భః సమవర్త తాగ్రే భూతస్యజాతః పతి రేక ఆసీత్,
సదాధార పృథివీం ద్యా ముతేమాం కస్మై దేవాయ హవిషా విధేమ."

ఋ. 10.121.1.

హిరణ్యగర్భః= హిరణ్యగర్భుడను దేవుడు, అగ్రే=సృష్టికి మొదట, సమవర్తత= ఉండెను, (ప్రాయణులు, పరమాత్మయే హిరణ్యగర్భుడు. అయినను తదుపాధి భూతము లయిన ఆకాశాదులగు సూక్ష్మ భూతములకు బ్రహ్మనుండి ఉత్పత్తి తెలియు చున్నందున 'మాయాధ్యక్షుడై జగత్సృష్టి చేయదలచిన పరమాత్మ నుండి ఈ సూత్రాత్ముడు అభివ్యక్తుడైనాడని ఋగ్వేదేతర గ్రంథముల నుండి గ్రహించుట జరిగినది) సః= అతడు, జాతః= తోచగనే, ఏకః=అద్వితీయుడై, భూతస్య=నానా వికారములతో గూడిన జగత్తునకు, పతిః=ఈశ్వరుడు, ఆసీత్=ఆయెను. అంతియేకాదు సః=అతడు, పృథివీం=అంతరిక్షమును, ద్యామ్=దివమును (స్వర్గమును), ఉత ఇమాం=కంటి కగపడు ఈ భూమిని, దాధార=ధరించెను. కస్మై=సృష్టికోసమైన కోరికగలవాడు 'క' అని చెప్పబడు చున్నాడు. అట్టి 'క' శబ్దవాచ్యుడగు, దేవాయ=దేవుని కొఱకు, హవిషా=హవిస్సు చేత–పూజాద్రవ్యము చేత, విధేమ=పరిచర్య చేయుదుముగాక!

"య ఆత్మదా బలదా యస్య విశ్వం ఉపాసతే ప్రశిషం యస్యదేవాః,

యస్య చ్ఛాయా మృతం యస్య మృత్యుః." ॥కస్మై...॥ (2)

ఏ హిరణ్యగర్భుని నుండి సృష్టిలో అనేకములగు జీవాత్మ లేర్పడుచున్నవో, ఎవడు శక్తి ప్రదాతయో, ఎవని శాసనమును సమస్త ప్రాణులును దేవతలును అనుసరించుచున్నారో, అమృతత్వ-మృత్యుత్వములు ఎవనికి ఛాయలైయున్నవో అట్టి పరమాత్ముని సేవింతుముగాక!

"యః ప్రాణతో నిమిషతో మహి త్వైక ఇద్రాజా జగతో బభూవ,

య ఈశే అస్య ద్విపద శ్చతుష్పదః." ॥కస్మై....॥(3)

ఎవడు నిశ్వసించుచున్న, నిమేషించుచున్న జగత్తునకు (ప్రాణులకు) తన మహిమచేత ఏకైక ప్రభుడై వెలుగుచున్నాడో, ఎవడు కంటికి కన్పించు ద్విపాత్తులకు (దేవమనుష్యాదులకు) చతుష్పాత్తులకు (గవాశ్వాదులకు) ప్రభువో, అట్టి హిరణ్యగర్భుని సేవింతుముగాక!

"యస్యే మే హిమవన్తో మహిత్వా, యస్య సముద్రం రసయా సహాహుః

యస్యే మాః ప్రదిశో యపస్యమ బాహూ." ॥కస్మై...॥ (4)

హిమవదాది పర్వతములు ఎవని ఐశ్వర్యమో, నదీనద సముద్రాదులు ఎవని మహాభాగ్యమని తత్త్వవేత్తలనుచుందురో, దిక్కులు-మూలలు (విదిక్కులు) ఎవని బాహువులై యున్నవో అట్టి హిరణ్యగర్భుని సేవింతుముగాక!

యజుర్వేదము "విశ్వకర్మా దిశాంపతి స్సన: పశూన్పాతు, సోZస్మాన్ పాతు. తస్మైనమః" (5.5.5). దిగ్రూపమైన ప్రపంచమునకు ప్రభువగు విశ్వకర్మ మా పశు ధనాదులను, మమ్మును రక్షించునుగాక! అని వచించుటచే, హిరణ్యగర్భునకు విశ్వకర్మకు అభేదము.

"యేన ద్యౌరుగ్రా పృథివీ చ దృఢా, యేన స్వః స్తభితం యేన నాకః,

యో అంతరిక్షే రజసో విమానః." ॥కస్మై...॥ (5)

ఎవని చేత అంతరిక్షము అంతుపట్టనంత గహనముగా నున్నదో, భూమి స్థిరమై వెలుగుచున్నదో, స్వర్గము పడకుండ ఉన్నదో, నాకము-అనగా సూర్యాదులు పడకుండ ఆకాశమున తిరుగాడు చున్నారో (ఇచట ఆదిత్యుని చెప్పుటచే తక్కిన గ్రహనక్షత్రాదులు కూడ అని గ్రహింపవలయును), ఎవడంతరిక్షమున కూడ ఉదకములను నిర్మించుచున్నాడో, అట్టి హిరణ్యగర్భుని సేవింతుముగాక!

"మానో హింసీ జ్జనితా యః పృథివ్యా, యో దివం సత్యధర్మా జజాన,
యశ్చా ప శ్చంద్రా బృహతీ ర్జజాన." ॥కస్మై...॥ (9)

ఎవడు భూమిని సృష్టించెనో, ఏ సత్యధర్ముడు స్వర్గాదిలోకములను సృజించెనో, ఎవడు ఆహ్లాదమును కలిగించునట్టి అధిక జలములను నిర్మించెనో, అట్టి పరమాత్మను సేవింతుముగాక!

"ప్రజాపతే న త్వ దేతా న్యన్యో విశ్వా జాతాని పరితా బభూవ,
య త్కామా స్తే జుహుమస్త న్నో అస్తు వయం స్యామ పతయో రయీణామ్." (10).

ఓ ప్రజాపతీ! నీవు తప్ప ఇంకెవడును ఇప్పుడేర్పడిన ఈ సర్వభూతములను (జగములను) సృజింపజాలడు. ఇట్టి సర్వశక్తి వంతుడవగు నీవు, మేము ఏ కోరికలను కోరి నిన్ను యజింతుమో, ఆ కోరికలు మాకు సిద్ధించుగాక! మేము సర్వవిధములయిన ధనములకు అధిపతుల మగుదుముగాక!

ఇట్టి వేదవాక్కులను బట్టి హిరణ్యగర్భుడు 'ప్రజాపతి' యనియు, పరమాత్మ అనియు తెలియుచున్నది. అమరకోశమున "ప్రజాపతి, పరమేష్ఠి, హిరణ్యగర్భ" పదములు, బ్రహ్మకు పర్యాయపదములుగ వాడబడినవి.

3. విష్ణువు :

"విషల్ వ్యాప్తౌ" అను ధాతువు నుండి పుట్టిన 'విష్ణు' శబ్దము సర్వవ్యాపక పరబ్రహ్మమునే సూచించుచున్నది. విష్ణువును జగత్సృష్టి కర్తగ తెలుపు వేదవాక్యము లనేకము విష్ణువు ప్రకరణమున వివరింపబడినవి.

"అతో దేవా అవన్తు నో యతో విష్ణుర్విచక్రమే పృథివ్యాః సప్తధామభిః" (ఋ. 1.22.16.) అను మంత్రము విష్ణువు భూమ్యాది (భూః,భువః, సువః. జనః, తపః, సత్యం) సప్తలోకములను ప్రవేశించినాడని బాహ్యార్థమును, శరీరమునగల ఆధార, స్వాధిష్ఠానాది సప్తచక్రముల నాక్రమించినాడని ఆధ్యాత్మికార్థమును సూచించుచున్నది. **"తద్విష్ణో పరమం పదం సదా పశ్యన్తి సూరయః దివీవ చక్షు రాతతమ్." (ఋ. 1.22.20.)** అను మంత్రము విష్ణువు యొక్క పరమ పదమును యోగాది సాధనలను చేసిన మహనీయులు సర్వదా చూడగలరు అని వచించగా, ఋగ్వేదమంత్రము (1.154.5) "విష్ణోః పదే పరమే మధ్వ ఉత్సః" అని వచించినది. సాయణు లీవాక్యమునకు "వ్యాపనశీలుడైన విష్ణువు యొక్క పరమానందాత్మక స్థానమున మధుర నిష్యందము కలదనియు, క్షు తృష్ణా జరామరణ పునరావృత్త్యాది భయములు లేవనియు, సంకల్పమాత్రము

చేతనే అమృతకుల్యాది భోగములు ప్రాప్తించుననియు" వ్యాఖ్యానము వ్రాసినారు. దీనిని బట్టి విష్ణువు సహస్రారస్థిత పరమాత్మ అని స్పష్టమగుచున్నది.

4. రుద్రుడు :

ఋగ్వేదమున మూడు పూర్తి సూక్తముల లోను, రెండు సూక్తభాగముల లోను స్తుతించబడిన రుద్రుడు, కృష్ణ యజుర్వేదమున మహోన్నతుడుగా, సర్వోన్నతుడుగా, సర్వజ్ఞుడుగా, ఆదిదేవుడుగా స్తుతించబడినాడు.

"య శ్శుక్ర ఇవసూర్యో హిరణ్య మివ రోచతే శ్రేష్ఠో దేవానాం వసుః" (ఋ. 1.43.5).

"శం నః కరత్యర్వతే, సుగం మేషాయ మేష్యే నృభ్యో నారిభ్యో గవే." (ఋ. 1.43.6).

ఏ రుద్రుడు సూర్యునివలె దీప్తిశాలియు, బంగారము వలె సర్వులకు ప్రీతి పాత్రుడును, దేవతలందరిలో శ్రేష్ఠుడును అయి ఇష్టుడగు చున్నాడో, అందఱను నివాస యోగ్యులను చేయు ఆ రుద్రుడు మాగుఱ్ఱములకు, మేషీమేషములకు, నారీనారులకు, గోవులకు చక్కగా పొందదగిన సుఖమును కలిగించు చున్నాడు.

"కద్రుద్రాయ ప్రచేతసే మీఢుష్టమాయ తవ్యసే వోచేమ శంతమం హృదే." (ఋ. 1.43.1)

ప్రచేతసే=ప్రకృష్టమగు జ్ఞానముతో కూడినవాడును, మీఢుష్టమాయ=సేకృత మాయ, కోరిక కోర్కెలను వర్షించువాడును, తవ్యసే=ఎక్కువగా వృద్ధినొందినవాడును, హృదే=మా హృదయములందధిష్ఠించిన వాడును నగు, రుద్రాయ= రుద్రుడను దేవుని కొఱకు, శంతమం=ఎక్కువ సుఖకరమగు స్తోత్రమును, కత్=కదా-ఎప్పుడు, వోచేమ= పఠింతుము.

ఈ మంత్రము వలన రుద్రుడు సకలజీవుల హృదయములలోనున్న పరమాత్మ యని తెలియుచున్నది. రుద్రుని 'భువనస్య పితరమ్' (ఋ. 6.49.10) అని వచించుట వలన రుద్రుడు 'జగత్పిత' అని స్పష్టమగుచున్నది.

కృష్ణ యజుర్వేదము నందలి శతరుద్రీయము (నమకము)న శ్వేతాశ్వత రోపనిషత్తున, రుద్రుడు సర్వోన్నతుడుగ స్తుతింపబడుట రుద్రప్రకరణమున నింతకు పూర్వమే వ్రాయబడినది.

5. ఇంద్రుడు :

"ఇది-పరమైశ్వర్యే" అను ధాతువు నుండి కలిగిన 'ఇంద్ర' శబ్దమునకు ఈశ్వరత్వము కలవాడని అర్థము స్ఫురించుటచే, ఇంద్రుడు పరమాత్మయని విదితమగుచున్నది. ఇంద్రుడు

"రూపం రూపం ప్రతిరూపో బభూవ" (ఋ. 6.47.18) అనగా ఇంద్రుడు ప్రతి శరీరము నందును ప్రతిబింబరూపుడై (జీవరూపుడై) యున్నాడు అనుటయు, ఇంద్రుని "విశ్వకర్మా విశ్వదేవో మహానసి (–ఋ. 8.98.2) అని స్తుతించుటయు, ఇంద్రుడు పరమాత్మ యని స్పష్టమగుచున్నది. ఇంద్రుని జగత్సృష్టి కర్తగ, పరమాత్మగ వివరించు వేదమంత్రము లనేకము 'ఇంద్ర' ప్రకరణమున వ్రాయబడినవి.

6. సూర్యుడు :

"సూర్య ఆత్మా జగతః త స్థుషశ్చ" (ఋ. 1.115.1) అనగా సూర్యుడు స్థావర జంగమరూప జగత్తునకు ఆత్మయై యున్నాడు అని వచించుట, సవిత–విష్ణు–రుద్రులు సూర్యుడే అని వచించుట (ఈ విషయములు ఆయా ప్రకరణములయందు చూడనగును) సూర్యుడు పరమాత్మయని స్పష్ట ప ఱచుచున్నవి.

7. మిత్రుడు :

"మిత్రో జనాన్యాత యతి బ్రువాణో మిత్రో దాధార పృథివీ ముత ద్యామ్॥
మిత్రః కృష్టీ రని మిషాభి చష్టే మిత్రాయ హవ్యం ఘృతవజ్జు హోత॥." ఋ. 3.59.1.

బృవాణః=శబ్దము చేయుచు, మిత్రః= మిత్రుడు, జనాన్=జనులచేత, యాతయతి= ప్రయత్నం (పనులు) చేయించును, మిత్రః=మిత్రుడు, పృథివీం=భూమిని, ఉత=ఇంకను, ద్యాం=స్వర్గమును, దాధార=ధరించుచున్నాడు, అనిమిషా=రెప్పపాటులేని దృష్టితో, కృష్టీః = పనులు చేయువారిని, అభిచష్టే=అంతటను చూచును. మిత్రాయ= మిత్రునికి, హవ్యం=హోమద్రవ్యమును, ఘృతవత్=నేతితో, జుహోత=హోమము చేయుడు.

"అయం మిత్రో నమస్యః సుశేవో రాజా సుక్షత్రో అజనిష్ఠ వేధాః।
తస్య వయం సుమతౌ యజ్ఞ యస్యాపి భద్రే సౌమనసే స్యామ॥." **(4)**

అయం మిత్రః=ఈ మిత్రుడు, నమస్య=అందఱకు నమస్కరింపదగినవాడు, సుశేవః= సుఖముగా సేవింపదగినవాడు, రాజా=రాజు, సుక్షత్రః=మంచి బలము కలవాడు, వేధాః =లోకముకు విధాత, అజనిష్ఠ=అయియుండెను, తస్య యజ్ఞయస్య=పూజార్హుడగు అతని యొక్క, సుమతౌ=సద్బుద్ధి యందు, భద్రే సౌమవసే=శుభమైన సౌమనస్యమునందు, స్యామ=ఉందుము.

ఈ సూక్తమునందలి ప్రథమ మంత్రమున మిత్రుడు ద్యావా పృథువులను ధరించినాడని తెలుపుట, నాల్గవమంత్రమున మిత్రుని. "వేధ" (బ్రహ్మ) అనియు, పూజార్హు డనియు తెలుపుట మున్నగు విశేషములు మిత్రుడు పరమాత్మయని తెలుపుచున్నవి.

"మిత్రాయ పంచ యేమిరే జనాఅభిష్టి శవసే సదేవాన్ బిభర్తి." **(8)**

పంచరీతులవారైన జనులు దుష్టశక్తుల నణచెడి బలముగల యేమిత్రుని ఆరాధింతురో, అట్టి మిత్రుడు ఎల్లదేవతలను భరించుచున్నాడు.

"మిత్రో దేవే ష్వాయుషు జనాయ వృక్త బర్హిషే ఇష ఇష్ట వ్రతా అకః." **(9)**

మిత్రుడు తనను యోగాదులచేత ఆరాధించు జనులకు ఐహిక, పారమార్థిక ఫలముల నిచ్చుచున్నాడు.

ఈ సూక్తమునందలి 5వ మంత్రము మిత్రుని–గొప్ప ఆదిత్యుడు (మహాఆదిత్య) అని వచించినది. అమరకోశమున సూర్యుని పర్యాయపదములలో మిత్రుని పేరున్నది.

8. వరుణుడు :

"వృ=కప్పు, వ్యాపించు అను ధాతువునుండి 'వరుణుడు' అను పదము పుట్టినదని సాయణుని వ్యాఖ్య. "వృణోతి పాపకృతఃస్వకీయైః పాశై రా వృణోతీతి వరుణః" అనగా పాపము చేయువారిని తన పాశములతో ఆవరించును అని అర్థము.
వరుణుడు ఋగ్వేదములో సమ్రాట్టుగా, స్వరాట్టుగా ప్రస్తుతించబడినాడు.

"అస్తభ్నా ద్యా మసురో విశ్వ వేదా అభి మిమీత వరిమాణం పృథివ్యాః।
ఆసీద ద్విశ్వా భువనాని సమ్రాడ్ విశ్వే త్తాని వరుణస్య వ్రతాని॥." **ఋ.8.42.1.**

ఐహిక పారిమార్థిక సంపత్తులు కల బలశాలియగు వరుణుడు ద్యావా పృథువులను నిర్మించెను. ఇట్లు సృష్టించిన సమస్తమునకు సమ్రాట్టు కూడ అయ్యెను. వరుణుని యీ ఘనకార్యములు విశ్వమునకు సంబంధించినవై వర్ణింప వీలుకానివై యున్నవి.

దీనిని బట్టి వరుణుడు విశ్వసృష్టికర్త యని తెలియుచున్నది.

"యోధర్తా భువనానాం య ఉస్రాణా మపీచ్యా వేద నామాని గుహ్యా.
సకవిః కావ్యా పురు రూపం ద్యౌరి వ పుష్యతి నభంతా మన్యకే సమే." **8.41.5.**

ఎవడు భువనములను ధరించుచున్నాడో, ఎవడు దేవగృహములైన తేజస్సుల నామముల రహస్యముల నెఱుంగునో సర్వజ్ఞుడగు అట్టి వరుణుడు సృష్టికర్మలను చేయుచు మనలను అడ్డగించు దుష్టశక్తులను అణచుగాక!

దీనిని బట్టి వరుణుడు సృష్టికర్తయని తెలియుచున్నది.

"మాయావాం మిత్రా వరుణా దివిశ్రితా సూర్యో జ్యోతిశ్చరతి చిత్రమాయుధమ్

తమభ్రేణ వృష్ట్యా గూహథో దివి పర్జన్యద్రప్సా మధుమంత ఈరతే." ఋ.5.63.4.

హే మిత్రా వరుణ! మీ మాయాశక్తి వలననే ఆకాశము ఉన్నది. చిత్ర విచిత్ర కిరణములతో గూడిన సూర్యుడు ఆశక్తివలననే చరించుచున్నాడు. ఆకాశమును మేఘములతోను వృష్టితోను కప్పివేయుచున్నారు. ఆశక్తి వలననే పర్జన్యుడు మధు సమానమైన జల బిందువులను కురిపించి లోకములకు శుభ సంతోషములను కలిగించు చున్నాడు. ఇది యంతయు నీమాయా శక్తి యొక్క ప్రభావమే.

'మాయాశక్తి' అనగా 'ఇంద్రియగోచరము కాని శక్తి, ఇంద్రజాలము' అని ప్రాచీనార్థము.

<u>తైత్తిరీయ సంహిత</u>

"ప్రాణోవైమిత్రః అపానో వరుణః." **(కాం.5.ప్రశ్న.3.మంత్రం 17).**

అనగా వారు శరీరమున ప్రాణాపాన వాయురూపులని వచించినది.

9. అగ్ని :

ఋగ్వేదము అగ్నిని స్తుతించు మంత్రముతో ప్రారంభమగుచున్నది. "అగ్ని మీళే పురోహితం యజ్ఞస్య దేవ మృత్విజం, హోతారం రత్నధాతమమ్." (1.1.1), పవిత్ర కర్మలను చేయువారికి ఆకర్మల ఫలము నిచ్చుచు హితము చేయువాడును, సత్కర్మములను సాధింప తోడ్పడువాడును, కర్మఫలములను సాధించు యజమానుడును, కర్మఫలములను స్వాధీనము నందుంచుకొనినవాడును, అగు అగ్నిదేవుని స్తుతించు చున్నాము.

"ప్రత్నం హోతార మీడ్యం జుష్ట మగ్నిం

కవిక్రతుం, అధ్వరాణా మభి శ్రియమ్." **(ఋ. 8.44.1)**

అతి పురాతనుడును, దేవతలను పిలుచువాడును, స్తుతించుటకు- సేవించుటకు తగినవాడును, క్రాంతదర్శియు, యజ్ఞరూపుడును, యజ్ఞముల కాశ్రయుడును అగు అగ్నిని స్తుతింతును.

"అగ్నిఃశుచివ్రత తమః శుచి ర్విప్రః శుచిఃకవిః, శుచీ రోచత ఆహుతః." (8.44.21.).

అగ్ని పరిశుద్ధములయిన సృష్ట్యాది కర్మలు కలవాడును, ప్రకృతి సంబంధమైన మాలిన్యములు లేనివాడును, జ్ఞానస్వరూపుడును, క్రాంతదర్శియునై (అనగా సర్వజ్ఞుడై) మాచే ఆహ్వానించబడి ప్రకాశించుచున్నాడు-ఆరాధింపబడుచున్నాడు.

"త్వ మగ్నే ప్రథమో అంగిరస్తమః కవిర్దేవానాం పరిభూషసి వ్రతం,
విభుర్విశ్వస్మై భువనాయ మేధిరే ద్విమాతా శయుః కతిధా చి దాయవే."

(ఋ. 1.31.2.)

ఓ అగ్నీ! నీవు మొట్టమొదటి అంగిరస్తముడవై, క్రాంత దర్శివై, దేవతల కర్మల నలంకరించుచున్నావు. ఇంకను నీవు సమస్త లోకముల హితము కొఱకు ఆహవనీయాది రూపములను తాల్చి చరించుచున్నావు.

"మహి త్వాష్ట్ర మూర్జయంతీ రజుర్యం స్తభూయమానం వహతో వహంతి,
వ్యంగేభి ర్దద్యుతానః సధస్థ ఏకా మివ రోదసీ ఆవివేశ." **(ఋ.3.7.4.)**

త్వష్ట యొక్క కుమారుడును, మహానుభావుడును అగు అగ్నిని, దుర్బలుని బలవంతుని చేయు నదులు ముసలితనము లేని వానినిగా చేయుచున్నవి. నీటి యొద్ద అవయవములచే ప్రకాశించు అగ్ని భూమ్యాకాశముల యందెల్లెడల అనేక రీతులుగా ప్రకాశించుచున్నాడు.

"త్వ మగ్నే త్వష్టా విధతే సువీర్యం." **ఋ. 2.1.5.**

ఓ అగ్నీ! నీవు త్వష్టవై గొప్ప వీర్యమును (ఫలమును) ఇచ్చుచున్నావు. అగ్ని త్వష్ట పుత్రుడే గనుక 'ఆత్మావై పుత్రనామాసి' అను వేదవాక్యమును బట్టియు, పితా పుత్రుల అభేదమును బట్టియు, అగ్ని త్వష్టు స్వరూపుడే అగుచున్నాడు.

"ఇహ త్వష్టార మగ్రియం విశ్వరూప ముపహ్వయే అస్మాక మస్తు కేవలః." (1.13.10.)

ప్రథముడును, విశ్వరూపుడును అగు త్వష్టు రూపాగ్నిని ఈకర్మను రక్షింప పిలుచుచున్నాము. అతడొక్కడే మమ్ము రక్షించునుగాక!

"త్వ మగ్న ఇంద్రో వృషభః సతామసి త్వం విష్ణు రురుగాయో నమస్యః,
త్వం బ్రహ్మా రయివిద్ బ్రహ్మణస్పతే త్వం విధర్తః సచసే పురంధ్యా." **ఋ.2.1.3**

తా॥ ఓ అ గ్నీ! నీవు సత్పురుషుల కోర్కెలు తీర్చుఇంద్రుడవు, లెస్సగా స్తుతింపబడు విష్ణుడవు, నమస్కారార్హుడవు. మంత్రపాలకుడవైన నీవు బ్రహ్మవు. గవాది రూపముల కధిపతివి. నీవు బహువిధాకారములను దాల్చి ఆయా బుద్ధులతో ప్రవర్తించుదువు.

"త్వ మగ్నే రాజా వరుణో ధృత వ్రత స్త్వం మిత్రో భవసి దస్మ ఈడ్యః,
త్వ మర్యమా సత్పతి ర్యస్య సంభుజం త్వ మంశో విదధే దేవ భాజయుః." **(4)**

తా॥ ఓ అగ్నీ! నీవు కర్మకుశలుడవైన వరుణ రాజువు. శత్రునాశకుడవుగాన స్తుతింపదగిన మిత్రుడవు. ధనాదుల నొసగు అర్యముడవు. నీవు సూర్యుని మూర్త్యాంతరమైన అంశుడవు. మరియు ఈ సూక్తము నందలి యితర మంత్రములు అగ్నిని "త్వం అగ్నే రుద్రో అసురో" (2.1.6), "త్వం దేవః సవితా రత్నధా అసి (2.1-7)" అనియు స్తుతించినవి. ఈ సూక్తము నందలి 11వ మంత్రము అగ్నిని 'అదితి' యనియు, 'భారతి' యనియు, 'ఇళాదేవి' అనియు 'సరస్వతి' అనియు స్తుతించినది. 8వ మంత్రము అగ్నిని మానవుల కధిపతి (విశృతి) అనియు, 15వ మంత్రము ద్యావాపృథువులు కూడ అగ్నియే అనియు స్తుతించినది. ఇచట శక్తికే ప్రాధాన్యముగాని, స్త్రీ, పుంసాది లింగములకు కాదని భావము. ఈ విధముగ అగ్ని ఋగ్వేదమున 200 సూక్తములలో లెస్సగ స్తుతించబడినాడు. అగ్ని ఒక్కడే రాజు (సమాన రాజా విభృతః పురుత్రా. ఋ. 3.55.4.) కమ్ముల చుట్టును చక్రమున్నట్లు అగ్ని దేవతలను చుట్టి ఉండును. (అగ్ని నేమి రరాన్ ఇవ దేవాం స్త్వం పరిభూరసి - ఋ. 5.13.6). చక్రము అంచు చక్రమును చుట్టుకొనియున్నట్లు అగ్ని అన్ని జ్ఞానములను చుట్టుకొని యున్నాడు (పరివిశ్వాని కావ్యా నేమిశ్చక్ర మివాభవత్. 2.5.3.) (కావ్యా=జ్ఞానములు). ఆయన పుట్టగనే జ్ఞానములను పొందినాడు (సహసా జాయమానః సద్యః కావ్యాని బ ళదత్త విశ్వా 1.96.1). ఆయన అన్నిరకముల జ్ఞానములు తెలిసినవాడు (విశ్వాని విద్వాన్ వయునాని. 10.122.2.). ఋగ్వేదములో అగ్నికి "విశ్వవిద్" (అన్నియు తెలిసినవాడు), 'విశ్వవేదస్' (పూర్తి జ్ఞానము కలవాడు), కవి, ఋషి, కవిక్రతు (ఋషులకున్న జ్ఞానము కలవాడు) అను విశేషణములు వాడబడినవి. ఋగ్వేదములో 120 సార్లకుపైగా అగ్నికి 'జాతవేదస్' అను విశేషణము వాడబడినది. ఈ విశేషణము అతనికి మాత్రమే వాడబడినది. ఈ పదమునకు ఋగ్వేదము (6.15.3) లో విశ్వా వేద జనిమా (జాతవేదాః) అన్ని జన్మలు (జన్మలు కలభూతజాతాలూ) ఆయనకు తెలియును అని వివరణ యివ్వబడినది. అగ్నికి దేవతలు విధించిన విధులు (వ్రతా), మనుష్యుల జన్మలూ తెలియును. (ఆ దైవ్యాని వ్రతా చికిత్వానా మానుషస్య జనస్య జన్మ. ఋ. 1.70.2.), ఆయన కలిగించు జ్ఞానము వలన భక్తులు కీర్తి పొందుదురు (అస్యక్రత్వా యశస్వత, ఋ. 8.102.8.), ఆయన నుండి జ్ఞానము, స్తుతులు పుట్టును. (ఋ. 4.11.3.)

"ఆయన ప్రకాశించు వాక్కును సృష్టించినవాడు (శుక్రస్య వచసో మనో తా."(ఋ. 2.9.4) ఆయన ప్రార్ధనను మొదటగా సృష్టించినాడు ప్రథమో మనోతా." (ఋ. 6.1.1.)

అగ్నికి 'గృహపతి' అనుపదము తరచువాడబడినది (యః..నిషసాద దమే దమేః, కవి ర్గృహపతి ర్యువా. (ఋ. 7.15.2)

ఆయన ఇండ్లలో అతిథి అని చెప్పబడినాడు (అతిథి ర్గృహే ర్గృహే, 10.91.2.)

అగ్ని మనుష్యులకు నివాసములు ఏర్పరచినాడు (ప్రతి మర్త్యాన్ అవాసయోః దమూనాః ఋ. 3.1.17). ఆయన నివాస మేర్పరచుకొనినవారికి నాయకుడు (ఋ. 3.2.5.), రక్షకుడు (విశాం గోపాఃఋ. 1.94.4.), విశ్పతి (నివసించేవారికి పతి), అను విశేషణములు, అగ్నికి వాడబడినది. అందువలననే అగ్ని బంధువు (ఋ. 7.15.1మొ), స్నేహితుడు (సఖా ఋ. 1.26.3మొ), పితా (ఋ. 6.1.5మొ), సోదరుడు (భ్రాత ఋ. 10.7.3.మొ), తల్లి (మాతృ.ఋ.6.15) అని చెప్పబడినాడు. అగ్ని-ఋషి, పురోహితుడు (ఋ.9.66.20), చాలా దయగల (వేధస్తమః) ఋషి (ఋ. 6.14.2), అగ్ని పండితులలో దివ్యుడు (అసురో విపశ్చితాం. ఋ.3.3.4). అగ్ని మొట్టమొదటి యజ్ఞానమునకు కర్త (యజ్ఞస్యనేతా ప్రథమస్య 3.15.4), అగ్ని హోతలలో పూజ్యుడు (10.2.1మొ), అధ్వర్యుడు (3.5.4.), బ్రహ్మ (4.9.4). అగ్నికి యజ్ఞములను గురించి పూర్తిగా తెలియును (వ్యమి మీత యజ్ఞం. ఋ. 10.110.1). మనుష్యులకు తెలియని యజ్ఞవిధులు విద్వాంసుడైన అగ్నికి తెలియును. ఆయన సరియైన కాలములో దేవతలను పూజించును (కృతు వి ద్వజానన్ యజిష్ఠో దేవాన్ ఋతుశో యజాతి, ఋ. 10.2.1మొ), అగ్ని భక్తులకు బాగుగా సహాయము చేయును. తన తేజస్సుతో నూఱు ఇనుపకోటలతో భక్తులను రక్షించును. (మహోభిః శతః పూర్భిరాయసీ భిర్ని పాహి. ఋ.7.16.10మొ). నావికుడు నావతో నదిని దాటున్నట్లు, అగ్ని భక్తుల యొక్క గొప్ప పాపములను దాటించును-ఋ. 5.4.9). చెట్టు నుండి కొమ్మలు వచ్చినట్లు అగ్ని నుండి ఆశీస్సులు వచ్చును (6.13.1). ఆయన వద్ద సంపదలన్నియు పోగుపడియున్నవి (ఋ. 10.6.6) ఆయన తన యొద్ద నున్న సంపదలను సమృద్ధిగా ఇచ్చును (ఋ. 1.1.3మొ). అగ్ని లోకములకు తండ్రి (1.96.4). ఆయన ఆజ్ఞను భూమి, స్వర్గము పాటించును (7.5.4). ఆయన వాటిని చర్మములను పరిచినట్లు విశాలము చేసెను (7.5.4 మొ), సత్యమైన మంత్రాలతో (మంత్రేభిః సత్యైః) భూమిని, అకాశమును నిలబెట్టెను (1.67.5.). అగ్ని దివ్యుడైన సమ్రాట్టు, ఇంద్రుని వలె శక్తిమంతుడు (ఋ. 7.6.2). వరుణుడు, మిత్రుడు, మరుత్తులు, దేవతలందఱు అగ్నిని స్తుతించి పూజింతురు (ఋ.3.9.8మొ), అగ్ని పూర్వకాలములో చాల గొప్ప పనులు చేసెను. (అగ్నే వ్రతాని పూర్వ్యా మహాని, ఋ. 7.6.2). అగ్ని ఎగురువాటిని, నడచు వాటిని, స్థావర జంగమములను సృష్టించెను (ఋ.10.88.4). అగ్ని అమర్త్యత్వమునకు రక్షకుడు (ఋ.7.7.4), ఈశ్వరుడు (7.4.6), మర్త్యులకు దానిని ప్రసాదించును. (ఋ.1.31.7). అగ్ని వైశ్వానరుడు మాతరిశ్వుడే (అగ్ని మవసే హవామహే వైశ్వానరం మాతరిశ్వానం, ఋ.3.26.2). అగ్ని యితర దేవతలతోబాటు దర్భాసనం మీద కూర్చుండును. (ఋ.3.14.2మొ). అగ్ని బంగారు రూపము (హిరణ్య రూపం) కలవాడు (ఋ.4.3.1మొ). అతని రథము బంగారపుది (ఋ. 4-1.8)

అగ్ని స్వర్గమునకు తల (అగ్నిం మూర్ధానం దివః ఋ. 3.2.14). మూడు తలలు కలవాడు (త్రిమూర్ధానాం) ఋ.1.146.1). మూడు శరీరములు (తిస్రఉతే తన్వః) మూడు స్థానాలు (త్రిషధస్థా), త్రిపస్త్య (మూడు నివాసాలు) (8.39.8) కలవాడు. అగ్ని మూడు ధాతువులు కలవాడు (ఋ.3.26.7), మూడు నాలుకలు (తిస్రస్తే జిహ్వా) కలవాడు (ఋ.3.20.2). అగ్ని స్వర్గములో ప్రకాశించును. (అగ్నే దేదీయ సి ద్యవి- ఋ. 8.44.29.)

అగ్ని మూడవ రూపము అత్యున్నత స్థానములోనిది (ఋ. 10.1.3మొ). ఇది సహస్రారములోని జ్యోతి స్వరూపమును తెలుపుచున్నది.

అగ్ని మనుష్యుని హృదయములోను (అస్మద్హృదో భూరిజన్మా వి చష్టే. ఋ. 10.5.1), జంతువులలోను, గుల్మములలోను, పక్షులలోను, రెండు కాళ్ళు, నాలుగు కాళ్ళు కలవాటిలోను (అధర్వవేదం 3.21.2, 12.1.9, 12.2.33, తైత్తిరీయ సంహిత 4.6.1.3) ఉండును. తైత్తిరీయము (5.7.11) "రుద్రోవా ఏషయ దగ్నిః" ఈ అగ్ని రుద్రుడే అనుచున్నది. విశ్వకర్మ యొక్క పంచముఖములలో మొదటిది రుద్రరూపము. అతడే కాలాగ్ని రుద్రుడు, మనుబ్రహ్మ. అందువలననే ఆ ముఖమును అగ్నివలె ఎఱుపు రంగుతో చిత్రింతురు. ఋగ్వేదము (2.1.7) అగ్ని ధనము నిచ్చువాడనియు, సవిత అనియు, భగుడనియు వచించినది.

"అగ్నే నయ సుపథా రాయే అస్మాన్ విశ్వాని దేవ వయునాని విద్వాన్,
యుయోధ్యస్మజ్జుహురాణ మేనో భూయిష్ఠాం తే నమ ఉక్తిం విధేమ."

ఋ.1.189.1.

హే దేవ అగ్నే= దివ్యలక్షణములు గల ఓ అగ్నీ! నీవు, విశ్వాని= సమస్తమయిన, వయునాని= కర్మలను లేదా జ్ఞానములను, విద్వాన్=ఎఱుగుదువు. కనుక మాయందుగల, జుహురాణాం=కుటిలమైన, ఏనః=పాపమును, అస్మత్=మానుండి, యుయోధి= వేఱుచేయుము-నశింప చేయుమని భావము. పిమ్మట మమ్ము, సుపథా=మంచిమార్గము ద్వారా; రాయే=మేము పొందదగిన స్వర్గమోక్షాది రూపధనము కొఱకు; నయ=నడిపింపుము, తే=నీకు భూయిష్ఠాం=బహుళమైన, నమ ఉక్తిం=నమస్కారరూప పరిచర్యను, విధేమ= చేయుదుము.

ఈ మంత్రమున జన్మరాహిత్య రూప మోక్షమును గూర్చి, ధనవాచకమైన "రై" (రాయే) శబ్దముపయోగించబడినది. పై మంత్రములలో కూడ అగ్ని పరమాత్మ అని తెలుపు అనేక విషయములు తెలుపబడినవి. "అగ్రం నయతీ త్యగ్నిః" అను వ్యుత్పత్తిని

బట్టి, జీవులను ఆద్యుడైన తనలో లీనమొనర్చుకొని ముక్తినిచ్చువాడు కావున, అగ్ని పరమాత్మ యగుచున్నాడు. అట్టి అగ్ని నామక పరమాత్మ సర్వజ్ఞుడు గనుక జీవుల యొక్క ఆగామి, సంచిత, ప్రారబ్ధములను, వాటికి సంబంధించిన జ్ఞానములను ఎఱిగినవాడు. ఋక్కులు అగ్ని యొక్క సర్వాత్మ కత్వమును ఇట్లు వివరించుచుండగా, శతపథ బ్రాహ్మణము "అగ్ని ర్వావ సర్వాదేవతా, అగ్నౌహి సర్వాభ్యో జుహ్వతి" (2.5.4) అగ్నియే సర్వదేవతలు. అందువలన అగ్నియందే ఎల్లదేవతలకు హోమద్రవ్యములనిత్తురు" అని వచించుచున్నది. ఋగ్వేదము (1.164.46) ఆ అగ్నినే ఇంద్రుడనియు, మిత్రుడనియు వరుణుడనియు, గరుత్మంతుడనియు, యముడనియు, వాయువనియు భిన్న భిన్న నామములతో పేర్కొనిరి అని తెలిపినది. ఈ అగ్ని భగవత్స్వరూపమే అని భగవద్గీత "అహం వైశ్వానరో భూత్వా, ప్రాణినాం దేహ మాశ్రితః ప్రాణాపాన సమాయుక్తః, పచామ్యన్నం చతుర్విధం" అని వచించినది.

అగ్ని ప్రాణుల శరీరమున ఉష్ణరూపముగను, జలములలో అవ్యక్తముగను, మేఘములతో విద్యుద్రూపముగను ఉండును. వస్తువులలో నిగూఢముగ నుండు అగ్ని స్వభావము నీక్రింది మంత్రమెట్లు తెలుపు చున్నదో చూడుడు.

"గర్భో యో అపాం గర్భో వనానాం, గర్భ శ్చ స్థాతాం, గర్భశ్చ రథాం,
అద్రౌ చి దస్మా అన్తర్దురోణే, విశాం న విశ్వో అమృతః స్వాధీః." **ఋ. 1.70.2.**

యః=ఏఅగ్ని, అపాంగర్భః =నీటికి గర్భమైయున్నదో-అనగా నీటిలోగల ఉష్ణమును ఈమాట తెలుపుచున్నది. వనానాంగర్భః=అడవులకు గర్భమైయున్నదో, స్థాతాం=స్థావర రూపములైన కాష్ఠాదులకు, గర్భః=లోపల నిమిడియున్నదో, చరథామ్= పాదములుగల జంగమములకు, గర్భః=గర్భమైయున్నదో అనగా జఠరాగ్ని రూపమున గర్భమునందు కలదని భావము. అస్మై=ఇట్టి అగ్నికి, దురోణే, అద్రౌ అంతః=అందుకొనరాని కొండమీద కూడ హవిస్సు నర్పించుచున్నారు. విశామ్=ప్రజలకు విశ్వోన=రాజువలె, స్వాధీః=శోభనకర్మ యుక్తుడగుగాక! ఈమంత్రము అగ్ని చరాచర ప్రపంచమున కెల్లను గర్భములోపల నుండువాడని, అగ్ని రహస్యమును తెలుపుచున్నవి.

అసలు తత్త్వము విచారించిన అఖండ పరమాత్మయే ఆకాశాది భూతములుగను, వాటివికారమగు జగత్తుగను, నానాదేవతలుగను విలసిల్లు చున్నాడని "యో దేవానాం నామధా ఏక ఏవ", ఏకం సద్విప్రా బహుధా వదన్తి", అను మంత్రములు తెలుపుచున్నవికదా! దీనిని బట్టి ఆకాశాదులైన అన్నిటికి లోపల వెలుపల అంతట నిండియున్నది "అంతర్బహిశ్చ తత్సర్వం వ్యాప్య" ఆ పరమాత్మ తత్త్వమే గనుక అగ్న్యాదులు పరమాత్మ రూపమేనని తత్త్వజ్ఞులు తలంతురు.

ఋగ్వేదము అగ్నికి అధిభౌతిక, ఆధిదైవిక, పారమార్థిక స్వరూపములున్నట్లు వర్ణించుచున్నది. ఈ త్రివిధ రూపములు సర్వదేవతలకు ఉండినను, అగ్ని విషయమున నివి లెస్సగా వర్ణింపబడినవి. 1. అగ్ని-పంచభూతములలో నొకటిగా భావించబడినపుడు అధిభౌతికమైన సృష్టికి ఉపాదాన పదార్థమగుచున్నది. అపుడు ఆత్మ నుండి ఆకాశము, ఆకాశము నుండి వాయువు, వాయువు నుండి అగ్ని కలిగినవని తెలియుటచే, అగ్నియొక్క భౌతిక స్వరూపము స్పష్టమగుచున్నది. "వాయోరగ్నిః" అను తైత్తిరీయోపనిషద్వాక్యము కూడ ఈ విషయమునే వెల్లడిచేయున్నది. 2. అగ్ని దేవుడుగా భావించబడినపుడు అతడు దేవతలలో శ్రేష్ఠుడుగా పరిగణింపబడుట, దేవతలతో కలిసి ఆయా పనులు చేయుట పొసగుచున్నవి. 3. అగ్ని యొక్క పారమార్థిక రూపము అనగా సర్వాత్మకమై సర్వవ్యాపకమైన పరమాత్మ స్వరూపము-అగ్ని గొప్ప కాంతి కలవాడు, స్వర్గమునకు తల, అగ్ని యొక్క మూడవ రూపము అత్యున్నత స్థానము (అనగా సహస్రారము) లోనిది, అగ్ని మనుష్యుని హృదయములోను, జంతువులలోను, గుఱ్ఱములలోను, పక్షులలోను ద్విపాద - చతుష్పాద జంతువులలోను కలదను విషయములు తెలుపుచున్నవి. మరియు ఋగ్వేదము (1.31.1) నందలి "ఓ అగ్నీ! నీవు మొట్టమొదటి అంగిరసుడవు. "దేవతలలో మొట్ట మొదటి దేవుడవు" అను వాక్యము అగ్ని యొక్క పారమార్థిక స్వరూపమును స్పష్టపరుచు చున్నది.

10. బృహస్పతి

ఋగ్వేదములో పదకొండు పూర్తి సూక్తములలోను, మరి రెండు సూక్తములలో ఇంద్రునితో కలిపి-బృహస్పతి స్తుతించబడినాడు, ఋగ్వేదములో బృహస్పతి అను పేరు 120 సార్లు, బృహస్పతికి నామాంతరమైన బ్రహ్మణస్పతి పేరు 50 సార్లూ వాడ బడినునది. ఋగ్వేదములో ద్వితీయ మండలము 23వ సూక్తములోని ప్రథమ మంత్రములో 'బ్రహ్మణస్పతే' అనియు, ద్వితీయ మంత్రములో 'బృహస్పతే' అనియునున్నది. దీనిని బట్టి బృహస్పతి, బ్రహ్మణస్పతి ఒక్కరే అని స్పష్టమగుచున్నది.

"బృహతీ-వాక్, తస్యాఃపతిః-బృహస్పతి-బృహతి అనగా వాక్కు వాక్కుకు అధిపతి బృహస్పతి. బృహస్పతి శబ్దమునకు పర్యాయపదమే వాచస్పతి. వాచః=వాక్కులకు పతి. 'వాచస్పతిం విశ్వకర్మాణ మూతయే' అని విశ్వకర్మ సూక్తమంత్ర వాక్యము. అనగా విశ్వకర్మకు కూడా 'వాచస్పతి' అను పేరు కలదు. వాచస్పతి నామక విశ్వకర్మ జగద్గురుడు పరమాత్మ కాగా, వాచస్పతి నామక బృహస్పతి జగత్సృష్టికర్త, వాగధిపతి, సద్గురు మూర్తియే.

నిరుక్తము:బృహతః-మహతః- ఈ గొప్ప జగత్తునకు, పాతా, పాలయితా= రక్షకుడు, పాలించువాడు. అందువలన బృహస్పతి యనబడును.

బ్రహ్మణస్పతిః, బ్రహ్మణఃఅన్నస్యపతిః, పాతా పాలయితాః, బ్రహ్మణః=అన్నము యొక్క పాతా పాలయితా = రక్షకుడు, పాలకుడు.

బృహస్పతిని గురించి ఋగ్వేద మీక్రింది విషయములు తెలుపుచున్నది.

బృహస్పతి బంగారు రంగుకలవాడు, ఎర్రనివాడు (హిరణ్య వర్ణ మరుషం- 5.43.12), ప్రకాశించువాడు (ఆ ఘృణే. 3.62.7 మొ), శుచి అయినవాడు (శుచిః .7.97.7), నీలపురంగు వీపు కలవాడు (నీలపృష్ఠం 5.43.2), స్పష్టమైన వాక్కు కలవాడు (శుచిక్రందం 7.97.5), మంచి నాలుక కలవాడు (మంద్ర జిహ్వా, 4.50.1మొ). ఋగ్వేదము (10.141.3)లో 'బ్రహ్మాణం చ బృహస్పతిం' అని యున్నది. అనగా ఋత్విజులలో బ్రహ్మ స్థానమును ఆయన స్వీకరించును అనియు భావించవచ్చును.

ఇంద్రుడు, వరుణుడు, మిత్రుడు, అర్యముడు, దేవతలు సంతోషించు మంత్రమునే ఆయన ఉచ్చరించును (ప్రనూనం బ్రహ్మణస్పతి ర్మంత్రం వద త్యుక్థ్యం. 1.40.5), బృహస్పతి లేకుండ యజ్ఞము సిద్ధించదు (యస్మా దృతే న సిధ్యతి యజ్ఞః1.18.7). ఆయన దేవతలకు భోజనము లభించు యజ్ఞములకు మార్గమును సులభము చేయును. 2.23.6,7). ఆయన వలన దేవతలకు యజ్ఞములో భాగము లభించును (2.23-1) 'బృహస్పతి' సామాలతో అర్చించును (బృహస్పతిః సామభి ర్ఋక్వో అర్చతు 10.36.5), ఆయన శ్లోకము స్వర్గములోనికి వెళ్ళును (అస్యశ్లోకో దివీయతే, 1.190.4). ఆయనతో పాటు స్తుతులు పాడువారు ఉందురు (7.10.4 మొ). ఆయన హంస వలె పాడు తన సఖులతో కలిసి (సామాలు) పాడును (హంసై రివ సఖిభిర్వావదద్భిః....అగాయత్ 10.67.3). ఇచట 'సఖులు' అనగా ఈ మంత్రమునకు పై మంత్రము (10.67.2) లో చెప్పబడిన అంగిరసులు అయి ఉండవచ్చును. అందుకు కారణము బృహస్పతి అంగిరసుడే. "బృహస్పతి రాంగిరస" అని ఋగ్వేదము (6.73.1) లో వచింపబడినాడు గదా! అంతియే కాదు. బృహస్పతి ఉన్నతమైన స్వర్గములోని గొప్ప జ్యోతి నుండి మొదట పుట్టి శబ్దముతో చీకటిని పారద్రోలినాడు అని "బృహస్పతిః ప్రథమం జాయమానో మహోజ్యోతిషః పరమే వ్యోమన్... అధమత్త మాంసి"-అని ఋగ్వేదమంత్రము (4.50.4) తెలుపుట, అగ్ని స్వర్గములో ప్రకాశించును (అగ్నే దేదీయ సిద్యవి. 8.44.29) అనుట, మఱియు "త్వ మగ్నే ప్రథమో అంగిరాఋషి" అగ్నే! నీవు మొట్టమొదట అంగిరసుడవు. (1.31.1) అనుట, అగ్ని-జ్యోతి స్వరూపుడనుట (దేవసో Z జనయంత దేవం వైశ్వా నరజ్యోతి రి దార్యాయ (1.59.2/మొ)-అనగా అగ్నిని దేవతలు ఆర్యులకు జ్యోతిగా పుట్టించినారు). ఇవియున్నియు పై మంత్ర వాక్యములను బలపఱుచుచున్నవి. అగ్ని-త్వష్ట కుమారుడని (త్వాష్ట్రం 3.7.4) వచించిన ఋగ్వేదమే, బృహస్పతిని త్వష్ట పుట్టించినట్లు (త్వష్టా జనత్. 2.23.17) అని వచించినది.

త్వష్ట-బృహస్పతినే యననేల సమస్త ప్రాణులను సృష్టించినట్లు "త్వష్టా రూపాణి పింశతు ఋ. 10.184.4) త్వష్టా వై రేత సస్సిక్త స్వరూపాణి వికరోతి (యజు. 6.6.6.2) మున్నగు శ్రుతులనేకము తెలుపుచున్నవి కదా! బ్రహ్మోణో అంగిరసః (ఋ. 7.42.1), బ్రహ్మోణంచ బృహస్పతిం 10.141.3) అనుటయేగాక, అగ్ని-పురోహితుడు (9.66.20) అనియు, బృహస్పతి పురోహితుడనియు (2.24.9), వచించి ఋగ్వేదము అగ్ని-బృహస్పతి ఒకే వంశము వారని స్పష్టపరిచినది. బృహస్పతి పురోహితుడని ఋగ్వేదమేకాక వాజసనేయ సంహిత (శుక్లయజుర్వేదము 20.11), తైత్తిరీయ సంహిత (6.4.10), ఐతరేయ బ్రాహ్మణము (8.26.4), వచించినవి. బృహస్పతి సోమునికి పురోహితుడని శతపథ బ్రాహ్మణము (4.1.2.4) తెలిపినది. అంతియేగాక బృహస్పతిని 'జ్యేష్ఠ రాజం బ్రహ్మోణం' అనియు, కవిం కవీనాం (2.23.1) అనియు వచించి, అతని యొక్క అగ్రస్థానమును విశదపరిచినది. అంగిరసుడైన బృహస్పతి మొట్టమొదట పుట్టిన పవిత్రుడు (ప్రథమజా ఋతావా 6.73.1).

అగ్నిలోకములకు తండ్రి (7.5.7) అని చెప్పబడగా, బ్రహ్మ దేవతలకు తండ్రి (దేవానాం యఃపితరం-2.26.3) అని చెప్పబడినాడు. బృహస్పతి జగత్ సృష్టికర్తయని "బ్రహ్మణస్పతి రేతా సం కర్మార ఇవాధమత్" (10.72.2) తెలుపుచున్నది. అనగా బృహస్పతి కమ్మరి-అగ్నిలో లోహములను కరగనూది వస్తువులను చేయునట్లు, ఈ జగత్తులను నిర్మించెను అని భావము.

బృహస్పతి దేవతలలో గొప్ప దేవత (దేవానాం దేవత మాయ 2.24.3). ఆ దేవుడు దేవతలలోనికి వ్యాపించినవాడు (సదేవో దేవాన్ ప్రతి పప్రదే. 2.24.11). ఆయన తన శక్తితో, అరుపుతో భూమి అంచులను నిలబెట్టెను (4.50.1). సూర్యచంద్రులు ఒకరి తరువాత మరియొకరు ఉదయించునట్లు చేయుట-అను ఆయన పని ఎవ్వరూ చేయలేనిది, ఎవరూ అనుకరించలేనిది (అనాను కృత్య మ పునశ్చకార యా త్సూర్యా మాసా మిథ ఉచ్చరాతః 10.68.10).

బృహస్పతి కాయలు కాయునవి, కాయలు కాయనివి, పువ్వులు పూయునవి పూయనివి అయిన చెట్ల వృద్ధికి కారకుడు (యాఃఫలి నీర్యా అఫలా అపుష్పా యాశ్చ పుష్పిణీః, బృహస్పతి ప్రసూతాః 10.97-15,19).

బృహస్పతి ప్రార్థించువారిని అనుగ్రహించును. (2.25.1). ప్రార్థనలను ద్వేషించువారిని దహించును. (బ్రహ్మద్విష స్తపనః2.23.4), ఆయన భక్తుని అన్ని ప్రమాదముల నుండి, ఆపదల నుండి, శాపము నుండి, హాని నుండి కాపాడి, సంపద-వృద్ధి అనుగ్రహించును. (1.18.3, 2.23.4,10).

బృహస్పతి కోరదగినవన్నియు కలవాడు (విశ్వవార 7.10.4, 7.97.4). ఆయన ధనవంతుడు (రేవాన్), ధనము సంపాదించువాడు (వసువిత్), వృద్ధి కలిగించువాడు, ఆయుర్వృద్ధి కలిగించువాడు, రోగములను పోగొట్టువాడు (అమీవహా) 1.18.2), ఇంద్రుని వలె దానగుణము కలవాడు (2.24.12). ఆయనను చిన్న యుద్ధములో కాని పెద్ద యుద్ధములోకాని జయించినవాడు లేడు (1.40.8).

ఆయన యుద్ధములో స్తుతించదగిన పురోహితుడు (2.24.9), త్రిషధస్థః (=మూడు స్థానములు కలవాడు) అనుపదము అగ్నికి వలె బృహస్పతికి కూడ వాడబడినది (4.50.1). మరియు బృహస్పతి-గృహములలోని వారికి పూజ్యుడు (యజతం పస్త్యానాం. 7.97.5), గృహములకు పతి (సదసస్పతి 1.21.5). 'సదసస్పతి' అనుపదము ఇంద్రాగ్నులకు వాడబడినది (1.21.5).

ఋగ్వేదమున గల ఈ క్రింది మంత్రము బ్రహ్మణస్పతియే గణపతి అని తెలుపుచున్నది.

"గణానాం త్వాం గణపతిగ్ం హవామహే, కవిం కవీనా ముపమ శ్రవస్తమమ్,
జ్యేష్ఠరాజం బ్రహ్మణాం బ్రహ్మణస్పత, ఆనః శృణ్వ న్నూతిభిః సీదసాదనమ్" 2.23.1.

సాయణుని భాష్యానుసారము అర్థము. బ్రహ్మణః పతే=మంత్రములకు అధిపతివి అగు ఓ దేవా! గణానాం=దేవాది గణములకు, గణపతిం=ప్రభుడవును, కవీనాం=క్రాన్త దర్శులకు కూడ (అనగా భూత, భవిష్య, ద్వర్తమాన విజ్ఞానము కలవారికి కూడ) కవిం=క్రాంత దర్శివి (అనగా కవులకు కూడ కవీశ్వరుడవని భావము). ఉపమ శ్రవస్తమం= సర్వాన్నములకు ఉపమానమైన అన్నశ్రేష్ఠము కలవాడవును, బ్రహ్మణామ్= మంత్రాధిపతివిని, జ్యేష్ఠరాజం=జ్యేష్టుడవుగా ప్రకాశించువాడవును అగునట్టి, త్వా=నిన్ను, హవామహే=ఈ కర్మయందు ఆహ్వానించు చున్నాము. నః= మాయొక్క, స్తుతీః= స్తోత్రములను, శృణ్వన్ = వినుచు, ఊతిభి=పాలనములచేత (రక్షణలచేత), సాదనం= యజ్ఞగృహమును (మా హృదయమును), ఆసీద= ప్రవేశింపుము.

ఈ మంత్రమున స్తుతింపబడిన దేవత బ్రహ్మణస్పతి. ఈ మంత్రమున వాడబడిన 'గణపతి' అనుపదము బ్రహ్మణస్పతి యొక్క సర్వదేవగణాధిపత్యమును తెలుపుచున్నది. అదే విధముగా 'కవి'యను పదము ఆ దేవతా శ్రేష్ఠుని భూత భవిష్య ద్వర్తమాన సర్వజ్ఞత్వమును తెలియజేయు చున్నది. అనగా ఆ దేవుడు వర్తమాన భవిష్యత్కాల ములందలి విఘ్నములను లేదా ఆపదలను ఎఱింగినవాడు కావున తనను పూజించు వారలకు ఆవిఘ్నములు రాకుండ చేసి కార్యాను కూలతను చేకూర్చునని తెలియజేయు చున్నది. ఈ మంత్రమునందలి 'జ్యేష్ఠ రాజ' పదము బ్రహ్మణస్పతి యొక్క దేవతా జ్యేష్ఠత్వమును సూచించుచు, అతడు ఇంద్రాదుల కంటె మిన్నయని తెలుపుచున్నది. ఈ మంత్రమున బ్రహ్మణస్పతిని 'గణానాం గణపతిం, బ్రహ్మణాం, బ్రహ్మణస్పతే' అని స్తుతించుట గమనించదగిన విశేషణము.

ఈ దేవుని స్తుతించు మరియొక మంత్రము.

"న తమంహో న దురితం కుతశ్చన, నారాతయ స్తితి రు ర్న ద్వయా వినః,
విశ్వా ఇ దస్మా ధ్వరసో విబాధ సే, యం సుగోపా రక్షసి బ్రహ్మణ స్పతే."   2.23.5.

ఓ బ్రహ్మణస్పతీ! సత్పాలకుడ వగు నీవు ఏజనుని రక్షింతువో, అట్టివానిని దుఃఖముగాని, దురితముగాని బాధింపదు. అతనిని శత్రువులు హింసింపలేరు. వంచకులు మోసగింపలేరు. అతనికి అపకారము చేయువారిని నీవు బాధింతువు.

ఈ దేవుని గురించిన అనేక మంత్రములు ఋగ్వేదమున గలవు. బ్రహ్మణస్పతి ఇట్టి మహిమాతి శయము కలవాడు కనుకనే అతనిని సర్వకార్య సమారంభములందును పూజించుచున్నారు.

ఋగ్వేదయు నందు బ్రహ్మణస్పతి 'గణపతి'గా స్థానము పొందియుండగా, పురాణములలో గణపతి–పార్వతీ పరమేశ్వరుల పుత్రుడుగా వర్ణింపబడుటయేగాక, అతనికి ఏనుగు తల, ఏక దంతము, మహాకాయము, ఎలుక వాహనము మున్నగున వన్నియు కల్పింపబడి అందుకు తగిన కథలు కూడ రూపొందింపబడినవి.



13. పంచ సంకృతులు

"స ప్రథమ స్సంకృతి ర్విశ్వకర్మా
స ప్రథమో మిత్రో వరుణో ऽగ్నిః
స ప్రథమో బృహస్పతి శ్చికిత్వాన్," యజుర్బ్రాహ్మణ ప్రథమాష్టకమ్.

'కృతి' అనగా కర్మ, సమీచీనము అనగా యోగ్యమైనది. యోగ్యమైన కర్మలు అనగా సృష్ట్యాది కర్మలు కలవాడు 'సంకృతి' యనబడును. అనగా సృష్టికర్త లేక శిల్పాచార్యుడు అని భావము. అట్టి సృష్టికర్తలలో మొదటివాడు విశ్వకర్మ. మిత్రుడు, వరుణుడు, అగ్ని, బృహస్పతి మొట్టమొదటి సృష్టికర్తలు, శిల్పాచార్యులు.

విశ్వకర్మ అనగా జగత్కారణ పరబ్రహ్మమని ఋగ్వేదము (1.81-1,2), యజుర్వేదము (4.6.2) మఱియు అథర్వవేదము నందలి పెక్కు మంత్రములలో తెలుపబడినది. అతడే పిండాండమున సహస్రార స్థిత పరమాత్మ. తరువాతి వారైన మిత్రావరుణులు ప్రాణాపానములని "ప్రాణో వై మిత్రో అపానోవరుణః" అని యజుర్వేదము (5.3.17) తెలిపినది. అగ్ని సుషుమ్నా నాడికి సంకేతము. ఆధార చక్రము నందలి కుండలిని శక్తిని ప్రాణాయామాది ప్రక్రియలచే మేల్కొలిపి సుషుమ్నా నాళము ద్వారా షట్చక్రములను భేదించుకొనుచు సహస్రారమునకు ప్రయాణింప చేయుటయే కుండలినీ యోగ లక్ష్యము. ఈ సందర్భమున ప్రాణవాయువు సుషుమ్న యందే సంచరించుచుండును. కుండలినియు, [illegible]శక్తియు-సుషుమ్న యందు సంచారము చేయునప్పుడు మనోవృత్తులన్నియు నిరుద్ధములు కా[illegible], జీవాత్మ పరమాత్మ స్వరూపుడై పొందుఆనందమే మోక్షానందము. దానినే అమృతత్త్వమని పురుష సూక్తాదులు వర్ణించినవి. ఈ విధముగా మోక్షార్థులు సుషుమ్నా నాళమున ప్రయాణము చేసి ముక్తులగుదురు. చివరి సంకృతి బృహస్పతి. బృహస్పతిది గురుస్థానము. అతడు సత్త్వగుణ సంపన్నులగు దేవతలకు గురువు. గురువు అనువాడొకడు లభించిననేకాని శిష్యులు-జీవాత్మ పరమాత్మల నెఱిగి, వారి ఐక్యము కొఱకు సాధనలను చేసి తరింపజాలరు. ఈ విధముగా ఈ మంత్రము పంచ సంకృతులను పేర్కొని జీవుల మోక్షమునకు మార్గము చూపినది.

"అగ్నే నయ సుపథా రాయే..." అను మంత్రము (ఋ. 1.189.1) అగ్నిని 'మమ్ము మంచి మార్గము (సుపథా) ద్వారా మోక్షరూప ధనము కొఱకు నడుపుమని స్తుతించుచున్నది. ఇందలి 'సుపథా' అను పదమునకు 'సుషుమ్న' అనియే భావము.

సూర్యచంద్రాగ్నులను ఇడా, పింగళ, సుషుమ్న నాడులుగా పేర్కొందురు. కుడి ముక్కు పింగళ సూర్యునికి నెలవు. ఎడమ ముక్కు ఇడ చంద్రునికి నివాసము. ఈ ఇడా పింగళల ద్వారముననే యోగులు ప్రాణాయామమును కొనసాగింతురు.

విష్ణువు మెట్టిన త్రిథామములు ఈ సూర్య చంద్రాగ్ని నాడులేనని వేదాంతుల అభిప్రాయము.

సూర్యచంద్ర నాడులయందు సంచరించు ప్రాణవాయువును వశపఱచుకొని, దానిని సుషుమ్నయందు సంచరింపజేయగలిగిన, తద్ద్వారా కుండలిని మేల్కొని సుషుమ్నా మార్గమున బ్రహ్మ రంధ్రమున కెగబ్రాకి బ్రహ్మప్రాప్తికి హేతువు కాగలదు.

దేహము బ్రహ్మాండమునకు ప్రతీక. ఆధారచక్రము భూలోకము. స్వాధిష్ఠానము భువర్లోకము. మణిపూరము సువర్లోకము. అనాహతము మహర్లోకము. విశుద్ధ చక్రము జనలోకము. ఆజ్ఞాచక్రము తపోలోకము. సహస్రారము సత్యలోకము.

కుండలిని సర్పాకారమని వర్ణింతురు. సర్పములు నేలబొఱియలలో ఎక్కువగా నివసించు చుండును. నేల అనగా భూమి. భూభూతమునకు ఆధార చక్రము నెలవు. ఆధారము యొక్క అంతరమున కుండలినీ సర్పము కొలువై యుండును. దాని లోపలనే అంతర్యామి రూపమున పరమాత్మ ప్రకాశించు చుండును. ఈ రహస్యమునే విష్ణువునకు ఆదిశేషుడు అనగా సర్పము శయ్య అని పురాణములు వర్ణించినవి.

పిండాండమున ఇటువంటి విశిష్ట స్థానము గల పంచ సంకృతులు బ్రహ్మాండమున నెంతటి మహోన్నత స్థానమును పొందియున్నారో, ఎట్టి సృష్టి కార్యముల నిర్వర్తించి యున్నారో ఈ గ్రంథమున నింతకు పూర్వమే వివరించుట జరిగినది. అట్టి వారి స్మృతులు చిరస్మరణీయములు గదా!



14. విశ్వకర్మ

యజుర్వేదము :

"ఓం నమో విశ్వకర్మణే, స ఉ పా త్వస్మాన్." **3.2.30.**

సాయణభాష్యము. విశ్వ విషయం కర్మ సృష్ట్యాది రూపం యస్యా సౌ విశ్వకర్మా ప్రజాపతి స్తస్మై నమోZస్తు, సఉ=సో Z పి విశ్వకర్మా స్మా ననుష్ఠాన ప్రవర్తనేన పాతు."

విశ్వసంబంధములైన సృష్ట్యాది కర్మలు చేయు దేవుడు విశ్వకర్మ. ఆ విశ్వకర్మ ప్రజాపతి మమ్ము కర్మానుష్ఠానమున ప్రవర్తింప జేయుచు కాపాడుగాక!

ఈ మంత్రము నుండియే "ఓం నమో విశ్వకర్మణే" అను విశ్వకర్మా ష్టాక్షరీ మంత్రమును పరబ్రహ్మో పాసకులు గ్రహించినారు. ఈ అష్టాక్షరి లో 'ఓం' కలిసిననేకాని అష్టాక్షరి కాదు. 'ఓం' కారమును వీడిననే 'నమశ్శివాయ' అను పంచాక్షరి యగును.

"విశ్వకర్మా దిశాంపతి స్సనః పశూన్పాతు, సోచిస్మాన్ పాతు, తస్మై నమః."

యజు : కాం. 5.5.5.

దిగ్రూపమైన ప్రపంచమునకు ప్రభువగు విశ్వకర్మ మా పశుధనాదులను, మమ్మును రక్షించుగాక!

ప్రపంచమనునది దిక్కులను విడిచిలేదు. కనుక విశ్వకర్మ దిక్కులయందు గల బ్రహ్మాండములకు అధీశ్వరుడని వర్ణింపబడినది.

"ప్రజాపతి ర్విశ్వకర్మా మనోగంధర్వః" అను యజుర్వాక్యములోని 'ప్రజాపతి' అను పదమును శతపథ బ్రాహ్మణము "ప్రజాపతి ర్విశ్వకర్మేతి, ప్రజాపతిర్వై విశ్వకర్మా, సహీ దగ్ం సర్వ మకరోత్" అని నిర్వచించినది. ప్రజాపతి యైన విశ్వకర్మ-అనగా విశ్వకర్మ ప్రజాపతియై ఈ సమస్తమును సృష్టించినాడు.

"విశ్వకర్మా మా సప్త ఋషిభి రుదీచ్యా దిశః పాతు." అను అథర్వవేద మంత్రము (19.17.7) లోని 'విశ్వకర్మా' పదమునకు సాయణుని భాష్యము-విశ్వకర్మా=విశ్వం-సర్వం, కర్మ-కార్యం-సృజ్యం యస్మాత్ భవతి, స విశ్వకర్మా-విశ్వజగత్కారణ భూతః పరమాత్మా-విశ్వ మంతయు ఎవని చేత సృష్టింపబడినదో, అట్టి జగత్కారణ భూత పరమాత్మయే విశ్వకర్మ.

"విశ్వకర్మా మనసా యద్విహాయా ధాతా విధాతా పరమోత సంద్రుక్" (యజు. కాం. 4.6.2) అను మంత్రములో "విశ్వకర్మా" అను పదమునకు సాయణుల భాష్యము

"విశ్వ విషయాణి- సృష్టి స్థితి-సంహార రూపాణి యస్యాసౌ విశ్వకర్మా." అనగా విశ్వమునకు సంబంధించిన సృష్టి-స్థితి-సంహారము-అనెడి కర్మలు ఎవని వలన జరుగునో అతడు విశ్వకర్మ.

విష్ణు సహస్రనామములలోని "విశ్వకర్మా, మను, స్త్వష్టా, స్థవిష్టః, స్థవిరో, ధ్రువః" (శ్లో6) అను శ్లోకములోని 'విశ్వకర్మా' అను పదమునకు శంకర భాష్యము. "విశ్వం కర్మ-క్రియా యస్య సః విశ్వకర్మా, క్రియతే ఇతి జగత్ కర్మ." అనగా విశ్వమంతయు ఎవని కర్మ (సృష్టి)యో, అతడు విశ్వకర్మ. లేదా చేయబడునది కర్మ. ఆ చేయబడునది జగత్తు కనుక, అట్టి విశ్వరూపమైన కర్మ ఎవరి వలన జరిగెనో ఆయన విశ్వకర్మ.

'విశ్వకర్మ' శబ్దమిచ్చునంత విస్తృతార్థమును విష్ణు-రుద్రాది పదము లేవియు నీయ జాలవు. 'విష్ణు' శబ్దమునకు 'వ్యాపించువాడు' అని వ్యుత్పత్త్యర్థము. హరి-హర-హిరణ్యగర్భ-ఇంద్ర-వరుణ-చంద్ర-సూర్య-బ్రహ్మాది శబ్దములకు ఇంతటి విస్తృతార్థము నిచ్చు శక్తిగాని, వ్యుత్పత్తిగాని లేదు. ఈ పదముల అర్థము పరిమితము. విశ్వకర్మ శబ్దార్థము అపరిమితము ఆ దేవతలొనర్చు కార్యములును పరిమితములు. విశ్వకర్మ పదము సృష్టిలోని కార్యములన్నియు తనవేనని తెల్పుచున్నది. బ్రహ్మ చేయు సృష్టి విష్ణువు చేయు పోషణ, రుద్రుడొనర్చు లయము, మిగిలిన దేవతలొనర్చు సర్వకార్యములు విశ్వకర్మ పదము యొక్క అర్థములోనే ఇమిడియున్నవి. విశ్వకర్మ సృష్టింపగలడు, పాలింపగలడు, సమయింపగలడు, సర్వమును తిరోధాన మొనరింపగలడు, అనుగ్రహిం పగలడు, వ్యాపింపగలడు, వెలుగగలడు, జీవుల కర్మానుసారము సుఖదుఃఖ బంధమోక్ష రూప ఫలముల నొసగగలడు, ఆయా దేవతల కాయాశక్తులనిచ్చి ఆయా కార్యములు చేయింపగలడు. ఇట్టి జగత్కారణ మూల తత్త్వమగు విశ్వకర్మను గురించి ఋక్-యజుర్-సామ అథర్వవేదములు, శతపథ బ్రాహ్మణము, శ్వేతాశ్వతరోపనిషత్తు. విశ్వకర్మ-విశ్వబ్రహ్మ-మహాశిల్ప-పంచబ్రహ్మోప నిషత్తులు విస్తృతముగా తెల్పినవి. ఆ జగత్కారణ పరబ్రహ్మమును గూర్చి ఎంత తెలిపినను, ఎంత తెలిసికొనినను అల్పమే అగును. స్వానుభూతిచే తెలియదగిన ఆ విశ్వకర్మను గురించిన విశ్వకర్మ-పురుష సూక్తముల నిట నుదాహరించుచున్నాను.

విశ్వకర్మ సూక్తము

ఋగ్వేదమున దశమ మండలము 81,82 సూక్తములలో ఒక్కొక్క సూక్తమున ఏడు మంత్రములతో మొత్తము పదునాలుగు మంత్రములలో విశ్వకర్మ సూక్తము తెలుపబడినది. శుక్ల యజుర్వేదమున పై మంత్రములకు అదనముగా రెండు మంత్రములు కలవు. కృష్ణ యజుర్వేదమున శుక్ల యజుర్వేదమున గల మంత్రములకు అదనముగా మరియొక మంత్రము కలిగి మొత్తము 17 మంత్రములయినవి. ఈ మంత్రములనే

కృష్ణయజుర్వేదమున ఆఱు మంత్రములుగా విభజించుట జరిగినది. ఆ మంత్ర విభాగమును కూడ నిచట బ్రాకెట్లలో నుదాహరించుట జరిగినది.

కృష్ణయజుర్వేదీయ చతుర్థకాండ, షష్ఠ ప్రపాఠకము, ద్వితీయానువాకము.

"య ఇమా విశ్వా భువనాని జుహ్వ
దృషి ర్హోతా నిషసాద పితా నః
స ఆశిషా ద్రవిణ మిచ్ఛమానః
పరమచ్ఛదో వర ఆవివేశః." (1)

యః = ఏ విశ్వకర్మ పరమేశ్వరుడు, ఇమా విశ్వా భువనాని=ఈ సమస్త లోకములను; జుహ్వత్ = ప్రళయ కాలమున తనయందు ఆహుతివలె వేసికొని–లీనము చేసికొని (ఇముడ్చుకొని), ఋషి=సర్వద్రష్టయు, సర్వజ్ఞుడును, హోతా=సంసార హోమకర్తయు (జగములను తనలో హోమము చేసికొనిన వాడును) అయి; నః= మనకు, పితా=జనకుడై; నిషసాద=ఉండెనో–అనగా ప్రళయకాలమున సర్వలోకములను సంహరించి మనకును సంహారకుడై, మఱల సృష్టించు వాడై, సర్వము నెఱిగినవాడై యుండెనో.

ఈ విధముగా ప్రళయానంతరస్థితిని, సృష్టికి పూర్వముగల స్థితిని విశ్వకర్మ సూక్త ప్రారంభమంత్రము వచించుచుండగా, తైత్తిరీయోపనిషత్తు నందలి భృగువల్లి యిట్లు తెలిపినది.

"యతోవా ఇమాని భూతాని జాయన్తే, యేన జాతాని, జీవన్తి,
యత్ప్ర యన్త్యభి సం విశన్తి, తద్వి జిజ్ఞా సస్వ, తద్బ్రహ్మేతి."

ఈ మంత్ర భావమును భాగవతమిట్లు వచించినది.

"ఎవ్వనిచే జనించు జగమెవ్వని లోపలనుండు లీనమై
ఎవ్వని యందుడిందు పరమేశ్వరుడెవ్వడు మూలకారణం
బెవ్వడనాది మధ్యలయుడెవ్వడు సర్వము తానయైన వా
డెవ్వడు వాని నాత్మభవు నీశ్వరునే శరణంబు వేడెదన్
ఒకపరి జగముల వెలికిని
ఒకపరి లోపలికి గొనుచు, నుభయము తానై
సకలార్థ సాక్షియగు న
య్యకలంకుని నాత్మమయుని నర్థిదలంతున్.

విశ్వకర్మ సూక్తము భగవంతుడు ఈ బ్రహ్మాండము నంతటిని ఆహుతివలె తనలో లీనము చేసికొనినాడని ప్రళయ కాలస్థితిని వర్ణించుచు ప్రారంభమైనది. అంతియేకాని సృష్టిక్రియతో ప్రారంభము కాలేదు. సృష్టితో నారంభించిన సృష్టికి ఒక ఆరంభమున్నట్లు కాగలదు. ఈ సృష్టికి ఆరంభమనునది లేదు. ఇది చక్రము వంటిది. ఈ సృష్టి ప్రళయములు అనాది సిద్ధములని తత్త్వజ్ఞుల అభిప్రాయము. దీనినే భగవద్గీత ఈక్రింది విధముగ తెలిపినది.

"అవ్యక్తా ద్వ్యక్తయ స్సర్వాః ప్రభవ న్త్యహ రాగమే,
రాత్ర్యాగమే ప్రలీయనే తత్రైవా వ్యక్త సంజ్ఞకే,
భూత గ్రామస్స్య ఏవాయం భూత్వా భూత్వా ప్రలీయతే
రాత్ర్యాగమే Z వశః పార్థ ప్రభవ త్యహ రాగమే." **9.18.9.**

అవ్యక్తమైన పరమేశ్వర తత్త్వము నుండి పగటివేళ సర్వభూతములు పుట్టుచున్నవి. అవి రాత్రివేళ ఆ అవ్యక్తము నందే లీనమగుచున్నవి. ఆ భూత సమూహమే పుట్టుచు మరల పుట్టుచు రాత్రి వచ్చిన వెంటనే అవశమై ప్రకృతిలో లయించుచున్నది. ఇది చక్రము గిరగిర తిరిగెడి రీతియేకాని దానికి భిన్నము కాదు. ఇచట విశ్వకర్మ అనియు, బ్రహ్మమనియు, ఆత్మయనియు, సత్తనియు చెప్పబడిన తత్త్వము 'అవ్యక్త' శబ్దముచే పేర్కొన బడినది. ఈ ప్రళయానంతర స్థితిని ఐతరేయోపనిషత్తు "ఆత్మా వా ఇదమేక ఏవాగ్ర ఆసీత్, నాన్యత్ కించన మిషత్" అనియు, ఛాందోగ్యోపనిషత్తు, "సదేవ సోమ్యేద మగ్ర ఆసీ, దేక మేవా ద్వితీయమ్"–ఆత్మ ఒక్కటే సృష్టికి పూర్వమున్న తత్త్వము, దానికి భిన్నమయిన ప్రాణులు కాని, అ ప్రాణులు కాని అప్పుడేవియు లేవు. దానినే **నాసదీయ సూక్తమిట్లు** వచించినది.

"నాస దాసీన్నో స దాసీ త్త దానీం నాసీ ద్రజో నో వ్యోమా పరో యత్,
కి మా వరీవః కుహ కస్య శర్మ న్నం భం కి మాసీ ద్గహనం గభీరమ్."
ఋ. 1.129.1.

సృష్టికి పూర్వము అనగా ప్రళయము, తిరోధానము, అనుగ్రహము జరిగిన పిమ్మటి స్థితి యిచట వర్ణింపబడినది. అపుడు 'సత్' అనికాని, 'అసత్' అనికాని చెప్పదగిన దేదియులేదు. (సదసదతీతమైన దన్నమాట). అప్పుడు ఆకాశాదులుకాని, ఆకాశాదుల యందు ఆధారపడిన లోకములు కాని యేమియు లేవు. అప్పుడు ఆవరించునది ఆవరింప బడునది కూడ లేవు. దీనినే **భాగవతమిట్లు** వచించినది.

"లోకంబులు లోకేశులు
లోకస్థుల తెగిన తుది నలోకంబగు పెం
జీకటి కవ్వల నెవ్వం
డేకాకృతి వెలుగు నతని నే సేవింతున్"

దీనినే 'మూలస్తంభము' ఈ క్రింది విధముగా తెలిపినది.

"న భూమి నజలం చైవ న తేజో నచవాయవః
న చ బ్రహ్మా న చ విష్ణు న చ రుద్రశ్చ తారకః
సర్వాశూన్య నిరాలంబో స్వయంభూ విశ్వకర్మాః"

భూమి, జలము, తేజస్సు, వాయువు, బ్రహ్మ, విష్ణువు, రుద్రుడు, నక్షత్రములు ఏమియు లేక సర్వశూన్యమై యున్నపుడు స్వయం భూ విశ్వకర్మ ఒక్కడే ఉండెను.

"స ఆశిషా.....ఆ వివేశ"

సః= అట్టి విశ్వకర్మ, ఆశిషా=తిరిగి సృష్టింపవలయునను సంకల్పము చేత; ద్రవిణం ఇచ్ఛమానః=ధనమని చెప్పదగిన జగత్తుల యొక్క భోగమును కోరినవాడై, పరమచ్ఛదః=స్వకీయమైన పారమార్థిక రూపమును ఆవరించినవాడై; ఆవరే=శ్రేష్ఠము కానటువంటి నశ్వరమైన శరీరమున; అవివేశ=ప్రవేశించెను. అనగా జగత్సృష్టికర్త యగు విశ్వకర్మ భగవానుడు తనచే సృజించబడిన జగత్తుల లోపలి ప్రాణుల హృదయమున జీవరూపుడై ప్రవేశించెను.

దీనినే శ్వేతాశ్వతరోపనిషత్తు :

"ఏషదేవో విశ్వకర్మా మహాత్మా
సదా జనానాం హృదయే సన్నివిష్టః,
హృదా మనీషా మనసాభి క్ల ప్తో
య ఏత ద్విదు రమృతాస్తే భవన్తి 4.17.

దీనికి కీ.శే. వడ్డెపాటి నిరంజనశాస్త్రిగారి తెలుగు అనువాదము.

ఆ.వె. "ఇతడు విశ్వకర్మ, ఈ దేవుడు మహాత్ము
డెపుడు నిలుచు జనుల హృదయమందు;
ఎవ్వ రీమనీష నెదలోన భావింతు
రమృతు రగుదు రెల్ల రట్టివారు."

దీనినే భగవద్గీత :

"ఈశ్వర స్సర్వ భూతానాం హృద్దేశే Zర్జున తిష్ఠతి,
భ్రామయన్ సర్వభూతాని యంత్రా రూఢాని మాయయా." **18.61.**

ఈ విషయమునే మంత్రపుష్పము "అంతర్బహిశ్చ తత్సర్వం వ్యాప్య నారాయణః స్థితః" లోపల వెలుపల అంతట ఆ పరబ్రహ్మ స్వరూపమే నిండియున్నది." అని వచించినది.

విశ్వకర్మ సూక్తమునందలి మొదటి మంత్రము 'లయకర్మ' తో ప్రారంభమైనది. ఆమంత్రములోనే లయమొనర్చిన విశ్వకర్మయే జీవుల కర్మఫలములను వా రనుభవించు నిమిత్తము జగ దుపాధులను సృష్టించి వాటిలో తానే జీవరూపమున ప్రవేశించెనని "స ఆశిషా ద్రవిణ మిచ్ఛమానః ప్రథమ చ్ఛదవరా ఆవివేశ" అని తెలుపుచుండగా, నాసదీయ సూక్త మీక్రింది విధముగ తెలుపుచున్నది.

"కామ స్త దగ్రే మవర్త తాధి, మనసో రేతః ప్రథమం యదాసీత్,
స తో బన్ధు మసతి నిరవన్దన్ హృది ప్రతీష్యా కవయో మనీషా." **10.129.4.**

సృష్టి పుట్టుటకు ముందు ఈశ్వరునకు సృష్టి చేయవలయునను కోరిక కలిగినది. దానినే ఈ మంత్రము 'కామము' అని పేర్కొనినది. విశ్వకర్మ సూక్త మంత్రములోని 'ఆశీస్సే' నాసదీయ సూక్తములోని "కామము." కోరికలను సృష్టించునది మనస్సు కనుక, మంత్రము యొక్క రెండవ పాదము "మనసో రేతః ప్రథమం యదాసీత్"-ఒక ప్రాణి సృష్టికి రేతస్సు (ఇంద్రియము-శుక్లము) కారణమయినట్లు ఈ కామసృష్టికి మనస్సు కారణము.

నాసదీయ సూక్తమున సత్తు, అసత్తు, రజః(లోకము)వ్యోమ, అంభః, మృత్యువు, అమృతం, వాతం, స్వధ, అపరం, తమస్సు, సలిలము, తపస్సు, అజాయత, కామము, మనస్సు, రేతస్సు, ప్రయతి, ఎవడు దీని కధ్యక్షుడు-ఇత్యాది పదములు వాడబడినవి. నాసదీయ సూక్త-మూలస్తంభములు విశ్వకర్మ నుద్దేశించి చెప్పగా, భాగవతము ఆ అంశములనే విష్ణువు నుద్దేశించి చెప్పినది.

భాగవతము :

"లోకంబులు లోకేశులు
లోకస్థుల తెగిన తుది నలోకంబగు పెం
జీకటి కవ్వల నెవ్వం
డేకాకృతి వెలుగు నతని నే సేవింతున్

ఇందలి పెంజీకటి "తమసః పరస్తాత్" అను వేదవాక్యమునకు, ఏకాకృతి అను మాట ఏకంసత్, అను పదమునకు తెలుగు.

విశ్వకర్మ సూక్తము నందలి ప్రథమ మంత్రమున విశ్వకర్మకు ఈ క్రింది విశేషణములు వాడబడినవి.

1. ఋషి : "ఋ. గతౌ" 'ఋ ధాతువునకు గమనము (పొందుట) అని అర్థము. కనుక ఋషి అనగా సమస్తమైన జ్ఞానముల గమ్యములను పొందిన వాడని భావము. అనగా జ్ఞానము యొక్క కడపటి హద్దును పొందినవాడు. భగవంతుడు (జగత్కారణము) బాహ్యేంద్రియములకే కాక అంతరేంద్రియము లైన మనోబుద్ధులకు కూడ అందని వాడు. అట్టివానిని 'అతీంద్రియుడు' అందురు. అనగా ఋషి అట్టి భగవంతుని (అతీంద్రియుని) చూడగలడు. కనుక ఋషి శబ్దమునకు 'అతీంద్రియద్రష్ట' అని భావము. కనుక ఋషి అనగా సర్వజ్ఞుడు. ఇట్టి సర్వజ్ఞత్వము ఒక్క భగవంతునియందే కలదు.

2. హోతా : 'హోత' అనగా హోమము చేయువాడు. విశ్వకర్మ ప్రళయకాలమున జగములన్నింటినీ తనలో ఆహుతిగా వేసికొని హోమము చేయుచున్నాడు. (లీనము చేసికొనుచున్నాడు). ఈ భావమునే 'విశ్వా భువనాని జుహ్వత్' అను వాక్యము చెప్పుచున్నది. 'హోత' అనగా యజ్ఞమునందు హోమము చేయువాడని భావము కనుక 'సృష్టి యజ్ఞము జరుపునట్టి హోత అనియు భావించవచ్చును.

3. పితా : 'పిత' అనగా తండ్రి. పిత మాత యందు బీజము (గర్భము) నుంచి సంతానము యొక్క పుట్టుకకు కారణమగుచున్నాడు. విశ్వకర్మ అపాం గర్భం వ్యదధాత్ పురుత్రా" అను మంత్రమునుబట్టి నీటియందు జగద్బీజము నుంచినాడు. కనుటచేత జనకుడు (బ్రహ్మ). భగవంతుడు జగములను కని, వాటి పోషణకు (స్థితికి) హేతువగు చున్నాడు. అనగా పోషణ చేయు విష్ణువు కూడా అతడే.

ఈ 'పితా' శబ్దము 3వ మంత్రములో 'యోనః పితా జనితా' అనియు, 8వ మంత్రములో "తృతీయః పితా జని తౌషధీ నామ్' అనియు, 9వ మంత్రములో 'చక్షుషః పితా" అనియు వాడబడినది. మఱియు విశ్వకర్మ 'హోతా' అనుటచే రుద్రస్వరూపమును, 'పితా' అనుటచే బ్రహ్మ-విష్ణువుల స్వరూపములు దాల్చి నాడనియు వ్యక్తమగుచున్నది. త్ర్యంబక మంత్రము (ఋ. 7.59.12) నకు భాష్యము వ్రాయుచు సాయణులు 'త్ర్యంబకుడు-బ్రహ్మ-విష్ణు-రుద్రులనెడి త్రిమూర్తులకు తండ్రియని ఈ మంత్రతష్ట యగు వసిష్ఠుని అభిప్రాయము' అని వ్రాయుటయు ఈ విషయమున గమనించ తగినది.

"విశ్వకర్మా మనసా యద్వి హాయా
ధాతా విధాతా పరమోత సంధృక్,
తేషా మిష్టాని సమిషా మదన్తి
యత్ర సప్తర్షీన్ పర ఏక మాహుః." (2)

యత్=ఎందువలన, విశ్వకర్మ, మనసా=తన మనస్సంకల్ప మాత్రము చేతనే, విహాయాః= విశేషముగా తాను సృష్టించినవాటిని సంహరించువాడును, ధాతా= పుట్టించువాడును, విధాతా=పోషించువాడును, అయినాడో. అందువలననే, విశ్వకర్మా= సమస్తమైన సృష్టి-స్థితి-లయ-తిరోధాన-అనుగ్రహాదులైన కర్మలను చేయు 'విశ్వకర్మ' అను శబ్దముచే చెప్పదగిన యోగ్యత కలవాడైనాడు.

ఉత=ఇంకను, ఆ విశ్వకర్మ, పరమా=తాను సృష్టించిన అందటి కంటెను, అన్నిటి కంటెను, శ్రేష్ఠుడును, సంధృక్=అన్నిటిని దర్శించునట్టి సర్వద్రష్టయు, సర్వజ్ఞుడు అయినాడు. యత్ర పరే=ఏ సర్వ శ్రేష్ఠమైన పరమేశ్వరుని యందు, సప్తర్షీన్ =మరీచి మొదలగు సప్తఋషులు, ఏకంఆహు= ఒక్కటే అని తత్త్వవేత్తలు చెప్పుదురో, ఆ విశ్వకర్మ. తేషాం ఇష్టాని=ఆ సప్తఋషుల కోర్కెలను, ఇషా=తన సంకల్పమాత్రము చేతనే తీర్చుచున్నాడు. ఆ కోరికలు తీరిన ఋషులు తమ కోరికలు తీరినందున, మదంతి= సంతసించుచున్నారు.

సప్తఋషులను విశ్వకర్మయే సృష్టించినాడని ఈక్రింది అధర్వవేదమంత్రము తెలుపుచున్నది.

"విశ్వకర్మాణమ్ తే సప్తఋషి వంత మృచ్ఛంతు,
యే మాఘూ యవ ఉదీచ్యా దిశో Z భి దాసాన్." 19.18.7.

దీనికి వడ్డెపాటి నిరంజనశాస్త్రిగారి తెలుగు అనువాదము.

తే.గీ. ఎవ్వరుత్తర దిశనుండి యేగుదెంచి
అఘ చయంబుల మముద్రోతు రట్టి రిపులు
సప్తఋషుల సృజించు ప్రసన్న విశ్వ
కర్మ తేజో Z గ్ని దగ్ధత (గాంత్రు గాత.

భగవద్గీత :

"మహర్షయ స్సప్త పూర్వే చత్వారో మనవ స్తథా,
మద్భావా మానసా జా తా యేషాం లోక ఇమాః ప్రజాః" 10.6.

సప్త ఋషులు, మనువులు నా మనస్సంకల్పము వలన కలిగినవారే. ఈ సప్తఋషులను పిండాండ పక్షమున తాత్విక దృష్టితో చూచినచో ఆధారాది సప్త చక్రములు అని చెప్పు కొనవలయును.

సప్త సంఖ్యను గూర్చి ముండకోపనిషత్తు

"సప్త ప్రాణాః ప్రభవంతి తస్మాత్ సప్తార్చిషః సమిధః సప్త హోమాః,
సప్త ఇమే లోకా యేషు చరంతి ప్రాణా గుహాశయా నిహితాః సప్త సప్త॥" 2.1.8.

సప్తార్చిషః = ఏడు రకముల విషయ బోధకములగు కిరణములుగల,

సప్త సమిధః = సప్త విషయములుగల,

సప్త హోమాః = ఏడు రకములైన విషయ జ్ఞానముగల

సప్త ప్రాణాః = ఏడు విధములైన శక్తులు-కన్నులు=2, చెవులు=2, ముక్కుపుటములు=2, నోరు=1, తస్మాత్= ఆపరమేశ్వరునిచే కలుగును; ఇమేలోకాః= ప్రత్యక్షముగా కనపబడు ఈ ఇంద్రియ ఛిద్రములు, యేషు=వేనిలో, గుహాశయా= నిద్రాదులలో అంతః కరణము నాశ్రయించియుండును, ప్రాణాః=ఏ ప్రాణములు జాగ్రదాది సమయములలో చరించుచుండునో, అట్టి యింద్రియములు ప్రతి ప్రాణి శరీరమునందు, సప్త సప్త విహితాః = వేఱు వేఱుగ ఏడు ఏడు ఉంచబడినవి.

ఈ విశ్వకర్మ సూక్తమంత్రమున విశ్వకర్మ విహాయా, సంహర్త (శివుడు), ధాత (బ్రహ్మ), విధాతా= పోషకుడైన విష్ణువు, అయినాడని చెప్పినందున ఆయన త్రిమూర్తి స్వరూపుడని శ్రుతియే చెప్పి నట్లయినది.

ఈ విశ్వకర్మ సూక్తమంత్రమున విశ్వకర్మకు వాడబడిన పర్యాయ పదములు

4. విశ్వకర్మా : సమస్తములయిన సృష్టికార్యములు అనగా సృష్టి-స్థితి-లయ -తిరోధాన అనుగ్రహాది రూపములైన పంచకర్మలేకా చలనాది సమస్త కార్యములు ఎవరికి కలవో అతడు విశ్వకర్మ. బ్రహ్మ-విష్ణు-రుద్రాదులు సృష్టి-స్థితి-లయాదులయిన ఒక్కొక్కపనిని చేయువారైయుండగా విశ్వకర్మ అందఱు చేసిన పనులను చేయగలిగినవాడ గుచున్నాడు. విశ్వకర్మ పదమునకు ఇంతటి విశేషముండుటచేతనే యజుర్వేదము "ఓం నమో విశ్వకర్మణే స ఉ పాత్వ స్మాన్"-విశ్వకర్మకు నమస్కారము. అతడు మమ్ము రక్షించుగాక" అనుచున్నది.

5. విహాయా : విశేషముగా తాను సృష్టించిన జగములను సంహరించువాడు అని అర్థము. దీని వలన విశ్వకర్మ – రుద్రుడు చేయుపనులను చేయుచున్నాడని తెలియుచున్నది. అనగా విశ్వకర్మ-రుద్రరూపుడు, మనుబ్రహ్మ స్వరూపుడు.

6. ధాతా : 'ధాత' అనగా పుట్టించువాడు. 'ద్యావా పృథివీ జనయన్ దేవ ఏకః" అనుటచే ద్యావా పృథువులను చరాచరములను సృష్టించిన 'ధాత' అతడని తెలియుచున్నది. అనగా సృష్టి చేయు బ్రహ్మ-ఆయనయే (విశ్వకర్మయే). "విశ్వకర్మా హ్యా జనిష్ఠ దేవః" అను వాక్యము కూడ విశ్వకర్మయే బ్రహ్మ (త్వష్ట) అయినాడని తెలుపుచున్నది గదా!

7. విధాతా : 'విధాత' అనగా తాను కన్న ప్రాణులను, జగములను వృద్ధి యగుటకు పోషించువాడని భావము. ఈపనులు నిర్వహించునది విశ్వకర్మయే. ఈ పోషణక్రియ వ్యష్టిలో విష్ణుదేవుని (మయుని) దని భావన. కనుక విశ్వకర్మయే విష్ణువు.

పైనుదాహరింపబడిన 'ధాతా', విధాతా, విహాయా' పదములచే త్రిమూర్తులను చెప్పుట గమనించదగినది. మఱియు పైవాక్యములనే సృష్టి-స్థితి-లయములను నిర్వహించునది విశ్వకర్మయే అని విదిత మగుచున్నది.

8. పరముడు : అనగా అన్నిటికంటెను శ్రేష్ఠుడు అని అర్థము. అందువలననే ఉపనిషత్తు 'నత త్సమశ్చా భ్యధి కశ్చ దృశ్యతే' అనగా ఆయనతో సమానుడు కాని, అధికుడుకాని లేడని వచించినది. ఈ 'పరమ' శబ్దమునకు 'ఆత్మ' శబ్దము కలుపుటచే 'పరమాత్మ'శబ్ద మేర్పడుచున్నది.

9. సంద్రుక్ : 'సమ్యక్ పశ్యతీతి సంద్రుక్' అని వ్యుత్పత్తి-బాగుగా చూచువాడు. అనగా లోపల (శరీరములో), వెలుపల, అంతటను చూచుచు విషయముల యొక్క బాహ్యాంతరము లను చూడ గలుగు నదియే సమ్యగ్దృష్టి. అట్టి సమ్యగ్దృష్టి కలవాడు భగవంతుడే. ఆయన సర్వజీవుల మన స్సంకల్పములను, పూర్వాపర జన్మలయందు వారు చేసికొనిన కర్మ విశేషములను తెలిసికొనువాడు కనుక ఆయనకు 'సంద్రుక్' అనుపదము వాడబడినది. దీనినే భగవద్గీత "వేద్యం చ, వేత్తాచ, పరంచధామ"- అనగా భగవంతుడు మనకు తెలియదగినవాడు. అందరి స్థితిని తెలిసికొనువాడు (వేత్త), శ్రేష్ఠమైన నివాసము (పరంధామ) అని భావము.

10. జనితా : 'జనీ ప్రాదుర్భావే"- జనిధాతువునకు 'పుట్టుట' అని అర్థము. జాయతే=పుట్టు చున్నాడు. పుట్టుచున్నవి, జనిత=పుట్టించువాడు-జగములను, జీవులను, సర్వమును పుట్టించువాడు భగవంతుడే గనుక ఆయనకు 'జనిత' అను పేరు సార్థకమగుచున్నది. ఈ పదము పిత, ధాత అను పదములకు పర్యాయపదమే. బ్రహ్మ సూత్రము "జన్మా ద్య స్య యుత:" ఈ జగమునకు జన్మ-స్థితి-నాశములు ఎవని వలన కలుగునో అతడు (ఆది) భగవంతుడు' అని చెప్పుచున్నది.

"యోనః పితా జనితా యో విధాతా
యో న స్సతో అభ్యాస జ్జజాన, (1)
యో దేవానాం నామధా ఏక ఏవ
తం సం ప్రశ్నం భువనా యన్త్యన్యా." (3)

యః=ఏ విశ్వకర్మ, నః=మనకు, పితా=పాలకుడును, జనితా=పుట్టించిన దేవుడును, అంతియేకాదు. యః=ఏ విశ్వకర్మ, విధాతా=సమస్త జగత్తులకు ఉత్పాదకుడును అయి ఉండెనో, యః=ఏ విశ్వకర్మ, నః=మనకు కావలసిన అనుభవయోగ్య వస్తు సమూహములను, సతః=సత్తు నుండి, జజాన=కలిగించినాడో, ఇంకనూ, యః=ఏ విశ్వకర్మ, ఏకఃఏవ= ఒక్కడే అయ్యును, దేవానాం=దేవతల యొక్క నామధా=నామరూపములను, ధరించుచున్నాడో, తం=అట్టి విశ్వకర్మను, అన్యా భువనా=ఆయనచే సృజించబడి ఆయనకు భిన్నములయిన లోకములు, సంప్రశ్నం=ఆయనను ప్రశ్నించునట్లుగా, యన్తి= ప్రళయ కాలమున ఆయనలో లీనమగుచున్నవి. అనగా ప్రళయ కాలమున భువనములు ఏవి? విశ్వకర్మ ఎవరు? అని అడుగుటకు వీలులేకుండా అగుచున్నది" అని అర్థము. ఈ ప్రళయానంతర స్థితిని ఐతరేయోపనిషత్తు "ఆత్మా వా ఇదమేక ఏవాగ్ర ఆసీత్, నాన్యత్ కించన మిషత్" అనగా ఆత్మ ఒక్కడే సృష్టికి పూర్వమున్న తత్త్వము. దానికి భిన్నమైన ప్రాణులు కాని అప్రాణులుకాని అప్పుడేవియులేవు అనియు, ఛాందోగ్యోపనిషత్తు, "స దేవ సోమ్యేద మగ్ర ఆసీ, దేకమే వా ద్వితీయం" అనగా ఆదియందు 'సత్' ఒక్కటి మాత్రమే కలదు, దానికి భిన్నమైన దేదియులేదు అనియు, నాసదీయ సూక్తమంత్రము "నా సదాసీ న్నో సదా సీత్' అనగా సృష్ట్యాదిమ వస్తువు సత్తు అనికాని, అసత్తు అనికాని, చెప్ప వీలుకాని అనిర్వచనీయము అనియు, భగవద్గీత "న సత్త న్నాస దుచ్యతే" అనగా జ్ఞేయ వస్తువు సత్తు అనికాని, అసత్తు అనికాని చెప్పవీలుకాని స్వానుభూతి మాత్రమే అని వచించినది.

ఈ మంత్రము నందుగల "యో దేవానాం నామధా ఏక ఏవ" అను విషయమునే మోక్ష సూక్తము "ఇంద్రం మిత్రం వరుణ మగ్ని మాహుః.... ఏకం స ద్విప్రా బహుధా వదన్తి" (ఋ. 1.164.46.) 'జగత్కారణమగు ఏకైక సత్పదార్థమును మేధావులు ఇంద్రుడనియు, మిత్రుడనియు, వరుణుడనియు, అగ్నియనియు అది చేయు భిన్నభిన్న కార్యములను బట్టి భిన్న భిన్న నామములచే పేర్కొనుచున్నారు" అని వచించినది.

ఈ మంత్రమున విశ్వకర్మ 'పిత' అనియు, 'జనిత' అనియు, 'విధాత' అనియు మఱియొకసారి వర్ణింపబడినాడు.

"త ఆ యజన్త ద్రవిణం సమస్మా
ఋషయః పూర్వే జరితారో న భూనా,
అసూర్తా సూర్తా రజసో విమానే
యే భూతాని సమ కృణ్వ న్నిమాని." (4)

సాయణుల భాష్యము : "త ఆయజన్త...సమకృణ్వన్నిమానీతి–పూర్వోదాహృతేన విశ్వకర్మణా ప్రథమ ముత్పాదితా యే స్రష్టారః, ఇమాని భూతాని=సర్వానేతాన్‌ప్రాణినః, సమకృణ్వన్=సమ్యగుత్పాదిత వన్తః, తే= పూర్వే స్రష్టారః, అస్మై=సృష్టాయ జగతే, ద్రవిణమ్ =ధన రూపం భోగ్యజాతం, సమాయజంత=సమ్యక్సంపాదిత వంతః, కీ దృశాస్తే ఋషయః అతీంద్రియద్రష్టారః, సర్వజ్ఞా ఇత్యర్థః. భూనా జరితారో న=భూమ్నా– స్వకీయేన మహత్త్వేన, న కదా చిదపి జీర్ణా నశ్వరా భవన్తి. కీదృశాని, భూతాని, అసూర్తా=అసుభిః ప్రాణైరీరి తాని, ప్రాణయుక్తా నీత్యర్థః తథాః రజసో విమానే సూర్తా రంజనాత్మక స్య విశేషేణ ప్రమితౌ స్వస్వ కర్మభిః సుష్ఠు ప్రేరితాని.

యే= విశ్వకర్మచే సృష్టింపబడిన మొట్టమొదటి ఏ సృష్టికర్తలు, ఇమాని భూతాని= ఈ ప్రాణులను, సమకృణ్వన్=సృజించినారో, తే పూర్వే=పూర్వులైన ఆసృష్టి కర్తలు అనగా మనుమయాది పంచబ్రహ్మలు, లేదా బ్రహ్మ విష్ణు రుద్రాది పంచమూర్తులు లేదా సానగాది పంచఋషులు, అస్మై=తమచే సృజించబడిన ఈ జగత్తు కొఱకు, ద్రవిణం=ధనమని చెప్పదగిన భోగ్యవస్తు సమూహమును, సమాయజంత=సృష్టించిరి లేదా సంసిద్ధము చేసిరి. ఋషయః=అతీంద్రియ జ్ఞానము గల (సర్వజ్ఞులైన), తే= ఆఋషులు లేక బ్రహ్మలు, భూనా=తమ మహిమ చేత ఎప్పటికిని, జరితారః న=జీర్ణులు కారు. ఇక విశ్వకర్మచే సృజింపబడిన లౌకికజీవులు, అసూర్తా=ప్రాణములు కలిగినవారై, రజసోవిమానే సూర్తాః =తాము చేసికొనిన రంజనాత్మక కర్మలను అనుభవింప సంసిద్ధులై యున్నారు.

ఈ మంత్రమున "పూర్వేఋషయః" అనుటచే ఈ పంచ ఋషులు ప్రాచీనులు, ప్రథములు అని తెలియుచున్నది. వీరు ఐదుగురు అను విషయమును, సానగాదులు అను విషయమును తైత్తిరీయ సంహితలోని "ప్రాచీదిశామా"ది మంత్రములు విపులముగా తెలుపుచున్నవి.

"న తం విదాథ య ఇదం జజానాన్య
ద్యుష్మాక మంతరం భవాతి,
నీహారేణ ప్రావృతా జల్ప్యా
చా సుతృప ఉక్థ శాస శ్చరన్తి." 5.

యః=ఏ విశ్వకర్మ, ఇదం=ఈ కనపడు జగత్తును, జజాన=సృష్టించెనో, తం=ఆ విశ్వకర్మను, న విదాథ= మీరు ఎరుగకున్నారు, యుష్మాకం=మీకు, అన్యత్=మీ శరీరేంద్రియ మనో బుద్ధ్యాదుల కంటె భిన్నమైన ఆత్మతత్త్వ మొకటి, అంతరం=లోపలిదై, తెలియదగినదై, భవాతి=ఉన్నది. దానిని మీరెరుగలేకున్నారని భావము. ఈ విశ్వకర్మ తత్త్వమే ఈ సూక్తపు మొదటి మంత్రమున" స ఆశిషా ద్రవిణ మిచ్ఛమానః పరమచ్ఛదో వర ఆవివేశా" అని పిండ బ్రహ్మాండములను సృష్టించి వాటిలోపల ప్రవేశించెనని చెప్పబడినది. దానిని ఎఱుగలేక పోవుటకు కారణమును తరువాతి మంత్రభాగము వివరించుచున్నది. జీవులు, నీహారేణ=మంచువంటి అజ్ఞానముచే, ప్రావృతాః=కప్పబడినవారై, జల్ప్యాచ=బ్రతుకు తెరువుకై అబద్ధము లాడుచు, అసుతృపః=తమ ప్రాణ సంరక్షణమే శ్రేష్ఠమని తలచి ప్రవర్తించుటయేగాక, ఉక్థశాసః చరంతి=స్వర్గాది పరలోక భ్రాంతిచే యజ్ఞాదులను చేయుచు పరమేశ్వర తత్త్వమును ఎఱుగలేకున్నారు.

ఇచట అజ్ఞానమును నీహారము (మంచు)తో పోల్చినందున, అది జ్ఞానమనెడి ఎండచేత నశించునని గ్రహించవలయును. ఈ జగత్తును సృష్టించిన విశ్వకర్మను ఎఱుగ కున్నారనుటచేత సర్వులు ఎఱుగదగినది జగత్కారణమైన ఆ పరమేశ్వర తత్త్వమే అని వ్యంగముగా తెలుపబడినది. ఆ తత్త్వమును మీరెఱుగరు అని ఈ మంత్రము వచించు చుండగా "తమేవం విద్యానమృత ఇహ భవతి" అనగా అతని నెఱిగినవాడే మృత్యువును దాటి అమృతుడు కాగలడు అని పురుష సూక్తము తెలుపుచున్నది.

ఈ మంత్రమున నీ హారముతో పోల్చబడిన అజ్ఞానమును నాసదీయ సూక్తము "తమస్సు" అని వచించినది. దీనినే బ్రహ్మశక్తి, మాయ, మూలప్రకృతి, అవ్యక్తము, అవిద్య-ఇత్యాది పదములతో వేదాంతశాస్త్రము పేర్కొన్నది. జీవుల యొక్క పూర్వ జన్మకర్మలే జగత్సృష్టికి ఉపాదాన కారణమైన తమస్సు లేక మూలప్రకృతి అని మనము భావించవలసి యున్నది. ఈ తమస్సు సదసదతీతము నుండి కలిగినది. జీవకోటి యంతము నీతమస్సుచే (మాయచే) కప్పబడియున్నారు. నాసదీయ సూక్తము తుచ్ఛమైన మాయచే పరమాత్మ ఆవరింపబడినది." అని తెలిపినది. ఆమాయ (తమస్సు) సద సదతీత తత్త్వము నుండి అవిభాజ్యము, అందే అవ్యక్తముగా నిగూఢము. అందువలననే శ్రుతి 'తమసా గూఢ' మని వచించినది"తమ ఆసీ త్తమసా గూఢమగ్రే" అని మంత్రవాక్యము. మొదటి సదసదతీత తత్త్వము అనగా విశ్వకర్మ తత్త్వము తమస్సును తనలో వ్యక్తము కానీయక అనన్యముగా ఇముడ్చుకొన్నది. అందువలననే ఇవి రెండును అవ్యక్తములయినవి. మూలము విశ్వకర్మకాగా, మాయాశక్తి గాయత్రీ స్వరూపము. మూలము జగత్కారణము అయినందున దానిని 'విశ్వకర్మ' అని ఋగ్వేదము పేర్కొనినది. విశ్వకర్మ యొక్క ప్రతిభా సమే మాయా

స్వరూప గాయత్రి. బింబ ప్రతి బింబములకు భేదముండదు కనుక గాయత్రీ విశ్వకర్మలు అభేదాకారులు, అద్వైత స్వరూపులు. వారికి స్త్రీ, పురుష భేదము ఆరోపించి ఆరాధించు చున్నాము. వారు ఏకైక పరమాద్వైత స్వరూపము.

ఈ తమోరూప గాయత్రి నుండియే మహదహంకారమలు వెలువడినవి. అవియును అవ్యక్తములే. అనంతరము పంచతత్త్వముల ప్రాదుర్భావము. అవియే పంచతన్మాత్రలు, పంచమహాభూతములు. తొలుత పేర్కొనిన అవ్యక్తములోనే త్రిగుణము లున్నవి. పంచ తత్త్వములు కూడ త్రిగుణాత్మకములే. ఈ త్రిగుణాత్మక పంచతత్త్వముల సాంకర్యము, పరిణామములచేత వెలసినదే బ్రహ్మాండముల పంచతత్త్వములు, పంచ బ్రహ్మలు, పంచమూర్తులు, పంచఋషులు, పంచేంద్రియములు, జాగ్రత్-స్వప్న- సుషుప్తి- తురీయ-తురీయాతీతములను పంచావస్థలు, సత్తు-చిత్తు -ఆనందము-నామము-రూపము అను పంచాంశములుగా వెలసినవి. వాటి సమూహమే ప్రపంచము. ప్రపంచము లోని 'పంచ' శబ్దము దానినే సూచించుచున్నది.

"పరో దివా పర ఏనా (2) పృథివ్యా
పరో దేవేభి రసురైర్గు హాయత్,
కం స్విద్గర్భం ప్రథమం దధ్ర ఆపో
యత్ర దేవా స్సమ గచ్ఛన్త విశ్వే." 6

యత్=ఏ పరమేశ్వర తత్త్వము, గుహా=హృదయమనెడి గుహయందు కలదో (సదా జనానాం హృదయే సన్నివిష్టః" శ్వేతాశ్వతరోపనిషత్తు) అది, దివా=స్వర్గము కంటె, పరః=శ్రేష్ఠమైనది. దూరముగా నున్నట్టిది. ఏనా పృథివ్యా పరః= ఈ భూలోకము కంటెను పరమైనది. దేవేభిః అసురైపరః= దేవతలకంటెను అసురులకంటెను పరమైనది. అనగా వీటన్నిటికంటెను భిన్నమైనదనియు, వారికి అందరానిదనియు భావము. యత్ర=ఏ గర్భమునందు, విశ్వేదేవాః = సమస్తమైన దైవశక్తులు, సమగచ్ఛంత=ఇమిడియున్నవో, అట్టి, కంస్విద్గర్భం= ఒకానొక గర్భమును (కారణరూప జగద్బీజమును) ప్రథమమ్=మొదట, ఆపః=ఉదకములు, దధ్రే=ధరించినవి. మొదట ఉదకములు దాల్చిన ఆగర్భము నందు సమస్త దేవమనుష్య తిర్యగ్జాది రూపజగత్తు విలసిల్లినదని భావము. దీనిని బట్టి ఉదకములలోనే సమస్త జగద్బీజములున్నవని తెలియుచున్నది. అట్టి గర్భమును గూర్చి "కం స్విత్" అని నందున, అది మనో బుద్ధుల కందని అనిర్వచనీయ మాయాశక్తి అని తెలియుచున్నది. దీనినే భగవద్గీత "బీజం మాం సర్వభూతానాం విద్ధి పార్థ సనాతనమ్" అని వచించినది.

11. పరః : ఈ మంత్రమున "ఇహ పరలోకములేకాక, ఆలోకములకు కారణమైన మూల తత్త్వము కూడ హృదయములోనే ఉన్నది." అని తెలుపుట జరిగినది.

ఈమంత్రమున విశ్వకర్మ యొక్క "పరస్వరూపము"ను గురించి వివరింప బడినది. "పరము" అనగా అపరము (ఇహము=ఈలోకము) కంటె భిన్నమైనది. ఈ లోకమనగా జగద్రూపముగా తోచిన విశ్వకర్మ యొక్క బాహ్యరూపము. అనగా విశ్వతశ్చక్షు, విశ్వతో ముఖ మొదలగు వానితో కూడినది. దివము, పృథివి, ధాత, విధాత, రుద్రుడు, సూర్య చంద్రులు మున్నగు నానా దేవతల సృష్టితో కూడినది. వీటన్నిటికంటెను భిన్నమై మనకు గోచరింపనిది 'పరము' అనగా విశ్వకర్మ యొక్క పరస్వరూపము, మూలకారణ స్వరూపము, సదసత్తులు కానిది. ఆదిమ తత్త్వము, ఈ ఆదిమ తత్త్వమే జగములలోని పిండాండములను సృష్టించి, వాటిలో తాను జీవరూపమున ప్రవేశించినాడని ఈ సూక్త ప్రథమ మంత్రములో తెలిపి, 5వ మంత్రములో సమస్త జగములను సృష్టించిన ఆ విశ్వకర్మ తత్త్వము మీ హృదయములలోనే ఉన్నను మీరు తెలిసికొన లేకున్నారు అని వచించినది. పురుష సూక్త మంత్రము (16) ఆ తత్త్వమును తెలసికొనినవాడు అమృతుడగునని తెలిపినది. తైత్తిరీయోపనిషత్తు విశ్వకర్మ యొక్క పరస్వరూపమునే బ్రహ్మవేత్త పొందునని తెలిపినది.

ఋగ్వేద మంత్రమొకటి (1.22.20.) "తద్విష్ణోః పరమం పదం సదా పశ్యన్తి సూరయః దివీవ చక్షు రాతతమ్"– విష్ణువు యొక్క పరమపదమైన ఆ తత్త్వమును పండితులు ఎల్లప్పుడు ఏ అవరోధము లేకుండా చూచుచుందురు" అని తెలిపినది. ఇచట విశ్వకర్మ యొక్క పరస్వరూపము విష్ణువునకు పరమపదమని చెప్పుట చేత అది విష్ణువునకు కూడ కారణము, జన్మహేతువని తెలియుచున్నది. ఇందుకు విశ్వకర్మ సూక్త ద్వితీయ మంత్రము (10.81.2) నందలి "ధాతా విధాతా పరమోత సందృక్" అను వాక్యము, యజుర్వేదము నందలి 'వసురుద్రాదిత్యులను కన్నది విశ్వకర్మయే' అను అర్థమును సూచించు మంత్రమును ప్రమాణములు.

తైత్తిరీయ బ్రహ్మానందవల్లి :

"ఓం బ్రహ్మవిదా ప్నోతి పరం, తదేషా భ్యుక్తా,
సత్యం జ్ఞాన మనన్తం బ్రహ్మ, యోవేదం నిహితం
గుహాయాం పరమే వ్యోమన్ సో Zశ్నుతే సర్వా
న్కామాన్ బ్రహ్మణా సహ విపశ్చి తే తి."

బ్రహ్మవేత్త పరమును పొందును. బ్రహ్మమనగా సత్యము, జ్ఞానము, అనన్తము అయి సర్వుల హృదయ గుహలోను, సర్వము నందును, ఆకాశమువలె ఉన్నట్టిది. అట్టి బ్రహ్మము నెఱిగినవాడు సమస్త కామములు పొందినవాడు వలె ఆనందించును.

ముండకోపనిషత్తు :

"దివ్యో హ్యమూర్తః పురుషః స బాహ్యా భ్యంతరోహ్యజః,
అప్రాణో హ్యా మనా శ్శుభ్రో హ్యాక్షరా త్పరతః పర." 2.1.2.

జగత్కారణ వస్తువైన పురుషుడు దివ్యుడు, మూర్తి (ఆకారము)లేనివాడు, లోపల వెలుపల అంతటనిండిన అజుడు (పుట్టుకలేనివాడు), ప్రాణుడు, మనస్సు-ఇంద్రియాలు లేని స్వచ్ఛుడు, అక్షరుడైన జీవుని కంటెను పరలోకమున కంటె పరుడైనవాడు. 'పరతః" పర' అనుటచేత ఏది పరమో, పరుడో, దానికంటెను పరము, పరుడు అని తెలుపుచున్నది.

భగవద్గీత :

"పురుష స్స పరః పార్థ భక్త్యా లభ్యస్త్వ నన్యయా
యస్యాన్తః స్థాని భూతాని యేన సర్వమిదం తతమ్." 8.22.

ఎవని లోపల జగములన్నియు నున్నవో, ఎవనిచేత అంతయు వ్యాపింప బడినదో, ఆపరస్థాన పురుషుడు అనన్య భక్తి చేత మాత్రమే పొందదగినవాడు.

"త్వమాది దేవః పురుషః పురాణ
స్త్వ మస్య విశ్వస్య పరం నిధానం,
వేత్తా Zసి వేద్యం చ పరం చ ధామ
త్వయా తతం విశ్వ మనంత రూప." 11.38.

నీవు ఆదిదేవుడవు, పురాణ పురుషుడవు, సర్వము నెఱింగినవాడవు, నిధి వంటి వాడవు, అందఱిచే తెలియదగినవాడవు, పరంధాముడవు, అనంతుడవగు నీచేతనే విశ్వమంతయు నిండియున్నది.

పై రెండు శ్లోకములలో 'పురుషుడు' అను పదము వాడబడినది. ఈ పురుషుడు పురుషసూక్తములోని పురుషుడే. అతడే విశ్వకర్మయని పురుష సూక్త శ్లోకములు వచించుచున్నవి కదా!

"నాన్యం గుణేభ్యః కర్తారం యదా ద్రష్టా Z ను పశ్యతి,
గుణే భ్యశ్చ పరం వేత్తి మద్భావం సో Z ధి గచ్ఛతి." 14.19.

శరీర ద్రష్ట అగువాడు గుణములే (అనగా రజ స్సత్వ తమోగుణములే) కర్త లనియు, 'తాను' కాదనియు నెప్పుడెఱుగునో, గుణముల కంటె పరుడ నయిన నన్నెప్పుడెఱుంగ జాలునో, అప్పుడే నా భావమును పొందుచున్నాడు.

దీనిని బట్టి బ్రహ్మవిష్ణ్వాదులతో గూడిన గుణమయ ప్రపంచమంతయు 'అపర' మనియు, గుణములకు పరమైన తత్త్వమే 'పరస్వరూపమ'నియు స్పష్టమగుచున్నది.

"పరం భూయః ప్రవక్ష్యామి జ్ఞానానాం జ్ఞాన ముత్తమం
యద్ జ్ఞాత్వా మున యస్సర్వే పరాం సిద్ధి మితో గతాః." 14.1.

ఓ అర్జునా! జ్ఞానములలో కెల్ల ఉత్తమమైన 'పర' జ్ఞానమును గూర్చి నీకు చెప్పుచున్నాను. ఈ జ్ఞానము నెఱిగి మునులందఱు 'పర' సిద్ధినందినారు

"అనన్త దేవేశ జగన్నివాస త్వమక్షరం సదసత్తత్పరం యత్" 11.37

ఓ అనన్తా! దేవతా ప్రభూ! జగములకు నివాసమైనవాడా! నీవు సదసత్తులు రెంటికి కారణము, పరము అయిన అక్షరుడవు (శాశ్వతుడవు).

ఇందు నాసదీయ సూక్తములోని "నాసదాసీ న్నో సదాసీత్" అను భావము వ్యక్తమగుచున్నది. ఈ విధముగా విశ్వకర్మ యొక్క పరస్వరూపము విశ్వకర్మ సూక్తములో వచింపబడినది గీతోపనిషాది గ్రంథములలో విస్తరింపబడి పునరుద్ఘాటింపబడినది.

"క్షేత్ర క్షేత్రజ్ఞయో రేవమంతరం జ్ఞాన చక్షుషా
భూత ప్రకృతి మోక్షం చ యే విదుర్యాన్తి తే పరం." 13.14.

క్షేత్ర క్షేత్రజ్ఞులను వారికి గల భేదమును, భూతముల యొక్క స్వభావమును, వాటి నుండి కలుగు మోక్షమును, ఎఱిగినవాడు పరమును పొందును.

క్షేత్ర క్షేత్రజ్ఞులు అను పదములనే ప్రకృతి పురుషులనియు, గాయత్రీ విశ్వకర్మలనియు వివిధ నామములతో నుచ్చరించుట ఈ గ్రంథములోనే గాయత్రీ విభాగమున విపులముగ వ్రాయబడినది.

శ్లో॥ "మత్తః పరతరం నాన్యత్కించి దస్తి ధనంజయ
మయి సర్వమిదం ప్రోతం సూత్రే మణి గణా ఇవ." 7.7.

ధనంజయా! నాకంటే పరమేదియులేదు. అన్నిటికిని నేనే పరుడను. ఇట్టి నాయందు దారము నందు పూసలు వలె జగములన్నియూ (సర్వమును) ఆధారపడి (కూర్చబడి) యున్నవి.

ఈ 'పర' శబ్దముల కన్నిటికి 'పరో దివా పరఏనా' అనెడి విశ్వకర్మ సూక్తములోని వాక్యమే మూలము. ఈ 'పర' శబ్దమును మూలముగ గ్రహించియే ఉపనిషత్తులు పరవస్తువు, పరబ్రహ్మ, పరమాత్మ మొదలగు పదములను వాడినవి. "పరంజ్యోతి"

శబ్దము కూడ ఇట్టి అర్థమునే సూచించును. అగ్ని, సూర్య, చంద్ర, నక్షత్రాదుల జ్యోతులు భౌతికములు. ఆ జ్యోతులకు పరమైనది, ఆ జ్యోతుల లక్షణములు లేనిది 'పరంజ్యోతి'. అందువలననే పరమేశ్వరుని 'పరంజ్యోతి స్వరూపుడు' అందురు. కంటికి కన్పించు బాహ్య జ్యోతులను కాక హృదయాంతరమున వెలుగు ఆ 'పరంజ్యోతి'ని దర్శించుటయే మోక్షము.

"తమిద్గర్భం ప్రథమం దధ్ర ఆపో
యత్ర దేవా స్సమ గచ్ఛన్త విశ్వే,
అజ స్య నాభా వధ్యేక మర్పితం
యస్మి న్నిదం విశ్వం భువన మధిశ్రితమ్." 7.

యత్ర విశ్వే=బ్రహ్మాండములను పొట్టలో నుంచుకొనిన ఏ విశ్వమునందు (ఏ విశ్వకర్మ యందు), దేవాః సమగచ్ఛన్త=దేవతలు కూడియున్నారో, తమిత్= ఆగర్భమునే, ఆపః=ఉదకములు, ప్రథమమ్= మొట్టమొదట, దధ్రే=ధరించినవి, అజస్య= జన్మములేని, విశ్వకర్మ యొక్క, నాభౌ=నాభిస్థానమున (నడుమ) అనగా భగవత్స్వరూప తత్త్వమున, ఏకం=ఒకానొక, బీజము (జగత్కారణము), యస్మిన్=ఏ బీజమున, ఇదం విశ్వం భువనమ్= ఈ సమస్త భువనము, అధిశ్రితమ్=ఆశ్రయింపబడియున్నదో, అట్టి బీజము, అధి+ అర్పితమ్= ఉంచబడినది.

ఈ మంత్రమున విశ్వకర్మకు 'అజః' అను పదము వాడబడినది.

12. అజః : "నజాయతే ఇతి అజః" ఎవనికి పుట్టుక (జన్మము) అను వికారము లేదో అతడు (అది) అజుడు (అజము) అని చెప్పబడును. ప్రకృతికి, ప్రకృతిలోని త్రిగుణ మయములైన పదార్థములకు పుట్టుట, ఉండుట, పెరుగుట, పరిణమించుట (మార్పులు చెందుట) క్షీణించుట, నశించుట అను ఆఱు వికారములుండును. అట్టి వికారము లేమియు లేనటువంటిదే జగత్కారణము లేక విశ్వకర్మ. అందువలన ఆ భగవంతునకు 'అజుడు' అను పేరు సార్థకమగుచున్నది.

ఆ భగవంతుని యొక్క ప్రతి బింబమే అయిన జీవుడు కూడ అజుడు అని భగవద్గీత చెప్పుచున్నది. "అజో నిత్య శ్శాశ్వతో Zయం పురాణో, నహన్యతే హన్యమానే శరీరే" జీవాత్మ పుట్టుకలేనివాడు, శాశ్వతుడు, పురాణుడు (సనాతనుడు), చచ్చిపోవునట్టి శరీరము నందున్నను చావులేనివాడు. అద్వైత శాస్త్రము జీవేశ్వరులను ఒక్కటే అని చెప్పుచున్నది. 'అజ' శబ్దమువలెనే 'అమృత' శబ్దము కూడా సార్థకమగుచున్నది. చచ్చుట, పుట్టుట, పెరుగుట, ఇత్యాది వికారములు ఆత్మకు లేవుగదా! ఆత్మను పరమాత్మ

చేసికొనుటయే జీవుల లక్ష్యము.

ఈ మంత్రమున 'అజస్య, నాభౌ' అను రెండు పదములు కలవు. ఆ రెంటిని కలిపిన 'అజనాభము' అగును. ఈ విషయమే విష్ణువు యొక్క నాభికమలము నుండి బ్రహ్మపుట్టి, సృష్టి చేసినాడని పురాణముల యందు వ్రాయబడినది!

'అజస్య నాభావధ్యేక మర్పితం' అనగా విశ్వకర్మ నాభియందుగల బీజమున సమస్త విశ్వము ఆశ్రయింపబడియున్నదని అర్థము.

ఈ గర్భమును గూర్చి 6 వ మంత్రము 'కం స్విత్' అనుటచే అది మనోబుద్ధులకు అందని అనిర్వచనీయ మాయాశక్తి అని తెలియుచున్నది.

"విశ్వకర్మా హ్యజనిష్ట దేవ,
అది ద్గంధర్వో అభవ ద్వితీయః,
తృతీయః పితా జని తౌషధీనాం, (3)
అపాంగర్భం వ్యదధా త్పురుత్రా." 8.

విశ్వకర్మా=దేవ మనుష్య తిర్యక్ స్థావరాది నానా చరాచర భేదములకు కర్తయైన విశ్వకర్మ, దేవః=దేవుడై-అనేక దివ్య స్వభావములకు నిలయమై, అజనిష్ఠ=ఉండెను. ఈ సందర్భమున సాయణుల భాష్యమిట్లున్నది. బ్రహ్మాండ మధ్యగతానాముత్పత్తి రుచ్యతే। అండమధ్యే ప్రథమం విశ్వకర్మా (దేవ తిర్యగాది విశ్వభేద కర్తా) సత్యలోకవాసీ చతుర్ముఖో దేవః అజనిష్ఠ (ఉత్పన్న) ఆదిత్ అనంతరమేవ తదపేక్షయా ద్వితీయః గంధర్వః అభవత్ తత ఊర్ధ్వమ్ ఓషధీనాం పితాపాలకః జనితా ఉత్పాదకః సోమః పూర్వోక్త ద్వితీయా పేక్షయా తృతీయ: అభవత్॥తదేవం అపాగర్భం బ్రహ్మాండం పరమేశ్వరః పురుత్రా వ్యదధాత్ (బహుధా వ్యక్తం కృతవాన్) - బ్రహ్మాండ మధ్యంగతుల యొక్క యుత్పత్తి చెప్పబడుచున్నది. అండ మధ్యమునందు ముందుగా విశ్వకర్మ (దేవతిర్యగాదులచే విశ్వభేదముల జేయువాడు) సత్యలోకమునందున్న చతుర్ముఖుడగు దేవుడు పుట్టెను. తరుహాత రెండవవాడు గంధర్వుడయ్యెను తరువాత ఓషధీపాలకుడగు సోముడు పుట్టెను. ఇట్లు పరమేశ్వరుడు బ్రహ్మాండమును వేఱువేఱుగా చేసెను.

ఈ మంత్రార్థమున గల విశ్వకర్మ నాభినుండి సత్యలోక నివాసియైన చతుర్ముఖుడు జన్మించినాడను నదియే, పురాణములలో నారాయణుని నాభికమలము నుండి బ్రహ్మ జన్మించినాడనుటకు మూలమైనది.

ఆదిత్=పిమ్మట, ద్వితీయః=రెండవ వాడైన, గంధర్వ=గంధర్వుడు, అభవత్=

అయినాడు. పిమ్మట, పితా=పోషకుడును, ఓషధీనాం=ఓషధులకు, జనితా=ఉత్పాదకుడైన సోముడు, తృతీయః=మూడవ వాడుగా, అభవత్=అయినాడు, పిమ్మట, అపాం గర్భమ్= నీటిలోని బీజము నుండి వెలువడు బ్రహ్మాండమును, పురుత్రా= అనేక రీతులుగా, వ్యదధాత్= సృష్టించెను.

ఈ మంత్రము మొదటి దేవుడు విశ్వకర్మ అనియు, ఆయనయే రెండవవాడుగా గంధర్వుడైనాడనియు చెప్పుచున్నది. గంధర్వ శబ్దమును "సూర్యో గంధర్వః తస్య కిరణా న్యప్సరసః" అని యజుర్వేదము వచించుచున్నందున సూర్యుని సృష్టి జరిగినదనియు దేవలోకమైన స్వర్గసృష్టి కూడ జరిగినదనియు తెలియుచున్నది. మూడవవాడు ఓషధీశుడైన సోముడ (చంద్రుడ)ని చెప్పినందున అన్నమునకు తద్వారా ప్రాణులకు మూలకారణమైన ఓషధులు, వాటి పాలకుడు తెలియబడుచున్నందున భూలోకాదుల సృష్టి జరిగినట్లు వ్యక్తమగుచున్నది. మర్త్య-స్వర్గ-సత్యలోకముల సృష్టి ఇందు సూచితమైనందున అనాహత-ఆజ్ఞా-సహస్రారములిందు చెప్పబడినట్లు గ్రహింపవలయును.

ఈ మంత్రమున బ్రహ్మశబ్దము కన్పించుట లేదు. 'అజ' శబ్దము విశ్వకర్మ పరముగను, విశేషణముగను ఈ మంత్రమున ప్రయోగింపబడినది. దీనిని ఆత్మపరముగ భగవద్గీత "అజో నిత్య శ్శాశ్వతో Z యం పురాణః" అని వచించినది. ఈ అజ శబ్దము తరువాత బ్రహ్మకు పర్యాయపదమైనది. ఈ విషయములన్నిటిని బట్టి విశ్వకర్మ మొదట దేవాది దేవుడు అనగా సృష్టికర్త అయిన బ్రహ్మ దేవుడైనాడనియు. అనంతరము గంధర్వుడయినాడనియు పిమ్మట చంద్రుడైనాడనియు భావించవచ్చును. విశ్వకర్మ దేవుడైనాడనగా జీవుడైనాడనియు, సూర్యచంద్రులయి నారనగా పింగళా- ఇడా నాడుల రూపమైనారనియు చెప్పికొనిన పిండాండమున తాత్వికార్థము పూర్తియగును.

"ప్రజాపతి ర్విశ్వకర్మా మనోగంధర్వః
తస్య ఋక్సామా న్యప్సరసో వహ్నాయః."

యజుః కాండము 3. ప్రసా.4, అను 7.

ఈ మంత్రము ప్రజలను సృష్టించిన విశ్వకర్మ మనోనామక గంధర్వుడైనా డనియు, అతనికి ఋక్సామము లనెడి అప్సరసలు భార్యలు అనియు తెలిపినది.

జగత్కారణ వస్తువు (విశ్వకర్మ) యందు కలిగిన మొదటి చలనము (స్పందము) మనస్సే. ఆ మనస్సును ఈ మంత్రము 'గంధర్వుడు'గా పేర్కొన్నది. గంధర్వులు భోగప్రియులు. మనస్సుకూడ భోగములను కోరునదియే. మనస్సునకు సంకల్ప వికల్పములను రెండు రూపములు గలవు. ఆ సంకల్ప వికల్పములనే గంధర్వుని భార్యలగు

ఋక్కులు, సామములు అనియు, ఈ ఋక్కులు సామములు అప్సరసలు అనియు చెప్పుటచే వారి భోగతృష్టను తెలిపినట్లు యినది. భార్యాలోలుడై భోగప్రియుడైన వాడు భ్రష్టుడగునట్లు, మనస్సు వెంట దాని కోరికలకు లోబడి పరుగులెత్తు వాడును భ్రష్టుడగుని సూచింపబడినది. బ్రహ్మము నుండి కలిగిన మనస్సు వలననే జగత్తు పుట్టుచున్నది గదా! మనస్సే సర్వ ప్రపంచమని వేదాంత శాస్త్రము వక్కాణించు చున్నది.

నాసదీయ సూక్తము జగత్కారణ వస్తువును తమస్సు అనియు, కామమనియు వచించినది. "తమ ఆసీత్తమసా గూఢమగ్రే. కామస్త దగ్రే సమవర్తతాధి, మనసో రేతః ప్రథమం య దాసీత్" ఇందు మనస్సును శరీరోత్పత్తికి హేతువైన రేతస్సు (శుక్లము) గా పేర్కొనుట జరిగినది. ఈ అంశమునే విశ్వకర్మ సూక్తమంత్రము గంధర్వ శబ్దముచే వచించినది.

ఈ మంత్రమున విశ్వకర్మకు 'దేవః' అను విశేషణము వాడబడినది. ఈ విశేషణము ఋగ్వేదమున త్వష్టకు సవితకు వాడబడినది.

13. దేవుడు : ఈ పదము 'దివ్' అను ధాతువు నుండి పుట్టినది. 'దివిభవమ్ దివ్యం' అని అర్థము. భూసంబంధము లేని వారిని దేవతలు, దేవుడు అనుచుందురు. 'ద్యు' (దేవ) లోక లక్షణములు కలవారని దీని భావము. కనుకనే దేవతలు నిద్రా జరాదులు లేని 'అస్వప్నులు, అమృతులు' అని చెప్పబడినారు. సచ్చిదానంద స్వరూపుడగు విశ్వకర్మ ఈ దివ్యలక్షణములకు కూడ అతీతుడు. ఏలయన ఆయన దివమును, అందలి దేవతలను, భూమిని, భూలోకవాసులను సృష్టించిన మహాశక్తియని "ద్యావా పృథివీ జనయన్ దేవ ఏకః" అని విశ్వకర్మ సూక్తవాక్యము తెలిపినది కదా! కనుక ఇచట "దేవ" శబ్దమునకు దివ్యుడనియేగాక ఆ దివ్యులను కూడ సృష్టించిన "దేవదేవుడు" అని అర్థము చెప్పుకొన వలయును. ఆయనను 'పిత' అనినపుడు సామాన్య పితగాక 'జగత్పిత' అని భావించి నట్లే, 'దేవ' శబ్దమునకు 'దేవదేవుడ'ని భావించుట సమంజసము.

"చక్షుషః పితా మనసా హి ధీరో
ఘృత మేనే అజ న్న న్న మానే,
యదే దన్తా అదదృం హన్త పూర్వ
ఆది ద్యావా పృథివీ అప్రథేతామ్." **9.**

చక్షుషః నేత్రాది ప్రాణ సముదాయమునకు (చక్షు స్థానీయమైన అజ్ఞాచక్రాదులకు కూడ), పితా=ఉత్పాదకుడును (సృష్టికర్త), ధీరః=ధీరుడును అగు విశ్వకర్మ, మనసాహి= నిర్మలమైన తన మనస్సు చేతనే, ఘృతం=నేయివలె ప్రాణులచే అనుభవింపదగిన, ఏనే=ఈ

ద్యావా పృథువులను, నన్నమానే=ఒకదానికొకటి అనుకూలపడునట్లు (పరస్పరము లోబడునట్లు), అజనత్=సృష్టించెను. యదేత్=ఎప్పుడైతే, పూర్వే=మొదటివైనవియు, అంతాః = సప్రాణములై పనిచేయునవియు అగు చక్షురాది ప్రాణములు (ఆధారాదిచక్రములు), ద్యావాపృథివీ=ద్యావాభూములు, అప్రధేతాం=విస్తరింపబడినవి. ద్యావా పృథువులకు స్వర్గమర్త్య లోకములనెడి ప్రసిద్ధి కలిగి అవి అన్నిటిచే పరిపూర్ణములైనవని భావము.

ఈ మంత్రమున బ్రహ్మాండమున జరిగిన ఆకాశాది జీవపర్యంతమైన సృష్టియు, పిండాండమున స్థూలసూక్ష్మ కారణములతోను, సప్తచక్రములతోను గూడిన సృష్టియు ని గూఢముగా వర్ణింపబడినది.

ఈ మంత్రమన విశ్వకర్మకు వాడబడిన విశేషణములు.

14. చక్షుషః పితా : అనగా ప్రాణాదులయిన ఇంద్రియ సముదాయమునకు తండ్రి అని సాయణులు వ్రాసినారు. కాని, తృతీయ చక్షు స్థానమన నుండునది ఆజ్ఞాచక్రము. అది అవ్యక్త మహదహంకారములకు అందలి జీవులకు నివాసము కనుక చక్షు శబ్దముచేత ఆజ్ఞాచక్రమును కూడ చెప్పికొనుట తగియుండునని కీ.శే. కొండూరి వీరరాఘవాచార్యులు గారు వ్రాసినారు. సహస్రారస్థ పరమాత్మ నుండియే ఆజ్ఞాది షట్చక్రములు కలిగినవి కదా! కనుక ప్రాణాదీంద్రియములకే కాక ఆజ్ఞ నుండి గల చక్రములకు కూడ విశ్వకర్మయే అధిపతి అగుచున్నాడు. కనుక అతడు 'చక్షుషఃపితః'.

15. ధీరః : "ధియం=బుద్ధిం, రాతీతిః, ధీర= ఎవడు తన బుద్ధిని స్వాధీనపఱుచుకొని, పరిజ్ఞానము కలదానిని శక్తిమంతము, ఏకాగ్రము చేయగలడో వాడు ధీరుడని చెప్పబడు చున్నాడు. ధీరుడనగా ధైర్యశాలి యని సామాన్యార్థము. భగవంతుడు బుద్ధినేకాక సర్వమును శాసించి వశము చేసికొను సమర్థుడు కనుక ఆయనను ధీరుడని వేదము వ్యవహరించినది. ఆయనను మించిన ధీరుడెవడును లేడు. ఉపనిషత్తులు ఈ పదమును ఈశ్వర సాక్షాత్కారమును పొందువారికి కూడ అన్వయించినవి.

"కశ్చిద్ధీరః ప్రత్యగాత్మన మైక్షత్ ఆవృత్త చక్షు రమృతత్వ మిచ్ఛన్."

ఒకానొక ధీరుడు మాత్రమే మోక్షమును పడయ గోరి ఇంద్రియ విషయములకు దూరుడై పరమాత్మ సాక్షాత్కారమును పొందుచున్నాడు.

"విశ్వత శ్చక్షు రుత విశ్వతోముఖో
విశ్వతోహస్త ఉత విశ్వతఃపాత్,
సం బాహుభ్యాం నమతి సంపతత్రై

ర్ద్యావా పృథివీ జన యన్దేవ ఏకః॥" 10.

ఆ విశ్వకర్మ. విశ్వతః చక్షుః= అంతటను కన్నులు కలవాడు. పరమేశ్వరుడు. సమస్త ప్రాణులకు ఆత్మ తానే గనుక అందటి కన్నులును ఆయనవే అయి ఆయన విశ్వతశ్చక్షుడై నాడని భావము. ఉత=ఇంకను, విశ్వతఃహస్తః=అంతటను చేతులు గలవాడును, విశ్వతః పాత్=అంతటను పాదములు కలవాడును, అయిన సహదేవః= ఆ దేవుడొక్కడే, ద్యావాపృథివీ =భూమ్యాకాశములను, జనయన్= పుట్టించుచున్నవాడై, బాహుభ్యాం=చేతుల వంటివైన ధర్మాధర్మములచేత, అనగా జీవుల ధర్మాధర్మరూప కర్మలను నిమిత్త కారణముగా చేసికొని, సం నమతి=లోకము నందలి జీవుల నందటిని స్వాధీనమొనర్చుకొనుచున్నాడు. అనగా ఆయా జీవుల కర్మానుసారము వారిని సృష్టించి సంసారచక్రమున త్రిప్పుచున్నాడని భావము. అదేవిధముగ పతత్రై=నశించు స్వభావముగల ఉపాదాన కారణములయిన పంచభూతముల చేత కూడ జగత్తును లోబఱుచుకొని తాను నిమిత్త కారణుడై ఉన్నాడని భావము.

ఈ మంత్రమున 'దేవఃఏకః' అనుటచేతను, "యోదేవానాం నామధా ఏక ఏవ" అని ఈ సూక్త తృతీయ మంత్రమున తెలుపుటచేతను విశ్వకర్మ ఒక్కడే దేవాది దేవుడని స్పష్టమగుచున్నది. బ్రహ్మ విష్ణు రుద్రేంద్రాదులు ఆయన అంశలని వ్యక్తమగు చున్నది.

విశ్వకర్మను వర్ణించినంత మహోన్నతముగను, వివరముగను, ఆధ్యాత్మికము గను ఏ దేవుని గురించి వర్ణించినట్లు కన్పించదు. 'సహస్రశీర్షా పురుషః' అను పురుష సూక్తము, 'సహస్ర శీర్షం దేవం విశ్వాక్షం శంభువం' అను మంత్రపుష్పము, ఈ విశ్వకర్మ సూక్తమంత్రముల నాధారము చేసికొని వెలువడినట్టివని పరిశీలకుల అభిప్రాయము.

ఈ మంత్రమున వాడబడిన విశ్వకర్మ యొక్క విశేషణములు.

16. విశ్వతః చక్షువు: అంతటా కన్నులు కలవాడు. అనగా అందటి కన్నులు ఆయనవే అనియు అందటి స్వరూపములు ఆయనే అనియు భావించవలయును. ఈ పదమే పురుష సూక్తములో 'సహస్రాక్ష' అని వాడబడినది. అందలి సహస్ర సంఖ్యకు 'వేయి, అనేకము, అపరిమితము, అసంఖ్యము' అని భావము. భగవద్గీత భగవంతుని "అనేక వక్త్ర నయన మనేకాద్భుత దర్శనమ్" (11.10) "అనంతం విశ్వతోముఖమ్" (11-11) అని వర్ణించినది.

17. విశ్వతోముఖుడు: అంతటా ముఖములు కలవాడు. అనగా అందటి ముఖములు ఆయనవే అని పై విధముగా భావించవలయును.

18. విశ్వతోహస్తుడు: అంతటా చేతులు కలవాడని పై విధముగా భావించవలయును.

ఈ విషయములనే భగవద్గీత "అనేక బాహోదర వక్త్రనేత్రం, పశ్యామి త్వా సర్వతో Zనంత రూపం, నాంతం నమధ్యం న పునస్తవాదిమ్, పశ్యామి విశ్వేశ్వర విశ్వరూప" (11.16) అని వచించినది. దేవా! నిన్ను ఎన్నో బాహువులు, ఉదరములు, ముఖములు, కన్నులు కలవానినిగా చూచుచున్నాను. నీకు ఆది మధ్యాంతములు లేవు. ఈ విశ్వమే నీ స్వరూపము. దానికి నీవే ఈశ్వరుడవు.

19. విశ్వతఃపాదుడు : అంతటను పాదములు కలవాడు. దీనికిని పైవానివలె భావము.

అందువలననే జగత్తు బ్రహ్మస్వరూపమని 'బ్రహ్మసత్యమ్ జగద్బ్రహ్మ' అను వాక్యము తెలుపుచున్నది. మంత్రపుష్పము 'విశ్వం నారాయణమ్ హరిమ్' అనియు, విశ్వమే వేదం పురుషః' అనియు అనుచున్నవి.

"కిం స్విదాసీ దధిష్ఠాన మారంభణం
కతమత్ స్విత్ కి మాసీత్,
యదీ భూమిం జనయ (4) న్విశ్వకర్మా
విద్యా మౌర్ణో న్మహినా విశ్వచక్షాః" **11.**

యది=ఆ పరమేశ్వరుడొక్కడే ఇతరుల సహాయము లేకుండ ద్యావా పృథువులను సృష్టించినచో, ఆయనకు, అధిష్ఠానం= నివాస గృహము, లేదా ఆధారస్థలము, కిం స్విత్ ఆసీత్=ఏది అయినది? ఆరంభణం=ఉపాదాన కారణ పదార్థము, కతమత్ స్విత్, కిమాసీత్= ఏది, ఎట్టిది, అయినది.

విశ్వచక్షాః= సర్వద్రష్ట, సర్వజ్ఞుడు అయిన, విశ్వకర్మా= ఆ విశ్వకర్మ, మహినా= తన మహిమ చేతనే, భూమిం=భూలోకమును, జనయన్=కనినవాడై, సృష్టించినవాడై, ద్యామ్=స్వర్గలోకమును, వి ఔర్ణోత్=విశేషముగా సృష్టించి వ్యాపించినాడు. అనగా భూమ్యా కాశములను, అందలి భవనములను సృష్టించి, తాను వాటన్నిటియందు పరిపూర్ణుడై నిండినాడని సారాంశము.

ఈ మంత్రమున పూర్వపాదమునకు సమాధానముగ నిమిత్త- ఉపాదాన- సహకారి కారణములన్నియు ఆయనయే అనియు, ఆయనకంటె భిన్నమైనదేదియు సృష్టి క్రియలో వాడబడలేదనియు, అసలట్టి పదార్థమేదియు అప్పుడుగాని, ఇప్పుడుగాని లేదనియు గ్రహించవలయును. ఈ రహస్యమునే పురుషసూక్తము "పురుష ఏ వేదగ్ం సర్వం యద్భూతం యచ్చ భవ్యమ్" ఆయన కంటె భిన్నమైనది ఇది వఱకు లేక పోవుటయేకాదు, ఇక ముందుకూడా ఉండదు, అతడే సర్వము అని వచించినది. ఈ మంత్రమున 'మహిమ' అను పదము వాడబడినది. మహిమ అనగా ఆయనయొక్క శక్తి అని భావము.

ఆశక్తినే మనము గాయత్రినిగా ఆరాధించుచున్నాము. దీనినే శ్వేతాశ్వతరో పనిషత్తు ఇట్లు వచించినది.

"న తస్య కార్యం కరణం చ విద్యతే
న త త్సమ శ్చా భ్యదిక శ్చ దృశ్యతే
పరాస్య శక్తి ర్వివిధైవ శ్రూయతే
స్వాభావికీ జ్ఞాన బలక్రియా చ." **6.3.**

అతనికి శరీరము కాని, ఏ ఇతర సాధనములు కానిలేవు. అతనికి సముడు కాని, అధికుడుగాని లేడు. అతనికి స్వాభావికమైన పరాశక్తి (మాయ) వివిధ రీతులుగలదై, జ్ఞాన బలక్రియలతో ఒప్పుచుండును. ఇట్టి మహిమ (శక్తి)యే జగత్క్రీడకు మూలభూతము. ఈ మంత్రమున విశ్వకర్మను "విశ్వచక్షాః" అనుట జరిగినది.

20. విశ్వచక్షాః : సర్వమును చూచువాడు. ఎఱుగువాడు. అనగా సర్వద్రష్ట, సర్వజ్ఞుడు.

"క్విం స్వి ద్వనం క ఉస వృక్ష ఆసీ
ద్య తో ద్యావా పృథివీ నిష్ట తక్షుః
మనీషిణో మనసా పృచ్ఛతే దు
తద్య దధ్య తిష్ఠ ద్భువనాని ధారయన్." **12.**

హేమనీషిణః=ఓ పండితులారా! మీరు, మనసా=మీ మనస్సుతో పర్యాలోచించి ఆ విశ్వకర్మ, యతః=దేని నుండి, ద్యావా పృథివీ=ఆకాశమును భూమిని, నిష్ట తక్షుః=(శిల్పముచే) సృజించెనో, అట్టి, వనం=అడవి, కింస్విత్=ఏది? సః వృక్షః= అట్టి వృక్షము, ఉ ఆసీత్=ఏద్దై ఉండును? భువనాని=లోకములను, ప్రాణులను, ధారయన్=సృష్టించుచు, యత్=దేనిని, అధ్య తిష్ఠత్=అధివసించినాడు? అని, పృచ్ఛతేదు=అడుగదలచినచో అడుగుడు? దీనికి సమాధానముగనే 11వ మంత్రమున "విశ్వచక్షాః విశ్వకర్మా మహినా ద్యాం విఔర్ణోత్" సర్వద్రష్ట, సర్వజ్ఞుడు, సర్వశక్తి అయిన విశ్వకర్మ తన మహిమ చేతనే తానను పదార్థము తోనే ద్యావా భూములను, అందలి సర్వమును సృష్టించినాడని చెప్ప బడినది. సాధనాంత రముల అపేక్షలేని పరమేశ్వరునికి, సృష్టి విషయమున తనకంటె భిన్నమైనదేదియు అవసరము లేదని దీని భావము. ఈ విషయమునే శ్వేతాశ్వతరోపనిషత్తు ఇట్లు చెప్పుచున్నది.

"అపాణి పాదో జవనో గ్రహీతా
పశ్యత్య చక్షు స్స శ్రుణో త్యకర్ణః,

స వేత్తి వేద్యం న చ తస్యాస్తి వేత్తా

త మాహు రగ్ర్యం పురుషం మహాన్తమ్." **3.19.**

ఆ విశ్వకర్మపరమాత్మ పాదములు లేకున్నను వేగముగా నడువగలడు, చేతులు లేకున్నను పట్టుకొనగలడు. చెవులు లేకున్నను వినగలడు. ఇంతయేల? తెలియదగిన దానినెల్ల అతడు తెలిసికొనగలడు. కనుకనే సమస్త జీవుల పుణ్యపాపముల నెఱిగి వాటికి తగిన ఫలముల నొసగుచున్నాడు. అట్టి సర్వజ్ఞుని పూర్ణముగా ఎఱుగువారులేదు. ఎవరైన ఎఱుగుదు మన్నచో ఆ ఎఱుక కొంతవఱకే అని తెలియవలయును. అట్టి పరమ పురుషునే సర్వ శ్రేష్ఠునిగను, మహానుభావునిగను తత్త్వజ్ఞులు వచింతురు.

సాధనములచేత పనులను సాధించువాడు సామాన్యుడు. సాధన సామగ్రి లేకయే పనులు చేయగలవాడు విశిష్టుడు. అట్టివాడు భగవంతుడే. అందువలననే అతనిని గూర్చి "స ఆశిషా ద్రవిణ మిచ్ఛమానః" అనగా సంకల్ప మాత్రము చేతనే పనులు చేయువాడు. అని వేదము వచించుచున్నది.

"యాతే ధామాని పరమాణి యావమా

యా మధ్యమా విశ్వకర్మన్నుతే మా,

శిక్షా సఖి భ్యో హవిషీ స్వధావః

స్వయం యజస్వ తనువం జుషాణ." **13.**

విశ్వకర్మన్=ఓ విశ్వకర్మా! తే=నీ యొక్క పరమాణి=శ్రేష్ఠములైన (దేవాదుల), ఉత=ఇంకను, మధ్యమా=నడిమిరకము లయిన (మానవాదుల), అధమా=అధమములైన (తిర్యగాదుల), ధామాని=స్థానములు (శరీరములు) ఏవి కలవో, ఇమా=ఇట్టి వీటినన్నిటిని, సఖి భ్యః= నిన్నారాధించుటచే నీకు సఖులవంటి వారమైన మాకు యజించు నిమిత్తమై, హవిషి= హవిర్దానమునకై, శిక్షా=ఉపదేశింపుము, ఇమ్ము హేస్వధావః= స్వధాలక్షణమైన అన్నము కలవాడా! నీవు, స్వయమ్=స్వయముగా, తనువంజుషాణః= యజమాన శరీరమును పొందిన వాడవై, యజస్వ=యజింపుము, యజ్ఞము చేయుము అని భావము.

ఈ మంత్రమున దేవమానవ తిర్యగ్జడాదులైన ఉత్తమ-మధ్యమ-అధమ శరీరములన్నిటి యొక్క తృప్తి కోసమై మేముచేయు యాగాది సత్కర్మలు విశ్వరూపుడవైన నీ సేవయే అని తెలుపబడినది. అనగా జీవుల ప్రవర్తన విశ్వము నందలి సకల చరాచరముల యొక్క క్షేమము కొఱకు ఉపయోగింపవలయునని ఇందలి పరమార్థము.

ఈ మంత్రమున ఉత్తమ-మధ్యమ-అవమము లనెడి మూడు స్థానములను పేర్కొనుటచేత స్వర్గ-మర్త్య-పాతాళలోకములు లేదా పృథివ్యంతరిక్ష ద్యులోకములు సూచితములగుచున్నవి. అదే విధముగ సత్వగుణ ప్రధానములైన దేవతా శరీరములు,

రజోగుణ ప్రధాన మానవశరీరములు, తమోగుణ ప్రధానములైన మృగ పక్షి క్రిమి కీట స్థావరాది శరీరములు సూచితము లైనవి. ఇవి యన్నియు భగవంతుని సృష్టియే. వీటి అన్నిటియందును భగవంతుడు నివసించియే యున్నాడు. కనుక ఈ మూటిచేతను సృష్టి నంతటిని పేర్కొనినట్లే యగుచున్నది. ఇవి తప్ప అవయవములు లేని పరమేశ్వరునికి వేరు శరీరావయము లేవియులేవు. ఈ విషయమునే 'నతస్య ప్రతిమా అస్తి- ఆ పరమేశ్వరునికి దేహము లేదు. అతనికి సాటియైన వస్తువు కూడ లేదు" అని ఉపనిషత్తులు వచించినవి. చైతన్య రూపుడైన భగవంతునికి విపరీత లక్షణము కలది జడమే. జడము సాధనమే కాని సాధ్యము కాదు కదా! ఈ మూడు ధామములనే విష్ణుమంత్రములలో "ఇదం విష్ణు ర్విచక్రమే త్రేధా నిదధే పదమ్" (ఋ. 1.22.17) "త్రణి పదా విచక్రమే" (ఋ. 1.22.18) అని చెప్పబడినది. విష్ణువు ముల్లోకమును మెట్టినాడని ఇందలి బాహ్యార్థము. ఈ వర్ణనము వలన విష్ణు-విశ్వకర్మల అభేదము సిద్ధమగుచున్నది.

తాత్విక దృష్టితో చూచిన ఈ పరమ, మధ్య మాధ్యమ-అధమ స్థానములు-సహస్రారము, అజ్ఞా, అనాహతము లని భావింపవలయును. ప్రాణాయామాదులను అనాహతము నుండియు,ధ్యానాదులను ఆజ్ఞా చక్రము నుండియు, అసంప్రజ్ఞాత సమాధిని సహస్రారము నుండియు కొనసాగింపవలసి యున్నది. కనుక ఇవి మూడే జీవుని ఉన్నత భూమి కారోహణమునకు సాధనములగుచున్నవి. ప్రాణాయామాదులచేత నీచస్థితిని వదలుటయు, ధ్యానాదులచేత విజ్ఞాన ప్రధాన స్థానమునకేగుటయు, సమాధి వలన అనగా సహస్రార విహారము వలన పరబ్రహ్మ ఐక్యమును అందుటయే తటస్థించును.

మరియు పరమస్థానమనగా కారణ శరీరమనియు, మధ్యమ స్థానమనగా సూక్ష్మశరీర మనియు, అవమ స్థానమనగా స్థూలశరీరమనియు భావించినచో కారణ శరీరము కారణమే గనుక అది పరమము, సత్వ గుణము కలది. సూక్ష్మదేహము మధ్యమ స్థానము గనుక అది సత్వరజోగుణములతో కూడినట్టిది. స్థూలదేహ మనిననో తమోగుణ మయములైన పంచీకృత పంచభూతములతో ఏర్పడిన భోగశరీరము. అది చచ్చుచు పుట్టుచు ఉండును కనుక అది అవమము. ఈ మూటియందును భగవంతుడు ప్రవేశించి వాటిని చైతన్యవంతము లొనర్చి, తాను వాటితో ఏకమైపోయి జీవుడని చెప్పబడు చున్నాడు. జీవుడు సుషుప్తిని కారణముతోను, స్వప్నమును సూక్ష్మము తోను, జాగ్రదవస్థను స్థూలముతోను అనుభవించుచున్నాడు. ఈ మూడు ధామముల (శరీరముల) యందును జీవభావము నశించి ఈశ్వరభావము కలిగిననే గాని నాల్గవదియైన తురీయదశ (సమాధి) చేకూరదు. అప్పుడుగాని జీవునికి అమృతత్త్వము ప్రాప్తించదు. ఈ అంశమునే ఈ మంత్రము యొక్క తుది రెండు పాదములు ఇట్లు వచించినవి. 'ఓ విశ్వకర్మా! నీవు స్వయముగా సాధకుని శరీరమున ప్రవేశించి (అనగా వ్యక్తమై) అతని జీవభావము

నణచి, అతని చేత తురీయమైన ఆనందమును అనుభవింపజేయుమనుటయేగాక, ఆ ఆనంద రూపునిగానే అతనిని శిక్షింపుము (తీర్చుము) అనుటలోని పరమార్థము అతి గంభీరము, రహస్యమునై యున్నది. ఈ మంత్రము చివరగల 'యజస్వ' అనుమాటకు బాహ్య యజ్ఞమును చేయుట అని అర్థమును చెప్పికొనుటకంటె, శివజీవైక్య రూప తాత్విక యజ్ఞమును చేయుమనెడి అర్థమును చెప్పికొనుట యోగ్యముగా నుండును.

"వాచస్పతిం విశ్వకర్మాణ మూతయే (5)
మనోయుజం వాజే అద్యా హువేమ,
సనో నేదిష్ఠా హవనాని జోషతే
విశ్వ శంభూ రవసే సాధుకర్మా" **14.**

అద్య=ఈనాడు, వాజే= 'అన్న' విషయమైన కార్యము జరుగుచుండగా, వాచః పతిం= వేదమంత్ర రూప వాక్కులకు పాలకుడైన వాడును, మనోయుజం=మన మనస్సులకు యోగమును కూర్చువాడును, లేక మనలను యోగ్యమైన మనస్సులు కలవారినిగ చేయువాడును అయిన, విశ్వకర్మాణం=విశ్వకర్మ పరమేశ్వరుని, ఊతయే=సర్వ సంరక్షణార్థమై ఆహువేమ= పిలుతుముగాక! విశ్వ శంభూః= విశ్వమునకు సుఖమును కూర్చువాడును, లేక సమస్త సౌఖ్యములనిచ్చువాడును, సాధుకర్మా=జగత్సంబంధములైన సృష్టి మొదలగు యోగ్యకర్మలు గలవాడును అయిన, సః=ఆ విశ్వకర్మ, అవసే=మన రక్షణ కొఱకు, నేదిష్ఠా హవనాని=మనకు సమీపమునందుగల- ఇప్పుడు మనమాచరించుచున్న యజ్ఞాది కార్యములను, జోషతే=సేవించును, ఇప్పుడు మనము చేయుచున్న సత్కార్యములనన్నిటిని ఆమోదించి తగిన ఫలములను ఒసగుగాక! అని భావము!.

వేదపాలకుడును, విశ్వమునకు సుఖము కలిగించువాడను, సాధుకార్య శీలుడును అయిన విశ్వకర్మ, జీవులమైన మనము తనను తెలిసికొనుటకు చేయునట్టి ప్రతి సత్కర్మను ప్రోత్సహించుచు, మన మనస్సులను యోగయుక్తములగునట్లుచేసి, మనలను రక్షించుగాక, అని ఇందలి పరమార్థము. పూర్వమంత్రమున ఏ యోగకార్యము సూచింప బడినదో, దానిని రక్షించుట కొఱకు భక్తుడు భగవంతుని ఈ మంత్రమున సవిశేషముగా ప్రార్థించినాడు. ఈశ్వరుడెపుడును మా హృదయములందు నివసించుచు, మమ్ము ప్రేరేపించుచు తత్త్వ జ్ఞాన సంపన్నులను చేయుగాత! అని సారాంశము.

ఈ మంత్రమున విశ్వకర్మకు ఈక్రింది విశేషణములు వాడబడినవి.

21. వాచస్పతి : "వాక్" అను పదము యొక్క షష్ఠీ విభక్తి ప్రథమైక వచనమైన, వాచః = వాక్కునకు, పతిః=భర్త అని అర్థము. ఈమాటకు భాష్యము వ్రాయుచు సాయణులు

"మంత్రరూపాయా వాచః పతిః-పాలకం-స్వామినం-విశ్వకర్మాణం' అనినారు. దీనిని బట్టి వాగ్దేవికి పతియగుటచే విశ్వకర్మ 'వాచస్పతి'. ఇచట వాక్కులు అనగా తొలిపలుకులు అని అర్థము అనగా వేదములకు అధిపతి. "వాగ్వై గాయత్రీ" అని ఛాందోగ్యోపనిషత్తు అనగా వాక్కు-గాయత్రి అని అర్థము, గాయత్రీ పతి విశ్వకర్మ- "వాగ్వై సరస్వతీ" అని తైత్తిరీయ సంహిత వచించినది. దీనిని బట్టి సరస్వతీ పతి విశ్వకర్మ. ఈ విషయము 'సరస్వతి' అను అంశమున విపులముగ వ్రాయబడినది.

పై విషయములను బట్టి వాచస్పతి వేదాధిపతి, సరస్వతీపతి, గాయత్రీపతి. గాయత్రి అనగా ప్రకృతియే. ఆ ప్రకృతికి పురుషుడే (పతియే) విశ్వకర్మ. అనగా జగత్కారణ వస్తువు. అట్టి ప్రకృతి పురుష స్వరూపుడగు విశ్వకర్మను మనస్సు నందు ప్రవేశింప ఆహ్వానింపుమని కూడ ఇందు సూచనయున్నది. వేదవాణికి పాలకుడగు విశ్వకర్మను మా రక్షణార్థమై ఆహ్వానించుచున్నాము-అని ఈ మంత్రమున కలదు. 'శ్వేతాశ్వతరోపనిషత్తు కూడ విశ్వకర్మ బ్రహ్మ దేవుని సృష్టించి ఆయనకు వేదముల నొసంగినట్లు "యో బ్రహ్మాణం విదధాతి పూర్వం యోవై వేదాంశ్చ ప్రహిణోతి తస్మై" అని వచించినది.

22. విశ్వశంభువు : 'శంభు' అనగా సుఖస్వరూపుడై సుఖమును కలిగించువాడు' అని అర్థము. విశ్వశంభువు అనగా ఐహిక-ఆముష్మిక-పారమార్థికములైన సమస్త సుఖములను కలిగించువాడు. ఈ పదమునే మంత్రపుష్పము "విశ్వాక్షం విశ్వ శంభువమ్' అని వచించినది.

23. సాధుకర్మ : 'సాధు' అనగా యోగ్యము, మంచిది అని అర్థము. 'యోగ్యములైన' అనగా జీవులకుపయోగించు సృష్టి-స్థితి-లయ-తిరోధాన-అనుగ్రహ కర్మలను విస్తరించువాడనియు, వాటిని సమకూర్చువాడనియు భావము. తనకు భక్తులు చేయు మంచిపనులకు తగిన ఫలములనిచ్చువాడని సారాంశము. అనగా వారి వారి కర్మలను బట్టి వారికి తగిన ఫలమునొసగును. అనగా సత్కర్మలు చేసి సత్ఫలమును పొందవలయునని భావము.

"విశ్వకర్మన్ హవిషా వా వృధానః
స్వయం యజస్వ తనువం జుషాణః,
ముహ్యన్త్వన్యే అభిత స్సపత్నా
ఇహా స్మాకం మఘవా సూరి రస్తు." **15.**

విశ్వకర్మన్=ఓ విశ్వకర్మా! నీవు, హవిషా=మేమర్పించెడి హవిస్సులచే, వా వృధానః = వృద్ధిపొందుచున్నవాడవై, తనువం=నా శరీరమును, జుషాణః=పొందినవాడవై, స్వయం=

నీవే స్వయముగా (నేనై), యజస్వ=ఈ యజ్ఞమును చేయుము, ఇహ=ఈ సత్కార్యమునందు, అస్మాకమ్=మా యొక్క అన్యే సపత్నాః=మా భావములకు విఘ్నములు కల్పించు శత్రువులు, అభితః=అంతట, అన్ని విధముల, ముహ్యంతు= మోహము చెందుదురుగాక! అనగా పరాజయము పాలగుదురుగాక! అని భావము. యోగ విఘ్నకరములైన ప్రతీపశక్తులు నశించుగాక! అని భావము, మఘవా=ధనవంతుడును, సూరిః=జ్ఞానవంతుడును అగు పుత్రుడు, అస్మాకం అస్తు=మాకు కలుగుగాక!

ఇచట లౌకిక పుత్రుడనియేకాక జ్ఞానపుత్రుడని తాత్వికార్థము. మేమొనర్చిన ఈ సత్కార్యము మాకు జ్ఞాన లాభమును చేకూర్చుగాక అని సారాంశము.

"విశ్వకర్మన్ హవిషా వర్ధనేన
త్రాతార మింద్ర మకృణో రవధ్యం,
తస్మై విశ స్సమన మన్త పూర్వీ
రయ ముగ్రో విహవ్యో యథా సత్." 16.

విశ్వకర్మన్=ఓ విశ్వకర్మ ప్రభూ, హవిషా=మేమర్పించు హవిస్సు చేత, వర్ధనేన= వృద్ధిపొందిన వాడవై, అనగా మా మనస్సులలో ఎడబాయక తోచుచున్నవాడవై ఈ యజమానుని, లేదా యోగ సాధకుని, త్రాతారం=ఇతరులను రక్షించువానినిగను, అనగా లోకారాధనకు త్రికరణముల నర్పించువానినిగను, అవధ్యం=ఇతరులకు లోబడని వానినిగను, అకృణోః=చేయుము. తస్మై=ఇతని కొఱకు, పూర్వీః విశః=గొప్ప గొప్పవారు కూడ, సమనమంత=లోబడుదురుగాక! ఇతనికి శిష్యభూతులై ఇతని మార్గములను అనుసరింతురుగాక! అని భావము. అయం=ఈ యజమానుడు, లేదా సాధకుడు, ఉగ్రః = ఇతరులకు అణపరానివాడును, విహవ్యః= విశేష యజ్ఞ (సత్) కార్యములు చేయువాడును, యథాసత్=ఎట్లు కాగలడో, అట్లు చేయుమని భావము. యజుర్వేదము యజ్ఞకర్మలు ప్రధానముగా కలది కనుక, యజ్ఞకారులకు కావలసిన ఐహి కాభ్యుదయము ఈ రెండు మంత్రములలో కోరబడినది.

"సముద్రాయ వయునాయ సింధూనాం
పతయేనమః, నదీ నాగ్ం సర్వానాం
పిత్రే జుహుతా విశ్వకర్మణే
విశ్వాహా మర్త్యగ్ం హవిః." (6) 17.

సింధూనాం= ప్రవహించునట్టి నదములకు, పతయే= పాలకుడును, సముద్రా

కారుడై భరించు భర్త అని భావము. విశ్వకర్మాకారుడై, సర్వానాం నదీనాం=సమస్త నదులకు, పిత్రే=తండ్రి అయిన వాడును, వయునాయ= కాంతుడును, అనగా చిత్స్వరూపుడు, జ్ఞానాకారుడు అర్థము. (ఇది 'విశ్వచక్షాః' అనుపదము వంటిదే) సముద్రాయ=జలరాశి స్వరూపుడైన విశ్వకర్మకు, నమః=నమస్కారము, ఇట్టి విశ్వకర్మకు, విశ్వాహా=ఎల్లవేళల యందును, అమర్త్యం=నాశనములేనట్టి, హవిః= పూజాద్రవ్యమును, జుహుత=హోమము చేయుడు, అర్పింపుడు.

ఈ మంత్రము విశ్వకర్మను సముద్ర స్వరూపుడనియు, నదీనదములకు జనకుడు, భర్త అనియు చెప్పుట గమనించవలసి యున్నది. ఆయన జగద్బీజము నుంచినది ఉదకములయందే కనుక ఇట్టి వర్ణన ఎంతయో సముచితముగ నున్నది.

ముండకోపనిషత్తు :

"అతః సముద్రా గిరయశ్చ సర్వే
అస్మాత్ స్యందంతే సింధవః సర్వరూపాః,
అతశ్చ సర్వా ఓషధయో రసశ్చ
యే నైష భూతై స్తిష్ఠతే హ్యంతరాత్మా." **2.1.9.**

అతః=ఈ పరమేశ్వరుని వలననే, సర్వే సముద్రా=సర్వసముద్రములు, గిరయః చ= పర్వతములు, అస్మాత్=ఆ పరమేశ్వరుని వలననే, సర్వరూపాః సింధవః= సర్వవిధములైన నదులును, అతః చ=అతని వలననే, సర్వా ఓషధయః= సర్వ ఓషధులు, రసః చ=రసము, అన్నియు నేర్పడినవి. యేన=ఆ రసముచే పరిణతములైన, భూతైః= పంచభూతములచే పరివేష్ఠితుడై, అంతరాత్మ=జీవుడు, తిష్ఠతే=ఉన్నాడు.

ఈ విశ్వకర్మ సూక్త మంత్రమున విశ్వకర్మకు ఈక్రింది పర్యాయ పదములు వాడబడినవి.

24. సముద్రాయ : దీనికి సాయణులు 'సముద్ర స్వరూపుడు' అని అర్థము వ్రాసినారు. విశ్వకర్మ–జలములయందే జగద్బీజము నుంచినాడని "అపాం గర్భం వ్యద ధా త్పురుత్రా" అనెడి మంత్రము తెలుపుచున్నది. అట్టి జలములను తనయందపారముగా నిముడ్చుకొనిన సముద్రుని "విశ్వకర్మ స్వరూపమే" అని భావించుట తగియున్నది.

25. సింధుపతి : "సింధూనాంపతిః సింధుపతిః". సముద్ర శబ్దము అఖండ జలరాశిని చెప్పుచుండగా, ఈ 'సింధు', 'నదీ' శబ్దములు ఖండములైన జలములను గూర్చి చెప్పుచున్నవి. సింధువులకు పతి–సింధుపతి.

26. నదీపిత : నదులను సృష్టించిన తండ్రి – నదీపిత.

ఉదకములు సూర్యకిరణములు ద్వారా పీల్చబడి, మేఘములై వర్షించి నదీనద రూపములై ప్రవహించి సముద్రమున కలియుచున్నవి. కనుక సూర్యుడు నదులకు సృష్టికర్త (తండ్రి) అని భావించవచ్చును. సూర్యుడు (సవిత)–"విశ్వకర్మ" స్వరూపుడే. సాయణ భాష్యము నందును " ఆదిత్యా త్మకాయ విశ్వకర్మణే" అని యున్నదిగదా!

పురుష సూక్తము

పురుష సూక్తము ఋగ్వేద దశమ మండలము నందలి తొంబదవ సూక్తములో 16 మంత్రములతోను, అధర్వవేదము పందొమ్మిదవ కాండము ప్రథమాను వాకమున 6,7 సూక్తములలో 16 మంత్రములతోను, యజురారణ్యకమున, శుక్లయజుర్వేదమున 99 పాదములతోను పాఠభేదములతోనున్నది. ఆసేతు హిమాచల పర్యంతము బహువిధ సమస్త బ్రాహ్మణులు అధ్యయ నాధ్యాపనములతో వైదిక క్రియా కలాపములందు చదువు యజురారణ్యకములోని పురుష సూక్తమును ఈ క్రింద వ్రాయుచున్నాను.

"ఓం సహస్ర శీర్షా పురుషః
సహస్రాక్ష స్సహస్రపాత్,
స భూమిం విశ్వతోవృత్వా
అత్య తిష్ఠ ద్దశాంగులమ్." **1.**

పురుషః= జగత్కారణుడైన పురుషుడు, సహస్రశీర్షః= ఇచట 'సహస్ర' అను పదమునకు వేయి అనిగాక అనంతములు అని అనుట సమంజసము. అనగా అనంతములైన శీర్షములు కలవాడును, అటులనే, సహస్రాక్ష=అనంతములైన కన్నులు కలవాడును, సహస్రపాత్=అనంతములైన పాదములు కలవాడును, అనగా సమస్త ప్రాణుల చక్షురాదీంద్రియములు, హస్తపదాద్యవములు అతనివే కనుక అనంతేంద్రి యములు, అనంతావయవములు కలవాడగుచున్నాడు.

ఆయన "అపాణిపాదో జవనోగ్రహీతా" అనినట్లు ఏ ఇంద్రియములు లేని నిరేంద్రియుడు–రూప రహితుడు అయినను అనేకేంద్రియములు కలవానివలె సంకల్ప మాత్రముననే సర్వము నిర్వహించునని భావము. ఈ అంశమునే విశ్వకర్మ సూక్తము "విశ్వతశ్చక్షు రుత విశ్వతోముఖో, విశ్వతోహస్త ఉత విశ్వతస్పాత్" (ఋ. 10.81.3) అని

వచించినది. ఆ మంత్రమున విశ్వతః (అంతట) అని చెప్పగా, ఈ మంత్రమున 'సహస్ర' అనుట జరిగినది.

సః=ఇట్టి పరమాత్మ, భూమిం=భూమిచే చెప్పదగిన సమస్త బ్రహ్మాండములను (ఆకాశాదులనే కాక అవ్యక్తమహదాది సమస్త జగమును), విశ్వతః=అంతట, అనగా అణు పరమాణువుల నుండి మహత్తు వఱకు గల వస్తుకోటిని, వృత్వా=ఆవరించి (అంతర్బహిశ్చ తత్సర్వం వ్యాప్య నారాయణస్థితః అనగా ఆ పరమేశ్వర తత్త్వమే, లోపల వెలుపల అంతట వ్యాపించియున్న దని భావము). దశాంగులమ్=దశదిక్కులను, అతి+అతిష్ఠత్= దాటి కూడ ఆ తత్త్వము కలదని భావము. అంగుళ శబ్దము చేత ప్రదేశము సూచితమగును కనుక దానికి 'దిక్కు' అని అర్థము చెప్పుకొనుట జరిగినది.

విశ్వకర్మ సూక్తమంత్రము (ఋ. 18.81.3) విశ్వకర్మ ద్యావాభూములను సృష్టించినాడనియు, సమస్తమును తన స్వాధీనము చేసికొనివాడనియు తెలుపగా, ఈ పురుష సూక్త మంత్రమున భూమినంతయు దశదిక్కులను దాటి వ్యాపించి నాడని తెలుపబడినది. విశ్వకర్మ సూక్త మంత్రము (ఋ. 10.81.1) విశ్వకర్మ సమస్త జగమున వ్యాపించుటయేగాక, అందు అంతర్యామి రూపమున నున్నాడని తెలిపినది. ఈ విధముగా పురుష సూక్తమంత్రము విశ్వకర్మ సూక్తమంత్రము ననుసరించియున్నది.

ఈ మంత్రమునగల 'శీర్షా' అను పదమునకు బదులుగ అథర్వ వేద మంత్రము (1)న 'బాహుః' అనియున్నది.

"పురుష ఏ వేదగ్ం సర్వం
యద్భూతం యచ్చ భవ్యం
ఉతా మృత త్వస్యేశానః
య దన్నే నాతి హరోతి." **(2)**

యత్=ఏ జగము, భూతః=భూతకాలము నందుండెనో, యత్=ఏది, భవ్యమ్=ఇక ముందు పుట్టనున్నదో, యత్=ఏది, ఇదమ్=వర్తమాన కాలమున ఇట్లు కన్పించు చున్నదో, సర్వం=ఇది యంతయు, పురుష ఏవ=పురుషుడేకాని ఇతరముకాదు. ఆ పరమ పురుషునికంటె భిన్నముగ త్రికాలములందలి జగత్తునది లేనేలేదు. మట్టి లేనిచో-కుండ లేనట్లు, ఆ పురుష తత్వమే లేకున్న జగముల యొక్క సృష్టి-స్థితి-లయ తిరోధానాను గ్రహములు లేనే లేవు అని భావము. అనగా ఆ పరమపురుషుడే జగద్రూపముగ వివర్తించి కనపడుచున్నాడనుట పరమార్థము.

ఉత=ఇంకను, అమృతస్య= దేవత్వమునకు లేక మోక్షమునకు ఈ పురుషుడే ఈశానః=ప్రభుడు, అనగా అతని తత్త్వము నెఱిగిననే దేవత్వముకాని మోక్షముకాని లభించును. యత్=ఏది, అన్నేన= అన్నము వలన, అతి రోహతి= అధిగమించుచున్నదో, వృద్ధియగుచున్నదో, అనగా మర్త్య జగత్తునకు కూడ అతడే ప్రభువు అని అర్థము. అథర్వ వేదమున ఈ మంత్రము యొక్క ఉత్తర భాగము "ఉతామృతత్వస్యేశ్వరో, యదన్యే నాభవత్ సహ" అని యున్నది.

"ఏతావా నస్య మహిమా,
అతో జ్యాయాంశ్చ పూరుషః,
పాదో Z స్య విశ్వాభూతాని,
త్రిపాద స్యామృతం దివి." ...3

ఏతావాన్=ఈ కన్పించు జగత్తు అంతయు, అస్య= ఆ పురుషుని యొక్క మహిమా =మహిమయే, అతః= అందువలన, పురుషః=ఆ పురుషుడు, జ్యాయాన్=దీని కంటే ఎంతో గొప్పవాడు. విశ్వాభూతాని=ఈ సమస్త విశ్వము, అస్యపాదః= ఆ విరాట్ పురుషుని యొక్క ఒక్క పాదము మాత్రమే, అస్య త్రిపాత్=అతని మూడు పాదములు, అమృతందివి =అమృత స్వరూపదివము. అనగా ఈ అనంత సృష్టి అతని యొక్క చతుర్థాంశము అనగా స్వల్పాంశమనియు, మిగిలిన పాదత్రయాత్మకమైన అతని స్వరూపమంతయు జనన మరణాది ధర్మములు లేని నిర్వికార నిత్య సత్య స్వరూపమనియు, ఆ నిత్య సత్య చిన్మయ స్వరూపము నుండియే అల్పమైన ఈ సృష్టి ప్రవర్తిల్లు చున్నదనియు భావము.

పరమాత్మకు ఈ చతుష్పాద విభాగము సమంజసము కాదనియు, జగత్తు యొక్క అల్పత్వమును బట్టి పరమాత్మ యొక్క అనంతత్వము బోధపడుట కిట్లు విభాగము చేయబడినదనియు విజ్ఞుల అభిప్రాయము.

విశ్వకర్మ సూక్తమంత్రము (10.82.5) "పరోదివా పరఏనా పృథివ్యా పరో దేవేభి రసురై ర్యదస్తి" అనగా ఆ విశ్వకర్మ దివము కంటెను భూమికంటెను దేవాసురుల కంటెను పరమై ఒప్పుచున్నాడు" అని వచించినది. అనగా బ్రహ్మాండములన్నియు విశ్వకర్మ యొక్క ఒక అంశము మాత్రమే అని భావము. ఆ భావము ననుసరించియే ఈ పురుష సూక్తమంత్రము, భగవద్గీత యందలి "విష్ట భ్యాహ మిదం కృత్స్న మేకాంశేన స్థితో జగత్" (10.42)- నేనీ విశ్వమును నా యొక్క అంశమాత్రము చేతనే వ్యాపించియున్నాను' మున్నగు వాక్యములు విస్తరిల్లినవి.

పురుష సూక్తము నందలి ఈ మంత్ర పూర్వభాగము అధర్వవేద పురుషసూక్త మంత్రపూర్వమున "తావన్తో అస్య మహిమా న స్తతో జ్యాయాంశ్చ పూరుషః" అని చెప్పబడి యున్నది.

"త్రిపా దూర్ధ్వ ఉదై త్పురుష ః
పాదో Z స్యే హా భవాత్పునః,
తతో విష్వ వ్య క్రామత్
సాశనా నశనే అభి." **4.**

త్రిపాత్ పురుషః= త్రిపాత్పురుషుడు లేక ఆ విరాట్పురుషుని యొక్క మూడు పాదములు, ఊర్ధ్వ ఉదైత్= అజ్ఞాన (తమః) కార్యమగు సంసారమును అంటక ఊర్ధ్వము నందుండెను. అనగా పిండాండ పక్షమున సహస్రారము నందుండెనని భావము. అస్య పాదః= ఆ విరాట్పురుషుని యొక్క నాల్గవ పాదము, ఇహ = ఈలోకమునకు, పునః అభవాత్= మరల మరల వచ్చుచుండును. తతః విష్వఙ్ వ్యక్రామత్=ఈ లోకమునకు వచ్చిన పిమ్మట అనేక విధములు కలవాడై సర్వత్ర వ్యాపించి యుండును. సాశన అనశనే అభి= ఆహారముతో కూడిన ప్రాణి జాతముగను, ఆహారము అవసరములేని నదీ పర్వతాదులుగను వ్యాపించినాడు. అనగా పరమేశ్వరుని యొక్క చతుర్థాంశము (ఒక అంశము) మాయా సంపర్కముచేత సృష్ట్యాది కార్యముల నిమిత్తమై జీవులకు పాప పుణ్య కర్మఫలముల నొసంగుటకు మరల మరల వ్యక్తమగుచుండును. ఆ పురుషుడు మాయోపాధుల యందు ప్రతిబింబించిన పిమ్మట దేవ-మనుష్య-తిర్యగాది భేదములచేత భిన్నుడై ప్రాణి-అప్రాణి రూపములతో వెలసినాడు.

ఇక్కడ పురుషపదముచే చెప్పబడిన విశ్వకర్మ స్వరూపతః విశ్వకర్మయై వెలసినాడని భావము. ఈ సందర్భమున మాయా Z విద్యాది పదములచే పేర్కొనదగిన సంసార కారణము అతని నుండియే వ్యక్తమైనదని గమనించవలసిన విషయము.

ఈ మంత్రమే అధర్వవేదమున "త్రిభిః పద్భిర్ద్యా మరోహత్ పాదస్యేహా భవత్పునః, తథా వ్యక్రామద్ విష్వఙశనా నశనే అను" (2) అనియున్నది.

"తస్మా ద్విరాడజాయత,
విరాజో అధిపూరుషః,
స జాతో అత్యరిచ్యత,
పశ్చాద్భూమి మథోపురః." **(5)**

తస్మాత్ విరాట్ అజాయత= ఆ పరమ పురుషుని నుండి విరాట్పురుషుడు ద్భవించెను. 'విరాట్' అనగా తత్త్వములను ధరించి విశేషముగా ప్రకాశించువాడు అని వ్యుత్పత్త్యర్థము. విరాజః అధిపురుషః= ఆ విరాట్పురుషుని ఆధారము చేసికొని మరియొక పురుషుడు (జీవుడు) కలిగెను. అతడు మది నుండి కలిగిన మానసీనుడని ('సమానసీన ఆత్మా జనానాం') తైత్తిరీయా రణ్యకము (3.11.1) వచించినది. విరాట్టు నుండి కలిగిన అతనిని "వైరాజుడు" అనిరి. ఆ పురుషుడు, జాతః=పుట్టుటతోనే, అత్యరిచ్యత=అనేక రీతులుగా (తన రూపమునకంటె భిన్నముగా) ఆయెను. ఆకాశాది భూత రూపమును పొందెనని భావము. అనగా పరమాత్మ నుండి అవ్యక్త మహదహంకారములు, వాటి నుండి పంచతన్మాత్రలు మహాభూతములు ఇత్యాది సృష్టి విధానము కలిగెనని భావము. అనగా మాయ జనించి దాని నుండి సవికారమైన ప్రపంచోత్పత్తి జరుగుటను వైరాజ సృష్టిగా తలప వలసియున్నది. పశ్చాత్=భూత సమూహ సృష్టికి పిదప, భూమిన్=భూమిని సృష్టించెను, అధః= తరువాత, పుర=పురములను-జరాయుజ, అండజ, ఉద్భిజ్జ, స్వేదజము లనెడి జీవశరీరములను సృష్టించెను. ఈ శరీరములు సప్తధాతువుల చేత పూరింపబడును కనుక పురములని మంత్రము వచించినది. వీటిలో దేవతిర్యఙ్మనుష్య స్థావరాదులన్నియు అంతర్భూతములు. అనగా మొదట బ్రహ్మాండ రూపమైన విరాట్పురుషుడు కలిగి, అతడు దేహాభిమానియై జీవస్వరూపుడైనాడని భావము.

ఈ విషయము విశ్వకర్మ సూక్తము (10.81.1) నందలి "స ఆశిషా ద్రవిణ మిచ్ఛమానః ప్రథమ చ్ఛ దవరా ఆవివేశ"- విశ్వకర్మ తిరిగి సృష్టింపవలయునను సంకల్పము చేత జగత్తుల భోగమును కోరినవాడై జగత్తులలోని ప్రాణుల హృదయములందు జీవరూపుడై ప్రవేశించెను" అను దానిని అనుసరించినట్లు వ్యక్తమగుచున్నది.

అధర్వవేదమున ఈ మంత్రమునందలి 'తస్మాద్విరాడ జాయత' అను వాక్యమునకు బదులు "విరా డగ్రే సమ భవత్" అని యున్నది.

"యత్పురుషేణ హవిషా,
దేవా యజ్ఞ మతన్వత,
వసంతో అస్యా Z సీదాజ్యమ్
గ్రీష్మ ఇధ్మ శ్శర ద్ధవిః" **(6)**

దేవాః పురుషేణ హవిషా= దేవతలు పురుషరూపమైన హవిస్సుతో, యత్ యజ్ఞం అతన్వత= ఏ యజ్ఞమును చేసిరో, అస్య= ఆ యజ్ఞమునకు, వసన్తః ఆజ్యం ఆసీత్= వసంత ఋతువు ఆజ్యముగా నుండెను. గ్రీష్మః ఇధ్మః= గ్రీష్మ ఋతువు ఇధ్మములుగానుండెను.

శరత్తు హవిః= శరదృతువు హవిస్సుగా నుండెను.

దేవతలనగా ప్రాణములు, ఇంద్రియములు అని భావించిన యజ్ఞకర్త మానవు డగును. మానవుడు సంకల్ప రూపమైన యజ్ఞము నొనర్పబూనగా, ఆ యజ్ఞమునకు రసముల నందించెండి వసంతము ఆజ్యము, ఎండలు కాయుగ్రీష్మము దర్భలు, సమిధలు, పంటలను పండించి యిచ్చు శరత్తు అన్నాది రూప హవిస్సు అయినదని వర్ణించుటచేత, ఆ ఋతువుల నాధారము చేసికొని మానవులు సంకల్పములను పండించు కొనుచు యజ్ఞములని చెప్పదగిన సత్కర్మలను చేసి జీవిత ఫలసిద్ధి నందుచున్నారని భావము.

"సప్తా స్యాసన్ పరిధయః
త్రి స్సప్త సమిధః కృతాః।
దేవా యద్యజ్ఞం తన్వానాః
అబధ్నన్ పురుషం పశుమ్॥" **(7)**

అస్య సప్త పరిధయః ఆసన్ =ఈ యజ్ఞమునకు సప్తధాతువులు (త్వక్, చర్మము, మేదస్సు, రక్తము, మాంసము, మజ్జ, అస్థులు) యజ్ఞవేదికలుగా నుండెను. లేక గాయత్ర్యాది సప్తచ్ఛందస్సులు పరిధలు అయినవి అని కొందఱు పండితుల అభిప్రాయము.

త్రిః సప్త సమిధః కృతాః=మూడు ఏడులు ఇరువది యొక్కటి (3×7=21) అనగా 12 నెలలు, 5 ఋతువుల, పృథివి, అంతరిక్షము=దివము అను మూడులోకములు, ఆదిత్యుడు, సమిధలు అయినవి. దేవాః యత్ యజ్ఞం తన్వానాః= దేవతలు ఏ యజ్ఞము చేసిరో ఆ యజ్ఞములో, పురుషం పశుం అబధ్నన్=విరాట్ పురుషుని యజ్ఞపశువుగా యూపస్తంభమునకు బంధించిరి.

"తం యజ్ఞం బర్హిషి ప్రోక్షన్,
పురుషం జాత మగ్రతః।
తేన దేవా అయజన్త,
సాధ్యా ఋషయ శ్చయే॥" **(8)**

యజ్ఞం తమ్=యజ్ఞసాధన భూతుడైన పశువుగా బంధింపబడిన ఆ విరాట్ పురుషుని, బర్హిషి ప్రోక్షన్=మానస యజ్ఞము నందు ప్రోక్షించిరి. అగ్రతః పురుషం జాత=

సర్వసృష్టికి ముందు పుట్టిన ఆ పురుషునితో, సాధ్యా=సాధ్యులు లేదా సృష్టి సాధనకు తగిన, దేవాః=దేవతలు, ఋషయః చ=ఋషులును, యేతే=ఎవరుగలరో వారందఱును, ఆయజన్త= మానస యజ్ఞము చేసిరి.

"తస్మా ద్యజ్ఞా త్సర్వహుతః
సంభృతం పృష దాజ్యమ్,
పశూగ్ం స్తాగ్ం శ్చక్రే వాయవ్యాన్
ఆరణ్యాన్ గ్రామ్యాం శ్చయే॥" **(9)**

సర్వహుతః=సర్వము హుతముగా చేయబడిన ఏ యజ్ఞము కలదో, తస్మాత్ యజ్ఞాత్= ఆ మానస యజ్ఞము నుండి, పృషత్=పెరుగు, ఆజ్యమ్=ఘృతము, మున్నగు భోగ్యజాతము, సంభృతమ్=సంపాదింపబడినది, తాన్=ప్రసిద్ధములైన,వాయవ్యాన్=గాలిలో తిరుగు పక్షులును, పశూన్=పశువులును, ఆరణ్యాన్=అడవులలో సంచరించు సింహాదులును, గ్రామ్యాన్=గ్రామములలో సంచరించు ఆవులు మున్నగు నవియు, యే=ఏవిగలవో అవియన్నియు, చక్రే=ఉద్భవించినవి.

"తస్మా ద్యజ్ఞా త్సర్వహుతః।
ఋచ స్సామాని జజ్ఞిరే,
ఛందాగ్ం సి జజ్ఞిరే తస్మాత్,
యజుస్తస్మా దజాయత॥" **(10)**

సర్వహుతః తస్మాత్ యజ్ఞాత్=సర్వము హుతము చేయబడిన ఆ మానస యజ్ఞము నుండి, ఋచఃసామాని జజ్ఞిరే=ఋక్కులు, సామములు పుట్టినవి, తస్మాత్ ఛందాగ్ం సి జజ్ఞిరే= ఆ మానస యజ్ఞము నుండి ఛందస్సులు పుట్టినవి, తస్మాత్ యజుఃఅజాయత= ఆ మానస యజ్ఞము నుండి యజుర్వేదము పుట్టినది.

ఈ మంత్ర మిట్లు ఆ పరమపురుషుని నుండి వేదములు పుట్టినవని చెప్పుచుండగా, విశ్వకర్మ సూక్తమంత్రము (ఋ. 10. 81. 7) "వాచస్పతిం విశ్వకర్మాణమ్" అని వచించినది. అనగా మంత్ర స్వరూపములయిన వాక్కులకు (వేదములకు) పతి-విశ్వకర్మ అని భావము.

"తస్మా దశ్వా అజాయన్త,
యే కే చో భయా దతః,

గావోహ జజ్ఞిరే తస్మాత్

తస్మా జ్జాతా, అజా ऽవయః" **(11)**

తస్మాత్ అశ్వాః అజాయన్త= ఆ విరాట్ పురుషుని నుండి గుఱ్ఱములు పుట్టినవి. యేకేచ= ఏ యే రూపములు గలవో అవియన్నియు, ఉభయాదతః=స్త్రీ పురుష ద్వంద్వము లుగా, జజ్ఞిరే=ప్రకాశించినవి, తస్మాత్గావః జజ్ఞిరే=ఆ పురుషుని నుండి ఆవులు పుట్టినవి, తస్మాత్ అజాః అవయఃజాతాః= ఆ పురుషుని నుండి మేకలు, గొఱ్ఱెలు పుట్టినవి.

"యత్పురుషం వ్యదధుః

కతిథా వ్యకల్పయన్,

ముఖం కిమస్య కౌబాహూ,

కావూ రూ పాదా వుచ్యేతే॥" **(12)**

యత్పురుషం= ఏ విరాట్ పురుషుని, వ్యదధుః= తెలిసికొనిరో (అప్పుడు ఆ పురుషుని) కతిథా వ్యకల్పయన్=ఎన్ని విధములుగా సంకల్పించిరి?

బ్రహ్మవేత్తలు ఆ పురుషుని ఏ యే రీతులుగా కల్పించినారు? అనగా సృష్టికి, అతనికి గల సంబంధమును వేత్తలైనవారు ఎట్లు కల్పించిరి? ఎట్లతనిని అర్థము చేసికొనిరి?

అస్య ముఖం కిమ్= ఆ పురుషునికి ముఖము ఏది? అస్య బాహూ కౌ=అతనికి బాహువులు ఏవి? కౌ ఊరూ కౌపాదౌ ఉచ్యేతే=ఏవి తొడలుగా, ఏవి పాదములుగా చెప్పబడుచున్నవి?

"బ్రాహ్మణో ऽస్య ముఖమాసీత్,

బాహూ రాజన్య కృతః

ఊరూ తదస్య యద్వైశ్యః,

పద్భ్యాగ్ం శూద్రో అజాయత॥" **(13)**

ఆవిరాట్పురుషునకు బ్రాహ్మణుడు అనగా బ్రహ్మజ్ఞానమును కలవాడు ముఖము అయ్యెను. క్షత్రియుడు బాహువులు అయ్యెను. వర్తకుడు తొడలు అయ్యెను. పాదముల నుండి శూద్రుడు పుట్టెను.

(కృష్ణయజుర్వేదమున "పద్భ్యాగ్ం శూద్రో అజాయత" కు అనంతరము "పాదేనఖేషు పంచమా" అని యున్నది.)

ఈ మంత్రమున మొదటి మూడు పాదములలో బ్రాహ్మణ-క్షత్రియ-వైశ్యులు 'అయినారు' అని చెప్పి, నాల్గవ పాదమున 'శూద్రుడు పుట్టినాడు' అనుట గమనించతగి యున్నది.

"చంద్రమా మనసోజాతః
చక్షో స్సూర్యో అజాయత,
ముఖా దింద్ర శ్చాగ్నిశ్చ,
ప్రాణా ద్వాయు రజాయత॥." **(14)**

మసస్సః చంద్రమాః జాతః=మనస్సు నుండి చంద్రుడు పుట్టెను, చక్షోః సూర్య అజాయతః= నేత్రముల నుండి సూర్యుడు పుట్టెను. ముఖాత్ ఇంద్రశ్చ అగ్నిశ్చ అజాయత= ముఖము నుండి ఇంద్రుడు, అగ్ని పుట్టిరి ప్రాణాత్ వాయుఃఅజాయత= ప్రాణము నుండి వాయువు పుట్టెను.

"నాభ్యా ఆసీ దన్తరిక్షమ్,
శీర్ణ్షో ద్యౌ స్సమవర్తత,
పద్భ్యాం భూమి ర్దిశ శ్శ్రోత్రాత్,
తథా లోకాగ్ం అకల్పయన్." **(15)**

ఆ పురుషుని బొడ్డు నుండి అంతరిక్షము, శిరస్సు నుండి స్వర్గము, పాదముల నుండి భూమి, శ్రోత్రము (చెవి) నుండి దిక్కులు కలిగినవి.

పై 13,14,15 మంత్రములలో పురుషుని నుండి చంద్రాదులు పుట్టినారని యుండగా, ముండకోపనిషత్తునందలి ఈక్రింది మంత్రము 'ఆయెను' అనుచున్నది చూడుడు.

"అగ్నిర్మూర్ధా చక్షుసీ చంద్ర సూర్యౌ,
దిశఃశ్రోత్రే వాగ్వి వృతా శ్చ వేదాః,
వాయుఃప్రాణో హృదయం విశ్వ మస్య,
పద్భ్యాం పృథివీ హ్యేష సర్వభూతాం తరాత్మా." **2.2.4.**

ఆ విశ్వమయునకు అగ్నిశబ్దముచే చెప్పదగినదియు తేజః ప్రధానమును అగు ద్యులోకము శిరస్సు, చంద్ర-సూర్యులు కన్నులు, దిక్కులు చెవులు, వాక్కులు వేదములు, వాయువు ప్రాణము, విశ్వము హృదయము, పాదములు భూమి అయ్యెను. అట్టి విరాట్పురుషుడు చరాచరములైన సర్వమునకు అంతరాత్మగా నున్నాడు.

ఆత్మస్వరూపుడైన యే పరమపురుషుడు సర్వవ్యాపకుడై విశ్వస్వరూపముగా గోచరించుచున్నాడో, ఆయనయే భూతములకును అంతరాత్మయై కూటస్థ రూపుడై యున్నాడని ఈ మంత్రము తెలుపుచున్నది. ఈ విషయములనే "ఏషదేవో విశ్వకర్మా మహాత్మా, సదా జనానాం హృదయే సన్నివిష్టః" అని శ్వేతాశ్వతరోపనిషత్తు మంత్రము,
"ఈశ్వర స్సర్వ భూతానాం హృద్దేశే Z ర్జున తిష్ఠతి' అను భగవద్గీతా శ్లోకము చెప్పుచున్నవి.

"వేదా Z హ మేతం పురుషం మహాన్తమ్,
ఆదిత్య వర్ణం తమసస్తుపారే,
సర్వాణి రూపాణి విచిత్యధీరః,
నామాని కృత్వా Z భి వదన్ యదాస్తే॥." (16)

యత్ధీరః= ఏ ధీరుడగు విరాట్పురుషుడు, సర్వాణి రూపాణి విచిత్య=స్థావర జంగమాది సమస్త రూపములను సృష్టించి, నామానికృత్వా= పేర్లనుపెట్టి, అభివదన్ అస్తే= ఆయా పేర్లతో అంతటా వ్యవహరించుచుండెనో, ఏతం పురుషమ్=ఈ విరాట్పురుషుని, మహాన్తమ్=మహాత్మునిగను, మహాజ్ఞాన స్వరూపునిగను, ఆదిత్యవర్ణమ్= సూర్యతేజస్సు కలవానినిగను (పరంజ్యోతి స్వరూపునిగను), తమసఃపారే= అజ్ఞానాంధ కారమునకు దూరముగా నుండు వానినిగను, అహంవేద= నేను తెలిసికొనినాను.

ఇందు "సర్వాణి రూపాణి విచిత్య ధీరః" అనగా ఆ సృష్టికర్త సమస్త రూపములను నిర్మించి వాటికి పేర్లు పెట్టినాడని అర్థము. అనగా రూపసృష్టికి పిమ్మట నామకరణము జరిగినట్లు తెలియుచున్నది. ఈ విషయములను విశ్వకర్మ సూక్తమంత్రము నామరూప పదములతో కాక "ద్యావా భూమీ జనయన్ దేవ ఏకః" అని వచించినది. అనగా ఇందలి 'భూమి శబ్దము చేత రూపసృష్టియు, ద్యు శబ్దము చేత నామసృష్టియు జరిగినదని గ్రహింప వలయును. మనకు భూమి, అందలి రూపములే కన్పించునుగాని, దివముగాని అందలి శక్తులుగాని కన్పించవు. కన్పించని ఆ స్వర్గాదుల సృష్టిని పురుష సూక్తము 'నామ' పదముచే పేర్కొన్నది. అనగా వాటిని నామములతో మాత్రమే తెలిసికొనుచున్నాము. విశ్వకర్మ సూక్తము వాటిని 'ద్యు' శబ్దముచే పేర్కొనినది.

తైత్తిరీయారణ్యకము= 'ఆదిత్యో వా ఏష తన్మండలం తపతి, తత్ర తా ఋచస్త దృచాం మండలం, సఋచాం లోకో **Z** థయ ఏష ఏతస్మి న్మండలే **Z**ర్చి ర్దీప్యతే తాని సామాని, ససామ్నాం మండలం, ససామ్నాంలోకో **Z**థయ ఏష ఏతస్మిన్మండలే **Z**ర్చిర్దీప్యతె తాని సామాని, సయజుషాం మండలం, సయజుషాం లోక స్సైషా త్రయ్యేవ విద్యా. తపతి

ఏషో Z న్త రాదిత్యే హిరణ్మయః పురుషః (28.13) ఆదిత్యుడీ మండలమున వెలుగుచున్నాడు. అక్కడే ఋక్కులున్నవి. అందుచేత అది ఋఙ్మండలము, ఋక్కులలోకము అగుచున్నది. ఈ మండలమున వెలిగెడి దీప్తియే సామములు. కనుక అది సామమండలము, సామ లోకము. ఈ మండలమునగల తేజోరూప పురుషుడే యజుస్సులు. అదియే యజుర్మండలము, యజుస్సుల లోకము. ఈ మొత్తమే త్రయీవిద్య. ఈ ఆదిత్యాం తర్గతుడైన హిరణ్మయ పురుషుడు, "సహస్రశీర్షః పురుషః" అని చెప్పబడిన విశ్వకర్మ స్వరూప పురుషుడే.

"ధాతా పురస్తా ద్య ముదా జహార,
శక్రః ప్రవిద్వాన్ ప్రదిశ శ్చతస్రః
తమేవం విద్వా నమృత ఇహ భవతి,
నా Z న్యః పన్థా అయనాయ విద్యతే॥." **17**

ధాతా=బ్రహ్మ! పురస్తాత్ యం ఉదా జహార=ముందుగా ఏ విరాట్పురుషుని గురించి ఉదాహరించి చెప్పెనో, విద్వాన్ శక్రః= విశేష జ్ఞానముగల ఇంద్రుడును, ప్రదిశః = ఆగ్నేయాది విదిక్కులను గూర్చి, ఉదాజహార= ఉదాహరించి చెప్పెనో, తమ్= ఆ విరాట్పురుషుని గురించి ఏవం విద్వాన్=ఈ విధముగా తెలిసిన మానవుడు, ఇహ అమృతః భవతి= ఈ లోకములో అమృతుడు అగుచున్నాడు, అయనాయ=ఈ అమృత స్వరూపుని తెలిసికొనుటకు, అన్యః పన్థాః= వేరుమార్గము, న విద్యతే=లేదు.

"యజ్ఞేన యజ్ఞమయ జన్త దేవాః
తాని ధర్మాణి ప్రథమా న్యాసన్,
తే హ నాకం మహిమానః స చం తే,
యత్రపూర్వే సాధ్యా స్సంతి దేవాః." **(18)**

దేవాః యజ్ఞేన యజ్ఞం అయజన్త=దేవతలు మానసయజ్ఞము చేత యజ్ఞ స్వరూప భగవంతుని అర్చించిరి, పూజించిరి. తాని ధర్మాణి=అట్లు పూజించుట వలన ఆ పూజా ధర్మములు, ప్రథమాని= ప్రథమములు, ముఖ్యములు, ఆసన్=అయినవి. యత్ర=ఏ స్వర్గమునందు, పూర్వే=ప్రాచీనులైన, సాధ్యాః=విరాట్ తత్త్వో పాసకులైన సాధకులును, దేవాః=దేవతలు, సన్తి=ఉన్నారో, అట్టి దుఃఖరహిత స్వర్గమును (దు:ఖ రహిత స్థితిని) మహిమానః తే=మహనీయులైన ఆ ఉపాసకులు సచంతే=పొందుచున్నారు.

ఈ మంత్రమున విరాట్పురుషుని, అతనిని పొందు సాధనను 'యజ్ఞ' శబ్దము చేత ప్రస్తావించుట గమనించదగినది. అనగా పొందువాడు, పొందదగినది, పొందుట

కయిన సాధనము మూడును బ్రహ్మములే అని తెలియుచున్నది. ఈ విషయమునే భగవద్గీత.

"బ్రహ్మార్పణం బ్రహ్మహవిః, బ్రహ్మాగ్నౌ బ్రహ్మణా హుతం,
బ్రహ్మైవ తేన గంతవ్యం, బ్రహ్మకర్మ సమాధినా." **4.24.**

అర్పణ, అర్పించువస్తువు, అగ్ని, అర్పించువారు–అంతయు బ్రహ్మమే. ఇట్టి కర్మచేత పొందదగినదియు బ్రహ్మమే. "సర్వం ఖల్విదం బ్రహ్మ" అనెడి వేదాంత సూక్తి ఇచట నిర్వచించబడినది. ఇట్టి పురుష సూక్తమంత్రమునకు మూలము విశ్వకర్మ సూక్తము నందలి 'సముద్రాయ వయునాయ' అను మంత్రమునగల "విశ్వకర్మను, విశ్వాహాః=ఎల్ల వేళలయందును, హవిః=హవిస్సులనిచ్చి, జుహుత=హోమము చేయుడు" అను వచనమే. ఇక్కడ 'హవిస్సు' అనగా నేయి మొదలగు హోమద్రవ్యమేకాదు. భగవంతుని ఉద్దేశించి సమర్పించు సర్వమును హవిస్సే. మనోవాక్కాయములతో భగవంతునుద్దేశించి చేయు సర్వకార్యములను యజ్ఞములే. వాటి యందలి అర్పణలన్నియు హవిస్సులే. యజ్ఞమనగా వేదోక్తమయిన కర్మమాత్రమేగాక, సమస్త లౌకిక పారమార్థిక కర్మలు కూడ యజ్ఞములే. ఈ అంశమును భగవద్గీత ఇట్లు వచించినది.

"ద్రవ్య యజ్ఞా స్తపో యజ్ఞా, యోగ యజ్ఞా స్తథాపరే,
స్వాధ్యాయ జ్ఞాన యజ్ఞాశ్చ, యత యస్సంశ్రిత వ్రతాః" **4.28.**

కొందఱు ధనముతో యజ్ఞములు చేయుదురు. కొందఱు మానసిక– వాచిక– కాయికములైన తపస్సులే–కర్మలే యజ్ఞముగా నెంచి చేయుదురు. మరి కొందఱు అష్టాంగ– కుండలీని యోగాదులనే యజ్ఞములని భావించి ఆచరింతురు. కొందఱు వేదశాస్త్రాదుల పఠనమును, మఱికొందంఱు జ్ఞానమును యజ్ఞముగా భావించుదురు.

"ఏవం బహువిధా యజ్ఞా వితతా బ్రహ్మణో ముఖే,
కర్మజాన్ విద్ధితాన్ సర్వా, నేవం జ్ఞాత్వా విమోక్ష్య సే." **4.32.**

ఇట్టి బహువిధ యజ్ఞములు కర్మప్రధాన యజ్ఞములే అని గ్రహింపుము. అట్టి జ్ఞానమే నీకు ముక్తిహేతువు.

"శ్రేయాన్ ద్రవ్యమయా ద్యజ్ఞాత్, జ్ఞానయజ్ఞః పరంతప
సర్వం కర్మాఖిలం పార్థ జ్ఞానే పరిసమాప్యతే." **4.33.**

ద్రవ్యమయ యజ్ఞము కంటె జ్ఞానమయ యజ్ఞము శుభప్రదమైనది, శ్రేష్ఠమైనది. ఈకర్మలన్నియు జ్ఞానమునందే పరిసమాప్తిని పొందుచున్నవి.

ఉత్తరార్థము

"అద్భ్య స్సంభూతి పృథివ్యై రసాచ్చ
విశ్వకర్మణ స్సమవర్త తా Zధి
తస్యత్వష్టా విదధ ద్రూపమేతి
తత్పురుషస్య విశ్వమాజాన మగ్రే." **(1)**

అద్భ్య=ఉదకములనుండి, విశ్వకర్మ అనెడి నిమిత్త కారణమునుండి నీరు, పృథివ్యైరసాత్ చ=భూమి యొక్క రసము నుండి, భూసారము (పంచభూతములు) ఉపాదాన కారణముగ, సంభూతః=జగత్తు పుట్టెను. విరాట్స్వరూపుడు పుట్టెను. కలిగెను. జలములు ఆద్య సృష్టియని (అప ఏవససర్జాదౌ) మనుస్మృతి. నీటి మీద పాలమీగడవలె బ్రహ్మాండ పురుషుడు పుట్టినాడని భావము. నీటి నుండియే కాదు జల, భూసార రూపరసము నుండి బ్రహ్మాండగోళము ఉత్పన్నమైనదని సారాంశము. విశ్వకర్మణః=ఆ విశ్వకర్మ పరమేశ్వరుని యొక్క, అధిసమవర్తత=ప్రతి రూపమై అది (అతడు) ఉండెను. అనగా ప్రకృతి పురుషుల కలయిక వలన విరాట్పురుషుడుదయింప-ప్రపంచ మేర్పడినదని భావము తస్య=ఆ జీవరూప జగత్తునకు, విరాట్స్వరూపునికి, త్వష్టా=త్వష్టృ ప్రజాపతి అను రూపం=పేరును, విదధత్=నిర్ణయించు చున్నవాడై, ఏతి=పొందుచున్నాడు. అనగా విరాట్స్వరూపునికి త్వష్టృ ప్రజాపతి అను పేరును నిర్ణయించెను. (త్వష్టృ) శబ్దమునకు 'విశ్వకర్మా జగదీశ్వరః' అని భాష్యకారులు అర్థము వ్రాసినారు. అగ్రే=సృష్టికి ముందు, పురుషస్య=ఆ పరమ పురుషునికి యొక్క, ఆ విశ్వకర్మ పరమాత్మ యొక్క జగత్పిత యొక్క తత్విశ్వం= ఆ జగత్తు, అజానమ్=జ్ఞానరూపములో నున్నదని తెలిసికొనుచున్నాను.

ఈ విషయములనే విశ్వకర్మ సూక్తము 6వ మంత్రములో జగద్బీజమును జలములు తమలో దాల్చినవనియు, 7వ మంత్రములో విశ్వకర్మ నాభియందు గల బీజమున సమస్త విశ్వమున్నదనియు, 8వ మంత్రమున 'విశ్వకర్మా హ్యా జనిష్ఠ దేవః ,'-విశ్వకర్మ బ్రహ్మదేవుడు (త్వష్ట) అయినాడనియు తెలిపినది. అనగా మొదట విశ్వకర్మ తత్త్వము కలదు. దాని నుండి త్వష్ట రూపొందినాడు. ఆ త్వష్టయే (బ్రహ్మయే) జగన్నిర్మాణము చేసినాడు. ఈ త్వష్టను ప్రజాపతి, పరమేష్ఠి, విశ్వకర్మ అని వేదములు వచించినవి. కనుక పురుష సూక్తము నందలి పురుషుడు విశ్వకర్మ సూక్తములోని ఆది దేవుడు విశ్వకర్మయే. విరాట్ పురుషుడగు విశ్వకర్మయే ఇచట పురుషుడుగ వచింపబడినాడు.

"వేదా Z హ మేతమ్ పురుషం మహాన్తమ్।
ఆదిత్యవర్ణం తమసః పరస్తాత్।
తమేవం విద్యా నమృత ఇహభవతి,
నాన్యఃపన్థా విద్యతే Z యనాయ॥." **(2)**

ఏతం పురుషమ్=అట్టి జగత్కారణుడైన విశ్వకర్మ నామక పరమ పురుషుని, మహాన్తమ్=మహాత్మునిగను, సమస్త జ్ఞాన స్వరూపునిగను, సర్వశ్రేష్టునిగను, ఆదిత్య వర్ణమ్=సూర్య తేజస్సుగలవానినిగాను (ఆ తేజస్సును పురుషసూక్త 16వ మంత్రమున వివరించుట జరిగినది. పరమాత్ముని తేజము ప్రకాశింపచేయునదే కాని వేడిమితో కూడినదికాదు. అది అద్దము వలె సర్వ వస్తువులను భావములను తనలో ప్రతిబింబింప చేసికొనును. ఆ తేజస్సును శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వాములవారు 'కాలజ్ఞానము'లో నిట్లు వచించినారు.

"చంద్రం వినాచంద్రకళాను పూర్ణం, సూర్యం వినా సూర్య మహత్ప్రకాశం.
తేజోవినా తేజ పరస్వరూపం, నేత్రం వినా నేత్రసుపద్మ సంస్థితమ్."

చంద్రునివలె నుండును, చంద్రుడుగాడు. సూర్యునివలె నుండును, సూర్యుడు గాడు. మహాతేజో రూపముగ నుండును, తేజస్సుగాదు. ఈ కన్నులుగాకనే పరమాత్మ గానవచ్చును.

అది తమసః పరస్తాత్ = పెంజీకటి కవ్వల వెలుగుది. చీకటి కావలనే కాదు. చీకటిని హరింపజేసి తానే వెలుగునది. ఈ తమస్సు నాసదీయ సూక్తము వచించిన 'తమ ఆసీత్తమసాగూఢమగ్రే' అను వాక్యములోనిదే. మరియొక భావము-తమస్సు అనగా తమోగుణము. అనగా అవిద్య. తమోగుణ కార్యము బ్రహ్మాండమంతయు అవిద్యా విజృంభణమే. అట్టి దాని కావలనుండునది, దాని సంపర్కము లేనిది- సచ్చిదానంద స్వరూపమై ప్రకాశించునది, అజ్ఞానాంధకారమును దూరము చేయునది అగు అట్టి తత్త్వమును, అహంవేద= నేను తెలిసికొనుచున్నాను. తమ్=ఆ విశ్వకర్మ నామక పురుషుని, ఏవం=ఇటువంటి వానినిగా, విద్వాన్= తెలిసికొనినవాడు. ఇహ అమృత భవతి=ఈ లోకములో అమృతుడు అగుచున్నాడు. విశ్వకర్మ సూక్తమంత్రము'నతం విదాథ య ఇమా జజాన' అనువచింపగా జగములను సృష్టించిన మీ తండ్రిని మీరెఱుగరు? అని వచింపగా ఈ పురుషసూక్త మంత్రము 'అతని నెఱుగుదుము అని యిట్లు తెలిపినది. విశ్వకర్మ సూక్తమంత్ర విచారమునకు ఇది చక్కని సమాధానముగ నున్నది.

అయనాయ=ఈ అమృత తత్త్వమును తెలిసికొనుటకు, అన్యఃపన్థా=వేరు మార్గమున విద్యతే=లేదు.

"ప్రజాపతి శ్చరతి గర్భే అంతః
అజాయమానో బహుధా విజాయతే,
తస్యధీరాః పరిజానన్తి యోనిమ్
మరీచీనాం పదమిచ్ఛన్తి వేధ సః." (3)

ప్రజాపతి=ప్రజాపాలకుడైన ఆ విశ్వకర్మ, గర్భే=బ్రహ్మాండముల యొక్క జీవుల యొక్క అంతఃచరతి=లోపల చరించుచున్నాడు. ఈ విషయమును "ఏషదేవో విశ్వకర్మా సదా జనానాం హృదయే సన్ని విష్టః" అని శ్వేతాశ్వతరోపనిషత్తు, "స ఆశిషా ద్రవిణ మిచ్ఛమానః ప్రథమ చ్ఛదవరా ఆవివేశ" అని విశ్వకర్మ సూక్తము, "ఈశ్వర స్సర్వ భూతానాం, హృద్దేశే Z ర్జున తిష్ఠతి" అని భగవద్గీత తెలుపుచున్నవి.

అజాయమానః= జన్మరహితుడయ్యును (పుట్టకుండగనే), బహుధా విజాయతే= అనేక విధములుగా విశేషజన్మలను పొందుచున్నాడు, విజాయతే=విపరీత-విభిన్న రూపము లను కూడ పొందగలడు అనగా పుట్టకనే పుట్టినట్లు, పెరుగకనే పెరిగినట్లు, నశింపకనే నశించినట్లు ఎన్నో లీలలను చూపగలదు. అన్యోన్య విరుద్ధములైన ధర్మములను, వస్తువులను చూపి, లీలలను నెఱపి, చివరికా ధర్మములను తనలోనే లీనము చేసికొనగలడు.

తస్యయోనిమ్= ఆపురుషుని యొక్క జగత్కారణము, ధీరాః=ధీరులైన మహనీయులు, పరిజానన్తి=బాగుగా తెలిసికొనుచున్నారు, వేధసః=బ్రహ్మలు లేక బ్రహ్మవేత్తలు, మరీచీనాం పదమ్=ఆ కాంతుల స్థానమును, ఆ మహా తేజస్సును, ఇచ్ఛన్తి=తెలిసికొనుటకు కోరుచుందురు.

విశ్వకర్మ సూక్తము ఆ తత్త్వమును "విశ్వకర్మా మనసా యద్విహాయా ధాతా విధాతా పరమోత సంధృక్" (ఋ. 10.82.2) అని వర్ణించినది. వి మనస్సు-విశేషమనస్సు, విగత మనస్సు కలదనియు, విహాయా=సంహర్త అనియు, ధాతా=పుట్టించినదనియు, విధాతా=పోషించినదనియు ("యోనః పితా జనితా యో విధాతా") తండ్రి అనియు, పోషకుడనియు, శ్రేష్ఠమనియు, సర్వద్రష్ట అనియు నానావిధములుగ వర్ణించినది. అట్టి విశేషములనన్నిటిని "ప్రజాపతి శ్చరతి" అను మంత్రము "బహుధా విజాయతే" అనుమాట లోనిమిడ్చినది. సదసదతీతము నందు-తమస్సు, మనస్సు, రేతస్సు, కామము ఇత్యాదులు పుట్టుట, తోచుట-ఇట్టిదంతయు 'విజాయతే' అను పదములో కలదు. ఇంతటి విచిత్ర విశ్వమును కనినను అది అజాయమానమే. అనగా తానై స్వయముగా పుట్టనిదే. అన్నియు

అయ్యును ఏదియు కానిదే. అందువలననే అది 'విశ్వకర్మ' అయినది. సమస్త శరీరము (పురము) లందు శయనించు పురుషుడైనది. సంద్రుక్=ద్రష్ట, ఋషి అయినది. ఈ పురుష సూక్త మంత్రము నందలి "అజాయమానో బహుధా విజాయతే' అను వాక్యము ఈక్రింది గీతావాక్యమునకు మూలము.

"త్వమాది దేవః పురుషః పురాణః త్వమస్య విశ్వస్య పరం నిధానం,
వేత్తాసి వేద్యం పరం చ ధామ త్వయా తతం విశ్వ మనంత రూప." **11.38.**

నీవు మొట్టమొదటి దేవుడవు. పురాణ పురుషుడవు. ఈ విశ్వమునకు నిధి వంటివాడవు. నిధి నుండి ధనమ తీసికొనుచు వేయుచు ఉన్నట్లు జగములు నీ నుండియే వెలుపలికి వచ్చుచు నీలోనే లీనమగుచున్నవి అని భావము. ఈ మంత్రమున 'వేత్తాంసి, వేద్యంచ' అని నందున దృక్కు-దృశ్యము రెండును నీ స్వరూపములే, నీవే అని అద్వైతము తోచుచున్నది.

ఈ పురుష సూక్తమంత్రమున పురుష సూక్తాధి దైవతమయిన విశ్వకర్మ 'ప్రజాపతి' అను పదముచే పేర్కొనబడినాడు. ఇందుకు 'ప్రజాపతి ర్విశ్వకర్మా' మొదలైన యజుర్వాక్యములు ప్రమాణములు.

శుక్ల యజుర్వేదము నందలి 31వ అధ్యాయమునగల పురుషసూక్త 19వ మంత్రము ఈక్రింది విధముగనున్నది.

"ప్రజాపతి శ్చరతి గర్భే అన్తః,
అజాయమానో బహుధా విజాయతే,
తస్యయోనిం పరిపశ్యన్తి ధీరా
స్తస్మిన్ హ తస్థు ర్భువనాని విశ్వా."

ఈ మంత్రము యొక్క పూర్వార్థము యజురారణ్యకము నందున్నట్లే యున్నది. ఉత్తరార్ధము యొక్క భావము. ప్రజాపతి సర్వజీవుల హృదయాంతరాళముల యందును కలడు. అతడు పుట్టకున్నను అనేక విధములుగా తోచగలడు. పుట్టకున్నను పుట్టినట్లు, తోచగలడని భావము ధీరులైనవారు అతని స్థానము (మూలము) ను చూడగలరు, దర్శింపగలరు. ఆ విచిత్ర దివ్యశక్తి (ప్రజాపతి) యందే సమస్త భువనములు (చరాచరములు) నివసించుచున్నవి.

"యో దేవేభ్య ఆతపతి
యో దేవానాం పురోహితః
పూర్వో యో దేవేభ్యో జాతః
న యో రుచాయ బ్రాహ్మయే." (4)

యః= ఏ విశ్వకర్మ పరమేశ్వరుడు, దేవేభ్యః=దేవాది సమస్త ప్రాణులయందు ప్రణవ స్వరూపముతో వ్యాపించి, ఆతపతి=ప్రకాశించుచున్నాడో, యః= ఏ పురుషుడు, దేవానాం=దేవతలకు, పురోహితః= యోగక్షేమములు కోరుచున్నాడో, యః=ఏ పురుషుడు, దేవేభ్యః= సమస్త దేవతలకంటె, పూర్వః.జాతః= ముందున్నాడో, రుచాయ=స్వయం ప్రకాశకుడైన, బ్రాహ్మయే=జ్ఞానమయుడగు విశ్వకర్మ పురుషునకు, నమః= నమస్కారము అర్పించుచున్నాను.

"ఋచ బ్రాహ్మం జనయన్తః
దేవా అగ్రే తదబ్రువన్।
యస్త్వైవం బ్రాహ్మణో విద్యాత్
తస్యదేవా అసన్ వశే." (5)

దేవాః= సమస్త దేవతలు, అగ్రే=సృష్ట్యాదియందు, బ్రహ్మం రుచమ్= జ్ఞానమయ మైన ప్రకాశమును, జనయన్తః=తెలిసికొనుచున్నవారై, తత్=ఆ విరాడ్విశ్వకర్మ తత్త్వమును గూర్చి, అబ్రువన్=ఇట్లు పలికిరి. యః బ్రాహ్మణః ఏ బ్రహ్మజ్ఞానము కలవాడు, ఏవం విద్యాత్=ఈ విధముగా తెలిసికొనునో, తస్య=అతనికి, దేవాః= దేవతలు, వశే అసన్= స్వాధీనములో నుందురు.

"హ్రీశ్చతే లక్ష్మీశ్చ ప త్న్యౌ అహో రాత్రే పార్శ్వే నక్షత్రాణి రూపమ్,

అశ్వినౌ వ్యాప్తం। ఇష్టం మనిషాణ।
అముం మనిషాణ సర్వం మనిషాణ." (6)

హ్రీఃచ లక్ష్మీః చ=లజ్జా దేవియు లక్ష్మీదేవియు, తే పత్న్యౌ=నీకు భార్యలు, అహోరాత్రే=రాత్రిం దివములు, నీకు, పార్శ్వే=పార్శ్వములు, నక్షత్రాణి రూపమ్= నక్షత్రములు నీ రూపము.

అశ్వినౌ వ్యాప్తమ్=అశ్వనీదేవతలు నీముఖము, ఇష్టం మనిషాణ=మాకు ఇష్టమైన జ్ఞానమును ప్రసాదించుము, అముం మనిషాణ=ఈ ఆత్మ బోధను ఇమ్ము, సర్వం మనిషాణ= ఐహికా ముష్మిక భోగములన్నిటిని ఇమ్ము.

ఈ చివరి మంత్రము '7' పాదములతో నున్నది. ఈ విధముగ ఈ పురుషసూక్తము పూర్వార్ధము 72 పాదములతోను, ఉత్తరార్ధము 27 పాదములతోను యజురారణ్యకము నందు తైత్తిరీయోపనిషత్తు నందు సమగ్రముగనున్నది.

పురుషసూక్త పూర్వార్ధమున వచింపబడిన పరమాత్ముడగు పురుషుడు ఉత్తరార్ధమున అనగా 73వ పాదము నుండి 'విశ్వకర్మ' అని నిర్వచింపబడినాడు. పురుషుడు అనగా విరాట్పురుషుడు అనియే భావము. విరాట్పురుషుడగు విశ్వకర్మయే పూర్వార్ధమున పురుషుడుగ పేర్కొనబడినాడు. పురుషుడు విశ్వకర్మయే అనుటకు 'ప్రజాపతి శ్చరతి గర్భే అంతః అజాయమానో బహుధా విజాయతే' అను మంత్రమునకు సాయణాచార్యులు రచించిన ఈ క్రింది భాష్యమే నిదర్శనము.

"ప్రజాపతి ర్విశ్వకర్మా"–'ఇతిశ్రుతేః ప్రకరణ వశాచ్చ అత్రప్రజాపతి పదేన "విశ్వకర్మైవ గృహ్యతే" అనగా ప్రజాపతి విశ్వకర్మ అను శ్రుతివలన సందర్భము (ప్రకరణము) వలన ఇచ్చట ప్రజాపతి పదముచేత విశ్వకర్మనే గ్రహింపవలయును.

మఱియు "యో దేవేభ్య ఆతపతి, పూర్వోయో దేవేభ్యో జాతః" అను వాక్యములచే విశ్వకర్మయే విరాట్పురుషుడు అని సిద్ధించు చున్నది. "యో దేవేభ్య ఆతపతి" –యః= ఏ విశ్వకర్మ, దేవేభ్య ఆతపతి (దేవా నభివ్యాప్య తపతి) = దేవతలనెల్లరను వ్యాపించి తపించు చున్నాడు. తన తేజము చేత దేవతలందఱి తేజమును హరించు చున్నాడని అర్థము.

'తష్టా దుహిత్రే వహతుం కృణోతీ తీదం విశ్వం భువనం సమేతి యమస్యమాతా పర్యు హ్యమానా మహో జాయా వివస్వతో ననాశ" అను శ్రుతి ప్రమాణము వలన త్వష్టృ ప్రజాపతి పుత్రికయగు సంజ్ఞకొఱకు సూర్యుని తేజమును హరించెనని తెలియు చున్నది. విశ్వకర్మ కుమారుడగు త్వష్టయే సూర్యుని తేజమును హరించ, జగత్సృష్టి కర్తయగు విశ్వకర్మ–తక్కిన దేవతల తేజమును హరించుటలో నాశ్చర్యమేమున్నది. "పూర్వో యో దేవేభ్యో జాతః" – యః = ఎవ్వడు, దేవేభ్యః=ఎల్ల దేవతల కంటె, పూర్వోజాతః= మొదటివాడై యుండెనో, "విశ్వకర్మా హ్యజనిష్టదేవ ఆది ద్గంధర్వో అభవ ద్వితీయః తృతీయః పితా జనితౌషధీనాం' అనుశ్రుతిచే విశ్వకర్మ దేవత లందఱికంటెను ముందుగా నుండెనని తెలియుచున్నది.

పై విషయములచే పురుషసూక్తమున వచింపబడిన పురుషుడు విశ్వకర్మయే అని స్పష్టియగుచున్నది. మఱియు నీ సూక్తమున హరి హర హిరణ్య గర్భాది దేవతలలో ఏ దేవుని పేరును కన్పించక, విశ్వకర్మ నామమే వచింపబడుట–ఈ సూక్తమున వచింపబడిన పురుషుడు విశ్వకర్మయే అని స్పష్టపఱుచు చున్నది.



15. సవిత - విశ్వకర్మ

"తత్సవితుర్వరేణ్యం
భర్గో దేవస్య ధీమహి
ధియో యోనః ప్రచోదయాత్." ఋ. 3.62.10.

ఏ సవితృ దేవుడు మన యొక్క బుద్ధులను (లేదా ధర్మాధర్మాది కర్మలను) ప్రేరేపించునో, ఆ సవితృ దేవుని యొక్క భజింపదగిన భర్గమనుపేరుగల తేజమును (అనగా పరబ్రహ్మ స్వరూపమగు స్వయంజ్యోతియగ తేజమును) ధ్యానించుచున్నాము.

మనోమయ కోశములో మనస్సునకు ప్రాధాన్యమున్నట్లు విజ్ఞానమయ కోశములో బుద్ధికి ప్రాధాన్యము కలదు. కాలిన ఇనుము నుండి అగ్నిని వేరుచేయలేనట్లు బుద్ధి నుండి ఆత్మను వేరుచేయలేము.

<u>తైత్తిరీయోపనిషత్తు</u> : బ్రహ్మానందవల్లి–అన్నమయ శరీరమున (అనగా స్థూల శరీరమున) ప్రాణమయ శరీరము, మనోమయ శరీరము, విజ్ఞానమయ శరీరము లున్నవి. ప్రాణమయ శరీరము సూక్ష్మము. శరీరము నందుండు వాయువే ప్రాణము. అది ప్రాణాపానాది నామములతో వ్యవహరింపబడును. ప్రాణమయ శరీరము ననుసరించి మనోమయ శరీరముండును. అదియే అంతఃకరణము. మనోమయ శరీరముతో విజ్ఞానమయ శరీరము నిండియుండును.

సంకల్ప వికల్పాత్మకమగు మనస్సు మనోమయ శరీరమనబడును. నిశ్చయాత్మక మనస్సు విజ్ఞానమయ శరీరమనబడును. అదియే బుద్ధి యనబడును. నిశ్చయాత్మక బుద్ధి జీవుడొనర్చు కర్మలకు సాధనమగును. సంకల్ప వికల్పాత్మక మనోవృత్తులన్నియు

నశించి నిశ్చయాత్మక బుద్ధి యేర్పడిన, ఆ బుద్ధియే బ్రహ్మము యొక్క ఆనంద స్వరూపము నెఱుగగలదు. సమాధియందు జీవుడు ఆనందమయ శరీరము నందే యుండును. అన్నరసమయము, ప్రాణమయము, మనోమయము విజ్ఞానమయము, ఆనందమయము అనునైదు శరీరములందు జీవుడు స్థితుడై యుండును. ఈ ఐదు శరీరములు క్రమముగా నొకదాని కంటె మఱియొకటి సూక్ష్మము.

ప్రాణుల బుద్ధులను ప్రేరేపించుట వలననే ప్రాణులకు సహస్రారమున నున్న పరమాత్మ స్వరూపమును తెలిసికొనగలుగుట, చూడగలుగుట తటస్థించుచున్నది. అట్టి పరమాత్మ స్వరూపమును చూచినపుడే 'అహం బ్రహ్మాస్మి' అను జ్ఞానము కలిగి అజ్ఞానము నశించుచున్నది.

కనుక బుద్ధులను ప్రేరేపించువాడు ప్రాణులలో జీవుని రూపమున నున్న పరమాత్మయే కాని అన్యులు కాజాలరు. ప్రాణులలో జీవుని రూపముననున్న పరమాత్మ "ఏషదేవో విశ్వకర్మా మహాత్మా సదా జనానాం హృదయే సన్నివిష్టః" అని శ్వేతాశ్వతరో పనిషత్తు, "స ఆశిషా ద్రవిణ మిచ్ఛమానః పరమచ్ఛదోవర ఆవివేశ" అని విశ్వకర్మ సూక్తము, "ఈశ్వర స్సర్వ భూతానాం హృద్దేశే Zర్జున తిష్ఠతి" అని భగవద్గీత వచించుచున్నది గదా।

సవితృ శబ్దమునకు నిద్రించువానిని మేలు కొలుపు వాడనియు, సూర్యుడనియు అర్థములు కలవు. అవి కేవలము బాహార్థములు (అధి భౌతికార్థములు) మాత్రమే అగును. అంతరర్థమును పర్యాలోచించిన "నిద్ర నుండి మేల్కొలుపుట అనగా అజ్ఞానమను నిద్రనుండి మేల్కొలుపుట అని భావము. అట్లు మేల్కొలుపుటవాడు వెలుపలి సూర్యుడుగాక అంతరంగముననున్నవాడును పరమాత్మయునగు అంతర్యామి రూప సూర్యుడే. కనుక బాహ్యార్థమున బాహ్య సూర్యుని చెప్పుకొనినను అంతరర్థమున అంతఃకరణ వృత్తులను ప్రేరేపించి, సత్కార్యములు చేయించి ముక్తినిచ్చు "జ్ఞేయ స్వరూప విశ్వకర్మయే" అనుట సమంజసము. సాయణులు కూడ తన భాష్యములో సవితృ దేవుని సర్వాంతర్యామి అయిన పరమాత్మగా పేర్కొనినారు. ఆయనను జగత్తులకు స్రష్ట, పరమాత్మ అని వచించి నాడు. "త ఆయజంత ద్రవిణం సమస్మా ఋషయః పూర్వే జరితారోనభూనా" (ఋ. 10.81.4) అను మంత్రమునకు భాష్యము వ్రాయుచు" తే పూర్వఋషయో= ద్రష్టారో, రశ్మయో, అస్మా= ఆది త్యాత్మకరాయ విశ్వకర్మణే, ద్రవిణం= తేజ ఆయజన్త" అని వ్రాసి విశ్వకర్మ ఆదిత్య స్వరూపుడే నని వచించినారు. కనుక ఋగ్వేద మంత్రము (3.62.10) లో 'సవిత' అను పేరుతో వచింపబడిన దేవాది దేవుడు 'విశ్వకర్మయే' అని స్పష్టమగుచున్నది.

సవిత బంగారుమయమైన దీప్తి (హరిణ్మయీ మమతిం) కలవాడనియు (ఋ. 3.38.8, 7.3.8.1), ఆ దీప్తిని ఆయన సర్వత్ర వ్యాపింప చేయుననియు, ఆయన అంతరిక్షమును, భూమిని, స్వర్గమును, ప్రపంచమును, భూమిలోని భాగములను ప్రకాశింప జేయుననియు (ఋ. 1.35.8, 4.14.2, 4.53.4) చెప్పబడియున్నది. ఈ విషయములు ఆయన యొక్క పరంజ్యోతి స్వరూపమును, ఆయన పరమాత్మ అను విషయమును తెలియజేయుచున్నవి.

"తద్రాధో అద్య సవితు ర్వరేణ్యం
వయం దేవస్య ప్రసవే మనామహే,
అస్మభ్యం ద్యావా పృథివీ సుచేతునా
రయింధత్తం వసుమన్తం శతగ్వినమ్." **ఋ. 1-160.5.**

సాయణభాష్యము : వయం= యజమానాః, సవితుః–సర్వస్య ప్రసవితుః, దేవస్య– ఆదిత్య స్యాంతర్యామి రూపిణః, ప్రసవే–అనుజ్ఞాయాం సత్యాం, తత్తా దృశం వరేణ్యం వరణీయం, రాధః–పురుషార్థ సాధ్య సమర్థం ధనం గవాది రూపం, మనామ హే– యాచామ హే.

పై వాక్యములలో సవిత అనగా సమస్తమును అనగా సమస్త జగత్తును ప్రసవించిన వాడు అని తెలుపబడినది. సమస్తమును ప్రసవించినవాడు జగత్తునకు తండ్రియే కదా! ఈ భావమునే విశ్వకర్మ సూక్తమంత్రము "యోనఃపితా జనితా యో విధాతా యోనస్సతో అభ్యాస జ్జజాన" అని తెలిపినది.

సవితృ దేవుని 'ఆదిత్య స్యాంతర్యామి రూపిణః' అని పై మంత్ర భాష్యమున వ్రాయుట జరిగినది. విశ్వకర్మ ఆదిత్యాంతర్గత హిరణ్య పురుషుడని పురుష సూక్తము నందలి 16వ మంత్ర వివరణలో విపులముగ వ్రాయుట జరిగినది. కనుక సవితయు, విశ్వకర్మయు' అభేద రూపులు.

"య ఇమా విశ్వా జాతా న్యాశ్రావయతి శ్లోకేన ప్ర చ సువాతి సవితా"
(ఋ. 5.82.9).

ఏ సవిత లోకమున జన్మించిన ప్రాణులకు వేదస్వరూప ధర్మమును వినిపించు చున్నాడో, అట్టి సర్వప్రాణి పితయు, ప్రేరకుడు అగు దేవుని వరింతుముగాక!

ఈ మంత్రము విశ్వకర్మ సూక్తము నందలి "య ఇమా విశ్వా భువనాని జుహ్వ దృషిర్ హోతా" అను మంత్రమును పోలియున్నది.

"య ఇమే ఉఖే అహనీ పుర ఏత్యప్రయుచ్ఛన్ స్వాధీర్దేవః సవితా." (ఋ. 5.82.8).

సుకర్మలు గల ఏ సవిత రేలు పవళ్ళకు ముందర ఏ ప్రమాదము లేకుండ పయనించు చున్నాడో అట్టి సవితను అర్చింతుము గాక!

ఈ మంత్రము నందలి "స్వాధీః అను మాటకు సాయణులు 'సుకర్మా' మంచి సృష్ట్యాది కర్మలు కలవాడ'ని భాష్యము వ్రాసినారు. విశ్వకర్మ సూక్తము "విశ్వశంభూ రవసే సాధుకర్మా" అని వచించినది. అనగా విశ్వకర్మను విశ్వశంభువనియు, సాధుకర్మ అనియు వచించినది. స్వాధీః= సుకర్మ–అనినను, సాధుకర్మ అనినను ఒక్కటియే, సృష్ట్యాదులైన యోగ్యకర్మలు కలవాడనియే రెంటి యొక్క భావన. కనుక సవితకు విశ్వకర్మకు అభేదమే.

మరియు నీ మంత్రమున సవితను రేలుపవళ్ళకు ముందర పయనించువాడని తెలుప బడినది. రేలు పవళ్ళకు ముందర పయనించువాడనగా జాగ్రదవస్థలో జీవుడు విశ్వుడను పేరుతో లోకవ్యవహారము చేయుచున్నను, రాత్రులందు సుషుప్తిలో ప్రాజ్ఞుడను పేర ఏ కర్మను చేయక ఆనంద స్వరూపుడై ఉన్నను ఆ ఉభయులకు ద్రష్టయు, సాక్షియు,అతీతుడునై వెలుగు సహస్రారస్థిత పరమాత్మయే! "ఏషదేవో విశ్వకర్మా మహాత్మా సదా జనానాం హృదయే సన్నివిష్టః" అని శ్వేతాశ్వతరోపనిషత్తు వచనము. సమస్త జనుల హృదయము లందున్న విశ్వకర్మ - సహస్రారస్థిత పరమాత్మయే గదా। కనుక సవితా విశ్వకర్మలకు అభేదమే.

సవిత భువనము నంతటిని ధరించుచున్నాడని ("న ప్రమియే సవితుర్దైవస్య తద్యథా విశ్వం భువనం ధారయిష్యతి"–ఋ 4.54.4) యు, ద్యులోకమును ధరించుచున్నా డనియు, భువనములకు ప్రజాపతియనియు ("దివోధర్తా, భువనస్య ప్రజాపతిః"–ఋ. 4.53.2), సవిత భూమ్యాకాశములను నిలిపినాడనియు ("సవితా యంత్రైః పృథివీ మరమ్ణా దస్కంభనే సవితా ద్యామ దృంహత్–ఋ. 10.49.2) అనియు తెలియుచుండగా, విశ్వకర్మ తన మహిమ చేతనే భూలోకమును, స్వర్గలోకమును సృష్టించినాడనియు (యతో భూమింజనయన్ విశ్వకర్మా విద్యా మౌర్ణో న్మహినా విశ్వచక్షాః–ఋ. 10.31.2) ఆ దేవుడొక్కడే భూమ్యాకాశములను సృష్టించినాడనియు (ద్యావా భూమీ జనయన్ దేవ ఏకః) విశ్వకర్మ సూక్త మంత్రములు తెలుపుచున్నవి.


పై మంత్రములలో భూమియనగా ఆధారచక్రమనియు, ద్యులోకమనగా సహస్రారమనియు భావించిన ఆధ్యాత్మికార్థము బోధపడును.

సవితకు 'ప్రజాపతి' అను విశేషణము ఋగ్వేదము (4.53.2)న వాడబడినది. యజుర్వేదమున "ప్రజాపతి ర్విశ్వకర్మా" (3.4.7) అనియు, "ప్రజాపతి శ్చరతిగర్భే అంతః " (పురుషసూక్తము) అనియు, విశ్వకర్మకు 'ప్రజాపతి' విశేషణము వాడబడినది.

సవిత సమస్త రూపములను తనలో లీనమొనర్చుకొనుచున్నాడని (విశ్వా రూపాణి ప్రతిముంచతే. ఋ. 5.81.2) తెలుపబడగా, విశ్వకర్మ భువనములను తనలో లీనమొనర్చుకొనుచున్నాడనియు (య ఇమా విశ్వా భువనాని జుహ్వ దృషి ర్హోతా నిషసాద పితా నః (ఋ. 10.81.1) తెలుపబడినది.

సవిత జీవులను (రాత్రియందు) తమ తమస్థానములలో నుంచి, పగలు ప్రేరేపించును (ఋ. 4.5.6, 7.45.1). అనగా సవితృ పరమాత్మ ప్రళయకాలమున జీవులను తనయందుంచుకొని, అనంతరమ ప్రేరేపించుచున్నాడని భావము. విశ్వకర్మ సూక్తమున (ఋ. 10.81.1) విశ్వకర్మ పరమాత్మ ప్రళయకాలమున సమస్త లోకములను తన యందాహుతి చేసికొని అనగా లీనము చేసికొని, అనంతరము పిండ బ్రహ్మాండములను సృష్టించి వాటియందు జీవరూపుడై ప్రవేశించెనని తెలుపబడినది.

పై విషయములన్నియు విశ్వకర్మా, సవితృ దేవుల అభిన్నతను తెలుపుచున్నవి.



16. ప్రజాపతి

'ప్రజాపతి' అనగా ప్రజలకు పాలకుడు అని అర్థము. అతడు ప్రజలను సృష్టించు ఆదిదేవుడు.

'సవిత'కు ప్రజాపతి అను విశేషణము ఋగ్వేదము (4.53.2) లో "భువనస్య ప్రజాపతిః" అని వాడబడినది.

తైత్తిరీయ బ్రాహ్మణము : 'ప్రజాపతి' అయిన సవిత జీవులను సృష్టించినాడు. (1.6.4.1).

విశ్వకర్మ : "ప్రజాపతి ర్విశ్వకర్మా, మనోగంధర్వ,
స్తస్య ఋక్సామాన్యప్సర రసోవహ్నాయః' – యజుర్వేదము 3.4.7.

శతపథ బ్రాహ్మణము : "ప్రజాపతి ర్విశ్వకర్మేతి, ప్రజాపతిర్వై విశ్వకర్మా,
సహీదగ్ం సర్వమకరోత్"

ప్రజాపతి అనగా విశ్వకర్మ. అతడీ సర్వమును (విశ్వమును) సృష్టించెను. సవిత–ప్రజాపతి ఒక్కరే. (12.3.51)

శతపథ బ్రాహ్మణము (8.2.1.10, 8.2.3.13), ఐతరేయ బ్రాహ్మణము (4.22) విశ్వకర్మకు సృష్టికర్త అయిన ప్రజాపతికీ ఏకత్వము తెలిపినవి.

ఆదియందు తానొక్కడే యున్న ప్రజాపతి (శ.బ్రా. 2.2.41) దేవతలకు తండ్రి శ.బ్రా. 11.1.6.14, తై.బ్రా. 8.1.3.4) అని చెప్పబడినది.

ప్రజాపతి మొట్టమొదట యజ్ఞము చేసినవాడు (ప్రజాపతిర్వా ఏతే నాగ్రే యజ్ఞేనేజే) (2.4.4.1, 6.2.1).

ఋగ్వేదము (10.121) ప్రజాపతి దేవాది దేవుడని తెలుపుచున్నది.

విశ్వకర్మ సూక్తములు విశ్వకర్మయే దేవాది దేవుడని వచించుచున్నవిగదా!

ఋగ్వేదము 'ప్రజాపతి' పదమును హిరణ్యగర్భునికి వాడినది.

"ప్రజాపతిర్విశ్వకర్మా పరమేష్ఠీ త్యేతే త్రయో ప్యేక స్త్యైవ మూర్తి భేదాః" అని సాయణ భాష్యము. త్వష్ట–పరమేష్టి–బ్రహ్మ–హిరణ్య గర్భుడు–అనునవి పర్యాయపదములు.

"ప్రజాపతే న త్వదేతాన్యన్యో విశ్వాజాతాని పరితా బభూవ" (ఋ. 10.121.10) –ప్రజాపతీ, నీకంటెను ఇతరుడెవ్వడు అన్ని పదార్థముల లోను వ్యాపించిలేడు. అనగా ప్రజాపతి సర్వము వ్యాపించి యున్నాడని భావము.



17. శరీరము - జీవుని గమ్యము

ఈ గ్రంథమున షట్చక్రములు, ఆధ్యాత్మ విషయములనేకము వ్రాయబడినవి. అందువలన గాయత్రీ మంత్రముతో సంబంధము లేకున్నను శరీరతత్త్వము నిచట ప్రస్తావించుట జరిగినది.

పంచభూతములు, జ్ఞానేంద్రియ పంచకము, కర్మేంద్రియ పంచకము, పంచ ప్రాణములు, మనో-బుద్ధి-చిత్త-అహంకారములు అను ఇరువది నాలుగు తత్త్వములు జడపదార్థములనియు, వీనిని ప్రకాశింపచేయునది ఆత్మ తత్త్వమనియు, ఈ పంచవింశతి తత్త్వములతో కూడినదియే శరీరమనియు సాంఖ్యము తెలుపుచున్నది.

నానావిధ చేష్టలు గలిగిన శరీరము నందుగల బ్రహ్మస్వరూప జీవుడు దేహవాసనతో కూడుకొని అహంకారమును పొందెను. అహంకారమునకు జడమై యున్న బుద్ధికూడెను. ఆ బుద్ధి సకల వస్తువులను కోరుచుండును. మనస్సు భ్రాంతి నొందును. ఇవి యన్నియు ఏకమై చిత్తమును పొందును. ఆ చిత్తము అనేక చిత్త రూపమై జీవునకు జనన మరణాదులు కల్పించును.

మనస్సు సంశయించును. బుద్ధినిశ్చయము చేయును. చిత్తము చింత చేయును. అహంకారము నేనగును. ఇవియన్నియు ఎక్కడ పుట్టునో అక్కడనే అణగును. శబ్దము చెవులయందు, రూపు కనులయందు, రసము జిహ్వాయందు, గంధము ఘ్రాణ మందు, విసర్జనము గుదమందు, గమనము పాదములయందు, ఆనందము శిశ్నమందు అణగును. మనుజునకు ఈ విషయములయందు వైరాగ్యము కలిగిన మోక్షము, ఆసక్తి కలిగిన సంసారము నందు బద్ధుడగుట సంభవించును.

మనోమయ కోశములో మనస్సునకు ప్రాధాన్యమున్నట్లు విజ్ఞానమయ కోశములో బుద్ధికి ప్రాధాన్యము కలదు. కాలిన ఇనుము నుండి అగ్నిని వేరుచేయలేనట్లు బుద్ధి నుండి ఆత్మను వేరుచేయలేము. ఆత్మచైతన్యముతో కూడిన అహంకారము ప్రతి అణువులోను ఉంటుంది.

అవరోహణ క్రమములో పరమాత్మ నుండి జీవేశ్వరులు, ఆకాశాదులయిన చతుర్వింశతి తత్త్వములు, జగత్తు, జగత్తులోని వస్తువులు పుట్టుచున్నవి. వాటి జ్ఞానము మనకు కలిగినపుడు ఆరోహణ క్రమములో పైకి ఎక్కుట జరుగును. అనగా జగము పంచభూతములలోను, భూతములు అహంకారములోను, అహంకారము మహత్తులోను, మహత్తు అవ్యక్తములోను, అవ్యక్తము అఖండ పరమాత్మలోను లీనమగుచు, మనము కూడ వీటన్నిటిని లీనము చేయు పరమాత్మలో లీనమై, పరమాత్మగ శేషించుచు, ఎక్కడ నుండి వచ్చినామో అచటకు చేరుదుము.

ఆత్మకు జాగ్రత్ నిద్రాది దశలుండవు.

ఆనందమయ కోశము కారణశరీరము

ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ కోశములు సూక్ష్మశరీరము. అన్నమయ కోశము స్థూలశరీరము.

"నగారాను మ్రోయించినపుడు శబ్దము వెలువడును. ఆ శబ్దమును పట్టుకొన దలచిన నగారానుగాని, దానిని మ్రోగించువానినిగాని గ్రహింపవలయును. అదే విధముగ ఆత్మ ఇంద్రియములను ప్రేరేపించి సంసారము అను తమో గుణ రూపములనుత్పత్తి చేయును. కనుక సంసారమును పట్టుకొనదలచిన ఇంద్రియములను పిమ్మట ఆత్మను పట్టుకొనవలయును" – బృహదారణ్య కోపనిషత్తు.

"జీవుడు ఇంద్రియాదులతో కూడిన శరీరముతో బద్ధుడై ఈ లోకమున వర్తించును. ఈ బంధనము నుండి విడివడుటకు జీవులు ధ్యానశీలురు కావలయును. బ్రహ్మము ధ్యానగమ్యమేకాని ఇంద్రియ గమ్యముకాదు. బ్రహ్మకు రూపము లేదు. కనుక చక్షువున కట గతి లేదు. ఇంద్రియములను విషయముల వైపు పోనీయక చిత్తము నేకాగ్రమొనర్చి సమాహితమొనర్చుట వలన చిత్తము సంస్కార శూన్యమై శుద్ధమగును. అటుపై జీవునకు తన స్వరూపజ్ఞానము కలుగును. బ్రహ్మము తెలియనగును"–కేనోపనిషత్

పరబ్రహ్మ స్వరూపమును దర్శించు విధము :

ఆధార (మూలాధార) చక్రముః గుదస్థానమున నుండును. దీనికి అధినేత గణపతి. భూముద్ర.

స్వాధిష్ఠాన చక్రము : ఆధారచక్రమునకు సుమారు రెండంగుళములు పై భాగమున నుండును. అధిదేవత–బ్రహ్మ. ఉదకచక్రం.

మణిపూరక చక్రము : నాభిప్రదేశమున నుండును. అధిదేవత–విష్ణువు. అగ్నిచక్రం.

అనాహత చక్రము : హృదయ స్థానమున నుండును. అధిదేవత శివుడు. వాయుచక్రం.

విశుద్ధ చక్రము : కంఠము దగ్గర నుండును. అధిదేవత జీవుడు. ఆకాశ చక్రం.

అగ్నేయ చక్రము : కనుబొమల నడుమ నుండును (భ్రూయుగం). అధిదేవత పరమాత్మ. మనశ్చక్రం.

సహస్రారము : బ్రహ్మ రంధ్రమున నుండును (మేరుశిఖరము). అధిదేవత గురుడు.

ఈ సప్త చక్రములు (కమలములు) గుదస్థానము నుండి కపాలము వఱకు వెన్నెముక యందుండును. వెన్నెముక నడుమ సషుమ్న నాడి గుదస్థానము మొదలు కపాలము వఱకు నుండును. ఆ నాడికి కుడివైపు పింగళనాడి, ఎడమవైపున ఇడ నాడి యుండును. సుషుమ్న నాడిని బ్రహ్మనాడి అనియునందురు.

అగ్నిమండలము : భూమి ఉదకము కూడిన తావున నుండును.

సూర్యమండలము : అధోముఖముగ నుండును.

చంద్రమండలము : రవిచంద్రాదిత్యుల కాంతిగలిగి శిరస్సు నడుమనుండును. ఇది అమృతకళ. అగ్ని మండలము మీద సంతతధారగా అమృతము వర్షించుచుండును.

నాసికా ద్వారములు, చెవుల ద్వారములు, నోటిద్వారము కలిసికొనుచోటున బ్రహ్మరంధ్రమున్నది. ఆ బ్రహ్మ రంధ్రముననే మండల త్రయము (అగ్ని,సూర్య,చంద్ర మండలములు), హంస రూప పరమాత్మ యుండును. నాసాగ్రమందు కనుబొమల నుండి బ్రహ్మరంధ్ర పర్యంతము హంసరూప పరమాత్మయుండును.

బ్రహ్మనాడి యందు పరమాత్మ పచ్చిపగడపు తీగవలె బంగారు కాచిన తీగవలె కోటిసూర్య ప్రకాశముగ వెలుగుచుండును. ఆ పరమాత్మ నాభి కమలమున జ్యోతి రూపముగను, హృదయ కమలమున సూర్యరూపముగను, భ్రూయుగమధ్యమున హంసరూపముగ నుండును.

మంత్రయోగము : శుచియైన స్థానమున పద్మాసనము వేసికొని కూర్చుండి, చూపులు రెండు నాసికాగ్రమున నిలిపి, కన్నులు మూసి, తన కభీష్టమగు దేవతను ధ్యానించేది. ఇదే ధ్యానముద్ర.

నాసికాగ్రముపై దృష్టి నిలిపి తర్జని రెండు వేళ్ళచేత రెండు చెవుల రంధ్రాలు మూసికొనిన అచట మహాధ్వని వినబడును. ఆ ధ్వని వినగా వినగా 1. చిఱు గజ్జలనాదము, 2. గొప్ప గజ్జలనాదము, 3.ఘంటానాదము, 4. శంఖనాదము, 5.వీణానాదము, 6. తాళనాదము, 7. వేణునాదము, 8. మృదంగనాదము, 9. భేరీనాదము, 10. మేఘనాదము క్రమముగా వినిపించును. చివరి మేఘనాదము నభ్యసించి వినగా మనస్సు అచట లీనమగును. అదియే మోక్షమునకు హేతువు. అదియే ప్రణవనాదము. అది అనాహత చక్రమందు పుట్టి అచట నుండి ప్రజ్వలించి కపాలయందు మహాధ్వనియై మ్రోగుచుండును.

ఇదియే రాధాయంత్రము. లయ యోగము.

హఠయోగము : ఎడమ కాలి మడమ రెండు పిఱుదుల నడుమ నుంచి కుడికాలిమడమ బొడ్డుదగ్గఱ నుంచి గడ్డము రొమ్ము మీద నుంచి బొటనవ్రేళ్ళతో రెండు చెవులను మూసి అనామికలు రెండు వ్రేళ్ళతో రెండుముక్కులను మూసి వాయువును రేచక పూరక కుంభాకాల చేత సాధించి మూలబంధోడ్యాన జాలాంధ్రంబులనే మూడు గ్రంధుల భేదించి షట్కమలాలు శోధించి వాయువును సుషుమ్నా నాడిగుండా సహస్రార పర్యంతం తెచ్చియుంచి అక్కడ నుండే జ్యోతిస్వరూపము నందు జీవుని పొందించేది. ఇదే హఠయోగము. షణ్ముఖీ కేవలము కుంభకము, ఇదే సిద్ధాసనం.

రాజయోగము : ఇది సాంఖ్యము. తారకము. అమనస్కము అని మూడు విధములు.

సాంఖ్యము : శరీరము నందుగల పంచవింశతి తత్త్వములను లెస్సగా సాధించి, ఆ తత్త్వముల కన్నిటికి ప్రధాన తత్త్వమయిన పరబ్రహ్మయందు భక్తి కలిగియుండేది.

తారకము : శుచియైన స్థలమున కూర్చుండి రెండు కనుల దృష్టి వెలుపలి నాసికాగ్రమందు కనుబొమల నడుమగానుంచి దినక్రమేణ చూడగా చూడగా చంద్రమండలము ఇంద్రధనస్సు మాణిక్యదీపాలు అగ్నిమిణుగురులు ధూమకింజరులు మరియు ననేక విచిత్రములు కన్పించును. ఇంకను చూచుకొలది ఇవియన్నియు మరుగైపోయి వెన్నెల, ఆ వెన్నెలలో చిన్మయరూపము కన్పించును. అదియే పరబ్రహ్మ రూపము. అదియే తారక యోగము.

తారక యోగము పూర్వయోగము అమనస్కము ఇహపరయోగము. వీటికి విశేష భేదము లేదు.

శాంభవీ ముద్ర : ఈ ముద్రలో చూపులు మూడు విధములుగ నుండును.

1. అమావాస్య దృష్టి : కనురెప్పలు రెండు మూసి, నాసికాగ్రమును చూచుచు లోదృష్టి మనసున నుంచుట. **2. పాడ్యమి దృష్టి :** వెలుపలి నాసికాగ్రమందు దృష్టిని నిలిపి రెప్పపాటు లేకుండా చూచుట. **3. పున్నమి దృష్టి :** ముఖమును కొంచెముగా వంచి నల్లగ్రుడ్డును కన్పించనీయక పై రెప్పలో మరుగుపరచి అడుగు రెప్పలో నుండి తెల్లగ్రుడ్డు మాత్రము వెలుపలకు కన్పించునట్లుంచి స్థిరమనస్సుతో దినదినము చూడగా పై నుదాహరించిన తారక చిహ్నములు కన్పించును. ఒకటి రెండు ఝాములు దృష్టి నిలిపిన గాడాంధకారము కన్పించును. ఆ చీకటిలో తారక చిహ్నములు కన్పించును. పిమ్మట అవియన్నియు నిలచి పున్నమ వెన్నెల కన్పించును. అందు జ్యోతి స్వరూప పరబ్రహ్మము కన్పించును.

ఖేచరిముద్ర: ఖేచరి అనగా ఆకాశము. ఆకాశమున చరించబడినది కనుక ఖేచరిముద్ర యని పేరు కలిగెను. ఆకాశమనగా పరమాత్మ స్వరూపమయిన దహరాకాశము. అదియే నాసికాగ్రము.

యమ–నియమ–ప్రాణామాయ–ప్రత్యాహార–ధ్యాన–ధారణ–మనన–సమాధి అను అష్టాంగముల ద్వారా సహస్రార స్థితుడగు పరంజ్యోతి స్వరూపమును పొందుటయే జీవుని గమ్యము.



18. విశ్వకర్మ - గాయత్రి

యజుర్వేదము: "దేవాసురా స్సంయుక్తా ఆసన్. తేషాం గాయత్ర్యోజో, బల, మింద్రియ, వీర్యం, ప్రజాం, పశూన్ సంగృహ్యా దాయా పక్రమ్యా తిష్ఠత్ తేzమన్యన్త-యతరాన్వా ఇయముపా వర్త్స్యతి, త ఇదం భవిష్య న్తీతి. తాం వ్యహ్వాయన్త-విశ్వకర్మన్నితి దేవా, దాభీ త్యసురాః. సానాన్య తరాం శ్చ నో పా వర్తత, తేదేవా ఏతద్యజు రపశ్యన్నోజోzసి, సహోzసి, బలమసి, భ్రాజోzసి, దేవానాం ధామనామాసి, విశ్వమసి, విశ్వాయుః, సర్వమసి, సర్వాయు రభి భూరితి వా అసురాణా మోజో, బల, మింద్రియం, వీర్యం, ప్రజాం, పశూన వృంజత..." కాం. 2. ప్రశ్న 4.11.

దేవాసురులొకసారి యుద్ధమునకు సిద్ధమైరి. అప్పుడు గాయత్రీదేవి దేవాసురుల ఓజస్సు, బలము, ఇంద్రియశక్తి, ఉత్సాహము, ప్రజ, పశుసంపద అను ఆటింటిని హరించివైచెను. అప్పుడు దేవాసురులిరువురు గాయత్రిని సంస్తుతించిరి. ఆస్తుతిలో దేవతలామెను 'విశ్వకర్మ' అను పదముతోను, అసురులు 'దాభీ' అను పదముతోను సంబోధించిరి. దేవతలింకను ఓజస్సు మొదలైన దివ్యశక్తులు ఆ తల్లియొక్క స్వరూపమే అని తలచి, ఆమెనటులనే స్తుతించి, ఆమె హరించిన తమ తేజో బలాదు లాటింటిని మరలా సంపాదించుకొని, అసురులను నిర్వీర్యులుగా నొనర్చి గెలిచిరి. దీనిని బట్టి గాయత్రి ఓజోబలాదుల నిచ్చుమాత అని తెలియుచున్నది. అందువలననే సంధ్యా వందనము చేయునపుడు "ఓజోసి, సహోz సి, బలమసి, భ్రాజో z సి, దేవానాం ధామ నామాసి"-ఇత్యాదిగా ఆ తల్లిని ప్రార్థించుచుందుము. ఈ మంత్రము నందలి 'విశ్వకర్మ-దాభి' అను పదములకు సాయణుల భాష్యము-"హే విశ్వకర్మన్నితి దేవానా మాహ్వానం, దాభీత్య సురాణా మాహ్వానం, విశ్వాని కర్మాణి యస్యాః సా విశ్వకర్మా, తత్సంబో ధనం హే విశ్వకర్మన్నితి. దభ్నోతి-విరోధినో హినస్తీతి దాభీ, తత్సంబోధనం హే దాభీతి."

విశ్వకర్మ సూక్తములోని 'విశ్వకర్మ' శబ్దమునకు భాష్యము వ్రాయుచు సాయణులు విశ్వవిషయాణి సృష్టి స్థితి సంహార రూపాణి యస్యాసౌ విశ్వకర్మా' అని వ్రాసినారు. యజుర్వేదములోని ఈ మంత్రము గాయత్రిని 'విశ్వకర్మ' అని సంభోదించి గాయత్రీ విశ్వకర్మలకు గల పరమైక్య స్థితిని, జగన్మాతా పితృ భావములను మహోన్నత ముగా వ్యంగ్య రీతిలో వక్కాణించినది.

నాసదీయ సూక్తము సదసదతీతమైన (సర్వశూన్యమైన) దాని నుండి "తమస్సు" కలిగినదనియు, ఆ తమస్సు నుండి పంచభూతముల సృష్టి జరిగి క్రమముగ భోగ్య వస్తువుల-భోక్తలైన జీవుల సృష్టి జరిగినదని తెలిపినది. ఆ 'తమస్సు' నే మాయ, బ్రహ్మశక్తి, మూలప్రకృతి, అవ్యక్తము, ప్రధానము, అవిద్య-ఇత్యాది పదములతో ఉపనిష ద్వాఙ్మయము

పేర్కొన్నది. విశ్వకర్మ సూక్తము జగత్కారణమైనదియు, విశ్వసృష్టికి హేతువైనదియు నగు 'సదసదతీతము'ను 'విశ్వకర్మ' అని వచించి, నాసదీయ సూక్తమునందు వచింపబడిన 'తమస్సు'ను "నీహారము" (నీ హారేణ ప్రావృతాః"=మంచు) అని వచించినది. అనగా జ్ఞానముచే అజ్ఞానము నశించునట్లు, జ్యోతిరూపమగు కాంతి జ్ఞానము కలిగిన, మంచువంటి అజ్ఞానము నశించి, జ్ఞేయ వస్తువగు పరమాత్మ దర్శనము లభించునని భావము.

నాసదీయ సూక్తము వచించిన సర్వశూన్యమైన – సదసదతీతమైన తత్త్వమును మూలస్తంభ మిట్లు వచించినది.

"న భూమి న జలం చైవ న తేజో న చ వాయువః
న చ బ్రహ్మా న చ విష్ణు న చ రుద్రశ్చ తారకః
సర్వశూన్య నిరాలంబో స్వయంభూ విశ్వకర్మాణః ."

భూమి–నీరు–తేజము–వాయువు, బ్రహ్మా–విష్ణు–రుద్రుడు, నక్షత్రములు ఏమియు లేక సర్వశూన్యమై యున్న కాలమున స్వయంభూ విశ్వకర్మ ఒక్కడే యుండెను.

దీనినిబట్టి బ్రహ్మా–విష్ణు–రుద్రాదులందఱకు మూలపురుషుడు విశ్వకర్మయే అని తెలియుచున్నది.

మొదటి జగత్కారణ తత్త్వము అనగా విశ్వకారణ తత్త్వము (సదసదతీత తత్త్వము) తన నుండి వ్యక్తమైన తమస్సును (మూలప్రకృతిని, మాయను) తనలో వ్యక్తము కానీయక అనన్యముగా ఇముడ్చుకొన్నది. అందువలన మూలప్రకృతిని అవ్యక్తము (జగత్తు దానియందు వ్యక్తము కాని స్థితి. ఏకైక తత్త్వము మాత్రమే ఉన్న స్థితి. అనగా సాధకులు తురీయాతీతమున పొందు స్థితి) అనినారు. ఇది సదసదతీత తత్త్వము నుండి అవిభాజ్యము. అందే అవ్యక్తముగా నిగూఢము. అందువలననే 'తమ ఆసీత్తమసా గూఢమగ్రే' అని నాసదీయ సూక్తము వచించినది. అందువలన సదసదతీత తత్త్వము (విశ్వకర్మ తత్త్వము), మూలప్రకృతి రెండును అవ్యక్తములైనవి. ఆదిమ విశ్వకర్మ యొక్క దివ్యశక్తియే ఆ మాయా స్వరూపము. ఆమెయే గాయత్రి. ఆమె విశ్వకర్మలో అవిభాజ్యముగా అనన్యముగా సంలీనము. ఆమెను సాక్షా ద్విశ్వకర్మయే అనియు అనవచ్చును. యజుర్వేదమున దేవతలామెను 'విశ్వకర్మ' అనియే సంబోధించినారుకదా! అందువలన గాయత్రీ విశ్వకర్మలు అభేదస్వరూపులు. ఒకరు విశ్వరూపముకాగా మరియొకరు విశ్వకారణ స్వరూపము. విశ్వమునకు విశ్వకర్మకు అభేదమే.

ఈ విధముగా అఖండ నిర్గుణ పరబ్రహ్మము నందు (విశ్వకర్మ యందు) మాయ (గాయత్రి) తోచి జగములకు హేతువైనది. ఈ (తమోరూప) గాయత్రి నుండియే

మహదహంకారములు వెలువడినవి. అవియును అవ్యక్తములే. ఆ అవ్యక్తములోనే త్రిగుణములున్నవి. అనంతరము పంచతత్త్వముల ప్రాదుర్భావము. అవియే పంచతన్మాత్రలు, పంచ మహాభూతములు. పంచతత్త్వములు కూడ త్రిగుణాత్మకములే. ఈ త్రిగుణాత్మక పంచతత్త్వముల సాంకర్యముచేత వెలసినదే బ్రహ్మాండము. పంచతత్త్వములు, పంచబ్రహ్మలు, పంచమూర్తులు, పంచఋషులు, పంచేంద్రియములు, జాగ్రత్-స్వప్న-సుషుప్తి-తురీయ-తురీయాతీతములనెడి పంచావస్థలు, సత్తు-చిత్తు-ఆనందము-నామము-రూపము-అను పంచాంశములు-వీటి సమూహమే ప్రపంచము. ఈ ప్రపంచకార్యములగు సృష్టి, స్థితి, లయ, తిరోధాన, అను గ్రహములను నిర్వహించుటకు విశ్వకర్మచే సృజించబడినవారే పంచబ్రహ్మలు, లేదా పంచమూర్తులు, లేదా పంచఋషులు.

ఈపంచభూతములు, లేక పంచబ్రహ్మలు, లేదా పంచమూర్తులే విశ్వకర్మకుగాని, గాయత్రికి గాని శిరస్సులు లేక ముఖములుగా భావింపబడినారు. వారు నిర్వహించు కార్యములే సృష్టి-స్థితి-లయ-తిరోధాన-అనుగ్రహములనెడి పంచకృత్యములు. ఆకాశమునకు విశ్వజ్ఞుడు (సూర్యుడు) ప్రతినిధి లేక అధిదేవత. వాయువునకు దైవజ్ఞుడు (శిల్పి లేక ఇంద్రుడు) ప్రతినిధి లేక అధిదేవత. అగ్నికి మనువు (రుద్రుడు), జలమునకు మయుడు (విష్ణువు) భూమికి త్వష్టయు (బ్రహ్మ) ప్రతినిధులు లేక అధి దేవతలు.

పంచభూతములలో పృథ్వి, అగ్ని, జలములు మాత్రమే రూపము కలిగి మనకు కన్పించుచున్నవి. వాయువు, ఆకాశములు రూపరహితములు గదా! అదేవిధముగ సృష్టి, స్థితి, లయములే మనకు గోచరములు. తిరోధాన అనుగ్రహములు మన కగోచరములు.

సృష్టికి ప్రధానమైనది తక్కిన భూతములతో గూడిన భూమి. దానికి దేవతయైన బ్రహ్మను సృష్టికి ప్రతీకగా భావించినారు. అందువలననే పంచశీర్షములలో నడుమనున్నది పృథ్వీ రూపబ్రహ్మ. దాని తరువాత స్థితి కర్మము. ఆ స్థితిని (పాలనక్రియను) కలిగించునది గాలి, తరువాత నీరు. అధి దైవిక దృష్టితో రక్షణక్రియాధిపతి విష్ణువు. తరువాత లయము. అది అగ్ని భూతముచే నగు కార్యము (భస్మము చేయుట). దాని కధిపతి రుద్రుడు. లయమునకును సృష్టికిని నడుమ తిరోధాన-అనుగ్రహ కర్మలు జరిగిననేకాని సృష్టి కార్యము ప్రారంభముకాదు. తిరోధానమనగా ఇంద్రియములకు కన్పించెడి జగము-కన్పించకుండ అదృశ్యమగుట. అట్లు అదృశ్యమైన జగము తిరిగి జన్మించుటకు తగిన స్థితిని పొందుటయే అనుగ్రహము. వాయువు తిరోధానము చేయు భూతము. దానికధిపతి ఇంద్రుడు. అనుగ్రహ కర్మకు ఆకాశము మూలము. సృష్టిలోని సర్వ పదార్థరాశియు ప్రళయమున ఆకాశమున లీనమగును. అట్టి ఆకాశమున విరాజిల్లువాడు సూర్యుడు. అతడాధిదైవికముగా జగముల పునఃసృష్టికి కారకుడగుచున్నాడు. విశ్వసృష్టి

విధానము లయకర్మతో ప్రారంభమగుటచే (విశ్వోత్పత్తి సూక్తమయిన విశ్వకర్మ సూక్త ప్రథమ మంత్రము లయ కర్మతో ప్రారంభమగుచున్నది) దాని ననుసరించియే గాయత్రీ-విశ్వకర్మల మొదటి ముఖము లయహేతువయిన అగ్ని (వర్ణము)తో ప్రారంభ మైనది. అగ్న్యాది భూతములకు వర్ణములు (రంగులు) కలవు. ఆ వర్ణములనే మనము విశ్వకర్మ గాయత్రీ స్తోత్రములలో నీక్రింది విధముగా చూచుచున్నాము.

శ్లో॥ వక్త్రై ర్యుక్త ప్రవాళార్జున కనక హరిద్ధూమ వర్ణై స్త్రి నేత్రైః
ఢక్కా శూలాబ్జ చక్రా భయ వరద గదా శ్చాంకుశ గ్రంథలేఖ్యాన్,
హస్తైర్బిభ్ర త్సురేడ్యో మణి మయ మకుటో వర్ష్మ హైరణ్యయం చ
విశ్వం నిర్మాతి యస్తం శరణ మ శరణో విశ్వకర్మాణ మీడే.

శ్లో॥ గాయత్రీం త్రీక్షణై ర్విద్రుమ సిత కనక శ్యామ ముక్తా భవక్త్రై
ర్యుక్తాం విశ్వప్రణేత్రీం మణిమయ మకుటాం హేమ గాత్ర ప్రదీప్తాం,
హస్తా బ్జై శ్శూల ఢక్కా భయ వరద గదా శంఖ చక్రా బ్జ కోశా
లేఖీ న్యస్తా వహంతీం శ్రుతి చయ జననీం పద్మవాసాం భజే Zహం

పై రెండు శ్లోకములలోను చెప్పబడిన వర్ణములు.

అగ్ని వర్ణము ఎఱుపు. అందువలన దానిని ప్రవాళ (పగడము), విద్రుమ శబ్దములతో చెప్పినారు. నీటి రంగు తెలుపు, కనుక దానిని 'అర్జున, సిత' శబ్దములతో చెప్పినారు. భూమి బంగారు చాయ. కనుక దానిని 'కనక' శబ్దముతో చెప్పినారు. వాయువు రూపరహితమైనను హరి ద్వర్ణమని చెప్పుట విశేషము. ఆకాశము బూడిదరంగుకలది. కనుక దానిని ధూమ్ర, ముక్తా శబ్దములతో చెప్పుట జరిగినది.

ఇచట ఆయా వర్ణముల చేతనే ఆయా భూతములు, ఆయా బ్రహ్మలు, మూర్తులు, కర్మలు ఊహింపదగిన వగుచున్నవి. ఈ రంగులే భూతములకు గుర్తులను విషయమును ఈక్రింది విశ్వబ్రహ్మస్తోత్రము కూడ తెలియజేయుచున్నది.

శ్లో॥ వక్త్రై ర్వహ్న్యంబు భూ క ద్యురితి శుభ గదా శంఖ చక్రాబ్జ ఢక్కా
శూల గ్రంథ ప్రలేఖీ న్యభయ వరద హస్తై శ్చదీప్తై స్త్రినేత్రైః,
హంసారూఢం హిరణ్యాంచిత తను మమలం రత్న రాజ త్కిరీటం
విశ్వబ్రహ్మాణ మాద్యం సకల తనుభృతాం హృన్నివాసం భజే Zహం"

ఈ శ్లోకమున విశ్వబ్రహ్మ యొక్క పంచముఖములు వరుసగా వహ్ని (అగ్ని), అంబు (జలము), భూ (భూమి), క (వాయువు), ద్యుః (ఆకాశము) అని చెప్పబడినవి. ఆయనకు హంసయే వాహనమనగా హంసరూపుడైన జీవునికి లోపల అంతర్యామియై యుండు వాడనియు, హంసరూప ప్రాణవాయువును ఆధారముగా చేసికొని సంచరించు వాడనియు తెలియుచున్నది. సమస్త జీవుల శరీరములందు నివసించు చున్నాడని 'ఏషదేవో విశ్వకర్మా మహాత్మా సదా జనానాం హృదయే సన్ని విష్టః" అను శ్వేతాశ్వతరోపనిషత్తు మున్నగు వాక్యములను బట్టి తెలియుచున్నది.

అతని శరీరము హిరణ్మయము అనగా బ్రహ్మము చిత్స్వరూపుడని భావము. అతని పది చేతులును పది ఇంద్రియములకు దృష్టాంతములు. అశరీరుడైన బ్రహ్మమునకు ఈ రూపకల్పన ఉపాసకుల ప్రయోజనమునకే అని ఈ క్రింది శ్లోకము తెలియ జేయుచున్నది.

"చిన్మయ స్యాద్వితీయస్య నిష్కల స్యా శరీరణః,

ఉపాసకా నాం కార్యార్థం బ్రహ్మణో రూపకల్పనా" - కులార్ణవ తంత్రము.

"ముక్తా విద్రుమ హేమనీల ధవళచ్ఛాయై ర్ముఖై స్త్రీ క్ష ణైః" అని పఠించు గాయత్రీ ధ్యాన శ్లోకములో ముఖముల వరుస 'ముక్తా (ఆకాశము), విద్రుమ (అగ్ని), హేమ (భూమి), నీల (వాయువు), ధవళ (నీరు)" అను క్రమములో నుండుట వలన తత్త్వార్థము అన్వయించుట లేదని పండితుల అభిప్రాయము.

గాయత్రీ విశ్వకర్మలను సాకారులుగా భావించినపుడు సృష్టి హేతువులైన పంచభూతములే శిరస్సులుగా కలవారగుచున్నారు.

గాయత్రీ విశ్వకర్మలకు గల సామ్యములు.

1. నామ సామ్యము : 'విశ్వకర్మ' పదము గాయత్రీ, విశ్వకర్మ లిరువురికి వర్తించుచున్నది.

2. రూప సామ్యము : ఐదుతలలు, పది చేతులు, సచ్చిదానంద స్వరూపములు మొదలగు రూపసామ్యము లిరువురికిని గలవు.

3. అవస్థాన సామ్యము : అవస్థానమనగా సచ్చిదానందానంత తత్త్వాదులు. ఇది ఉభయులకును గలవు. ఉభయులును అనంత మహిమలు కలవారే.

4. అనుష్ఠాన సామ్యము : అనుష్ఠానమనగా వారు చేసెడి కర్మలు. గాయత్రీ విశ్వకర్మ లిరువురు జగత్తుల యొక్క సృష్టి–స్థితి–లయ–తిరోధాన–అనుగ్రహాదులు చేయుచున్నారు.

5. అధిష్ఠాన సామ్యము : అనగా ఆధారసామ్యము. గాయత్రీ విశ్వకర్మలిరువురు జగత్తులు తోచుటకు ఆధారభూతులే. ప్రకృతి పురుష స్వరూపులయిన గాయత్రీ విశ్వకర్మలు బ్రహ్మాండ ముల సృష్టి–స్థితి–లయ–తిరోధాన–అనుగ్రహములకు ఆధారభూతులే.

'బ్రహ్మ సత్యం జగ ద్బ్రహ్మ' అను వాక్యము ననుసరించి, బ్రహ్మస్వరూప విశ్వకర్మ, జగత్స్వరూప గాయత్రియే కాని వేఱుకాదు. ఇదియే గాయత్రీ విశ్వకర్మల పరమాద్వైతము.

పార్వతీ పరమేశ్వరులు 'జగత్పితలు'గా స్తుతింపబడుట జగద్విదితమే. గాయత్రీ విశ్వకర్మలును అట్టివారే. పార్వతి శివుని అర్థాంగి మాత్రమేకాగా, గాయత్రీ దేవి సాక్షాద్విశ్వకర్మ స్వరూపిణియే (ఇరువురికిని స్త్రీ, పురుషభేదము తప్ప అన్యభేదము లేమియు లేవు) అయి పరమాద్వైతమును ప్రకటించుచున్నది.



19. గాయత్రి

నాగరఖండము : **"ఓంకారస్తు పరంబ్రహ్మా విశ్వకర్మా పరశ్శివః**
పరాత్పర తరోంకారః, పరాదూర్ధ్వం పరాత్పరః
అగ్నిస్తు విశ్వకర్మైవ, తదర్థం వహ్నిదైవతమ్
తస్య బ్రహ్మా ఋషిశ్చైవ, గాయత్రీ ఛంద ఉచ్యతే.
స్వరూపం పరమాత్మాచ, ప్రణవస్యై వ తస్యహి
లోకమాతా చ సావిత్రీ, త్ర్యక్షరం బ్రహ్మ సమ్మితం
వేదశ్చ లోకమాతా స్యా, ద్గాయత్రీ వేదమాతృకా
జాతా Z సౌ దేవతా నామ్నా, విశ్వకర్మేతి కీర్తి తా.

పరమశివుడును, విశ్వకర్మయు, పరబ్రహ్మమును ఓంకారమే యగును. పరస్వరూపమున కంతటికిని ఊర్ధ్వమున నున్నది అదియే. అగ్ని కూడ విశ్వకర్మ రూపమే. అందువలననే అది వహ్ని దైవతము కలదయ్యెను. ఆ ప్రణవమునకు (ప్రణవ రూపము. నందిన గాయత్రికి) బ్రహ్మ ఋషియు, గాయత్రి ఛందస్సును, పరమాత్మ స్వరూపమును అగును. లోకమాతయైన సావిత్రి మూడక్షరములు గలదియు, బ్రహ్మ సమ్మితయు అగుచున్నది. శ్రుతి (వేదము) లోకమాతయే. అట్టి వేదములకు తల్లి గాయత్రి. ఆ గాయత్రీ దేవత విశ్వకర్మ నామముతో కీర్తింపబడినది.

గాయత్రీ విశ్వకర్మలకు స్త్రీ పుంభేధము తక్క మరేమియు భేదములేక బాహ్య స్వరూపసామ్యమును సచ్చిదానంద స్వరూప సృష్ట్యాది క్రియాకరణ ఆంతరంగిక రూప సామ్యము కలిగి వారిరువురు అద్వైత స్వరూపులని తెలియపరిచిరి.

'వాచస్పతిం విశ్వకర్మాణ మూతయే' (ఋ. 10.82.6) అను మంత్రమునకు భాష్యము వ్రాయుచు సాయణులు 'మంత్రరూపాయాః వాచః పాలకమ్", అని వ్రాసిరి. వాచ=మంత్రాదులైన వాక్కులకు, పతిః=అధినాధుడైనవాడు. ఇచట వాక్కులనగా లౌకిక వాక్కులేగాక తొలిపలుకులని గ్రహింపవలయును. వేదాధిపతి వాచస్పతియగు విశ్వకర్మయే.

ఛాందోగ్యోపనిషత్తు

"గాయత్రీ వా ఇదం సర్వం భూతమ్ యదిదం కించ, వాగ్వై గాయత్రీ, వాగ్వా ఇదం సర్వం భూతమ్ గాయతి చ త్రాయతే చ." (3.12.1).

గాయత్రియే సమస్త భూతము. ఈ దృశ్యమానమంతయు గాయత్రియే. అనగా చరాచరమగు జగత్తు అంతయు గాయత్రియే అని భావము (విశ్వకర్మయు సర్వవ్యాప్త బ్రహ్మమే కావున గాయత్రీ విశ్వకర్మల తత్త్వ యొక్కటియే.) వాణియు గాయత్రియే. వాణియే సమస్తమును గానము చేయును, రక్షించును. అనగా గాయత్రి వాగ్దేవతా రూపమున గానత్రాణములను చేయుచున్నది. గానము చేయువారిని రక్షించునది గాయత్రి. గాయత్రి అనగా వాక్కు , వాగ్దేవి. ఆ వాగ్దేవికి పతి వాచస్పతి - విశ్వకర్మ.

"యావై సా గాయత్రీయం వావసా యేయం పృథి వ్యస్యాం హీదం సర్వం భూతం ప్రతిష్ఠిత మేతా మేవ నాతి శీయతే." 3.12.2.

ఆ గాయత్రి ఇదియే. ఈ పృథివి యందు సమస్త పదార్థములున్నవి. ఇవి యన్నియు ఈ పృథివి నతిక్రమింపజాలవు.

ఈ మంత్రమున గాయత్రి పృథ్వి వంటిదనియు, పృథివి సమస్త పదార్థములకు ఆధారమైనట్లు గాయత్రి అన్నిటికి ఆధారమనియు భావము తెలుపబడినది.

"యావై సా పృథివీయం వావసా యదిద మస్మిన్ పురుషే శరీర మస్మిన్ హీమే ప్రాణాః ప్రతిష్ఠితా ఏతదేవ నాతిశీయంతే." (3.12.3)

గాయత్రి వంటిదే ఈ పృథివి. ఈ పృథివియే పురుషుని శరీరము. అందే ప్రాణములు ప్రతిష్ఠితములై యున్నవి. ప్రాణములు శరీరమును విడిచి యుండనేరవు.

శరీరమున ప్రాణులుండునట్లు, గాయత్రి యందు ధర్మములున్నవనియు, గాయత్రి శరీరము వంటిదనియు ఈ మంత్ర భావము.

"యద్ వై తత్పురుషే శరీరమిదం వావతద్ యదిద మస్మి న్నంతః
పురుషే హృదయ మస్మిన్ హీమే ప్రాణాః ప్రతిష్ఠితా ఏత ఏవ నాతిశీయంతే."

3.12.4

పురుషుని ఆశరీరమిదియే. పురుషుని లోపల నుండు హృదయమే ఆ శరీరము ప్రాణములా హృదయమునందే యుండును. దాని నతిక్రమించి ప్రాణములుండ నేరవు. అనగా గాయత్రి హృదయ రూపమని భావము.

విశ్వకర్మ సూక్త మంత్రము (10.81.1) "స ఆశిషా ద్రవిణ మిచ్ఛమానః పరమచ్ఛదో వర ఆవివేశ" అనగా విశ్వకర్మ తనచే సృజించబడిన జగత్తుల లోపలి ప్రాణుల హృదయమున జీవరూపుడై ప్రవేశించెనని అర్థము. దీనిని బట్టి గాయత్రీ విశ్వకర్మల పరమాత్మ భావము స్పష్టమగుచున్నది.

"సైషా చతుష్పదా షడ్ విధా గాయత్రీ,
తదే తదృచా భ్య సూక్తం-తా వానస్య మహిమా
తతో జ్యాయాంశ్చ పూరుషః పాదో Z స్య
సర్వభూతాని, త్రిపాదస్యామృతం దివి." **3.12.5.6**

ఈ చతుష్పదా గాయత్రి ఆఱు విధములు కలిగియున్నది. బ్రహ్మము ఆ గాయత్రి మూలమున ప్రకాశితమగును. ఈ సమస్త భూతములు పురుషుని ఒక్కపాదమే. మిగిలిన అమృత స్వరూప పాదత్రయము దివి (దేదీప్య మానమగు నిజమహిమ) యందున్నది.

గాయత్రి షడ్విధములు అనగా వాక్కు, భూతము, పృథివి, శరీరము, హృదయము, ప్రాణము అను ఆఱు విధములు అని అర్థము.

పురుష సూక్తములో పురుషుడు నాలుగు పాదములయినట్లే, పురుష స్వరూపమే అయిన ఆత్మయు నాలుగు పాదములే. జీవాత్మకు జాగ్రదవస్థయందు విశ్వుడనియు, స్వప్నావస్థయందు తైజసుడనియు, సుషుప్తిలో ప్రాజ్ఞుడనియు, సమాధిలో కేవలాత్మ యనియు నామములున్నవి. ప్రణవమునకు అకార, ఉకార, మకార మాత్రలేగాక అమాత్రమని (మాత్రలేనిదని) నాల్గవ పాదము కలదు. అది సమాధి లేక తురీయమునకు చిహ్నము. కనుక ఈ నాలుగు పాదముల సాదృశ్యమును బట్టియు ప్రణవము-పరమాత్మ ఒక్కటియే.

గాయత్రిని బ్రహ్మ సమ్మిత (బ్రహ్మమయి) అగు చతుష్పాద దేవతగా దర్శించినపుడు విశ్వభువనములన్నియు ఒక్కపాదముగను, తక్కిన దంతయు మూడు పాదములుగను ఎన్నవలయను. శ్రీమద్గాయత్రీ మంత్రము 24 అక్షరములు కలది కావున ఆఱేసి అక్షరములను ఒకపాదముగా ఎన్నుకొనిన, నాలుగుపాదములు ఏర్పడగలవని ఈ మంత్రమునకు శంకరుల భాష్యము.

బ్రహ్మ సూత్ర శ్రీ భాష్యమునందు జ్యోతిరధి కరణములో శ్రీరామానుజులు ఈ విధముగా వ్రాసినారు. ఇచ్చట గాయత్రి అనునది సర్వాత్మకముగా చెప్పబడుచున్నది. ఇట్లు సర్వాత్మకముగా నుండుట ఛందోరూపమగు గాయత్రికి అసంభవము కనుక ఫలమునకై పరబ్రహ్మమును గాయత్రీ సదృశునిగా ధ్యానింపవలయునని పై శ్రుతి విధించుచున్నది. "పాదోస్య సర్వభూతాని" ఇత్యాది వాక్యములచే పరబ్రహ్మము నాలుగుపాదములతో కూడుకొనినదిగను చెప్పబడుచున్నది. గాయత్రీ ఛందస్సునకు నాలుగు పాదములు కలవు కనుక ఈ విషయమున పరబ్రహ్మమునకు గాయత్రి (ఛందస్సు)తో సామ్యము సంభవమే. ఏలననిన వేదముల యందు కొన్నిచోటుల గాయత్రీ ఛందస్సునకు నాలుగు పాదములు కన్పించుచున్నవి.

"ఇంద్ర శ్చచీపతిః, వలేన పీడితః, దుశ్చ్యవనో వృషా, సమిత్సుసా సహిః" ఛందోగులు 1. భూత, 2.పృథివీ, 3.శరీర, 4. హృదయములను నిర్దేశించి 'సైషా చతుష్పదా' అను వాక్యమున నాల్గింటిని గాయత్రికి పాదములుగా వచించియున్నారు. అట్లు భూతాదులను పాదములుగా కలిగియుండునది కేవల ఛందస్సుకాదు. కావున ఇచట గాయత్రీ శబ్దము పరమాత్మ పరమని చెప్పుట యుక్తము" (ఆంధ్రీకృత శ్రీభాష్యము).

"ప్రాణావై గయాస్తత్ ప్రాణాం స్తత్రే తద్యత్ గయాం స్తత్రే తస్మాత్ గాయత్రీ నామ." (బృ.ఉ.) గాయత్రీ శబ్దమున 'గాయ, త్రీ' అను రెండు శబ్దములున్నవి. 'గాయ' శబ్దము 'గయ' వలన నేర్పడినది. 'గయ' అనగా ప్రాణములు. ఇంద్రియములు 'త్రై' ధాతువువలన స్త్రీ లింగమున 'త్రీ' అగును. కావున సర్వేంద్రియములను, ప్రాణములను రక్షించునది 'గాయత్రి' అనబడును. "గా యంతం త్రాయత ఇతి గాయత్రీ" గానము చేయువారిని రక్షించునది కావున గాయత్రి అనియు అందురు.

గాయత్రి సామోపాసన

"మనో హింకారో వాక్ ప్రస్తావ శ్చక్షు రుద్గీథః శ్రోత్రం
ప్రతిహారః ప్రాణో నిధన మే తద్ గాయత్రం ప్రాణే షు ప్రోతమ్." 2.11.1.

మనస్సు హింకారమునకు, వాణి ప్రస్తావమునకు, నేత్రము ఉద్ గీధమునకు, శ్రోత్రము ప్రతిహారమునకు, ప్రాణము నిధనమునకు సమములు. ఇది గాయత్రి నామక సామగానము. ప్రాణములకు సంబంధించినది.

ఇంద్రియ వృత్తులలో మనస్సునకు ప్రాధాన్యమున్నట్లు సప్తవిధసామలో హింకారము ప్రథమము. హింకారము చేయక ఏకర్మము ప్రారంభింపనట్లు, మనస్సుతో సంబద్ధముకాక ఏ ఇంద్రియము విషయమును గ్రహింపదు. హింకారము తరువాత ప్రస్తావము. వాణి ప్రస్తావసమము. మనస్సుతో సంకల్పించినది వాణితో ప్రస్తావింతురు. కావున ప్రస్తావము 'వాణి' అనబడినది. ప్రాణ సంబద్ధమగు నీ 'గాయత్రము' నెఱుగువాడు ప్రాణధారియగును, పూర్ణాయువును పొందును, ఉజ్వల జీవనము గడుపును.

దేవతాధ్యాయ బ్రాహ్మణము : ఈ బ్రాహ్మణములో మౌద్గల్యుడు గాయత్రీ మంత్ర తత్త్వమును ఈ క్రింది విధముగా వివరించినాడు. " వేదములు, ఛందస్సు సవిత (సూర్యుని) యొక్క వరేణ్య (శ్రేష్ఠ)మైన భాగములు. అన్నము ఆయన యొక్క ప్రకాశము. 'ధియః' అనగా విధులు (లేక కర్మలు) – వీనివలననే ఆయన లోకమంతయు సంచరించును. మనస్సు సవిత, వాక్కు సావిత్రి, మనస్సు ఉన్నచోట వాక్కు, వాక్కు ఉన్నచోట మనస్సు ఉండును. అగ్నియు సావిత్రి, పృథ్వి సావిత్రి, అగ్ని ఆదిత్యుడు, వేదములు ఛందస్సు– యజ్ఞము దక్షిణ–ఇంతయేల సమస్త ప్రపంచము సావిత్రి. ఈ మంత్రత్త్వము తెలిసికొనినవాడు సర్వపాప విముక్తుడై సుఖసంతోషములను పొందును".

బృహదారణ్య కోపనిషత్తు

గాయత్రి మొదటి పాదము : "తత్,స,వి,తుర్,వ,రే,ణి,యమ్ – 8 అక్షరములు.
భూమి, అంతరిక్షము, దివము– 3 లోకములు.

రెండవ పాదము : "భర్గో, దేవస్య, ధీమహి" –
ఋచః, యజూంషి, సామాని–ఋక్– యజున్–సామములు అనుత్రయీ విద్య.

మూడవ పాదము : "ధియో యోనః ప్రచోదయాత్."
ప్రాణః, అపానః, వ్యాన:,–ప్రాణా పాన వ్యానములు

గాయత్రి యొక్కనాల్గవ పాదము : 'తురీయ, దర్శత, పరోరజా' అనబడును.
తురీయము–అనగా చతుర్థము. నాల్గవది. దర్శత–అనగా కనబడుచున్నట్లుండునది. పరోరజా–అనగా ప్రకృతి కంటెను పరమున నుండునది.

చతుర్థపదము విశ్వము నందంతటను తపించునదియే. ఇదియే గాయత్రి యొక్క నాల్గవ పాదము. ఈ చతుర్థపదము యొక్క ప్రతాపము వలననే ఈ విశ్వమంతయు ఒకదానిపై నొకటి గొప్ప తపస్సున లీనమైయున్నది. ఈ తురీయ పదమును-పరమాత్మను తపస్సున చూచువాడు యశస్సుతో, శ్రీతో తపించి ప్రకాశించును.

గాయత్రి ప్రతిష్ఠ ఈ నాల్గవదియైన తురీయ, దర్శత, పరోరజ-పద పాదమునందే యున్నది. ఆతురీయపదము సత్యమునందు ప్రతిష్ఠితమైయున్నది. చక్షువు సత్యము. అనగా చూచినదే సత్యము.

'దర్శత' యే గాయత్రి చతుర్థపదము, సత్యపదము. సత్యము బలము నందే ప్రతిష్ఠితమై యున్నది. సత్యమునందే బలముండును. బలము ప్రాణము. అనగా సత్యము బలమునందు, ఆ బలము ప్రాణమునందు ప్రతిష్ఠితమైయున్నది.

గాయత్రి భౌతిక జగత్తున, బ్రహ్మాండమున ఉపాసకునకు ప్రాణశక్తి యొక్క మహత్త్వమును చూపునట్లు, పిండమున ఆధ్యాత్మమున కూడ గాయత్రి కట్టి ప్రతిష్ఠయే యున్నది. ప్రాణములను 'గయ' అందురు. శరీరమునందలి (గయ) ప్రాణములను (త్రాణ) రక్షణ చేయును కావున 'గాయత్రి'అనబడుచున్నది. గాయత్రి ధ్యానము వాస్తవమున ప్రాణముల ఇంద్రియముల సంయమనము అనవచ్చును. ఉపనయనమున ఉపదేశించునది గాయత్రియే. గాయత్రిని ఉపదేశించుట అనగా ప్రాణరక్షణ చేయుటయే.

భూమి, అంతరిక్షము, దివము అను మూడు లోకములను పొందినచో గాయత్రి యొక్క ప్రథమ పాదమును పొందుటతో సమానమగును. త్రయీ విద్య ప్రాప్తించిన అది గాయత్రి యొక్క ద్వితీయ పదమును పొందినదానితో సమానమగును. గాయత్రి యొక్క చతుర్థపదము (దర్శన-తురీయ-పరోరజ) ఏ భౌతిక పదార్థముతోను తులన చేయ వీలుపడదు. దానికి సమానమైన దేదియు లేదు.

"తస్యా ఉపస్థానమ్-గాయత్ర్య స్యేకపదీ ద్విపదీ త్రిపదీ చతుష్పద్య పదసి,
న హి పద్యసే। నమస్తే తురీయాయ దర్శతాయ పదాయ పరోరజసే,
అసావదో మా ప్రాప దితి, యం ద్విష్యాత్, అసావస్మై కామో మా సమృద్ధీతి వా
నహై వాస్మై సకామః సమృధ్యతే యస్మా ఏవ ముపతిష్ఠతే అహమదఃప్రాపమితివా॥

5.14.7.

గాయత్రి యొక్క ఉపస్థానము : " ఓ గాయత్రీ! త్రిలోకములు నీకు మొదటి పదము. త్రయీ విద్య నీ రెండవ పదము. ప్రాణాపాన వ్యానములు నీ మూడవ పదము. అన్నింటిని ప్రకాశింపజేయు, 'పరోరజ-దర్శత రూపము నీ చతుర్థపదము.

ఇన్ని పదములుండియు నీవు పదములు లేని దానవు. నీవు తెలియబడవు. నీతురీయమైన దర్శత పరోరజ పదమునకు నా నమస్కారము. నేను ద్వేషించువారికి నీయీపదము లభింపకుండుగాక! అతని కామన సమృద్ధము కాకుండుగాక!

"–తస్యా అగ్నిరేవ ముఖమ్, యది హ అపి బహ్వి వాగ్నావభ్యా దధతి, సర్వమేవ తత్సన్దహతి, ఏవం హై వైవం విద్యద్యపి బహ్వివ పాపం కురుతే, సర్వమేవ తత్ సంప్సాయ శుద్ధః పూతో Z జరో Z మృతః సంభవతి॥ (5. 14. 8.).

గాయత్రి ముఖము అగ్ని. గాయత్రిని గూర్చి మననము చేయుదువేని నీవు అగ్నిముఖుడవగుదువు. అగ్నియందేది వేసినను అది దానిని భస్మము చేయును. అట్లే గాయత్రి యొక్క అగ్ని రూపమును సిద్ధము చేసికొనినవాడు మిక్కిలి పాపము చేయువాడుగా కన్పించినను ఆ పాపమును గూడ అతడగ్ని వలె తినివేయును. భస్మము చేయును. శుద్ధుడు, పవిత్రుడు, అజరుడు, అమరుడు అగును.

మాండూక్యోపనిషత్తు

ఓంకారము యొక్క నాలుగు పాదములు (మాత్రలు)

ప్రణవాయవములు: అకారము – మొదట మాత్ర.

ఉకారము – ద్వితీయ మాత్ర.

మకారము – తృతీయ మాత్ర.

మాత్రా రహితమగు నాల్గవ (తురీయ పాదస్థానమగు) ఓంకారము, తద్వాచ్యమగు బ్రహ్మము వ్యవహార యోగ్యము కాదు. అందు మాత్రారూప ప్రపంచముకాని, పాదవ్యవహార రూప ప్రపంచముకాని ఉండదు. ఆ బ్రహ్మము కళ్యాణాత్మకము, అద్వైతము.

శ్వాసను పూరించునపుడు 'అ'కారమును, కుంభించునపుడు 'ఉ' కారమును, రేచించునపుడు 'మ'కారమును మననము చేసిన మన శ్వాస ప్రశ్వాసలు వ్యర్థములు కాక పరబ్రహ్మ స్వరూపములే అయి మనకు సంసార మోక్షము నొసగి మనలను అమృతులను చేయును.

సో Z హం = హంస

"సో Z హం"లోని 'స'కార 'హ' కారములను తొలగించిన మిగులునది 'ఓం' అను ప్రణవమే. 'సో Z హం' అనగా ఆ పరబ్రహ్మమే నేను అని అర్థము. ఆ 'సో Z హం' శబ్దమును తలక్రిందులు చేసిన 'హంస' అగుచున్నది. 'హంస' అనగా జీవుడని భావము. ఆ పరమాత్మ ప్రకృతియందు తలక్రిందులై తోచుటయే 'హంస' అగుట. ఆయన నుండి పుట్టిన ప్రకృతి యొక్క వికారమైన అంతఃకరణోపాధియందు, తానే మరలా తోచుట

తలక్రిందులగుటయే కదా! పై నున్నవాడు తన నుండి పుట్టి దిగువనున్న ప్రకృతిలో ప్రతిబింబించుటయే తలక్రిందులగుట. అనగా పరమాత్మ ప్రకృతిలో ప్రవేశించి జీవ స్వరూపడగుట. కనుక 'హంస' శబ్దమునకు 'జీవుడు' అని అర్థము కలిగినది. పరమాత్మ. జీవరూప హంస అయిననే కాని అతన జగత్తును అనుభవించుటకు వీలుకాదు. అందు వలననే ఆత్మను 'హంస' అని వచించినారు. దీనిని జపించుమార్గము సీతారామాంజనేయ సంవాదము' అను గ్రంథములో నిట్లు తెలుపబడినది.

తే॥ పూరకమున 'హ' కారంబు పొందుపఱచి
కుంభకమున 'బిందువు'గూర్చి యంత
రేచకమున 'స' కారంబుచూచి, వానిఁ
దెలియు తెలివియె నేనని తెలియవలయు.

ఇచట 'నేను' అనగా 'అహం' అనగా పరమాత్మ స్వరూపమని భావము.

గాయత్రి - సావిత్రి - సరస్వతి

గాయత్రీ, సావిత్రీ, సరస్వతులు విశ్వకర్మ తత్త్వమున అంతర్భూతలయిన జగన్మాతలు. గాయత్రియే సరస్వతిగను, సావిత్రిగను ఎన్నబడి, ఉదయమున సరస్వతిగను, మధ్యాహ్నము గాయత్రిగను, సాయంకాలము సావిత్రిగను భక్తులచే అర్చించబడుచున్నది.

గాయత్రి, సరస్వతి, సావిత్రి ఒక్కరే అని తెలుపు ఈ క్రింది విషయము చూడుడు.

శ్రీ మత్స్య మహాపురాణము : చతుర్థాధ్యాయము.

"అయం చ సర్వవిద్యానా మధిష్ఠాతా చతుర్ముఖః।
గాయత్రీ బ్రహ్మణ స్తత్ర హ్యఙ్గ జాతాని గద్యతే (7)

"అమూర్తి మూర్తి మద్వాపి మిథునం తత్ప్రచక్షతే।
విరిఞ్చి ర్భగవా న్యత్ర తత్ర దేవీ సరస్వతీ (8).

భారతీ యత్ర యత్రైవ తత్ర తత్ర ప్రజాపతిః।
యథా రవేశ్చ రహితా ఛాయా నో దృశ్యతే క్వచిత్ (9)

గాయత్రీ బ్రహ్మణః పార్శ్వం తథైవ నవిముఞ్చతి।
వేదరాశి స్మృతో బ్రహ్మ సావిత్రీ త మధిష్ఠితా." (10)

ఈ చతుర్ముఖుడు సర్వవిద్యలకు అధిష్ఠాత. సర్వవిద్యా రూపయగు గాయత్రి (శబ్దరూప) అతని శరీరము నుండి పుట్టినదనియు, అందుచే కుమార్తె అనియు చెప్పబడుచున్నది. ఆ ఇరువురకు మూర్తి (ఆకారము–శరీరము) ఉండుగాక! లేకుండుగాక! ఆ ఇరువురును దంపతులే. ఇట్లు (విద్యాధిష్ఠాతయగు) బ్రహ్మ ఉన్నచోట, (విద్యారూపిణియగు) సరస్వతి ఉండును. భారతి ఉన్నచోట బ్రహ్మ ఉండి తీరును. సూర్యుడు లేని ఛాయ ఎచటను ఉండనట్లు, గాయత్రియు బ్రహ్మ సమీపమును విడిచి ఉండదు. బ్రహ్మ వేదరాశిరూపుడు. సావిత్రి అతనిని ఆశ్రయించి యుండును.



౨౦. సావిత్రి

సవితృ దేవునికి సంబంధించినది సావిత్రి.

నాగరఖండము నందలి గాయత్రీ ధ్యానములో 'సావిత్రి' నామముదాహరింపబడి గాయత్రియే సావిత్రి అని తెలుపుచున్నది.

వైఖానసాగమము, 20వ పటలము తృతీయావరణములో త్వష్టదేవుని గురించి ఇట్లు చెప్పబడినది.

"త్వష్టా ష్లోత వస్త్రోత్తరీయాది సంచయః, స్థానే హేమాభ, శ్శుక పింఛాంబరధర, శ్చతుర్భుజః, కలశాక్షమాలా పాణి, ర్జటాధరో, హంసవాహనో, రూపాద్యక్షరబీజ, స్సావిత్రీ పతి, రభిజజ్ఞాతః, కమండలు ధ్వజో, హూంకారరవ, స్త్వష్టా...త్వష్టారం రూపజాతం నిధిజం ష్లోతాధిపతిమితి."

ఇందు త్వష్టృదేవుని స్వరూపాది విశేషములను చెప్పుచు. త్వష్టృదేవుడు 'సావిత్రీపతి' అని చెప్పుట జరిగినది. మరియు త్వష్టృదేవుడు 'హంసవాహనుడు' అని చెప్పబడినది. బ్రహ్మము హంసవాహనుడే గదా! త్వష్టృదేవుడే బ్రహ్మయని ఈ గ్రంథమున పలుచోటుల వివరించుట జరిగినది. విశ్వకర్మయు హంస వాహనుడే.

భవిష్యత్ పురాణము : **"ఏకాక్షరం బ్రహ్మ ప్రాణాయామః పరం తపః**
సావిత్ర్యాస్తు పరం నాస్తి మౌనాత్సత్యం విశిష్యతే"

'ఓం' అను అక్షరమే బ్రహ్మము. ప్రాణాయామమే గొప్ప తపస్సు. సావిత్రిని మించిన మంత్రము లేదు. మౌనము కంటెను సత్యము చెప్పుట మేలు."

బృహద్ యోగి యాజ్ఞవల్క్య స్మృతి : "సావిత్ర్యాస్తు పరం నాస్తి" సావిత్రిని మించిన దేమియులేదు.

దేవతాధ్యాయ బ్రాహ్మణము : ఈ బ్రాహ్మణము సావిత్రీ దేవత యొక్క విశ్వరూపమును చిత్రించుచు, సావిత్రీ ఉపాసన వలన సర్వమంగళములు చేకూరునని ఉపదేశించుచున్నది. ఈ బ్రాహ్మణము సావిత్రికి బ్రహ్మశిరస్సు. ఆకాశము నుదురు, సూర్యచంద్రులు నేత్రములు, అగ్ని నోరు, సరస్వతి నాలుక, త్వష్ట మెడ, వసువులు రుద్రులు చేతులు, వాయు మండలము వక్షస్సు, ఇంద్రుడు పృష్ఠము, విష్ణువు బొడ్డు, మరుత్తులు తొడలు, వేదములు పాదములు, మెరుపు చిరునవ్వు, నక్షత్రములు ఆభరణములు అని వర్ణించుచున్నది. ఈ వర్ణన సావిత్రి సకల చరాచర జగద్రూపమని తెలియజేయుచున్నది.



21. సరస్వతి

సరస్వతి ఋగ్వేదమున మూడు సూక్తములలో పూర్తిగను, మరియు ననేక మంత్రములలో స్తుతించబడియున్నది. ఆమె వాగ్రూపదేవతగను, నదీరూపిణిగను ప్రస్తుతించబడియున్నది. ఆమె అనేక మంత్రములతో ఇళా భారతులతో కూడి స్తుతించ బడినది.

"భారతీళే సరస్వతి యావః సర్వా ఉపబ్రువే తా నశ్చోదయతాశ్రియే."

ఋ. 1.188.8.

సాయణుల భాష్యమననుసరించి భరతుడనగా ఆదిత్యుడు. ఆయనకు సంబంధించినది భారతి. ఆమె ద్యులోకదేవత. 'ఇళ' అనగా భూదేవి. సరశ్శబ్దమునకు ఉదకమనియు, వాక్కు అనియు అర్థములు కలవు. ఆ రెంటినీ కలిగియున్న (పాలించు) అంతరిక్ష దేవతయే సరస్వతి. భూమి, అంతరిక్షము (ఆకాశము), దివము అనునవి ముల్లోకములు. వీటిని పాలించు అధిదేవతలే ఇళ, సరస్వతి, భారతి అనువారు. వీరు ముప్పురును ఆదిత్య ప్రభావరూపిణులే." అట్టి ఇళా, సరస్వతీ, భారతీ దేవతలారా! మిమ్ము స్తుతించి ఆహ్వానించుచున్నాను. మీరు నన్ను సంపత్తి కొఱకు ప్రేరేపింతురుగాక! అనగా నాకు సంపదలను చేకూర్తురుగాక! అని భావము.

దీని తరువాత మంత్రము త్వష్టకు సంబంధించినది.

"సరస్వతీ సాధయంతీ ధియం న ఇళా దేవీ భారతీ విశ్వ తూర్తిః,
తిస్రోదేవీః స్వధయా బర్హిరేద మచ్ఛిద్రం పాంతు శరణం నిషద్య." ఋ. 2.3.8.

మా యొక్క బుద్ధిని సద్విషయములందు ప్రేరేపించు సరస్వతి, ఇళ, భారతి అను ముప్పురు దేవతలు సర్వత్ర వ్యాపించువారై యజ్ఞమునకు విచ్చేసి మా అర్పణలను స్వీకరించి మా గృహమును అశుభములు లేని రీతిగా పాలింతురుగాక! లేదా నా యజ్ఞ గృహమునకు విచ్చేసి ఈ క్రతువును నిర్విఘ్నమగునట్లు చేయుదురుగాక!

ఈ మంత్రమునకు తరువాతి మంత్రము త్వష్ట దేవునికి సంబంధించినది.

"ఆ భారతీ భారతీ భి స్సజోషా ఇళాదేవై ర్మనుష్యే భి రగ్నిః,
సరస్వతీ సారస్వ తేభిరర్వాక్ తిస్రో దేవీ ర్బర్హిరేదం సదంతు." ఋ.3.4.8.

సూర్య సంబంధముగల భారతులతో గూడి భారతి విచ్చేయుగాక! మనుష్యుల తోను దేవతలతోను కూడినవారై భూమియు, అగ్నియు దయచేయుదురుగాక! సరస్వతీ

సంబంధులతో కూడినదై సరస్వతి విచ్చేయునుగాక. దేవతలైన ఈ ఇళా సరస్వతీ భారతులు ముగ్గురు ఈ యజ్ఞగృహమున నిలిచియుందురుగాక.

ఈ మంత్రమునకు తరువాతి మంత్రము త్వష్టృ దేవుని స్తుతించునది.

"ఇళా సరస్వతీ మహీ తిస్రోదేవిర్మయో భువః బర్హిః సీదం త్వస్రిధః." ఋ. 5.5.8.

భూమి–అంతరిక్ష–ద్యుస్థాన దేవతలయిన ఇళా సరస్వతీ–భారతులు ముగ్గురు సుఖకారకలై హింసాస్వభావములేక ఈ యజ్ఞము (సత్కర్మము) నందు వసింతురుగాక!

ఈ మంత్రమునకు తరువాతి మంత్రము కూడా త్వష్టృ దేవుని స్తుతించునదే.

పై నుదాహరించిన 1వ మండలములోని 188వ సూక్తము, 2వ మండలము లోని 3వ సూక్తము, 3డవ మండలములోని 4వ సూక్తము, 5వ మండలములోని 5వ సూక్తము–ఈ సూక్తములన్నిటి యందును ఒక్కొక్క సూక్తములో 11 మంత్రములున్నవి. ఈ 4 సూక్తములలోను 8వ మంత్రము సరస్వతికి సంబంధించినది కాగా, 9వ మంత్రము త్వష్టృ దేవునికి సంబంధించినది. ఈ విధముగ సరస్వతీ ప్రశంస చేసి వెనువెంటనే త్వష్టను గూర్చి చెప్పుట చేత ఆ ఉభయులకుగల భార్యాభర్తృ భావము వ్యంగ్యముగా తోచుచున్నది. ఈ త్వష్టయే తరువాతి పురాణ వాఙ్మయమున బ్రహ్మగా రూపొందిన విషయము ఈ గ్రంథముననే పలుచోటుల వివరింపడినది. కనుక సరస్వతీ బ్రహ్మల దాంపత్యము సుస్పష్టము.

"దేవీం వాచ మజనయన్త దేవా స్తాం విశ్వరూపాః పశవో వదన్తి,
సానో మంద్రేష మూర్జం దుహానా ధేనుర్వా గస్మా నుప సుష్టు తైతు." 8.100.11.

ప్రకాశించునట్టిదైన వాక్కును దేవతలు కనిపెట్టినారు. అట్టి వాక్కును మాటలాడ నేర్చిన మాటలాడనేరని సర్వప్రాణులును పలుకుచున్నవి. అట్టి వాగ్దేవి మనచే లెస్సగా స్తుతించబడినదై సంతసించుచు మనకు వర్షము చేత సిద్ధించిన అన్నమును, పాలు–నేయి రూపములైన రసమును కామధేనువువలె సమృద్ధిగా నొసగుచు మనకు దక్కుగాక.

ఈ మంత్రమున వాక్కును కామధేనువని వర్ణించుటచేత దానియొక్క సర్వవస్తు సాధకత్వము వెల్లడియగుచున్నది. శబ్దము నుండియే వాక్కులు కలుగును. శబ్దము నిత్యము కనుక వాక్కులును నిత్యములే. వాక్కునకు పరా, పశ్యంతీ, మధ్యమా, వైఖరులని నాలుగు దశలు కలవు. వాటిలో పరవాక్కు పరబ్రహ్మ స్వరూపము, నిత్యము. కనుకనే పరావాగ్రూపిణియైన పరమేశ్వరిని ఉపాసించుదురు. వాక్కునకు పతి విశ్వకర్మయే. 'వాచస్పతిం విశ్వకర్మాణ మూతయే' అనగా వాక్కునకు పతియైన విశ్వకర్మను రక్షణార్థమై పిలుచుచున్నాము.

అని విశ్వకర్మ సూక్తమంత్రము తెలుపుచున్నది గదా!

"చత్వారి వాక్పరిమితా పదాని తాని విదుర్బ్రాహ్మణా యే మనీషిణః,
గుహా త్రీణి నిహితా నేంగయంతి తురీయం వాచో మనుష్యా వదంతి." 1.164.45.

వాక్కునకు పరిమితములయిన (విహరింపదగిన) స్థానములు నాలుగు. అవి నాలుగు రూపములు (పరా-పశ్యంతీ-మధ్యమా-వైఖరీ) కలిగి, నాలుగు స్థానములలో వెలయుచున్నవి. అట్టి వాక్కులను ఏ పండితులెఱుగుదురో వారే శబ్దబ్రహ్మము నెఱిగిన బ్రహ్మవిదులు. పరా, పశ్యంతీ, మధ్యమలు గుహలో (లోపల) కలవు. వాటిని బాహ్యముగా నెఱుగజాలము. వాక్కు యొక్క నాల్గవ దశ అయిన వైఖరిని మాత్రము మానవులు పలుకుచుందురు. పరావాక్కు పరబ్రహ్మ స్వరూపము. అదియే గాయత్రీ మాతృరూపము. పరావాక్కు తురీయమునకు, పశ్యంతి సుషుప్తికి, మధ్యమ స్వప్నమునకు, వైఖరి జాగ్రత్తునకు నిదర్శనలు.

జాగ్రదవస్థలో లోక వ్యవహారము జరుగుచున్నది. తురీయమున సంప్రజ్ఞాత, అసంప్రజ్ఞాత, సమాధులు సాగుచున్నవి. కనుక గాయత్రీ విశ్వకర్మలకు లేదా ప్రకృతీ పురుషులకు ఇచట అభేదము. పరాస్వరూపము అవ్యక్త పరబ్రహ్మ స్వరూపమే. అది నాసదీయ సూక్తము వచించిన భావాతీత స్థితికిని అవ్యక్తము, అనిర్వచనీయమైన ఆదిమదశ. తరువాత ఆ పరావాక్కు పశ్యంతీ-మధ్యమా రూపములను తాల్చుచున్నది. ఇవి సదసదతీత స్థితి కల్పించెడి పరిణామములో తొలిదశలు. కనుక వాటిని 'సత్' అని వచించవచ్చును. దాని యొక్క ఈషద్వ్యక్త స్వరూపమే మధ్యమవాక్కు. చివరిది వైఖరియై ద్వైతము తేజరిల్లినది. ఈ విధముగా ప్రథమ దశలోని అద్వైతస్థితి ఏకైక వస్తువైనను అనంతరము ద్వైత స్వరూపమును నానాత్వమును పొంది జగద్వ్యవహారములకు అనుకూలమగుచున్నది. అనగా ఒకే జగత్కారణ విశ్వకర్మయందు ఆత్మకంటె అభిన్నముగా గాయత్రి వ్యక్తమై జగత్క్రీడను నడుపుచున్నది. దీనినే అఖండ నిర్గుణ పరబ్రహ్మము నందు బ్రహ్మశక్తి (చిచ్ఛక్తి) తోచి జగములకు హేతువగుచున్నది అందురు. ఛాందోగ్యోపనిషత్తు "వాగ్వైగాయత్రీ" అనగా, తైత్తిరీయ సంహిత "వాగ్వై సరస్వతీ" అని యిట్లు వచించినది.

"వాగ్వై సరస్వతీ, సరస్వతీ మేవస్వేన భాగధేయే
నో పధావతి, సైవాస్మై న్వా చందధాతి. ప్రవదితా
వాచో భవత్యపన్న దతీభవతి. తస్మాన్మనుష్యా
స్సర్వాం వాచం వదన్తి." **కాండం. 2. ప్రశ్న. 1. అను వాకము.3.**

ఈ మంత్రము వాక్కును సరస్వతి అని చెప్పుచున్నది. పరా, పశ్యంతీ, మధ్యమా, వైఖరీ రూపములతో నున్న వాగ్దేవి–గాయత్రియే. వాగ్దేవికి పతి వాచస్పతి. అనగా విశ్వకర్మ "విశ్వకర్మణ సమవర్తతాధి తస్య త్వష్టా విదధ ద్రూపమేతి" అను పురుష సూక్త వాక్యమును బట్టి త్వష్ట–విశ్వకర్మలు అభేదరూపులే గనుక వాగ్దేవి అయిన సరస్వతి బ్రహ్మయగు త్వష్టకు పత్ని అని స్పష్టమగుచున్నది.

"సరస్వతి। త్వమస్మాఁ అవిడ్ఢి, మరుత్వతీ ధృషతీజేషి శత్రూన్." **2.30.8.**

ఓ సరస్వతీ దేవీ! నిన్ను స్తుతించెడి మమ్ము రక్షింపుము. మరుత్తులతో కూడి అంతరిక్షమున నుండెడి నీవు మా శత్రువులను తర్జించి గెలువుము.

దీనిని బట్టి సరస్వతీ దేవి గొప్ప ప్రతాపముగల వీరవనిత అని తెలియుచున్నది.

"త్వే విశ్వా సరస్వతి, శ్రితాయూంషి దేవ్యాం,
శున హోత్రేషు మత్స్వ ప్రజాం దేవి దిదిడ్ఢినః." **2.42.17**

ఓ సరస్వతీ! ప్రకాశించునట్టి నీయందు సర్వాన్నములును ఆశ్రయించి యున్నవి. అట్టినీవు గృత్సమదుల మయిన మేమిచ్చు సోమమును త్రావి, తృప్తినంది, మాకు సత్సంతానము నిమ్ము.

ఈ మాటలను బట్టి సరస్వతీదేవి సత్సంతానము నిచ్చు దేవత అని తెలియు చున్నది.

"ఇమా బ్రహ్మ సరస్వతి, జుషస్వ వాజినీవతి, యాతే
మన్మ గృత్సమదా ఋతావరి ప్రియా దేవేషు జుహ్వాతి." **2.42.18.**

జనులకు అన్నమును, నీటిని ఒసంగునట్టి ఓ సరస్వతీ, దేవతల కిష్టమగు ఏ హవిస్సులను గృత్సమదులమయిన మేము నీకిచ్చుచున్నామో, వాటిని నీవు స్వీకరింతువుగాక!

ఇచట ఋతావరి అనగా జలములు కలది అనియు, బ్రహ్మశబ్దమునకు హోమ ద్రవ్యము (హవిస్సు) అనియు భావము.

"ప్రణోదేవీ సరస్వతీ వాజేభి ర్వాజినీ వతీ ధీనా మవిత్ర్యవతు." **6.61.4.**

తనను ధ్యానించువారలను రక్షించునదియు, జ్ఞానరూపాన్న దానము చేయునదియు, అగు సరస్వతీదేవి జ్ఞానాన్న ప్రదానములచేత మమ్ము రక్షించుగాక.

సరస్వతిని "ధీనాం అవిత్రీ" అనుటచే ఆమె బుద్ధులను రక్షించునది, సద్బుద్ధులను కలిగించునది అని తెలియుచున్నది.

"ఉతస్యా న స్సరస్వతీ ఘోరా హిరణ్య వర్తనిః వృత్రఘ్నీ వష్టి సుష్టుతిమ్." **6.61.7.**

శత్రువులకు భయమును కలిగించునదియు, బంగారు రథము కలదియు, పాపరూపాజ్ఞానమును పటాపంచలు చేయునదియు అగు సరస్వతి మాయోగ్యమైన స్తుతిని స్వీకరించునుగాక!

"ఉతనః ప్రియా ప్రియాసు సప్త స్వసాసు జుష్టా సరస్వతీ స్తోమ్యా భూాత్." **6.61.10.**

మాకు అత్యంతము ప్రియతమమైనదియు, గాయత్ర్యాది సప్తచ్ఛందస్సులు చెల్లెండ్రుగా కలదియు, ప్రాచీన ఋషులచేత లెస్సగా స్తుతింపబడినదియు నగు సరస్వతి మాచే స్తుతింపతగినది అగుగాక!

పై విషయములచే సరస్వతీదేవి జగన్మాత అనియు, ప్రాణులకు కావలసిన అన్నాదుల నొసగు దేవియనియు, అజ్ఞానాంధకారమును నాశనముచేయు జ్ఞానస్వరూపిణి అనియు, వేదవాణి అనియు తెలియుచున్నది.

శ్రీ మత్స్య మహాపురాణము : 66వ అధ్యాయము సారస్వత వ్రతము.

"యో యద్భక్తః పుమా న్కుర్యా దేతద్వ్రత మనుత్తమమ్।
తద్వాసరాదౌ సమ్పూజ్య విధానేన సమారభేత్॥ (4)

అధవా zz దిత్య వారేణ గ్రహతారాబలేన చ।
పాయసం భోజయే ద్విప్రా న్కృత్వా బ్రాహ్మణ వాచనమ్ ॥ (5)

శుక్లావస్త్రాణి దత్వాతు స హిరణ్యాని శక్తి తః।
గాయత్రీం పూజయే ద్భక్త్యా శుక్ల మాల్యాను లేపనైః ॥ (6)

యథా సదేవి భగవాన్బ్రహ్మా లోకపితామహః।
త్వాం పరిత్యజ్య సన్తిష్ఠే త్తస్మా ద్భువ వరప్రదా॥ (7)

వేదశాస్త్రాణి సర్వాణి నృత్తగీతాదికం చయత్।
త్వదధీనం యథాదేవి తథా మే సన్తు సిద్ధయః॥ (8)

లక్ష్మీ ర్మేధా వరా పుష్టి ర్గౌరీ తుష్టిః ప్రభామతిః।
ఏతాభిః పాహి చాష్టాభి స్తనుభి ర్మాం సరస్వతి॥ (9)

ఏవం సమ్పూజ్య గాయత్రీం వీణాక్షమణి ధారిణీమ్।
శుక్ల పుష్పాక్షతై ర్భక్త్యా స కమణ్డలు పుస్తకామ్.॥ (10)

మౌనవ్రతేన భుఞ్జీత సాయం ప్రాతశ్చ ధర్మవిత్।
పఞ్చమ్యాం ప్రతిపక్షం చ పూజయేచ్చ సువాసినీమ్॥ (11)

తథైవ తణ్డులప్రస్థం ఘృత పాత్రేణ సంయుతమ్।
క్షీరం దద్యాద్ధిరణ్యం చ గాయత్రీ ప్రీయతామితి.॥ (12)

సన్ధ్యాయాంచ తథా మౌన మేత త్కుర్వ న్త్స మాచరేత్।
నాన్తరా భోజనం కుర్యాద్యావ న్మాసా స్త్రయోదశ॥ (13)

సమాప్తేతు వ్రతే దద్యా ద్భాజనం శుక్ల తణ్డులైః।
పూర్ణం సవస్త్ర యుగ్మం చ గాంచ విప్రాయ శోభనమ్॥ (14)

దేవ్యా వితాన ఖణ్డం చ సితనేత్ర పటావృతామ్।
చన్దనం వస్త్రయుగ్మం చ దధ్యన్న కరకం పునః॥ (15)

తతోపదేష్టార మపి భక్త్యా సమ్పూజయే ద్గురుమ్।
విత్త శాఠ్యేన రహితో వస్త్రమాల్యాను లేపనైః॥ (16)

ఈ వ్రతమును చేయదలచిన భక్తుడు ఆ దినారంభమున యథా శాస్త్ర విధానమున ఆరంభించి పూజ చేయవలయును. లేదా ఆదిత్య వారమున గ్రహతారాబల యుక్త దినమున బ్రాహ్మణులచే పాయసమును భుజింపచేసి వారిచేత స్వస్తి పుణ్యాహ వాచనము చేయించవలయును. వారికి తెల్లని వస్త్రములను బంగారమును ఈయ వలయును. తరువాత భక్తితో తెల్లని పూవులతో సుగంధపు పూతలతో గాయత్రిని పూజించ వలయును.


దేవీ! లోకపితామహుడు భగవంతుడు అగు బ్రహ్మ ఎల్లప్పుడు నిన్ను విడచి యుండడు. అట్టి నీవు నాకు వరప్రదురాలవు అగుము. సర్వవేద శాస్త్రములు, నృత్తగీతాది విద్యలు నీ అధీనములు. అట్టి నీ దయవలన నాకు వాటియందు సిద్ధులు కలుగుగాక! **సరస్వతీ! లక్ష్మి–మేధా–పరా–పుష్టి–గౌరి–తుష్టి–ప్రభా–మతి**–అను ఈ ఎనిమిది శరీరములతో కూడిన నీవు నన్ను రక్షింపుము. అని దేవిని ప్రార్థించవలయును.

వీణ–అక్షమాల–కమండలు–పుస్తక ధారిణియగు గాయత్రిని తెల్లని పూవులతో తెల్లని అక్షతలతో పూజించవలయును. యజమానుడు ప్రతిపక్షము పంచమి దినమున సాయం ప్రాతః కాలములందు దేవిని పూజించి సువాసినిని పూజించి మౌనవ్రతము పాటించి (హవిష్యమును) భుజించవలయును. కుంచెడు బియ్యమును ఘృతపాత్రమును పాలను బంగారమును ఆ ముత్తైదువునకు **"గాయత్రీ ప్రీయతామ్"** అను మంత్రముతో

దానమీయవలయును. ఈ వ్రతదినమున సంధ్యా కాలమునందు మౌనవ్రతమును పాటించవలయును. ఈ విధముగ పదమూడు మాసములు జరుపవలయును. ఈ వ్రత కాలములో నియత కాలమునందు నియత భోజనము తప్ప నడుమ ఏ ఆహారమును భుజించరాదు.

ఇట్లు వ్రతము ముగిసిన పిమ్మట తెల్లని బియ్యముతో నిండిన పాత్రలను వస్త్రముల జతను, తెల్లని కంటి ఆవరణ వస్త్రముతో కూడ చక్కని గోవును, దేవిని పూజించిన మండపపు చాందినీ నుంచి తీసిన ముక్కను చందనమును, అంగవస్త్రముల జతను, పెరుగన్నముతో నిండిన గరిగ పాత్రను కూడ దానముగ ఈయవలయును. తరువాత తనకు ఉపదేష్ట అగు గురువును భక్తితో వస్త్రమాల్య సుగంధ ద్రవ్యములతో పూజించ వలయును. ఏ విషయముననను ధనమునకు లోభము చూపరాదు.

ఈ వ్రతమున సరస్వతిని-గాయత్రి అని ఉదాహరించుటను బట్టి సరస్వతి, గాయత్రి ఒక్కరేనని స్పష్టమగుచున్నది.



౨౨. గాయత్రి - సవిత

గాయత్రి జగన్మాత అనియు, విశ్వకర్మ జగత్పిత అనియు, విశ్వకర్మ జగత్కారణ తత్త్వమనియు, ఆ తత్త్వము నుండి తోచిన మూలప్రకృతియే గాయత్రి అనియు, గాయత్రీ విశ్వకర్మ లిరువురు జగత్సృష్టి కర్తలనియు, వారిరువురికి స్త్రీ, పురుష లింగభేదము తక్క అన్యభేదము లేదనియు, గాయత్రికి విశ్వకర్మ నామము కలదనియు ఇంతకు పూర్వమే తెలుపబడినది. మరియు విశ్వకర్మ సవితృ దేవులిరువురు అభిన్నులనియు తెలుపబడినది. ఈ ప్రకరణమున గాయత్రీ-సవితల అభిన్నత్వమును గురించి ప్రస్తావించుట జరిగినది.

గాయత్రీ విశ్వకర్మ లిరువురు పరంజ్యోతి స్వరూపులను విషయము ఇంతకు పూర్వమే తెలిసికొనినాము. ఋగ్వేదము (3.62.10) లో సవితృ దేవుడు 'భర్గము' అను తేజము కలవాడని తెలుపబడినది. భర్గము అనగా అవిద్యను నాశనము చేయు పరంజ్యోతి స్వరూపము అని భావము. కావున సవితృ దేవుడును పరంజ్యోతి స్వరూపుడే. అనగా గాయత్రీ-సవితలిరువురు పరంజ్యోతి స్వరూపులే.


గాయత్రీ దేవిని భక్తులు ఉదయము సరస్వతిగను, మధ్యాహ్నము గాయత్రిగను, సాయంకాలము సావిత్రి గను పూజింతురనియు, తత్కారణమున గాయత్రీ, సావిత్రీ ఒక్కరే అనియు స్పష్టమగుచున్నది. సవితృ దేవునికి సంబంధించినది సావిత్రి. కనుక గాయత్రీ సవితల అభిన్నము స్పష్టము.

గాయత్రి సరస్వతీ నామముతో వ్యవహరించబడుట ఇంతకు పూర్వమే వివరించబడినది. "వాగ్వై గాయత్రీ" అని ఛాందోగ్యోపనిషత్తు తెలుపుచుండగా, "వాగ్వై సరస్వతీ" అని తైత్తిరీయ సంహిత వచించినది. దీనిని బట్టి గాయత్రీ సరస్వతుల అభిన్నము తెలియుచున్నది. సరస్వతి బుద్ధులను ప్రేరేపించు దేవత అని ఋగ్వేద మంత్రము (6.61.4.) నందలి 'ధీనాం అవిత్రీ' అను మాటచే తెలియుచున్నది. సవితృ దేవుడును బుద్ధులను ప్రేరేపించు వాడుగ ఋగ్వేద మంత్రమున (3.62.10) తెలుపబడినది. దీనిని బట్టి సరస్వతీ సవితృల అనగా గాయత్రీ సవితృల అభిన్నత్వము స్పష్టమగుచున్నది.

సవితృ దేవుడు సమస్తలోకములను కనిని తండ్రి అని 'సవితృ' శబ్దార్థము నందు తెలుపబడినది. గాయత్రి నుండి సృష్టి ప్రారంభము జరిగినట్లు, తత్కారణమున గాయత్రి జగన్మాతగా వర్ణింపబడుట, 'విశ్వకర్మ-గాయత్రి' అను అంశమున విపులముగా వ్రాయబడినది. కనుక సృష్టికి మూలపురుషులగు వీరిరువురు అభిన్నులేకదా!

తైత్తిరీయ బ్రాహ్మణము ప్రజాపతి అయిన సవిత జీవులను సృష్టించినాడని (1.6.4.1) తెలుపగా, ఋగ్వేదము (4.53.6) సవిత జీవులను (రాత్రులు) తమ స్థానములలో ఉంచి, (పగలు) ప్రేరేపించును అని తెలిపినది. అనగా సవిత జీవులను ప్రళయకాలమున తన యందుంచుకొని, అనంతరము ప్రేరేపించును అని భావము. ప్రళయకాలమున గాయత్రియందు సమస్త విశ్వము లయింపబడి తదనంతరము మాయా స్వరూపిణియగు ఆ గాయత్రి నుండియే పునఃసృష్టి జరిగి సమస్తము వెలువడుచున్నది. గదా! కనుక జగత్సృష్టికర్తలగు వీరిరువురూ అభిన్నులే.

సవితృ దేవుడు చరాచరమైన వాటన్నిటికి ప్రభువు అని ఋగ్వేదము (4.53.6) తెలుపగా, ఛాందోగ్యోపనిషత్తు 'చరాచరాత్మకమగు జగమంతయు గాయత్రియే' అని వచించినది. కనుక గాయత్రి-సవిత అభిన్నులు.



23. గాయత్రీ మంత్ర విశిష్టత

గాయత్రీ మంత్ర విశిష్టత, సవితృ దేవుని స్తుతించు మంత్రము గాయత్రికెట్లు అన్వయించుచున్నది అను విషయములు ఈ ప్రకరణమున ప్రస్తావించబడుచున్నవి.

గాయత్రికి సావిత్రి, సరస్వతీ నామము లున్నవనియు, గాయత్రీ విశ్వకర్మలు అభిన్నులనియు, అదే విధముగ గాయత్రీ సవితృలు అభిన్నులనియు, విశ్వకర్మా సవితృలు అభిన్ను లనియు, గాయత్రీ విశ్వకర్మలు సృష్టి-స్థితి-లయ-తిరోధాన-అనుగ్రహములు నిర్వర్తించు చున్నారనియు, బ్రహ్మ-విష్ణు-రుద్ర-ఇంద్ర సూర్యాదులందఱు విశ్వకర్మ నుండి ఉద్భవమైన వారేననియు ఈ గ్రంథమున ఇంతకు పూర్వమే వివరింపబడినది. ఈ దేవతలందఱు గాయత్రీ మంత్రములో ప్రస్తుతించబడుటయే గాయత్రీ మంత్ర విశిష్టత.

"తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియో యోనః ప్రచోదయాత్." 3.62.10.

ఏ సవితృ దేవుడు మన యొక్క బుద్ధులను ప్రేరేపించుచున్నాడో, ఆ సవితృ దేవుని యొక్క భర్గమను తేజమును (అవిద్యను నాశనము చేయు పరంజ్యోతి స్వరూపమును) ధ్యానించుచున్నాము.

ఈ మంత్రము సవితృ దేవుని స్తుతించుటచే సవితృనికి సంబంధించిన 'సావిత్రి' అంతర్లీనమై యున్నది.

సరస్వతీ దేవి ఋగ్వేదమున (6.61.4) 'ధీనామవిత్రీ' అని స్తుతించబడినది. 'ధీనాం అవిత్రీ' అనగా బుద్ధి ప్రేరకురాలు అని అర్థము. గాయత్రీ మంత్రమున బుద్ధులను ప్రేరేపించు దేవుడుగ సవితృ దేవుడు స్తుతించబడుటచే, బుద్ధులను ప్రేరేపించు సరస్వతీ దేవియు స్తుతించబడినది.

ఈ మంత్రములో 'గాయత్రి' పేరులేకున్నను, గాయత్రీ స్వరూపులయిన సావిత్రి, సరస్వతీ దేవతలు స్తుతించబడుటచే గాయత్రియు స్తుతించబడినట్లే భావించవచ్చును.

మంత్రములో గాయత్రి ప్రతినామములగు సావిత్రి, సరస్వతి స్తుతించబడుట, 'గాయత్రి' అను నామము లేకుండుట, గాయత్రి 'నామ-రూపరహిత నిర్గుణ పరమాత్మ స్వరూపిణి'యని తెలియజేయుచున్నది.

'గాయత్రి' నామములేకున్నను, గాయత్రికి సంబంధించిన సావిత్రి సరస్వతి స్తుతించబడుట చేతను, **ఈ క్రింది విషయములచేతను, గాయత్రి నామమున్నట్లే భావించవచ్చును.**

1. గాయత్రి మంత్రములో మనకు మూడు పాదములు మాత్రమే కన్పించుచున్నవి. చతుష్పాదములుగల గాయత్రి మంత్రములోని నాల్గవ పాదము 'తురీయ-దర్శత- పరోరజా' అనునది పరమున నుండునది యగుటచే అది మనకు కన్పించదు.

2. ప్రణవ స్వరూపిణి అయిన గాయత్రి యొక్క ఓంకారములోని అ,ఉ,మ, అను మూడక్షరములు (మూడు మాత్రలు లేక మూడు పాదములు) మాత్రమే మనకు కన్పించుచున్నవి. నాల్గవ అక్షరమున (పాదమున) మాత్రారూప ప్రపంచముకాని, పాదవ్యవహార ప్రపంచముకాని లేదని మాండూక్యోపనిషత్తు వచించుచున్నది. అందువలన నిరాకార-నిర్గుణ స్వరూపిణియగు గాయత్రి నామము మంత్రమున లేదు.

పై విషయములచే మంత్రములో 'గాయత్రి' అను నామము లేకున్నను ఉన్నట్లే వ్యక్తము. గాయత్రీ--విశ్వకర్మలు అభిన్నులనియు, వారికి స్త్రీ-పురుష బేధము తక్క అన్యభేదములేదనియు 'గాయత్రీ-విశ్వకర్మ' అను అంశమున తెలుపబడినది. గాయత్రీ పదము స్త్రీలింగములోనున్నను, గాయత్రీ మంత్రార్థము పుంలింగ పరముగ నుండి ఈక్రింది విధముగ విశ్వకర్మకు అన్వయించుచున్నది.

ఈమంత్రాధి దేవత సవితృ దేవుడు. 'సువతి-సుప్తం ప్రేరయతీతి సవితా' అని సవితృ పదమునకు వ్యుత్పత్త్యర్థము. అనగా నిద్రించువానిని మేల్కొలుపు వాడని భావము. ఇచట అంతరర్థమును పరిశీలించిన నిద్రనుండి మేల్కొలుపుట అనగా అజ్ఞానమను నిద్ర నుండి మేల్కొలుపుట అని భావము. అట్లు మేల్కొలుపు వాడు బుద్ధులను ప్రేరేపించువాడు అంతరంగమున ఉన్న పరమాత్మయగు విశ్వకర్మయే. ఈ విషయమును 'ఏషదేవో విశ్వకర్మా మహాత్మా సదా జనానాం హృదయే సన్ని విష్టః' అను శ్వేతాశ్వతరోపనిషత్తు మంత్రము తెలుపుచున్నది.

ఇచట బాహ్యార్థమును పరిశీలించిన ప్రాణులను నిద్ర నుండి మేల్కొలుపువాడు సూర్యుడు. సవితకు సూర్యుడని అర్థము కలదు. కనుక ఈ మంత్రమున సూర్యుని ఉపాసించుట జరిగినది.

ఈ గ్రంథమున సవితృ దేవునకు బ్రహ్మ-విష్ణు-రుద్ర-ఇంద్రులతో అభిన్నము తెలుపబడినది. కనుక గాయత్రిని 'సవితృ' నామముతో ధ్యానించుట ఆ దేవతలందఱిని ధ్యానించినట్లే యగుచున్నది. వారందఱు విశ్వకర్మ నుండి జన్మించిన జగత్సృష్టి కర్తలేగదా!

ఈ మంత్రమిట్టి బాహ్యార్థములను, అంతరర్థములను కలిగి 'సవితృ' నామము ద్వారా సమస్త సృష్టికర్తలను స్తుతింపచేయుచున్నది. మనస్సు నేకాగ్రత చేసి సృష్టికర్తల

నిందటిని ఒక్క మంత్రము ద్వారా స్తుతించిన, వారి వలన పొందదగిన దేది సాధ్యము కాకుండును. అందువలననే ఛాందోగ్యోపనిషత్తు "గాయంతం త్రాయత ఇతి గాయత్రీ" అనగా గానము చేయువారిని రక్షించునది గాయత్రి- అని వచించినది.

1. బృహత్పారాశరస్మృతి : **"గాయత్రీ తు పరతత్త్వం గాయత్రీ పరమాగతిః"**
గాయత్రియే పరమ తత్త్వము. గాయత్రియే పరమగతి.

2. యమస్మృతి : **"గాయత్ర్యా న పరం జప్యం గాయత్ర్యా న పరం తపః।**
గాయత్ర్యాన పరం ధ్యానం గాయత్ర్యాన పరం శ్రుతమ్."
గాయత్రికి మించిన జపము, తపము, ధ్యానము, తెలియవలసినది- ఏమియు లేదు.

3. సంవర్త స్మృతి : **"గాయత్ర్యాస్తు పరం నాస్తి శోధనం పాపకర్మణామ్।"**
గాయత్రికి మించి పాపకర్మలను నాశనము చేయు మరియొక మంత్రము లేదు.

4. శంఖ సంహిత : **"గాయత్రీ వేదజననీ గాయత్రీ పాపనాశనీ।**
గాయత్ర్యాః పరంనాస్తి దివిచేహచ పావనమ్."
గాయత్రి వేదమాత, గాయత్రి సర్వపాపములను నశింపజేయును. ఇహలోకమునందు పరలోకమునందు గాయత్రిని మించి పవిత్రము చేయు మరియొక మంత్రము లేదు.

"దేవీ దాత్రీచ భోక్త్రీచ దేవీ సర్వమిదం జగత్।
దేవీ జయతి సర్వత్రయా, దేవీ సోహమేవచ॥
సర్మాత్మనాహి సా దేవీ సర్వభూతేషు సంస్థితా।
గాయత్రీ మోక్షహేతుర్వై మోక్షస్థాన లక్షణమ్॥."

గాయత్రీ దేవి ఇచ్చునదియు, భోగపరంపరలు కలుగజేయునదియునై యున్నది. ఈ జగత్తు అంతయు గాయత్రియే. గాయత్రియే సర్వత్ర శ్రేష్ఠరూపములో విలసిల్లుచున్నది. గాయత్రియే పరబ్రహ్మ. గాయత్రియే సర్వప్రాణులయందు సర్వులకు ఆత్మగా సంచరించుచున్నది. గాయత్రియే మోక్షమునకు హేతువు. అదియే మోక్షము యొక్క అదృశ్య స్థానము.

5. బృహద్ యాజ్ఞవల్క్య స్మృతి : **"గాయత్రీ వా ఇదం సర్వం."**-ఈ సమస్తము గాయత్రియే.

6. నృసింహ పూర్వ తాపనీయోపనిషత్ : **"గాయత్రీ వా ఇదం సర్వం."**

7. అగ్ని పురాణము : **"గాయత్ర్యాస్తు పరంనాస్తి దివి చే హ చ పావనమ్."**

భూలోకమునందుగాని, స్వర్గలోకమునందు గాని గాయత్రికి మించి పవిత్రము చేయు ఇతర మంత్రమేదియులేదు. **"గాయత్రీ పరమో మంత్రః."** గాయత్రియే పరమ మంత్రము.

8. స్కంద పురాణము : **"గాయత్ర్యేవ పరో విష్ణు ర్గాయత్ర్యేవ పరఃశివః।**
గాయత్ర్యేవ పరో బ్రహ్మా గాయత్ర్యేవ త్రయోతతః."

గాయత్రియే మహావిష్ణువు. గాయత్రియే పరమశివుడు. గాయత్రియే పరబ్రహ్మ. ఈ ముువ్వురును గాయత్రియే.

"దుర్లభా సర్వమంత్రేషు గాయత్రీ ప్రణవాన్వితా।
గాయత్ర్యానాధికం కించిత్ త్రయీషు పరిగీయతే॥

సమస్త మంత్రములలో ప్రణవయుక్త గాయత్రి దుర్లభము. మూడు వేదములలోను, గాయత్రికి మించి మరియొక మంత్రములేదు.

"న గాయత్ర్యా సమోమంత్రః" -గాయత్రికి సమమైన మంత్రములేదు.

9. భవిష్యత్పురాణము : **"సర్వమంత్రేషు గాయత్రీ వరిష్ఠా ప్రోచ్యతే బుధైః"** సర్వమంత్రములలోను గాయత్రి శ్రేష్ఠమైనదని పండితులు వచింతురు.

10. పద్మ పురాణము : **"న గాయత్రీ సమో మంత్రః"** గాయత్రికి సమమైన మంత్రమేదియు లేదు.

"గాయత్రీ వేదజననీ, గాయత్రీ లోకపావనీ!
గాయత్ర్యా న పరంజప్య మేతద్ విజ్ఞాన ముచ్యతే"

గాయత్రి వేదములకు మాత, గాయత్రి సమస్తలోకములను పావనము చేయును. గాయత్రికి మించి జపము చేయవలసినది మరేమియులేదు. ఈ విధముగ తెలిసికొనిన వాడు ముక్తిని పొందును.

"గాయత్రీ మంత్ర సదృశం నాన్య దస్తి హి కుత్ర చిత్"

గాయత్రీ మంత్రమునకు సమమైనది మరియొకటి ఎక్కడను లేదు, లేదు, లేదు.

11. కూర్మ పురాణము : **"న గాయత్ర్యాః పరం జప్యమ్."** గాయత్రికి మించి జపము చేయవలసినదేమియు లేదు.

12. దేవీ భాగవతము : **"పరబ్రహ్మ స్వరూపాచ నిర్వాణ పదదాయినీ**
బ్రహ్మతేజోమయీ శక్తి స్తదధిష్ఠాతృ దేవతా"

గాయత్రి పరబ్రహ్మ స్వరూపము, నిర్వాణ పరమపదమును ఇచ్చును. బ్రహ్మ తేజోమయ శక్తి పరబ్రహ్మయే. ఆమె అధిష్ఠాతృదేవత. మరియు

" నగాయత్ర్యాః పరంపదమ్" – భారద్వాజస్మృతి.

" సావిత్ర్యాస్తు పరం నాస్తి" – బృహత్ యోగియాజ్ఞవల్క్య స్మృతి

"గాయత్రీతి గరీయసీ" – బృహత్ పరాశరస్మృతి

"గాయత్రీ బ్రహ్మైకమ్" – గాయత్రి, బ్రహ్మ ఒక్కటియే – శతపథ బ్రాహ్మణము

"గాయత్రీ సా మహేశానీ పరబ్రహ్మాత్మికా మాతా"

గాయత్రియే శివశక్తి మరియు పరబ్రహ్మ స్వరూపము – రుద్రగాయత్రి

'గాయత్రీ పరదేవతేది గదితా బ్రహ్మైవ చిద్రూపిణీ –

గాయత్రి పరదేవతగా పిలువబడుచున్నది. ఆమె చిద్రూపిణి. ఆమె సాక్షాత్తు పరబ్రహ్మము.

గాయత్రీ ధ్యానము :

" ఓం శ్వేతవర్ణా సముద్దిష్టా కౌసేయ పసనా తథా।
శ్వేతై ర్విలేపనైః పుష్పైరలంకారైశ్చ భూషితా॥
ఆదిత్య మండల స్థా చ బ్రహ్మలోక గతాథవా।
అక్ష సూత్రధరా దేవీ పద్మాసన గతా శుభా॥"

తెలుపు వర్ణము కలదియు, తెల్లని వస్త్రము ధరించి యున్నదియు, తెల్లని పుష్పము – చందనము మొదలగు విలేపనములచే భాసించు చున్నదియు, చేతియందు రుద్రాక్షమాల ధరించి పద్మాసనారూఢయై యున్నదియు, సూర్యమండలము నందు లేక బ్రహ్మలోకము నందుండునదియునగు అట్టి దేవిని నేను ధ్యానము చేయుచున్నాను.

ఈ మంత్ర మింతటి మహోన్నతార్థములను సూచించుచు సర్వోత్కృష్టమైన దగుటవలననే 'కాలజ్ఞానము' ను రచించి కంది మల్లయ్యపల్లెలో జీవసమాధిని చేరి సర్వులచే నిత్యము ఆరాధింపబడు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాములవారు "న గాయత్ర్యా పరం మంత్రం, న మాతుః పర దేవతా" అని వచించుటయేగాక, వేదాంత రహస్యములతో నిండిన–తాను రచించిన 'కాళికాంబ హంస కాళికాంబ'అను మకుటముగల పద్యములలో నీ విధముగా తెలిపినారు.

"గళము నందు నిలువ గాయత్రి మంత్రంబు
బడుగు మంత్రగాండ్ర గొడవయేల
సూత్రధారి ముక్తి చూపడు గదవయా
కాళికాంబ హంస కాళికాంబ."



24. ఉప సంహారము


గాయత్రీ మంత్రము "భర్గో దేవస్య ధీమహి" - అనగా 'భజింపదగిన జ్యోతి స్వరూపమును ధ్యానించుచున్నాము' అనుటచే, జ్యోతి స్వరూపులయిన విశ్వకర్మ, గాయత్రి, సవితృ దేవతలేగాక బ్రహ్మ-విష్ణు-రుద్ర-ఇంద్ర సూర్యమూర్తులును ఇందు ధ్యానించ బడుచున్నారు. గాయత్రీ మంత్రాధి దేవత సవితృడగుటచేతను, సవితృడు జగత్పిత అగుట చేతను విశ్వకర్మయు ధ్యానించబడినట్లే స్పష్టమగుచున్నది. సవితృ దేవునికి సంబంధించినది సావిత్రియగుట చేతను, సావిత్రి-గాయత్రి స్వరూపిణియగుటచేతను, సరస్వతియు గాయత్రి స్వరూపిణియగుట చేతను వేదమాతలగు గాయత్రీ- సావిత్రీ- సరస్వతు లిందు స్తుతించబడుచున్నారు. సవితృ శబ్దము సూర్యునకన్వయించ బడుటచే సూర్యుడును ఇందు స్తుతించబడుచున్నాడు.

ఈ మంత్రము జ్యోతి స్వరూపమును ధ్యానించునదగుటచే మోక్షహేతు వగుచున్నది. 'గాయంతం త్రాయత ఇతి గాయత్రీ' అను ఛాందోగ్యోపనిషత్తు వాక్యముచే గాయత్రి తనను గానము చేయువారిని రక్షించునని విదితమగుచున్నది.

ఇంతటి మహత్తరశక్తిగల-మహోన్నతార్థములను సూచించు గాయత్రీ మంత్రమును విశ్వామిత్రుడు ప్రసాదించుట వలననే, అతడు స్వయముగ "విశ్వామిత్రస్య రక్షతి బ్రహ్మేదం భారతమ్ జనమ్." (ఋ. 3.53.12) అనగా విశ్వామిత్రుడు దర్శించిన వేదభాగము భారతప్రజలను రక్షించుచున్నది- అని చెప్పినాడు.

వేదానుష్ఠాన పరాయణులును భక్తులును అగు బ్రాహ్మణాదులచే నిత్యము జపించబడు ఈ మంత్రము క్షత్రియుడగు విశ్వామిత్రునిచే ప్రసాదించబడి, బ్రహ్మజ్ఞానము కలవాడే బ్రాహ్మణుడు అని సూచించుటయేగాక, ఆ బ్రహ్మజ్ఞానమును పొందుమార్గము కూడ సూచించుచు వేదమంత్రములలో మహోన్నతస్థానమును పొందుచున్నది.

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః



ఉపయుక్త గ్రంథములు

ఋగ్వేదము, యజుర్వేదము, అథర్వవేదము, తైత్తిరీయారణ్యకము. నిరుక్తము - యాస్కుడు, శతపథబ్రాహ్మణము. తైత్తిరీయ బ్రాహ్మణము. గోపథ బ్రాహ్మణము, ఐతరేయ బ్రాహ్మణము, దేవతాధ్యాయ బ్రాహ్మణము.

శ్వేతాశ్వతరోపనిషత్తు, తైత్తిరీయోపనిషత్తు, ఛాందోగ్యోనిపనిషత్తు, బృహదారణ్యకోపనిషత్తు, ముండకోపనిషత్తు, మాండూ క్యోపనిషత్తు, శిల్పోపనిషత్తు, పంచబ్రహ్మోపనిషత్తు, ఈశావాశ్యోపనిషత్తు, కేనోపనిషత్తు, ప్రశ్నోపనిషత్తు, నృసింహపూర్వతాపనీయోపనిషత్తు.

బృహత్‌యోగియాజ్ఞవల్క్యస్మృతి, బృహత్పారాశరస్మృతి, యమస్మృతి, సంవర్త స్మృతి. భారద్వాజ స్మృతి, అశ్వలాయన గృహ్య సూత్రములు.

శంఖ సంహిత, శైవాగమము, భగవద్గీత, మూలస్తంభము, శిల్పి స్తంభము, మానసారము. దర్శనాచార్య, కళాప్రపూర్ణ. కొండూరు వారరాఘవాచార్యులు గారి ఋగ్వేద రహస్యాలు, ఋగ్వేద దిగ్దర్శనము, యజుర్వేద దర్శనము, అథర్వవేద దర్శనము.

వడ్డెపాటి నిరంజన శాస్త్రి గారి విశ్వకర్మ బ్రాహ్మణ వంశాగమము, ఆంధ్ర నాగరఖండము, ముదిగంటి గోపాలరెడ్డి సుజాతారెడ్డి గార్ల 'సంస్కృత సాహిత్య' చరిత్ర

శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వాముల వారి 'కాలజ్ఞానము'.

Vedic Mythology - Macdonell

వసిష్ఠ-విశ్వకర్మ-విష్ణు-స్కంద-పద్మ-అగ్ని-కూర్మ-మత్య-కూర్మపురాణములు, భాగవతము, దేవీ భాగవతము.